# బృహదారణ్యకోపనిషత్తు

## మునికాండము అధ్యాయము - 3

## ఉపోద్ఘాతము

మూడవ అధ్యాయములోకి వెళ్ళేముందు కొన్ని విషయాలు పునర్విమర్శ చేసుకుందాము. బృహదారణ్యకంలో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. రెండేసి అధ్యాయములను కలిపి కాండము అంటారు. అలా మూడు కాండములు ఉన్నాయి. వాటి పేర్లు వరుసగా మధు కాండము, ముని కాండము, ఖిల కాండము.

మొదటి రెండు అధ్యాయములను కలిపి మధు కాండము అంటారు. ఇందులో మధువిద్య పేరిట బ్రహ్మవిద్యను చూశాము. రెండవ అధ్యాయములోని ఐదవ బ్రాహ్మణాన్ని మధు బ్రాహ్మణము అంటారు. దానివల్లనే ఈ కాండమునకు మధు కాండము అనే పేరు వచ్చింది.

మూడు, నాలుగు అధ్యాయములను కలిపి ముని కాండము అంటారు. ఇందులో గురువు యాజ్ఞవల్క్య ముని. యాజ్ఞవల్క్యుడు అన్ని బ్రాహ్మణములలో వస్తాడు కాబట్టి దీన్ని యాజ్ఞవల్క్య కాండము అని కూడా అంటారు.

ఐదు, ఆరు అధ్యాయములను కలిపి ఖిల కాండము అంటారు. ఖిల కాండములో చెదురుమదురు అంశాలు ఉన్నాయి.

ఇప్పుడు మనం మధు కాండములోంచి ముని కాండములోకి అడుగు పెడుతున్నాము. నిజానికి రెండు కాండముల్లోనూ విషయం బ్రహ్మవిద్యే. అలాంటప్పుడు మధు కాండమును ముని కాండమునుంచి ఎందుకు విడదీశారు? దీనికి కారణాలు ఇవి –

1. **శ్రుతి-యుక్తి భేదం** – మధు కాండము ఉపదేశ ప్రధానం అయితే ముని కాండము ఉపపత్తి ప్రధానం. ఉపదేశం అంటే శాస్త్రబోధ. అందులో తర్కం రాదు. ఉపపత్తి అంటే తర్కం లేదా యుక్తి. మధు కాండము శాస్త్రీయ పద్ధతిలో బోధస్తే, ముని కాండము తర్క ప్రధానంగా బోధ చేస్తుంది. తర్కం అంటే కేవలం తర్కం ఉండదు, ఆ తర్కం వేదవాక్యాలను ఆధారం చేసుకుని ఉంటుందన్న విషయం మర్చిపోకూడదు. ఆ విధంగా మధు కాండము, ముని కాండము ఒకదానికొకటి తోడవుతాయి శ్రుతి-యుక్తులను ప్రవేశపెట్టటంద్వారా. శ్రుతి, యుక్తి రెండూ కలిస్తేనే జ్ఞానం నిస్సంశయ జ్ఞానం అవుతుంది. శ్రుతి సమ్మతము లేని తర్కం ప్రయోజనం లేనిదైతే, తర్కం తోడు లేని బోధ నిలకడ లేనిదవుతుంది. శ్రుతి బోధ లేని జ్ఞానం అసంపూర్ణం, తర్కం లేని జ్ఞానం అసందిగ్ధం. రెండూ కలిస్తేనే జ్ఞానం నిస్సంశయజ్ఞానంగా మారుతుంది. దీన్ని శ్రుతి సమ్మత తర్కము అంటారు.

2. **తత్ పద-త్వం పదయోః భేదం** – మధు కాండము **తత్ పద** విచారణ చేస్తే, ముని కాండము **త్వం పద** విచారణ చేస్తుంది.

3. **శ్రవణ-మననయోః భేదం** – మధుకాండము శ్రవణం స్థానంలో ఉంటే, మునికాండము మననం స్థానంలో ఉంటుంది. మధుకాండము శ్రోతవ్య విధిని పూరిస్తే, మునికాండము మంతవ్య విధిని పూరిస్తుంది.

ఖిలకాండ ఉపాసన ప్రధానం.

మునికాండము తర్క ప్రధానం అయితే, దాన్ని మళ్ళీ రెండు అధ్యాయాలుగా విభజించటం ఎందుకు? మధుకాండ శ్రుతి ప్రధానం అయినా కూడా దాన్ని రెండు అధ్యాయములుగా విభజించారు కదా! అక్కడ భేదం ఏమిటి? మొదటి కాండం అధ్యారోప ఉపదేశ ప్రధానం అయితే, రెండవ అధ్యాయము అపవాద ఉపదేశ ప్రధానం. రెండూ కలిపి ఉపదేశం అయ్యాయి. అలాగే ఇక్కడ కూడా తర్కంలో రెండు రకాలు చూస్తాము. మూడవ అధ్యాయము జల్పరూప తర్క ప్రధానం అయితే, నాల్గవ అధ్యాయము వాదరూప తర్క ప్రధానం.

**జల్పం – పరమతనిరాకరణపూర్వకం స్వమత స్థాపనమ్ –** అంటే ఎదుటి వ్యక్తి వాదనను, అభిప్రాయాన్ని, ఆలోచనను ఖండించి మన వాదనను, అభిప్రాయాన్ని, ఆలోచనను నిలబెట్టటం.

**వాదం – తత్త్వనిర్ణయఫలః వాదవిశేషః –** ఈ వాదన పూర్తిగా సత్యం తెలుసుకోవటానికి చేసేది. వేదాంతబోధ ముఖ్యం కాని, పరమత వాదనలు ముఖ్యం కాదు. జల్పంలో వారి వాదనలు రేపి, వాటిని ఖండిస్తారు.

**వితండవాదం** – ఈ రెండూ కాకుండా ఇంకోటి ఉంది. దాన్ని వితండవాదం అంటారు. ఇందులో మన వాదన బలపరచుకోకుండా, ఎదుటివారి వాదనలను ఖండించటం మాత్రమే ఉంటుంది. అంటే ఇది సానుకూలంగా దేన్నీ నిలబెట్టదు; ప్రతికూలంగా తక్కినవారి ఆలోచనలు ఖండిస్తుంది.

మూడవ అధ్యాయములో జల్పం వస్తే, నాల్గవ అధ్యాయములో వాదం వస్తుంది. మూడవ అధ్యాయములో తొమ్మిది బ్రాహ్మణాలు, నాల్గవ అధ్యాయములో ఆరు బ్రాహ్మణములు ఉన్నాయి. ఖండములను బృహదారణ్యకోపనిషత్తులో బ్రాహ్మణములంటారని చూశాము. అందువల్ల మునికాండములో మొత్తం పదిహేను బ్రాహ్మణములు ఉన్నాయి.

మూడవ అధ్యాయము ఒక కథతో మొదలవుతుంది. జనక మహారాజు ఒక పండిత సభ ఏర్పాటు చేశాడు. ఆ బ్రహ్మవేత్తలలో అత్యున్నత వ్యక్తికి వేయి గోవులను ఇస్తానని ప్రకటించాడు. ప్రతి ఒక్క గోవుకు పదేసి పాదముల బంగారం, రెండు కొమ్ములకు కట్టబడి ఉంది. ఈ వాదోపవాదాలలో యాజ్ఞవల్క్య ముని గెలిచి, తనే అత్యున్నత పండితునిగా నిరూపించుకున్నాడు. ఎనిమిది మంది బ్రాహ్మణులు యాజ్ఞవల్క్యునితో భేటీకి దిగారు. గార్గి అనే స్త్రీ రెండుసార్లు వాదించటంవల్ల తొమ్మిది బ్రాహ్మణములు వచ్చాయి. అందరితో వాదించి గెలిచాడు.

కథ రూపంలో చెప్పటంవల్ల రెండు విషయాలు తెలుస్తాయి.

1. **వాదం** – వేదాంతం గురుశిష్యుల సంవాదం రూపంలో అధ్యయనం చేయాలి లేదా చర్చలు చేయాలి. నిజానికి జ్ఞానం నాలుగు దశల్లో పొందుతాడుట శిష్యుడు.

> ఆచార్యాత్ పాదమాదత్తే పాదం శిష్యః స్వమేధయా
> పాదం సబ్రహ్మచారిభ్యః పాదం కాలక్రమేణచ

జ్ఞానంలో ఒక వంతు గురువుద్వారా పొందుతాడు; ఒక వంతు తను స్వయంగా మననం చేసుకోవటంవల్ల పొందుతాడు; ఇంకొక పాదం తోటి విద్యార్థులతో చర్చలవల్ల పొందుతాడు; నాలుగవ వంతు కాలక్రమేణా పొందుతాడు. అందువల్ల వాదోపవాదాలు, చర్చలు చేయటంవల్ల జ్ఞానం పొందవచ్చు. అది ఈ కథలో సూచించబడింది.

2. **దానం** – దానంయొక్క ప్రాముఖ్యతను చూపించటానికి కూడా ఈ కథ ఉపయోగపడుతుంది. విద్యను పొందటానికి దానం చేయాలి. అందువల్ల జనకుడు వేయి గోవులను ఇస్తున్నాడు.

గురుశుశ్రూషయా విద్యా పుష్కలేన ధనేన వా।
అథవా విద్యయా విద్యా చతుర్థం నోపలభ్యతే॥

జ్ఞానం ఎలా పొందాలి? గురుశుశ్రూష చేసో, పుష్కలంగా ధనం ఇచ్చో లేదా మనకు తెలిసిన విద్య గురువుకు బోధించో, అతనికి తెలిసిన విద్యను పొందాలి. ఈ మూడూ తప్ప, నాలుగవ కారణం లేదు అని ఆనందగిరి చెబుతారు. ఇక్కడ జనకుడు పుష్కలంగా ధనం ఇచ్చి జ్ఞానం పొందుతున్నాడు.

ఈ నేపథ్యంతో రెండవ కాండములోని మొదటి అధ్యాయములోకి అడుగు పెడదాము. మొదటి అధ్యాయములోని మొదటి బ్రాహ్మణమును అశ్వల బ్రాహ్మణము అంటారు.

**గమనిక–** కర్మకాండ భాగాలకు మంత్రాల్లోని అర్థాన్ని వివరంగా చూడటం లేదు.

# 3.1 - అశ్వల బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో యాజ్ఞవల్క్యుని సవాలు చేసినది అశ్వల ముని. అందుకని ఈ బ్రాహ్మణాన్ని అశ్వల బ్రాహ్మణము అంటారు. ఇందులో ముందు కథ వస్తుంది.

మంత్రం 3.1.1

**ఓమ్, జనకో హ వైదేహో బహుదక్షిణేన యజ్ఞేనేజే తత్ర హ కురుపఞ్చాలానాం బ్రాహ్మణా అభిసమేతా బభూవుస్తస్య హ జనకస్య వైదేహస్య విజిజ్ఞాసా బభూవ కః స్విదేషాం బ్రాహ్మణానామనూచానతమ ఇతి స హ గవాగ్ం సహస్రమవరురోధ దశ దశ పాదా ఏకైకస్యాశ్శృంగయోరాబద్ధా బభూవుః ॥**

**ఓమ్ జనకో హ వైదేహో బహుదక్షిణేన యజ్ఞేనేజే** – విదేహరాజు అయిన జనక మహారాజు అధికమైన దక్షిణలనిచ్చి, యజ్ఞమును చేసి ఈశ్వరుణ్ణి ఆరాధించాడు.

**తత్ర హ కురుపంచాలానాం బ్రాహ్మణా అభిసమేతా బభూవుః** – ఆ యజ్ఞానికి కురుపాంచాల దేశాలకు చెందిన బ్రహ్మవేత్తలు వచ్చి చేరారు.

**తస్య హ జనకస్య వైదేహస్య విజిజ్ఞాసా బభూవ** – ఈ వేదవేత్తలలో శ్రేష్ఠుడు ఎవరో తెలుసుకోవాలని జనకునికి కోరిక కలిగింది.

**కః స్విదేషాం బ్రాహ్మణానామనూచానతమ ఇతి** – వీరిలో అతిశయించి ప్రవచన సమర్థుడు ఎవరు?

అనూచానః అంటే వేదవిత్ అంటే బ్రహ్మవేత్త. వేదవిత్ అంటే వేదాంగాలు, వేదాలూ కూడా తెలిసివుంటారు. అనూచాన తమ అంటే అటువంటి వేదవిత్తులలో శ్రేష్ఠుడు. అది తెలుసుకోవటంకోసం ఆయన ఏంచేశాడు?

**స హ గవాగ్ం సహస్రమవరురోధ** – ఆయన వేయి గోవులను నిలిపివుంచాడు.

**దశ దశ పాదా ఏకైకస్యాశ్శృంగయోరాబద్ధా బభూవుః** – వాటిలో ప్రతి ఒక్క గోవుకు, పదేసి పాదముల బంగారం, రెండు కొమ్ములకు కట్టబడివుంది. పాదము అంటే బంగారానికి ఒక కొలత.

మంత్రం 3.1.2

**తాన్ హోవాచ బ్రాహ్మణా భగవన్తో యో వో బ్రహ్మిష్ఠస్స ఏతా గా ఉదజతామితి । తే హ బ్రాహ్మణా న దధృషురథ హ యాజ్ఞవల్క్యస్స్వమేవ బ్రహ్మచారిణమువాచైతాస్సోమ్యోదజ సామశ్రవా 3 ఇతి తా హోదాచకార తే హ బ్రాహ్మణాశ్చుక్రుధుః కథం నో బ్రహ్మిష్ఠో బ్రువీతేత్యథ హ జనకస్య వైదేహస్య హోతాఽశ్వలో బభూవ స హైనం పప్రచ్ఛ త్వం ను ఖలు నో యాజ్ఞవల్క్య బ్రహ్మిష్ఠోఽసీ 3 ఇతి స హోవాచ నమో వయం బ్రహ్మిష్ఠాయ కుర్మో గోకామా ఏవ వయగ్ం స్మ ఇతి తగ్ం హ తత ఏవ ప్రష్టుం దధ్రే హోతాఽశ్వలః ॥**

**తాన్ హోవాచ బ్రాహ్మణా భగవంతో యో వో బ్రహ్మిష్ఠస్స ఏతా గా ఉదజతామితి** – వారిని ఉద్దేశించి – పూజనీయులైన ఓ బ్రాహ్మణులారా! మీలో ఎవరైతే అతిశయించి బ్రహ్మవేత్తలో, వారు ఈ గోవులను తీసుకొని వెళ్ళవచ్చును– అని పలికాడు.

**తే హ బ్రాహ్మణా న దధృషుః** – ఆ బ్రాహ్మణులు సాహసం చేయలేకపోయారు.

**అథ హ యాజ్ఞవల్క్యస్స్వమేవ బ్రహ్మచారిణమువాచ** – అప్పుడు యాజ్ఞవల్క్యుడు తన బ్రహ్మచారిని ఉద్దేశించి ఇలా పలికాడు. ఏమని?

**ఏతా స్సోమ్యోదజ సామశ్రవా ౩ ఇతి** – ఓ ప్రియమైన సామశ్రవసా! ఈ గోవులను (మన గోశాలకు) తీసుకువెళ్ళు.

**తా హోదాచకార** – అతను వాటిని తీసుకువెళుతున్నాడు. శిష్యుని పని గురువు చెప్పిన పనిని అక్షరాలా పాటించటమే.

యాజ్ఞవల్క్యుని శిష్యుని పేరు సామశ్రవసుడు. సామశ్రవసుడు అంటే సామవేదాన్ని అధ్యయనం చేసినవాడు. శిష్యుడు సామవేదాన్ని అధ్యయనం చేశాడు అంటే గురువు అయిన యాజ్ఞవల్క్యుడు అన్ని వేదాలను బోధ చేయగలడని అర్థం అంటారు శంకరులవారు. యాజ్ఞవల్క్యుడు శుక్లయజుర్వేదంలో దిట్ట అయినా నాలుగు వేదాల్లోనూ ఆరితేరినవాడన్నమాట. అంటే అతను వేదవిత్తమః మాత్రమే కాదు చతుర్వేద విత్తమః అని చెప్పవచ్చు.

**తే హ బ్రాహ్మణాశ్చుక్రుధుః కథం నో బ్రహ్మిష్ఠో బ్రువీతేతి** – మనలో తను బ్రహ్మిష్ఠుడినని అతను ఎలా చెప్పగలడు అని ఆ బ్రాహ్మణులు కోపగించుకున్నారు. వాదోపవాదాలు అవకుండానే ఆయన గోవులను తోలుకువెళ్ళమన్నాడు అంటే తనే బ్రహ్మిష్ఠుడినని నిర్ణయించుకున్నట్టు అవుతుంది. అది అతని గర్వాన్ని సూచిస్తున్నదని బ్రాహ్మణులు భావించారు. అతను వేదవిత్తముడు అవునో కాదో కాని అతని అహంకారం సహించ రానిదిగా ఉంది వారికి.

తను శ్రేష్ఠుడనని చెప్పుకుంటే, పరోక్షంగా తక్కినవారు తనకు సమానులు కారని చెప్పకనే చెప్పినట్టు వస్తుంది. ఎందుకంటే శ్రేష్ఠుడు ఒకడే ఉంటాడు. యాజ్ఞవల్క్యుడు తమను పరోక్షంగా అవమానపరిచినట్టుగా వారు భావించారు. తను గొప్ప అనుకోవటం ఒక తప్పు, తక్కినవారు తనకన్నా తక్కువ అని సూచించటం ఇంకో తప్పు. అందువల్ల వారికి బాగా కోపం వచ్చింది.

**అథ హ జనకస్య వైదేహస్య హోతాశ్వలో బభూవ** – విదేహరాజైన జనకుని కొలువులో అశ్వలుడు అనే హోతా (ఋత్విక్కు) ఉన్నాడు.

అలా అవమానం చెందిన బ్రాహ్మణులలో అశ్వలుడు అనే బ్రాహ్మణుడు కూడా ఉన్నాడు. అతను ఋగ్వేదంలో దిట్ట. ఋగ్వేదకర్మను చేసే ఋత్విక్కును హోతా అంటారు. అతను మామూలు హోతా కాదు. సాక్షాత్తూ జనకుని కొలువులో ఉన్న హోతా. అందువల్ల అతను అందరి తరపున ముందుకు వచ్చాడు.

**స హైనం పప్రచ్ఛ** – అప్పుడు ఆయన యాజ్ఞవల్క్యుని ప్రశ్నించాడు. ఏమని?

**త్వం ను ఖలు నో యాజ్ఞవల్క్య బ్రహ్మిష్ఠోఽసీ ౩ ఇతి** – ఓ యాజ్ఞవల్క్యా! మనలో బ్రహ్మిష్ఠుడవు నువ్వేనా అని ప్రశ్నించాడు.

బ్రహ్మిష్ఠుడవా అని అడగటంలోనే అతని కోపం ప్రస్ఫుటమవుతున్నది. నువ్వెవరు నిర్ణయించటానికి, జనకుడు నిర్ణయించాలి కాని అని దాని అర్థం. దీనికి జవాబు యాజ్ఞవల్క్యుడు చాలా అణకువుగా ఇచ్చాడు. అక్కడ అందరూ అతనికి అహంకారం ఎక్కువగా ఉందని అనుకున్నారు కదా! అతను తాను అందరిలోకి బాగా అణకువ ఉన్న వానిగా చూపించదలుచుకున్నాడు. అందుకని యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పాడు.

**స హోవాచ నమో వయం బ్రహ్మిష్ఠాయ కుర్మో** – మేము బ్రహ్మిష్ఠునికి నమస్కారం చేస్తున్నాము.

హే హోతా అశ్వలా! నామీద కోపం తెచ్చుకోకు! నేను బ్రహ్మిష్ఠుడినని చెప్పుకోవటం లేదు. ఇక్కడ ఎవరు బ్రహ్మిష్ఠులైతే వారికి నేను నమస్కారం చేయటానికి సిద్ధంగా ఉన్నాను. అతను తాను శ్రేష్ఠుడు అనుకోకపోతే మరి గోవులను తీసుకువెళ్ళమని శిష్యులకు ఎందుకు చెప్పినట్టు? దానివల్లనే కదా అతనికి అహంకారం ఎక్కువ ఉందనుకున్నారు? అందువల్ల ఆ శంకా నివృత్తి చేస్తున్నాడు.

**గోకామా ఏవ వయగ్ం స్మ ఇతి** – మేము గోవులను కోరే వారం మాత్రమే! నాకు అవసరం ఉంది కాబట్టి తీసుకుంటున్నాను.

నీకు అవసరం ఉన్నా, నువ్వు **అనూచానతమః** గా నిరూపించుకోనిదే ఎలా తీసుకెళ్ళగలవు? ఇవి మామూలుగా ఇక్కడ పెట్టినవి కావు. శ్రేష్ఠునిగా నిరూపించుకున్నవానికి దానం చేసే ఆవులు. అందువల్ల నాతో వాదించి గెలవమన్న ఉద్దేశంతో అశ్వలుడు ఇలా అన్నాడు.

**తగ్ం హ తత ఏవ ప్రష్టుం దధ్రే హోతాఽశ్వలః** – అందువలననే, హోతా అయిన అశ్వలుడు ఆయనను ప్రశ్నించటానికి నిశ్చయించుకున్నాడు.

అశ్వలుడు యాజ్ఞవల్క్యుడిని ఎనిమిది ప్రశ్నలు అడిగాడు; యాజ్ఞవల్క్యుడు వాటన్నిటికీ దిగ్విజయంగా జవాబు చెప్పాడు. అశ్వలుడు వెనక్కి వెళ్ళాడు కాని ఇంకొక బ్రాహ్మణుడు ముందుకు వచ్చాడు. మొదటి మూడు బ్రాహ్మణములలో వేద పూర్వభాగం గురించిన ప్రశ్నలు వచ్చాయి. అంటే కర్మ, ఉపాసనల గురించిన ప్రశ్నలు.

## మంత్రం 3.1.3

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యదిదగ్ం సర్వం మృత్యునాఽఽప్తగ్ం సర్వం మృత్యునాఽభిపన్నం కేన యజమానో మృత్యోరాప్తిమతిముచ్యత ఇతి హోత్రర్త్విజాఽగ్నినా వాచా వాగ్వై యజ్ఞస్య హోతా॥ తద్యేయం వాక్సోఽయమగ్నిస్స హోతా స ముక్తిస్సాఽతిముక్తిః ॥**

## మంత్రం 3.1.4

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యదిదగ్ం సర్వమహోరాత్రాభ్యామాప్తగ్ం సర్వమహోరాత్రాభ్యా మభిపన్నం కేన యజమానోఽహోరాత్రయోరాప్తిమతిముచ్యత ఇత్యధ్వర్యుణర్త్విజా చక్షుషాదిత్యేన చక్షుర్వై యజ్ఞస్యాధ్వర్యుస్తద్యదిదం చక్షుస్సోఽసావాదిత్యస్సోఽధ్వర్యుస్స ముక్తిస్సాఽతిముక్తిః ॥**

## మంత్రం 3.1.5

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యదిదగ్ం సర్వం పూర్వపక్షాపరపక్షాభ్యామాప్తగ్ం సర్వం పూర్వపక్షాపరపక్షాభ్యామభిపన్నం కేన యజమానః పూర్వపక్షాపరపక్షయోరాప్తిమతిముచ్యత ఇత్యుద్గాత్రర్త్విజా వాయునా ప్రాణేన ప్రాణో వై యజ్ఞస్యోద్గాతా తద్యోఽయం ప్రాణస్స వాయుస్స ఉద్గాతా స ముక్తిస్సాఽతిముక్తిః ॥**

## మంత్రం 3.1.6

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యదిదమంతరిక్షమనారంబణమివ కేనాఽఽక్రమేణ యజమానస్స్వర్గం లోకమాక్రమత ఇతి బ్రహ్మణర్త్విజా మనసా చంద్రేణ మనో వై యజ్ఞస్య బ్రహ్మా తద్యదిదం మనస్సోఽసౌ చన్ద్రస్స బ్రహ్మా స ముక్తిస్సాఽతిముక్తిరిత్యతిమోక్షా అథ సమ్పదః ॥**

ఈ నాలుగు మంత్రాల్లో హోతా అశ్వలుడు నాలుగు ప్రశ్నలు అడిగాడు. యాజ్ఞవల్క్యుడు ఆ నాలుగు ప్రశ్నలకూ జవాబులుగా అతిమోక్ష ఉపాసన పేరిట ఒక ఉపాసన క్రమం చెప్పాడు. ఈ ఉపాసనలను యజ్ఞ అంగ ఉపాసనలు అంటారు.

ఉపాసన రెండు రకాలు.

1. స్వతంత్ర ఉపాసన – ఈ ఉపాసనను విడిగా చేయవచ్చు.

2. యజ్ఞాంగ ఉపాసన – దీన్ని యజ్ఞంలో ఒక భాగంగా చేస్తారు. ఉదాహరణకు విష్ణుసహస్రనామం చదివే ముందు వచ్చే ధ్యానశ్లోకాలు. కర్మాంగ ఉపాసనకు విడిగా ఫలం ఉండదు. కాకపోతే కర్మఫలాన్ని ఎక్కువ చేస్తుంది.

కేవల కర్మ (కర్మ మాత్రమే) చేస్తే స్వర్గలోకానికి వెళతారు

కర్మ, ఉపాసన కలిపి చేస్తే బ్రహ్మలోకానికి వెళతారు

ఇక్కడ యాజ్ఞవల్క్యుడు కర్మాంగ ఉపాసన లేదా ఉపాసన సహిత కర్మ గురించి చెప్పబోతున్నాడు. కర్మలు మూడు రకాలు. అవి –

1. **స్వాభావిక కర్మ** – మన స్వభావాన్నిబట్టి చేసే కర్మ. ఇది మన రాగద్వేషాలమీద ఆధారపడివుంది. శాస్త్రం విధించిన విధినిషేధాలతో సంబంధం లేదు దీనికి. మనకు ఇష్టం కాబట్టి చేస్తాము. అందువల్ల దీన్ని రాగద్వేష ప్రయుత్తం కర్మ అంటారు. ఈ స్వాభావిక కర్మలను అజ్ఞాన జనిత కర్మలంటారు శంకరులవారు. అజ్ఞానంవల్ల మనకు కలిగే కోరికలను తీర్చుకోవటానికి చేసే కర్మ.

2. **కేవల కర్మ** – కేవల కర్మ అంటే కర్మ కేవలంగా ఉంటుందని కాదు. ఉపాసన తోడవకుండా కర్మ మాత్రమే చేయటం. శాస్త్రం విధించిన యజ్ఞాలు చేయటం. ఇందాక చూసినట్టుగా విష్ణుసహస్రనామం ముందు ఉన్న ధ్యానశ్లోకాలను కూడా గడగడా చదివేస్తాము. అలా విష్ణుసహస్రనామ పారాయణాన్ని కేవల కర్మగా చేస్తాము.

3. **ఉపాసన సముచ్ఛిత కర్మ** – ఇది ముందు చెప్పిన రెండు రకాల కర్మల కన్నా ఉన్నతమైనది. ఇది అతి మోక్షానికి దారితీస్తుంది. అందువల్ల దీన్ని **అతిమోక్ష ఉపాసన** అంటారు.

ఇదీ ఈ నాలుగు మంత్రాల సారాంశం. కాని అడిగిన తీరు వేరు, జవాబు చెప్పిన తీరు వేరు. ఈ అంశాన్ని ఉపనిషత్తు ఎలా వివరించుకొస్తుందో చూసే ముందు కొన్ని ప్రాథమిక విషయాలు తెలుసుకోవాలి మనము.

మనలో ఉన్న అన్ని అంగాలకూ కొన్ని సమస్యలు ఉన్నాయి. ఆ అంగాలు పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచ ప్రాణాలు, నాలుగు అంతఃకరణలు. వీటికి నాలుగు సమస్యలున్నాయి.

1. **దేహ పరిచ్ఛిన్నం** – అవి వ్యష్టి శరీరానికి పరిమితమయ్యాయి కాబట్టి వాటికి దేహపరిచ్ఛిన్నం సమస్య ఉంది. దీన్నే ఆధ్యాత్మిక పరిచ్ఛేదం అని కూడా అంటారు.

2. **కాల పరిచ్ఛిన్నం** – ఈ అంగాలు కొన్ని సంవత్సరాలు మాత్రమే చక్కగా పనిచేస్తాయి. కాలక్రమేణా వాటి శక్తి క్షీణిస్తుంది.

3. **స్వాభావిక కర్మ** – స్వభావాన్నిబట్టి చేసే కర్మను స్వాభావిక కర్మ అంటారని చూశాము. స్వభావం మన రాగద్వేషాలమీద ఆధారపడి వుంటుందని కూడా చూశాము. అవి మనకు మాత్రమే పరిమితమైనవి.

4. **కేవలకర్మ** – స్వాభావిక కర్మలే కాకుండా శాస్త్రం చెప్పిన కర్మ కూడా చేస్తాము కాని అప్పుడు కూడా పొరపాటు చేస్తాము. కర్మను ఉపాసనతో జత చేయకుండా కర్మ మాత్రమే చేస్తాము. మన అంగాలు కేవలం కర్మ చేయటానికే పరిమితమయి ఉంటాయి.

ఇలా నాలుగు పరిమితులు ఉన్నాయి మన అంగాలకు. వీటిని ఆధ్యాత్మ పరిమితులు అంటారు. ఈ పరిమితులనుంచి ఎలా బయట పడాలని అడిగాడు అశ్వలుడు. ఈ నాలుగు పరిమితులు యజమానికి ఉన్నాయి. యజమాని అంటే యజ్ఞం చేసే వ్యక్తి. అతని అంగాలకు ఈ పరిమితులు ఉన్నాయి. యజమాని యజ్ఞాలను నాలుగు వేదాలకు చెందిన బ్రాహ్మణుల సహాయంతో చేస్తాడు. వారిని ఋత్విక్కులు అంటారు. ఒక్కొక్క వేదానికి చెందిన ఋత్విక్కుకు ఒక్కొక్క పేరు ఉంటుంది. వారి పని కూడా వేరే ఉంటుంది –

| | | | |
|---|---|---|---|
| ఋగ్వేద ఋత్విక్కు | – హోతా | – | దేవతలను ఆవాహన చేస్తాడు |
| యజుర్వేద ఋత్విక్కు | – అధ్వర్యుడు | – | ఆహుతులను వేస్తాడు |
| సామవేద ఋత్విక్కు | – ఉద్గాతా | – | దేవతలను స్తుతిస్తాడు |
| అథర్వణ వేద ఋత్విక్కు | – బ్రహ్మ | – | యజ్ఞపర్యవేక్షణ చేస్తాడు |

అథర్వణ వేదఋత్విక్కు అయిన బ్రహ్మకు బాధ్యత ఎక్కువ వుంటుంది. అతను తక్కిన మూడు వేదాలకు చెందిన ఋత్విక్కులు వారి పనులు సక్రమంగా చేస్తున్నారా లేదా చూడాలి. అంటే వారు చేసే వేద పారాయణం గమనించాలి. అంటే బ్రహ్మ చతుర్వేది అయివుండాలి. అతనికి నాలుగు వేదాలూ తెలిసివుండాలి. కాని ఈ ఋత్విక్కులకు కూడా వారి పరిమితులు ఉన్నాయి. వీటిని అధియజ్ఞ పరిచ్ఛేదం లేదా అధిభూత పరిచ్ఛేదం అంటారు.

ఇప్పుడు ప్రశ్న ఏమిటి? ఈ పరిమితులనుంచి ఎలా బయటకు రావటం? అది కూడా ప్రత్యక్షంగా, సూటిగా అడగలేదు. ఇక్కడ అన్ని అంగాలు, ఋత్విక్కులు స్వాభావిక కర్మ లేదా కేవలకర్మ అధీనంలో ఉన్నారు. కాకపోతే ఇది వేరే విధంగా చెప్పబడింది. కేవలకర్మ, స్వాభావిక కర్మలను మృత్యువుగా అభివర్ణించాడు అశ్వలుడు. అధ్యాత్మం (యజమాని) అధియజ్ఞం (ఋత్విక్కులు) మృత్యుకోరల్లో అంటే స్వాభావిక, కేవలకర్మల్లో చిక్కుకుని ఉన్నారు.

తర్వాత వచ్చే రెండు మంత్రాల్లో కాలం చేతిలో చిక్కారన్నాడు. కాలాన్ని రెండుగా విభజించాడు. సూర్యుని కాలతత్త్వం, చంద్రుని కాలతత్త్వం. సూర్యునిద్వారా రాత్రి, పగలుతో కూడిన రోజు ఏర్పడితే; చంద్రునిద్వారా తిథులు, పూర్ణమి, అమావాస్య ఏర్పడతాయి.

యజమాని, ఋత్విక్కులు అతిమోక్షాన్ని ఎలా పొందుతారు అని అడిగాడు అశ్వలుడు. దానికి యాజ్ఞవల్క్యుడు నాలుగు రకాల ఉపాసనలు చెప్పాడు. అవి ఈ నాలుగు మంత్రాల్లోనూ వస్తాయి. ఫలం యజమానికి, ఋత్విక్కు కూడా వెళుతుంది. ప్రతి ఉపాసనలోనూ ఋత్విక్కు మూడు విషయాలను కలిపి ఉపాసన చేయాలి. దాన్ని ఐక్య ఉపాసన అంటారు. ఏమిటా మూడు విషయాలు? యజమానియొక్క ఒక అంగం, ఒక వేదానికి చెందిన ఒక ఋత్విక్కు, ఒక దేవత. అంగం అధ్యాత్మం, ఋత్విక్కు అధియజ్ఞం; దేవత అధిదైవం. అందువల్ల ఈ ఉపాసనను **అధ్యాత్మ అధియజ్ఞ అధిదైవ ఐక్య ఉపాసన** అంటారు. ఈ ఉపాసనవల్ల అధ్యాత్మ, అధియజ్ఞాల పరిమితులు తొలగిపోయి అధిదైవంలో కలిసిపోతాయి. కన్ను అధిష్ఠానదేవత సూర్యుడు; కన్నులు సూర్యునిలో కలుస్తాయి; మరణం తర్వాత యజమాని, ఋత్విక్కులు సమష్టిలో కలుస్తారు. దీన్నే హిరణ్యగర్భప్రాప్తి అంటారు. దీన్నే అతిమోక్షం అంటారు. ఈ నాలుగు మంత్రాల సారాన్ని ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

| **మంత్రం సంఖ్య** | **ఋత్విక్కు** | **ఇంద్రియం** | **దేవత** |
|---|---|---|---|
| | అధియజ్ఞం | అధ్యాత్మం | అధిదైవం |
| 3 | హోతా | వాక్కు | అగ్ని |
| 4 | అధ్వర్యుడు | కన్ను | ఆదిత్యుడు |
| 5 | ఉద్గాతా | ప్రాణం | వాయువు |
| 6 | బ్రహ్మ | మనస్సు | చంద్రుడు |

ఈ ఐక్య ఉపాసన ఫలం ఏమిటి?

1. **మృత్యు తరణం** – మృత్యువు అంటే స్వాభావిక కర్మ, కేవల కర్మ అని చూశాము.దాని పరిమితిని దాటుతారు.
2. **కాల తరణం** – సూర్యునివల్ల, చంద్రునివల్ల ఏర్పడిన కాల పరిమితిని దాటుతారు.

ఈ ఫలాలు యజమానికీ, ఋత్విక్కులకూ వస్తుంది. ఈ ఫలాలను అతిముక్తి లేదా అతిమోక్షం అంటారు. అందువల్ల యాజ్ఞవల్క్యుడు ఈ నాలుగు ఉపాసనలనూ అతిమోక్ష ఉపాసనలన్నాడు. అతిమోక్షం అంటే హిరణ్యగర్భతో ఐక్యం. ఎలా చెప్పగలము? అధిదేవతలందరూ కలిస్తే హిరణ్యగర్భ అవుతాడు.

దేవతా ఉపాసనయా దేవతా భవతి.

ఈ నేపథ్యంతో మంత్రాల సారాన్ని చూద్దాము.

**మంత్రం 3.1.3**

ఓ యాజ్ఞవల్క్యా, ఈ సర్వమూ ఏదైతే మృత్యువుచే వ్యాపించబడివుందో, అటువంటి మృత్యువుయొక్క వ్యాప్తిని ఎలా అధిగమించగలదు? దానికి యాజ్ఞవల్క్యుని జవాబు హోతా, వాక్కు, అగ్నిల ఐక్యఉపాసన చేయాలి.

3 నుంచి 6 వరకూ ప్రతి మంత్రంలో **స ముక్తిస్సాஉతిముక్తిః** వస్తుంది.

**ముక్తి** అంటే ఉపాసన రూప సాధనం. ఏమిటా సాధనం? అధిదైవ, అధ్యాత్మ, అధియజ్ఞ ఐక్యరూప ఉపాసన.

**అతిముక్తి** అంటే హిరణ్యగర్భ పదప్రాప్తి రూపఫలం. అంటే సాధ్యం. ముక్తి సాధనాన్ని సూచిస్తే, అతి ముక్తి సాధ్యాన్ని సూచిస్తుంది. ముక్తి ఐక్య ఉపాసనను సూచిస్తే, అతిముక్తి హిరణ్యగర్భ పథప్రాప్తిని సూచిస్తుంది.

**మంత్రం 3.1.4**

**అహోరాత్ర–** కాల లక్షణ మృత్యువును ఎలా అధిగమించగలరు అని అడిగాడు అశ్వలుడు. ఈ కాలం సూర్యునివల్ల ఏర్పడిన కాలం. దీనికి యాజ్ఞవల్క్యుడు ఇచ్చిన రెండవ ఐక్య ఉపాసన – అధ్వర్యుడు, చక్షువు, ఆదిత్యుడు. మళ్ళీ ముక్తి అంటే ఉపాసన, అతిముక్తి అంటే ఫలం.

**మంత్రం 3.1.5**

ఇందులో కూడా కాల లక్షణ మృత్యువును ఎలా అధిగమించాలి అనే ప్రశ్న. కాకపోతే, ఇక్కడ కాలం చంద్రునివల్ల ఏర్పడిన కాలం. అంటే తిథులు, పక్షాలు, పౌర్ణమి, అమావాస్య. దీనికి యాజ్ఞవల్క్యుడు ఇచ్చిన మూడవ ఐక్యఉపాసన – ఉద్గాత, ప్రాణం, వాయువుల ఐక్య ఉపాసన.

**మంత్రం 3.1.6**

ఈ మంత్రంలో స్వర్గలోకాన్ని ఎలా పొందగలరు అనేది ప్రశ్న. స్వర్గలోకం అంటే హిరణ్యగర్భలోకం లేదా బ్రహ్మలోకం.

**అంతరిక్షమనారంబణమివ** – ఎందుకు ఆ ప్రశ్న అడిగాడంటే అంతరిక్షం ఆలంబన లేనట్టుగా ఉందిట. తమాషాగా లేదూ ప్రశ్న? స్వర్గలోకానికి మెట్లు లేనట్టుగా ఉంది. అలాంటప్పుడు ఏ ఆధారాన్ని పట్టుకుని స్వర్గ లోకానికి వెళ్ళగలడు?

దానికి జవాబుగా యాజ్ఞవల్క్యుడు స్వర్గలోకానికి ఒక నిచ్చెన ఉందనీ, ఆ నిచ్చెనను పట్టుకుని వెళ్ళవచ్చనీ అన్నాడు. ఆ నిచ్చెన పేరు ఐక్యఉపాసన. ఇందులో ఇచ్చిన ఐక్యం – బ్రహ్మ, మనస్సు, చంద్రుల ఐక్యం. ఇక్కడ బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ కాదు, బ్రహ్మ అంటే అథర్వణ వేద ఋత్విక్కు.

**ఇత్యతి మోక్షా అథ సంపదః** – ఇంతవరకూ అతిముక్తి గురించి చెప్పబడింది. ఆపైన సంపదుపాసనలు చెప్పబడతాయి. 7 నుంచి 10 మంత్రాల వరకూ సంపదుపాసనలు వస్తాయి.

మంత్రం 3.1.7

**యాజ్ఞవల్క్యేతి హోవాచ కతిభిరయమద్యర్గ్భిర్హోతాஉస్మిన్ యజ్ఞే కరిష్యతీతి తిసృభిరితి కతమాస్తాస్తిస్ర ఇతి పురోనువాక్యా చ యాజ్యా చ శస్యైవ తృతీయా కిం తాభిర్జయతీతి యత్కించేదం ప్రాణభృదితి॥**

మంత్రం 3.1.8

**యాజ్ఞవల్క్యేతి హోవాచ కత్యయమద్యాధ్వర్యురస్మిన్ యజ్ఞ ఆహుతీర్హోష్యతీతి తిస్ర ఇతి కతమాస్తాస్తిస్ర ఇతి యా హుతా ఉజ్జ్వలన్తి యా హుతా అతినేదన్తే యా హుతా అధిశేరతే కిం తాభిర్జయతీతి యా హుతా ఉజ్జ్వలన్తి దేవలోకమేవ తాభిర్జయతి దీప్యత ఇవ హి దేవలోకో యా హుతా అతినేదన్తే పితృలోకమేవ తాభిర్జయత్యతీవ హి పితృలోకో యా హుతా అధిశేరతే మనుష్యలోకమేవ తాభిర్జయత్యధ ఇవ హి మనుష్యలోకః ॥**

మంత్రం 3.1.9

**యాజ్ఞవల్క్యేతి హోవాచ కతిభిరయమద్య బ్రహ్మా యజ్ఞం దక్షిణతో దేవతాభిర్గోపాయతీత్యేకయేతి కతమా సైకేతి మన ఏవేత్యనన్తం వై మనోఽనన్తా విశ్వే దేవా అనన్తమేవ స తేన లోకం జయతి ॥**

మంత్రం 3.1.10

**యాజ్ఞవల్క్యేతి హోవాచ కత్యయమద్యోద్గాతాఽస్మిన్ యజ్ఞే స్తోత్రియాః స్తోష్యతీతి తిస్ర ఇతి కతమాస్తాస్తిస్ర ఇతి పురోనువాక్యా చ యాజ్యా చ శస్యైవ తృతీయా కతమాస్తా యా అధ్యాత్మమితి ప్రాణ ఏవ పురోనువాక్యాఽపానో యాజ్యా వ్యానశ్శస్యా కిం తాభిర్జయతీతి పృథివీలోకమేవ పురోనువాక్యయా జయత్యన్తరిక్షలోకం యాజ్యయా ద్యులోకగ్ంం శస్యయా తతో హ హోతాఽశ్వల ఉపరరామ ॥**

ఈ నాలుగు మంత్రాల్లో అశ్వలుడు అడిగిన నాలుగు ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుడు నాలుగు సంపదుపాసనలను ప్రవేశపెట్టాడు.

**సంపదుపాసన** – 1. ఒక చిన్నకర్మను చేస్తూ దాన్ని పెద్దకర్మగా ఊహించుకోవటం, నికృష్ట వస్తువుమీద ఉత్కృష్ట విషయాన్ని ఊహించుకోవటం. నికృష్ట అంటే చిన్నది; ఉత్కృష్ట అంటే పెద్దది. దీనికి సాధారణంగా ఇచ్చే ఉదాహరణ శ్రాద్ధకర్మ. మామూలుగా ఒక వ్యక్తి జీవితకాలం ముగిసేలోపు అతను గయకు వెళ్ళి తన పితృదేవతలకు శ్రాద్ధకర్మలు చేయాలి. దాన్ని గయాశ్రాద్ధం అంటారు.

ఏ కారణంవల్లనైనా ఒక వ్యక్తి గయదాకా వెళ్ళలేకపోతే, అతను తన ఇంటిలో మామూలుగా చేసే శ్రాద్ధకర్మనే, గయాశ్రాద్ధంగా ఊహించుకోవచ్చు. అలా భావన పెట్టుకోవటంవల్ల ఒక మామూలు శ్రాద్ధం ఉత్కృష్టకర్మగా అవటమే కాక, ఆ ఉత్కృష్టకర్మకు ఇచ్చే ఫలాన్ని కూడా ఇస్తుంది.

దీనికి ఇంకో ఉదాహరణ – మన నిత్యస్నానం. మనం రోజూ చేసే స్నానాన్ని గంగాస్నానంగా భావించు కుంటే మామూలు స్నానకర్మ గంగాస్నానం అవుతుంది. దీన్ని సంపదుపాసన అంటారు.

2. నికృష్టకర్మమీద ఉత్కృష్ట ఫలధ్యానం చేయటం. ఒకటి కర్మ దృష్టి అయితే రెండవది ఫలదృష్టి.

ఈ మంత్రాల్లో ఉత్కృష్ట ఫలధ్యానం చూస్తాము. నాలుగు వేదాలకు చెందిన ఋత్విక్కులకు ఉన్న పేర్లు చూశాము. వారి కర్మలు కూడా చూశాము. వాటి ఫలాలను ఇప్పుడు చూస్తాము. అది కూడా ఈ క్రింద పట్టికలో చూద్దాము.

**సంపదుపాసనలు**

| మంత్రం | ఋత్విక్కు | కర్మ | సంఖ్య | ఉత్కృష్ట ఫలం |
|---|---|---|---|---|
| 7 | హోతా | దేవతలను ఆవాహన చేస్తాడు | మూడు సార్లు | భూలోక, భువర్లోక, సువర్లోకాలు |
| 8 | అధ్వర్యుడు | ఆహుతులను వేస్తాడు | మూడు సార్లు | సువర్లోక, భువర్లోక, భూలోకాలు |
| 9 | బ్రహ్మ | యజ్ఞపర్యవేక్షణ చేస్తాడు | ఒకరిద్వారా | విశ్వే దేవతల లోకాలు |
| 10 | ఉద్గాతా | దేవతలను స్తుతిస్తాడు | మూడు సార్లు | భూలోక, భువర్లోక, సువర్లోకాలు |

బృహదారణ్యకోపనిషత్తులో కర్మ కాండ భాగం వచ్చిందేమిటి అనుకోకూడదు. యాజ్ఞవల్క్యుణ్ణి బ్రహ్మవిత్ అంటారు. బ్రహ్మవిత్ అంటే వేదవిత్ అంటే కర్మ, ఉపాసన, జ్ఞానకాండలన్నిటిలోనూ ఆరితేరి ఉండాలి. ఈ నేపథ్యంతో మంత్రాలు చూద్దాము.

**మంత్రం 3.1.7**

**యాజ్ఞవల్క్యేతి హోవాచ** – ఈ బ్రాహ్మణము మొదలుకొని, చివరి బ్రాహ్మణము వరకూ యాజ్ఞవల్క్యేతి హోవాచతో మొదలవుతుంది. ఎవరైతే యాజ్ఞవల్క్యుని ప్రశ్నిస్తారో, వారు ఓ యాజ్ఞవల్క్యా అని సంబోధించి ప్రశ్నిస్తారు.

**కతిభిరయమద్యర్గ్భిర్హోతాఽస్మిన్ యజ్ఞే కరిష్యతీతి** – ఈ హోతా యజ్ఞంలో ఎన్ని ఋక్కులతో శంసనం (దేవతల గుణాలను వర్ణించటం) చేస్తాడు?

**తిసృభిరితి** – మూడింటితో

**కతమాస్తాస్తిస్ర ఇతి** – ఆ మూడూ ఏమిటి?

**పురోనువాక్యా చ యాజ్యా చ శస్యైవ తృతీయా** – అవి పురోనువాక్య, యాజ్య, శస్య. వాటిని ఉత్కృష్ట కర్మఫలం పొందుతున్నట్టు ఊహించుకుని చేయాలి.

**కిం తాభిర్జయతీతి** – వాటితో (యజమాని) దేన్ని జయిస్తాడు (పొందుతాడు)?

**యత్కించేదం ప్రాణభృదితి** – ఈ ప్రాణకోటి ఏది ఉందో, దానిని పొందుతాడు. అంటే భూలోక, భువర్లోక, సువర్లోకాలను జయిస్తాడు.

**మంత్రం 3.1.8**

**యాజ్ఞవల్క్యేతి హోవాచ కత్యయమద్యాధ్వర్యురస్మిన్ యజ్ఞ ఆహుతీర్హోష్యతీతి** – ఓ యాజ్ఞవల్క్యా, యజ్ఞంలో అధ్వర్యుడు ఎన్ని ఆహుతులను హోమంలో వేస్తాడు?

**త్రిస ఇతి** – మూడు.

**కతమాస్తాస్త్రిస ఇతి** – ఆ మూడు ఏవి?

**యా హుతా ఉజ్జ్వలంతి యా హుతా అతినేదంతే యా హుతా అధిశేరతే** – ఏవైతే హోమం చేయబడినవై ప్రజ్వరిల్లుతాయో, ఏవైతే హోమం చేయబడినవై శబ్దం చేస్తాయో, ఏవైతే హోమం చేయబడినవై విలీనమైపోతాయో,

సమిధలు, నెయ్యి, నూతన వస్త్రాలు మొదలైనవి వేసినప్పుడు అవి దేదీప్యమానంగా వెలుగుతాయి. మాంసం, వండిన అన్నం మొదలైనవి వేసినప్పుడు అవి శబ్దాన్ని చేస్తాయి. పాలు, సోమరసం, పెరుగు మొదలైనవి వేసినప్పుడు అవి అగ్నికుండంలో క్రిందకి వెళ్ళిపోతాయి.

**కిం తాభిర్జయతీతి** – వాటితో (యజమాని) దేన్ని జయిస్తాడు?

**యా హుతా ఉజ్జ్వలంతి దేవలోకమేవ తాభిర్జయతి దీప్యత ఇవ హి దేవలోకః** – ప్రజ్వలించే వాటిని హోమంలో వేయటంవల్ల దేవలోకాన్ని జయిస్తాడు. ఎందుకంటే, దేవలోకం దేదీప్యమానంగా ఉన్నట్టు ఉంటుంది.

**యా హుతా అతినేదంతే పితృలోకమేవ తాభిర్జయత్యతీవ హి పితృలోకః** – ఏ ఆహుతులైతే అధికమైన శబ్దం చేస్తాయో, వాటితో పితృలోకాన్ని జయిస్తాడు. ఎందుకంటే పితృలోకం అధికమైన శబ్దం చేస్తున్నదా అన్నట్టు ఉంటుంది.

**యా హుతా అధిశేరతే మనుష్యలోకమేవ తాభిర్జయత్యధ ఇవ హి మనుష్యలోకః** – ఏ ఆహుతులైతే హోమకుండంలో కిందికి వెళ్ళిపోతాయో, వాటితో మనుష్యలోకాన్ని జయిస్తాడు. ఎందుకంటే మనుష్యలోకం క్రింద ఉంది.

అంతకుముందు మంత్రంలో హోతా కూడా ఈ మూడు లోకాలనే జయిస్తాడు. కాకపోతే రెండింటిలో వరుస క్రమంలో తేడా ఉంది. హోతా భూలోక, భువర్లోక, సువర్లోకాలను జయిస్తే అధ్వర్యుడు సువర్లోక, భువర్లోక, భూలోకాలను జయిస్తాడు.

**మంత్రం 3.1.9**

**యాజ్ఞవల్క్యేతి హోవాచ కతిభిరయమద్య బ్రహ్మా యజ్ఞం దక్షిణతో దేవతాభిర్గోపాయతీతి** – ఓ యాజ్ఞవల్క్యా! బ్రహ్మ దక్షిణం వైపు (కుడివైపు) కూర్చుని ఎందరు దేవతలద్వారా యజ్ఞాన్ని రక్షిస్తాడు?

**ఏకయేతి** – ఒకరిద్వారా.

**కతమా సైకేతి** – ఆ ఒక్క దేవత ఎవరు?

**మన ఏవేత్యనంతం వై మనోఽనంతా విశ్వే దేవా అనంతమేవ స తేన లోకం జయతి** – మనస్సే. మనస్సు నిశ్చయంగా అనంతం. విశ్వే దేవతలు అనంతులు. దానితో అనంతమైన లోకాలనే జయిస్తాడు.

మామూలుగా ఋత్విక్కుల గురించి చెప్పేటప్పుడు హోతా, అధ్వర్యుల గురించి చెప్పాక, ఉద్గాత గురించి చెబుతారు కాని ఇక్కడ యాజ్ఞవల్క్యుడిని ఖంగారు పెట్టటానికి వరుస క్రమాన్ని మార్చి, బ్రహ్మ గురించి అడిగాడు. ప్రశ్నలో కూడా అయోమయంలో పడవేయటానికి చూశాడు. బ్రహ్మ ఎందరు దేవతలద్వారా యజ్ఞాన్ని రక్షిస్తాడని

అడిగాడు. యాజ్ఞవల్క్యుడు అంత తేలిగ్గా బోల్తాపడే రకం కాదు. అతను ఏమాత్రం చెక్కు చెదరకుండా బ్రహ్మ గురించి జవాబు చెప్పాడు; పైపెచ్చు ప్రశ్నకు మోసపోకుండా ఒకరే అని చెప్పాడు.

బ్రహ్మ మనోదేవతను ఉపయోగిస్తాడు. మనసులో అనంతమైన ఆలోచనలు ఉంటాయి. విశ్వేదేవతలు కూడా అనంతం. అందుకని బ్రహ్మకు కలిగే ఫలం అనంతమైన విశ్వేదేవతల లోకానికి వెళ్ళటం.

**మంత్రం 3.1.10**

**యాజ్ఞవల్క్యేతి హోవాచ కత్యయమద్యోద్గాతాఽస్మిన్ యజ్ఞే స్తోత్రియాః స్తోష్యతీతి** – ఓ యాజ్ఞవల్క్యా! యజ్ఞంలో ఉద్గాతా ఎన్ని స్తోత్రాలు చేస్తాడు?

**తిస్ర ఇతి** – మూడు.

**కతమాస్తాస్తిస్ర ఇతి** – ఏమిటా మూడు?

**పురోనువాక్యా చ యాజ్యా చ శస్త్యైవ తృతీయా** – అవి పురోనువాక్య, యాజ్య, శస్య.

**కతమాస్తా యా అధ్యాత్మమితి** – అవి శరీరంలో ఏవి?

**ప్రాణ ఏవ పురోనువాక్యాఽపానో యాజ్యా వ్యానశ్శస్యా** – ప్రాణమే పురోనువాక్య, అపానం యాజ్య, వ్యానం శస్య.

**కిం తాభిర్జయతీతి** – వాటితో దేనిని జయిస్తాడు?

**పృథివీలోకమేవ పురోనువాక్యయా జయత్యంతరిక్షలోకం యాజ్యయా ద్యులోకగ్ం శస్యయా** – పురోనువాక్యవల్ల పృదివి లోకాన్ని, యాజ్యవల్ల అంతరిక్ష లోకాన్ని, శస్యవల్ల ద్యులోకాన్ని జయిస్తాడు.

ఇంచుమించు హోతా విషయంలో, ఉద్గాత విషయంలో వివరాలు ఒకటే. హోతా మంత్రాలను చదివితే, ఉద్గాత గొంతెత్తి పాడుతాడు. అతను మూడుసార్లు దేవతలను ఆహ్వానిస్తే, ఆ మూడుసార్లూ ఉద్గాత ఆయా దేవతలను కీర్తిస్తాడు. అందుకే ఆ స్తోత్రాల పేర్లు, వారు జయించే లోకాలు కూడా ఒకటే అయ్యాయి. అందువల్ల హోతా విషయంలో ఫలంలో ఈ అదనపు సమాచారం కలుపుకోవాలి. అంటే పురోనువాక్యవల్ల పృథివీ లోకాన్ని, యాజ్యవల్ల అంతరిక్ష లోకాన్ని, శస్యవల్ల ద్యులోకాన్ని జయిస్తాడని అర్థం చేసుకోవాలి.

ఇక్కడ అదనంగా ఇవ్వబడిన సమాచారం – వాటిని వ్యష్టిపరంగా దేనితో క్రోడీకరించుకోవాలో చెబుతుంది. ప్రాణం పురోనువాక్య, అపానం యాజ్య, వ్యానం శస్య.

వీటితో నాలుగు సంపదుపాసనలు ముగిశాయి. అశ్వలుడు అడిగిన ఎనిమిది ప్రశ్నలకూ జవాబులు వచ్చాయి.

**తతో హ హోతాఽశ్వల ఉపరామ** – దానితో హోతా అశ్వలుడు విరమించాడు. యాజ్ఞవల్క్యుడు బ్రహ్మవిదులలో శ్రేష్ఠుడు అని అర్థమయింది.

ఇప్పుడు ఇంకొక బ్రాహ్మణుడు వస్తాడు.

# 3.2 - ఆర్తభాగ బ్రాహ్మణము

మొదటి బ్రాహ్మణములో ఐక్య ఉపాసన చేస్తే హిరణ్యగర్భ లోకానికి వెళతారనీ, దాన్ని అతిమోక్ష ఉపాసన అంటారనీ చూశాము. ఆ లోకం పొందితే, కర్మ రూప మృత్యువును, కాలరూప మృత్యువును అధిగమిస్తారని చూశాము. ఇక్కడ కొంతమంది పొరపాటు పడే అవకాశముంది. హిరణ్యగర్భ పథం అమృతమనీ, అదే పరమ పురుషార్థమనీ అనుకోవచ్చు. అంటే ఉపాసనద్వారా మోక్షం పొందవచ్చనే అర్థం తీసుకుని ఉపాసన కాండలోనే ఆగిపోవచ్చు.

ఉపాసనవల్ల హిరణ్యగర్భ పథం పొంది, అదే మోక్షం అయితే ఇంక జ్ఞానకాండ ఎందుకు? ఉపాసన కాండే మోక్షం ఇస్తే, జ్ఞానకాండ ఎందుకు, గురుప్రాప్తికోసం వెంపర్లాట ఎందుకు? శ్రవణ, మనన, నిదిధ్యాసనల ఆవశ్యకత ఏముంది? అసలు వేదాంతమే అనవసరం అవుతుంది.

అందువల్ల అక్కడితో ఆగిపోకుండా, హిరణ్యగర్భలోకం కూడా సాపేక్షిక అమృతత్వాన్ని ఇస్తుంది తప్పితే, మోక్షాన్నివ్వదు అని చెప్పటానికే ఈ బ్రాహ్మణము. మొదటి బ్రాహ్మణానికీ, దీనికీ, మధ్య ఉన్న సంబంధాన్ని **సంగతి** అంటారు. మొదటి బ్రాహ్మణములో కర్మను మృత్యువు అనీ, దానినుంచి అతిమోక్షాన్నిచ్చేది ఉపాసన అనీ చూపించింది ఉపనిషత్తు.

ఇప్పుడు ఇంకో మెట్టు ఎక్కుతున్నాము. ఉపనిషత్తు గొప్పదనం అదే. మనం ఉన్నచోటికి దిగివచ్చి, అక్కడ్నుంచి మనను ఒక్కొక్కమెట్టు పైకి ఎక్కిస్తుంది. ఇంతకుముందు చూశాము –

కేవల కర్మ స్వర్గలోక ఫలాన్నిస్తుంది
కర్మ + ఉపాసన హిరణ్యగర్భలోక ఫలాన్నిస్తుంది

స్వర్గలోకంకన్నా హిరణ్యగర్భలోకం చాలారెట్లు శాశ్వతం.కాని ఈ మోక్షం కూడా సాపేక్షికం. నిజానికి, హిరణ్యగర్భ కూడా మృత్యువు కోరల్లో చిక్కి ఉన్నాడు. ముందు బ్రాహ్మణములో మనుష్యులు చిక్కుకున్న మృత్యుకోరల గురించి చూశాము. ఇప్పుడు హిరణ్యగర్భ చిక్కుకున్న మృత్యుకోరలు ఏమిటో ఈ బ్రాహ్మణములో చూస్తాము. అవి రెండు రకాలు – గ్రహాలు, అతిగ్రహాలు. గ్రహ లక్షణ మృత్యువు, అతిగ్రహ లక్షణ మృత్యువు.

ఈ బ్రాహ్మణంలో మొదటిభాగం ఈ గ్రహ, అతిగ్రహాల గురించి వివరిస్తే, రెండవభాగం ఈ మృత్యువులను అధిగమించటమెలాగో చెబుతుంది. కర్మ కన్నా ఉపాసన ఎక్కువైతే, ఈ రెండింటికన్నా జ్ఞానం ఎక్కువ. ఆత్మజ్ఞానం మాత్రమే మోక్షాన్నిస్తుంది. ఈ విషయమంతా సంవాదరూపంలో ఉంటుంది.

ఆర్తభాగుడు ప్రశ్నించాడు కాబట్టి దీన్ని ఆర్తభాగ బ్రాహ్మణము అంటారు.

మంత్రం 3.2.1

**అథ హైనం జారత్కారవ ఆర్తభాగః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యేతి హోవాచ కతి గ్రహాః కత్యతిగ్రహా ఇతి। అష్టౌ గ్రహా అష్టావతిగ్రహా ఇతి యే తేఽష్టౌ గ్రహా అష్టావతిగ్రహాః కతమే త ఇతి ॥**

**అథ హైనం జారత్కారవ ఆర్తభాగః పప్రచ్ఛ** – తర్వాత జారత్కారక ఆర్తభాగుడు అడిగాడు.

ప్రతివారికీ రెండు పేర్లు వస్తాయి.

**యాజ్ఞవల్క్యేతి హోవాచ కతిగ్రహాః కత్యతిగ్రహా ఇతి** – ఓ యాజ్ఞవల్క్యా, గ్రహాలెన్ని, అతిగ్రహాలెన్ని అని అడిగాడు.

**అష్టౌ గ్రహా అష్టావతిగ్రహా ఇతి** – గ్రహాలు ఎనిమిది, అతిగ్రహాలు ఎనిమిది.

**యే తేఽష్టౌ గ్రహా అష్టావతిగ్రహాః కతమే త ఇతి** – ఆ ఎనిమిది గ్రహాలు, అతిగ్రహాలు ఏమిటి?

మంత్రం 3.2.2

**ప్రాణో వై గ్రహస్సోఽపానేనాతిగ్రాహేణ గృహీతోఽపానేన హి గన్ధాన్ జిఘ్రతి ॥**

మంత్రం 3.2.3

**వాగ్వై గ్రహస్స నామ్నాఽతిగ్రాహేణ గృహీతో వాచా హి నామాన్యభివదతి ॥**

మంత్రం 3.2.4

**జిహ్వా వై గ్రహస్స రసేనాతిగ్రాహేణ గృహీతో జిహ్వయా హి రసాన్ విజానాతి ॥**

మంత్రం 3.2.5

**చక్షుర్వై గ్రహస్స రూపేణాతిగ్రాహేణ గృహీతశ్చక్షుషా హి రూపాణి పశ్యతి ॥**

మంత్రం 3.2.6

**శ్రోత్రం వై గ్రహస్స శబ్దేనాతిగ్రాహేణ గృహీతశ్శ్రోత్రేణ హి శబ్దాన్ శృణోతి ॥**

మంత్రం 3.2.7

**మనో వై గ్రహస్స కామేనాతిగ్రాహేణ గృహీతో మనసా హి కామాన్ కామయతే॥**

మంత్రం 3.2.8

**హస్తౌ వై గ్రహస్స కర్మణాతిగ్రాహేణ గృహీతో హస్తాభ్యాం హి కర్మ కరోతి॥**

మంత్రం 3.2.9

**త్వగ్వై గ్రహస్స స్పర్శేనాతిగ్రాహేణ గృహీతస్త్వచా హి స్పర్శాన్ వేదయత ఇత్యేతేஉష్టౌ గ్రహా అష్టావతిగ్రహాః॥**

ఎనిమిది గ్రహాలంటే మనకు తెలిసిన గ్రహాలు కావు. ఇంద్రియాలు. ఎందుకు?

గృహ్ణాతి ఇతి గ్రహః

అదుపులో పెట్టేది గ్రహం. మన ఇంద్రియాలు మనను అదుపులో పెడతాయి. వాటి శక్తి ఎంత ఎక్కువంటే అవి మనను అనేక దిక్కులకు పరుగులు పెట్టిస్తాయి.

కఠోపనిషత్తులో ఇంద్రియాలను అదుపు తప్పిన గుర్రాలతో పోలుస్తుంది ఉపనిషత్తు. రథంలో కూర్చున్న యజమానిని అదుపు తప్పిన గుర్రాలు వాటి ఇష్టం వచ్చినచోటికి తీసుకుపోతాయి.

ఇంద్రియాలు గ్రహాలైతే, అతిగ్రహాలు ఏమిటి? విషయ వస్తువులు అతిగ్రహాలు. ఇంద్రియాలను అవి అదుపులో పెడతాయి. మనం తీపి తినకూడదని నిర్ణయించుకున్నా, మన కళ్ళ ఎదురుకుండా తీపి పదార్థాలు పెడితే, మన కళ్ళు అటే పరుగెడతాయి. కళ్ళు ఆకర్షించబడి, మనం దాన్ని తినేలాగా చేస్తాయి. కళ్ళు టీవీకి ఎంతలా అతుక్కుపోతాయో వేరే చెప్పాలా? ఇంద్రియాలే మనకు యాజమానులైతే యజమానులకే యజమానులు విషయవస్తువులు.

**గ్రహాణాం గ్రహాః అతిగ్రహాః**

**గ్రహానపి గృహ్ణన్తి**

గ్రహాలకే గ్రహాలు అతిగ్రహాలు. గ్రహాలని కూడా అవి అదుపులో పెడతాయి.

మన సూక్ష్మశరీరంలో 19 అంగాలుంటాయి. పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణలు. వాటిలో కొన్ని మాత్రమే తీసుకున్నాడు యాజ్ఞవల్క్యుడు. తక్కినవాటిని కూడా కలుపుకోవాలి మనం. యాజ్ఞవల్క్యుడు చెప్పిన గ్రహాలు, అతిగ్రహాలను తేలిగ్గా ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

**గ్రహ, అతిగ్రహాల పట్టిక**

| **మంత్రం** | **గ్రహం** | **అతిగ్రహం** | **అతిగ్రహం పని** |
|---|---|---|---|
| 2 | ప్రాణం | అపానం | గంధాన్ని ఆఘ్రాణించడం |
| 3 | వాక్కు | నామం | మాటలు వినటం |
| 4 | జిహ్వా | రసం | రుచి చూడటం |
| 5 | కన్ను | రూపం | వస్తువులను చూడటం |
| 6 | చెవి | శబ్దం | శబ్దాలు వినటం |
| 7 | మనస్సు | కామం | కోరికలను కోరటం |
| 8 | చేతులు | కర్మ | పనులు చేయటం |
| 9 | త్వక్ | స్పర్శ | స్పర్శ తెలుసుకోవటం |

ప్రాణం, అపానం పదాలను ఉపనిషత్తు అనేక సందర్భాలలో అనేక అర్థాలలో వాడుతుంది. ఇక్కడ ప్రాణాన్ని ఘ్రాణేంద్రియంగానూ, అపానాన్ని గంధం ఉన్న విషయవస్తువులుగానూ వాడింది. అలా పంచజ్ఞానేంద్రియాల గురించి వచ్చింది. కర్మేంద్రియాలకు వాక్కు, చేతులు వచ్చాయి, నాలుగు అంతఃకరణలకు మనస్సు వచ్చింది. అలా ఎనిమిది గ్రహాలు, వాటికి సంబంధించిన విషయవస్తువులు అతిగ్రహాలు అయ్యాయి.

వ్యష్టి ఇంద్రియాలు, వ్యష్టికి నచ్చిన విషయవస్తువులు, వ్యష్టిని పట్టి బంధిస్తాయి. అదే సూత్రాన్ని హిరణ్యగర్భకు కూడా ఆపాదించాలి. హిరణ్యగర్భను సమష్టి ఇంద్రియాలు, సమష్టి విషయవస్తువులు బంధిస్తాయి. దీనివల్ల సూచించబడే విషయం ఏమిటంటే హిరణ్యగర్భ కూడా ఉపాధిలో బంధింపపడ్డాడని, ఆ సమష్టి ఉపాధిని గ్రహాలు, అతిగ్రహాలు నియంత్రిస్తున్నాయని. పదవ మంత్రంనుంచి ఈ గ్రహ, అతిగ్రహ మృత్యువును ఎలా అధిగమించాలో వస్తుంది.

కాని దానికి వెళ్ళేముందు ఒక విషయం గ్రహించాలి మనం. ఇక్కడ ప్రత్యక్షంగా ఆ విషయానికి సంబంధం లేదు కాని, కఠోపనిషత్తులో ఒక జటిలమైన విషయానికి దీనిద్వారా మనకు పరిష్కారం దొరుకుతుంది. అదేమిటో చూద్దాము.

**ఇంద్రియేభ్యః పరఅర్థ – కఠ**

పంచకోశ వివేకం చేసేటప్పుడు మామూలుగా చేసే పద్ధతి ఇది – బాహ్యప్రపంచం కన్నా అన్నమయకోశం గొప్పది, అన్నమయకోశంకన్నా ప్రాణమయకోశం గొప్పది అంటూ అలా బాహ్యంనుంచి అంతరంగా సాగుతుంది ఆ ప్రయాణం. కాని కఠోపనిషత్తులో యమధర్మరాజు ఇంద్రియాలకన్నా విషయవస్తువులు గొప్పవి అన్నాడు. అలా ఎందుకన్నాడో దానికి జవాబు ఇక్కడ దొరుకుతుంది. విషయవస్తువులు ఇంద్రియాలను ఆడిస్తాయి.

మంత్రం 3.2.10

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యదిదగ్ం సర్వం మృత్యోరన్నం కా స్విత్సా దేవతా యస్యా మృత్యురన్నమిత్యగ్నిర్వై మృత్యుస్సోఽపామన్నమప పునర్మృత్యుం జయతి ॥**

మామూలుగా మృత్యువు అంటే మరణం. కాని ఇక్కడ గ్రహ అతిగ్రహ లక్షణ మృత్యువు అన్నిటినీ బంధిస్తుంది. ఇక్కడ ఆర్తభాగుడు ప్రశ్నను వేరే విధంగా వేస్తున్నాడు. జగత్తులో ఉన్నదంతా మృత్యువుకు అన్నం అవుతున్నది. అన్ని జీవులు గ్రహ అతిగ్రహమృత్యువుకు అన్నం అవుతుంటే, ఆ మృత్యువును అన్నంలా తినే వారెవరైనా ఉన్నారా?

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యదిదగ్ం సర్వం మృత్యోరన్నం** – ఓ యాజ్ఞవల్క్యా! ఈ సర్వము ఏదైతే ఉందో అది మృత్యువుకు అన్నం.

**కా స్విత్సా దేవతా యస్యా మృత్యురన్నమితి** – ఏ దేవతకైతే మృత్యువు అన్నమో, ఆ దేవత ఎవరు?

**అగ్నిర్వై మృత్యుస్సోఽపామన్నమప పునర్మృత్యుం జయతి** – అగ్నియే మృత్యువు. ఆ అగ్ని జలములకు అన్నము. ఈ విధంగా ఉపాసించువాడు అపమృత్యువును జయిస్తాడు.

కప్ప నోటిలో పురుగు ఉంటే, కప్ప పాము నోటిలో ఉంటుంది. పురుగుదృష్ట్యా చూస్తే పురుగుకు కప్ప మృత్యువు; కప్ప దృష్ట్యా చూస్తే పాము కప్పకు మృత్యువు. అలా గ్రహ, అతిగ్రహ మృత్యువుకు, మృత్యువు ఎవరు అని ప్రశ్నించాడు ఆర్తభాగుడు. ఇది రెండవ ప్రశ్న.

దానికి జవాబు ప్రత్యక్షంగా ఇవ్వదు. మృత్యువుకు మృత్యువు ఉంది, అని చూపించటానికి ఒక ఉదాహరణనిస్తాడు యాజ్ఞవల్క్యుడు. అన్నిటికీ మృత్యువు అగ్ని. అంటే సర్వాన్నీ అగ్ని అన్నంలా తింటుంది. కాని అదే అగ్ని నీటికి అన్నం అవుతుంది. మండుతున్న అగ్నిమీద నీరు పోస్తే ఏమవుతుంది? మంట చల్లారిపోతుంది. నీరు వేడెక్కుతుంది. అంటే అది మంటను తనలోకి తీసుకుంది, లేదా అగ్నిని అన్నంగా తిన్నది. అలా అగ్నికి మృత్యువు నీరు. అగ్ని మృత్యువు అయితే నీరు మృత్యోర్మృత్యుః.

అలాగే గ్రహ అతిగ్రహాలు మృత్యువు అయితే, వాటికి మృత్యువు ఇంకో దేవత ఉంది. ఆ జవాబు సూచనగా చెప్పి వదిలేశాడు. అది ఆర్తభాగునికి అర్థమైంది. అతను అడిగిన తర్వాత ప్రశ్ననుబట్టి అతనికి అర్థమైందని మనకు అర్థమవుతుంది. ఆ జవాబుని శంకరులవారు పూరిస్తారు. దాని జవాబు బ్రహ్మజ్ఞానం దర్శనం. హిరణ్యగర్భను అధిగమించటానికి ఒక్కటే మార్గముంది. అది బ్రహ్మజ్ఞానం. దాన్నే ఆత్మజ్ఞానం అని కూడా అంటారు. ఈ రెండో ప్రశ్ననుంచి బ్రహ్మవిద్య గురించి వస్తుంది.

## మంత్రం 3.2.11

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యత్రాయం పురుషో మ్రియత ఉదస్మాత్ప్రాణాః క్రామన్త్యాహో 3 నేతి నేతి హోవాచ యాజ్ఞవల్క్యోఽత్రైవ సమవనీయన్తే స ఉచ్ఛ్వయత్యాధ్మాయత్యాధ్మాతో మృతశ్శేతే ॥**

ఈ మంత్రం జ్ఞానికి సంబంధించినది. ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తిని జ్ఞాని అంటారు. అంటే అతను గ్రహ అతిగ్రహ లక్షణ మృత్యువును జయించి, సంసారాన్ని దాటుతాడు. అటువంటి జ్ఞానికి మరణసమయంలో ఏమవుతుంది? జ్ఞానికి మరణసమయంలో ఏమవుతుందో చూసేముందు, అజ్ఞానికి ఏమవుతుందో చూద్దాము.

అజ్ఞానికి ప్రాణం, ఏదో ఒక నాడిద్వారా బయటకు వెళుతుంది. అజ్ఞానుల్లో రకరకాల స్థాయిలవారు ఉన్నారు. వారి స్థాయినిబట్టి ప్రాణం బయటకు వెళుతుంది.

కేవల కర్మ చేసిన వ్యక్తికి ఏదో ఒక నాడిద్వారా బయటకు వెళుతుంది.

అదే ఉపాసన చేసిన వ్యక్తికి సుషుమ్న నాడిద్వారా బ్రహ్మరంధ్రంలోంచి బ్రహ్మలోకానికి వెళుతుంది. అక్కడ జ్ఞానం పొందితే క్రమముక్తి పొందుతాడు. ఉపాసకుడు కూడా అజ్ఞానిలోకే వస్తాడు.

సన్న్యాసుల్లో రెండు రకాలు ఉన్నారు. ప్రతి సన్న్యాసీ జ్ఞాని కాకపోవచ్చు, ప్రతి జ్ఞానీ సన్న్యాసి కానవసరం లేదు. అందువల్ల సన్న్యాసి అజ్ఞాని సన్న్యాసి అయితే, అతనికి కూడా బ్రహ్మరంధ్రంలోంచి ప్రాణం పోతుంది. అతను కూడా క్రమముక్తి పొందుతాడు.

ఈ విధంగా అజ్ఞానులందరిలో ప్రాణం బయటకు వస్తుంది. ప్రాణం బయటకు పోవటాన్ని **ప్రాణోత్క్రమణం** అంటారు. ప్రాణోత్క్రమణం జరిగిందంటే పునర్జన్మ ఉంటుందని అర్థం. అందువల్ల అజ్ఞానులందరికీ పునర్జన్మ

ఉంటుంది. పునర్జన్మ అంటే ఈ లోకంలోనే తిరిగి పుట్టాలని లేదు. బ్రహ్మలోకంలోనో, స్వర్గలోకంలోనో, మరేదైనా లోకంలోనో పుట్టవచ్చు. అది వారి కర్మఫలాన్నిబట్టి ఉంటుంది.

ఆర్తభాగుని ప్రశ్న జ్ఞాని పరిస్థితి ఏమిటి అని. అతనికి ప్రాణోత్క్రమణ ఉంటుందా, ఉండదా? ఇది మూడవ ప్రశ్న. ప్రాణోత్క్రమణ ఉంటే పునర్జన్మ ఉంటుందని ఇప్పుడే చూశాము.

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యత్రాయం పురుషో మ్రియత ఉదస్మాత్ప్రాణాః క్రామంత్యాహో3** – ఓ యాజ్ఞవల్క్యా! ఈ పురుషుడు మరణించినప్పుడు అతని ప్రాణాలు పైకి పోతాయా, పోవా?

**నేతి నేతి హోవాచ యాజ్ఞవల్క్యః** – యాజ్ఞవల్క్యుడు పోవని చెప్పాడు.

**అత్రైవ సమవనీయంతే** – ఇక్కడే విలీనమవుతుంది.

**స ఉచ్ఛ్వయత్యాధ్మాయత్యాధ్మాతో మృతశ్శేతే** – ఆ పురుషుడు ఉబ్బుతాడు. గాలితో నింపబడతాడు. గాలితో నిండినవాడై, మరణించి పడి ఉంటాడు.

ప్రాణం బయటకు పోకపోతే మరణించినట్లు ఎలా తెలుస్తుంది? శరీరం ఉబ్బుతుంది. గాలితో నిండుతుంది. శరీరం మరణించి పడి ఉంటుంది. ప్రాణం బయటకు పోదు, అక్కడా ఉండదు. అది సమష్టిప్రాణంలో లయమయిపోతుంది. అందువల్ల జ్ఞానికి పునర్జన్మ లేదు.

ఈ మంత్రం అక్షర లక్షలు విలువ చేసే మంత్రం. దీన్ని ఆధారంగా చేసుకుని కొన్ని దర్శనాలను ఖండించవచ్చు. చాలా దర్శనాల్లో ముఖ్యంగా విశిష్టాద్వైతంలో మోక్షం అంటే ఊర్ధ్వలోకాలకు ప్రయాణించటం అంటారు. ప్రాణం ప్రయాణించకపోతే, మనస్సు ప్రయాణించవచ్చు కదా అనటానికి లేదు. ప్రాణం అంటే మొత్తం సూక్ష్మశరీరం వస్తుంది. సూక్ష్మశరీరమే మరణసమయంలో ప్రాణంతో పాటు పైకి వెళుతుంది. జ్ఞానికి ప్రయాణం లేదు అని నిరూపించే మంత్రం ఇది. దీనితో మూడవ ప్రశ్న అయిపోయింది. జ్ఞానికి ప్రయాణం ఉందా? జవాబు ప్రయాణం లేదు.

## మంత్రం. 3.2.12

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యత్రాయం పురుషో మ్రియతే కిమేనం న జహాతీతి నామేత్యనన్తం నామానన్తా విశ్వే దేవా అనన్తమేవ స తేన లోకం జయతి ॥**

ఇప్పుడు నాలుగవ ప్రశ్న. విదేహముక్తిలో జ్ఞానికి అన్నీ కలిసిపోతాయి. మరణసమయంలో స్థూలశరీరం స్థూలప్రపంచంలో; సూక్ష్మశరీరం సూక్ష్మప్రపంచంలో; కారణశరీరం కారణప్రపంచంలో కలిసిపోతాయి. జ్ఞాని మరణాన్ని పరాంతకాలే అని కూడా అంటారు.

కారణశరీరానికి ఉన్న ఇంకో పేరు అవిద్య. అవిద్యనే మాయ అని కూడా అంటారు. మాయకు రెండు శక్తులున్నాయి – విక్షేపశక్తి, ఆవరణశక్తి. జీవన్ముక్తి పొందగానే ఆవరణశక్తి మటుమాయమైపోతుంది. విక్షేపశక్తి ఉంటుంది. విదేహముక్తిలో విక్షేపశక్తి కూడా పోతుంది. ఆ విధంగా అవిద్య పోతుంది. ఆవరణశక్తి ముందే పోయింది; మరణంలో విక్షేపశక్తి పోయింది. ఆ విధంగా స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు పోతాయి.

దీన్ని మనస్సులో పెట్టుకుని ఆర్తభాగుడు ఒక ప్రశ్న అడిగాడు. జ్ఞానిని అన్నీ విడిచిపెట్టినా, ఒకటి మాత్రం ఉంటుంది – ఏమిటది? ఇది నాలుగవ ప్రశ్న.

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యత్రాయం పురుషో మ్రియతే కిమేనం న జహాతీతి** – ఓ యాజ్ఞవల్క్యా! ఏ కాలంలో ఈ పురుషుడు మరణిస్తాడో, అప్పుడు అతన్ని ఏది విడిచిపెట్టదు? పురుషుడంటే ఇక్కడ జ్ఞాని.

**నామేత్యనంతం నామానంతా విశ్వేదేవా** – నామం. నామం అనంతం. విశ్వే దేవతలు అనంతులు.

**అనంతమేవ స తేన లోకం జయతి** – ఇది తెలుసుకున్న అతను అనంతమైన లోకాన్ని జయిస్తాడు. ఆ విధంగా వేలాది సంవత్సరాల తర్వాత కూడా పేరు చిరస్థాయిగా నిలిచివుంటుంది.

ప్రశ్నోపనిషత్తులో షోడశకళా పురుషుని గురించి వస్తుంది. పదహారు కళలు ఉన్న పురుషుడు ఎవరు అని ప్రశ్న. అందులో ఒక కళ – **పేరు.**

ముండకోపనిషత్తులో పదహారు కళల్లో, పదిహేను పోయి, మనిషి మరణించాక కూడా ఒకటి మిగిలి వుంటుందని వస్తుంది.

ఈ రెండూ ఇక్కడ గుర్తు చేసుకుంటే పదహారు కళల్లో పదిహేను పోయి, మిగిలివున్న ఒకటీ – **పేరు**. ఇది జవాబు.

దీనికి ముగింపుగా చివర ఒక ఉపాసనవంటిది చెప్పబడింది. అది ఉపాసన కాదు, జ్ఞానం. నామాలు అనంతం. విశ్వే దేవతలు అనంతం. విశ్వే దేవతలు జగత్తులోని అన్ని పదార్థాలకు ప్రతీకలు. పదాలు అనంతం, పదార్థాలు అనంతం. పేర్లు అనంతం, వస్తువులు అనంతం.

జ్ఞాని ఏం చేస్తాడు? తనే అన్ని పేర్లు, అన్ని వస్తువులు అని తెలుసుకుంటాడు. తనే అన్ని పదాలు, అన్ని పదార్థాలు. తనే శబ్దప్రపంచం, తనే అర్థ ప్రపంచం. ఈ విషయం తెలుసుకోవటంవల్ల అతను అనంతలోకాన్ని అంటే మోక్షాన్ని జయిస్తాడు.

## మంత్రం 3.2.13

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యత్రాస్య పురుషస్య మృతస్యాగ్నిం వాగప్యేతి వాతం ప్రాణశ్చక్షురాదిత్యం మనశ్చన్ద్రం దిశశ్శ్రోత్రం పృథివీగ్ం శరీరమాకాశమాత్మౌషధీర్లోమాని వనస్పతీన్ కేశా అప్సు లోహితం చ రేతశ్చ నిధీయతే క్వాయం తదా పురుషో భవతీతి ॥**
**ఆహర సోమ్య హస్తమార్తభాగావామేవైతస్య వేదిష్యావో న నావేతత్సజన ఇతి ॥**
**తౌ హోత్క్రమ్య మన్త్రయాఞ్చక్రాతే తౌ హ యదూచతుః కర్మ హైవ తదూచతురథ యత్ప్రశశగ్ంసతుః కర్మ హైవ తత్ప్రశశగ్ంసతుః ॥**
**పుణ్యో వై పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేనేతి తతో హ జారత్కారవ ఆర్తభాగ ఉపరరామ ॥**

ఇప్పుడు ఆఖరి ప్రశ్న అయిన ఐదవ ప్రశ్న వస్తుంది. జ్ఞాని విషయం అయింది కాబట్టి ఇప్పుడు అజ్ఞాని పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలనుకున్నాడు.

**యాజ్ఞవల్క్యేతి హోవాచ యత్రాస్య పురుషస్య మృతస్య** – ఓ యాజ్ఞవల్క్యా, ఈ వ్యక్తి మరణించినప్పుడు (ఏమవుతుంది).

ఇక్కడ పురుషస్య అంటే అజ్ఞాని. ముందు మంత్రంలో పురుషస్య అంటే జ్ఞాని. అజ్ఞాని మరణించినప్పుడు ఏమవుతుంది అని అడుగుతున్నాడు కాని అతనికే కొంత తెలుసు. ఏ ఇంద్రియాలు ఏ దేవతలో లయమవుతాయో అతనే ఒక పెద్ద పట్టిక నిచ్చాడు.

**అగ్నిం వాగప్యేతి** – వాక్కు అగ్నిలో; **వాతం ప్రాణః** – ప్రాణం వాయువులో; **చక్షురాదిత్యం** – కన్ను ఆదిత్యునిలో; **మనశ్చంద్రం** – మనస్సు చంద్రునిలో; **దిశశ్శ్రోత్రం** – చెవులు దిక్కులలో; **పృథివీగ్ం శరీరమ్** – శరీరం పృథివిలో; **ఆకాశమాత్మా** – హృదయాకాశం భూతాకాశంలో; **ఓషధీర్లోమాని** – రోమాలు మొక్కల్లో; **వనస్పతీన్ కేశా** – జుట్టు చెట్టు చేమలలో; **అప్సు లోహితం చ రేతశ్చ నిధీయతే** – రక్తం, రేతస్సు కూడా నీటిలో నిక్షిప్త మవుతాయి.

**క్వాయం తదా పురుషో భవతీతి** – అప్పుడు ఈ వ్యక్తి ఎక్కడ ఉంటాడు?

ఇక్కడ శంకరులవారు ఒక ముఖ్య విషయాన్ని చర్చిస్తున్నారు – ఇలా అన్ని అంగాలు ఆయా దేవతలలో లయమయితే, జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్య భేదం ఏముంటుంది?

ఇప్పుడు ప్రతివ్యక్తికీ ఒక్కొక్క ఇంద్రియానికీ ఒక్కొక్క అధిష్ఠానదేవత ఉంటుంది (తత్త్వబోధలో వివరంగా వస్తుంది). దాన్ని అధిదైవ అంశం అంటారు. ఇంద్రియాలను అధ్యాత్మం అంటారు. ఉదాహరణకు కన్నుకు ఆదిత్యుడు అధిష్ఠానదేవత. ఈ దేవతా అంశాలు అధిష్ఠానదేవతల్లాగా ఉండటంవల్లనే, ఆయా ఇంద్రియాలు పని చేయగలుగుతున్నాయి.

అజ్ఞాని విషయంలో, మరణసమయంలో ఇంద్రియాలు దేవతా అంశంలో లయమవుతాయి. అంటే ఇంద్రియాలు లయమవవు, దేవతా అంశం ఇంక ఉండదు. ఇంద్రియాలు ఉంటాయి. అవి సూక్ష్మశరీరంతో ప్రయాణం చేసి ఇంకో అనుకూల స్థూలశరీరం పొందేదాకా, దేవతా అంశం వాటికి ఉండదు. ఇంకో శరీరంలో చేరాక, మళ్ళీ దేవతా అంశం అధిష్ఠానదేవతగా వస్తుంది. కాని ఒకవేళ ఆ రెండో శరీరంలో అతని ప్రారబ్ధకర్మవల్ల కనుచూపు ఉండకూడదు అంటే, అప్పుడు ఆ అధిష్ఠానదేవత తిరిగిరాదు. అందువల్ల ఈ లయ తాత్కాలిక లయ.

అందువల్ల వాక్కు అగ్నిలో లయమవుతుందంటే, వాగింద్రియం అగ్నిలో లయమవుతుందనికాదు అర్థం; అగ్నిదేవత అంశం ఇంక ఉండదు అని అర్థం. అదే జ్ఞాని విషయానికి వచ్చేసరికి వాగింద్రయం కూడా అగ్నిదేవతలో కలిసిపోతుంది. అంటే రెండూ ఉండవు.

ఆర్తభాగుని ప్రశ్న ఏమిటంటే, ఇంద్రియాలు పనిచేయక, స్థూలశరీరం లేకపోతే, మరణించిన అజ్ఞాని జీవిని ఎవరు నియంత్రిస్తారు? మనస్సు నియంత్రించలేదు ఎందుకంటే మనస్సుకు అధిష్ఠానదేవత, తన దేవతా అంశాన్ని

వెనక్కు తీసేసుకుంది; అలా సూక్ష్మశరీరం నియంత్రించలేదు; స్థూలశరీరం లేనేలేదు. మరి ఎవరు నియంత్రిస్తారు? ఇది ఐదవ ప్రశ్న?

**ఆహర సోమ్య హస్తమార్తభాగ** – ఓ సోమ్య! ఓ ఆర్తభాగా నీ చేతిని అందించు.

**ఆవామేవైతస్య వేదిష్యావో న నావేతత్సజన ఇతి** – ఈ ప్రశ్నకు సమాధానం మనమిద్దరమే తెలుసుకొందాము. ఇది జనసమూహంలో చెప్పేది కాదు.

ఇప్పుడు ఉపనిషత్తు అందుకుని తర్వాత ఏమైందో చెబుతున్నది.

**తౌ హోత్క్రమ్య మంత్రయాంచక్రాతే** – వారిద్దరు లేచి (వెళ్ళి) విచారణ చేశారు.

**తౌ హ యదూచతుః కర్మ హైవ తదూచతుః** – వారిద్దరు కర్మను మాత్రమే చెప్పారు.

**అథ యత్ప్రశశగ్ంసతుః కర్మ హైవ తత్ప్రశశగ్ం సతుః** – వారిద్దరు కర్మను మాత్రమే ప్రశంసించారు.

**పుణ్యో వై పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేనేతి** – పుణ్యకర్మవల్ల పుణ్యము పొందుతాడు. పాపకర్మలవల్ల పాపం పొందుతాడు.

విడిగా వెళ్ళి ఆర్తభాగుడు, యాజ్ఞవల్క్యుడు ఈ విషయంమీద సుదీర్ఘమైన చర్చ పెట్టుకున్నారు. ఏమిటా విషయం? ఒక వ్యక్తి మరణించాక, అతని జీవుణ్ణి ఏది నియంత్రిస్తుంది? ఇది జ్ఞానికి వర్తించదు. అజ్ఞానికి మాత్రమే. ఆర్తభాగుడే చెప్పాడని చూశాము కదా అతని అంగాలు పనిచేయవు, బుద్ధి పనిచేయదు, దైవ అంశ ఉండదు. అలాంటప్పుడు దేని అధీనంలో ఉంటాడు?

కాలం, గ్రహాలు, స్వభావం, ఈశ్వరుడు, కర్మ వీటన్నిటిలో ఏది నిర్ణయిస్తుంది? వీటిని కూలంకషంగా చర్చించి కర్మ నిర్ణయిస్తుందని నిరూపించారు. కొంతమంది స్వభావం నిర్ణయిస్తుందంటే, కొందరు ఈశ్వరుడు నిర్ణయిస్తాడంటారు. కొందరు కాలం నిర్ణయిస్తుందంటారు. యాజ్ఞవల్క్యుడు కర్మ నిర్ణయిస్తుందని చెప్పాడు. కర్మ నిర్ణయిస్తుందంటే ఇవేవీ పనిచేయవా అని సందేహం రావచ్చు. కర్మ ప్రధాన అంశం. తక్కినవి అంటే కాలం, గ్రహాలు, ఈశ్వరుడు దానికి సహకారీ అంశాలు.

కొంతమంది పుట్టిన సమయాన్నిబట్టి అతని జాతకం ఉంటుందనుకుంటారు. కాని అతని కర్మ మంచిదైతే, కర్మ మంచి కాలాన్ని ఉపయోగించుకుంటుంది అతన్ని దీవించటానికి; అలాగే అతని కర్మ చెడ్డదైతే చెడు కాలాన్ని కలుగజేస్తుంది. అంతేకాని గ్రహాలు ఏమీ చేయలేవు. గ్రహాలద్వారా కర్మ తన పని తను చేసుకుపోతుంది. అలాగే ఈశ్వరుడు కూడా. మన కర్మ బాగుండకపోతే ఈశ్వరుడు కూడా మంచి చేయలేడు; ఆయన కర్మ ఫలదాత. మనం చేసుకున్న కర్మకు తగ్గ ఫలాన్ని ఇస్తాడు. ఆయన ముందు మన పాపపుణ్యాల చిట్టా ఉంటుంది.

కర్మ సుఖదుఃఖాలను స్వయంగా ఇవ్వలేదు. అందువల్ల శరీరాన్ని, పరిస్థితులను, కుటుంబ వాతావరణాన్ని, పిల్లలను మన కర్మలకు తగ్గట్టుగా ఇస్తుంది. భార్యాపిల్లలు కూడా మన పూర్వజన్మ పుణ్యాపాపాలవల్ల వచ్చిన వారే. దేవతలు కూడా జ్ఞానికి మోక్షం రాకుండా అడ్డుపడలేరు అని ఈ ఉపనిషత్తులోనే చూశాము. (1.4.10లో ఇది వివరంగా చర్చించబడింది. ఒకసారి అక్కడ చూడండి)

తస్మై కర్మణే నమః - భర్తృహరి

అందువల్ల పుణ్యో వై పుణ్యేన కర్మణా భవతి అని ఈ చర్చ ముగుస్తుంది. పుణ్యేన భవతి అంటే పుణ్యఫలం పొందుతాడు. ఈ వాక్యం చాలా ప్రసిద్ధమైన వాక్యం. దీన్ని తరచు ఉటంకిస్తుంటారు శంకరులవారు.

దీనితో ఆర్తభాగ ఐదవ ప్రశ్నకు కూడా యాజ్ఞవల్క్యుడు జవాబు చెప్పాడు.

మరణించిన వ్యక్తి ఆత్మను ఏది నియంత్రిస్తుంది? అతను చేసిన కర్మ నియంత్రిస్తుంది.

**తతో హ జారత్కారవ ఆర్తభాగ ఉపరరామ** - దీనితో జారత్కారవ ఆర్తభాగుడు శాంతించాడు.

వారిద్దరు మళ్ళీ వెనక్కు తిరిగివచ్చారని అర్థం చేసుకోవాలి. ఇక్కడితో ఆర్తభాగ బ్రాహ్మణము ముగిసింది.

# 3.3 - భుజ్యు బ్రాహ్మణము

ఇప్పుడు భుజ్యుర్లాహ్యాయనుడు అనే బ్రాహ్మణుడు ప్రశ్నలు అడుగుతాడు. అందువల్ల ఈ బ్రాహ్మణాన్ని భుజ్యు బ్రాహ్మణము అంటారు. ఈ బ్రాహ్మణములో హిరణ్యగర్భ లోకం విస్తీర్ణం ఎంతో వస్తుంది.

కర్మ ఉపాసన సముచ్చయం చేసిన వ్యక్తి హిరణ్యగర్భ లోకానికి అంటే బ్రహ్మలోకానికి వెళతాడు. బ్రహ్మలోకం ఎంతమేరకు ఉంది అని చెప్పటంలోని ఉద్దేశం, బ్రహ్మలోక ఫలం శాశ్వతమైనది కాదు, పరిచ్ఛిన్నమైనది అని చూపించటానికి అంటారు శంకరులవారు. ఇంకోవిధంగా చెప్పాలంటే కర్మ, ఉపాసనల ఫలాలు పరిమితమైనవి అని అర్థం. ఈ విషయం నిరూపించటానికి శంకరులవారు కర్మఫల విచారణ చేస్తారు. అందువల్ల మంత్రంలోకి అడుగుపెట్టేముందు కర్మఫల విచారభాష్యం చూద్దాము. కర్మఫలం, మోక్షం కాదు అనేది ఈ విచారణ సారాంశం.

## కర్మఫల విచార భాష్యం

కర్మఫలం మోక్షాన్ని ఇస్తుందా లేదా అనేది చర్చనీయాంశం.

**పూర్వపక్షి వాదన 1** – కర్మఫలం మోక్షాన్నిస్తుంది.

**శంకరులవారి జవాబు** – కర్మఫలం ఎన్నటికీ మోక్షాన్నివ్వలేదు. ఒక కర్మ చేస్తే, అది నాలుగు రకాలైన ఫలాలనే ఇవ్వగలదు. అవి మోక్షానికి భిన్నమైనవి.

ఎ) **ఆప్తి** – ఒక ప్రాంతానికి చేరటం. వడ్లను ఒకచోటినుంచి ఇంకోచోటికి తరలించటం.

బి) **ఉత్పత్తి** – ఒక వస్తువును ఉత్పత్తి చేయటం. పంట పండించటం.

సి) **వికారం** – మార్పు చెందటం. వడ్లని అన్నంగా వండటం.

డి) **సంస్కారం** – దాన్ని శుద్ధి చేయటం. వడ్లనుంచి పొట్టు తీయటం. సంస్కారంలో రెండురకాలున్నాయి మళ్ళీ.

i) **గుణ ఆధానం** – ఉన్నదానికి కొత్త అలంకరణలు చేయటం.

ii) **దోష అపనయనం** – అశుద్ధాన్ని తొలగించటం.

స్నానం చేయటం దోష అపనయనం అయితే, తర్వాత చేసుకునే ముస్తాబు గుణ ఆధానం కింద వస్తుంది.

మోక్షం ఈ నాలుగు కర్మఫలాల్లో దేని కిందకీ రాదు. మోక్షం అంటే పూర్ణత్వం. బ్రహ్మ పూర్ణత్వం కాబట్టి మోక్షం కూడా పూర్ణత్వం. ఇప్పుడు పై నాలుగు ఫలాలనూ బ్రహ్మపరంగా చూద్దాము.

ఎ) **ఆప్తి** – బ్రహ్మ సర్వవ్యాపకం కాబట్టి బ్రహ్మను చేరలేము.
సర్వగతత్వాత్ ఆప్తి న భవతి

బి) **ఉత్పత్తి** – బ్రహ్మ నిత్యం కాబట్టి బ్రహ్మను ఉత్పత్తి చేయలేము.
నిత్యత్వాత్ ఉత్పత్తి న భవతి

సి) **వికారం** – బ్రహ్మకు వికారాలు లేవు కాబట్టి మార్పు చేయలేము.
నిర్వికారత్వాత్ వికార న భవతి

డి) **సంస్కారం** – బ్రహ్మకు దోషాలు లేవు కాబట్టి శుద్ధి చేయలేము.
నిర్దోషత్వాత్ సంస్కార న భవతి

అందువల్ల మోక్షం కర్మఫల విలక్షణం.

**పూర్వపక్షి వాదన 2** – నిత్యకర్మఫలం మోక్షాన్నిస్తుంది.

దీనికి శంకరులవారి జవాబు చూసేముందు మీమాంసశాస్త్రం ప్రకారం కర్మల్లోని రకాలు చూడాలి.

ఎ) **నిత్యకర్మ** – నిత్యకర్మ అంటే రోజూ చేసేవే కాదు, చేసి తీరాల్సిన కర్మలు. నాలుగు నెలల కొకసారి చేసే కర్మలు కూడా ఇందులోకి వస్తాయి.

బి) **నైమిత్తిక కర్మలు** – ఇవి కూడా చేసి తీరాల్సిన కర్మలే కాని, ఇవి కొన్ని ప్రత్యేక సందర్భాలలో చేసి తీరాలి. ఉదాహరణకు పుత్రుడు పుట్టినప్పుడు చేసే బారసాల చేసితీరాలి.

సి) **కామ్యకర్మలు** – ఇవి కోరికలు తీర్చుకోవటానికి చేసే కర్మలు. అందువల్ల అందరికీ వర్తించవు. పుత్రకామేష్టి యాగం పుత్రులు కావాలనుకునేవారు చేయవచ్చు. ఎందుకంటే చేసి తీరాలనేం లేదు. ఇష్టమైతేనే చేయవచ్చు.

డి) **నిషిద్ధకర్మలు** – ఇవి చేయకూడని కర్మలు. మాంసం తినకూడదు, సురాపానం చేయకూడదు, హింస చేయకూడదు.

ఇ) **ప్రాయశ్చిత్త కర్మలు** – ఏదైనా తప్పు చేస్తేనో, గ్రహపరిస్థితి మార్చటానికో చేసే కర్మలు.

ఈ కర్మలన్నింటిలోకీ నిత్యకర్మలు చేస్తే మోక్షఫలం వస్తుంది అంటాడు పూర్వపక్షి. పూర్వపక్షి అంటే వేదపూర్వభాగాన్ని ఆధారంగా చేసుకుని వాదించే వ్యక్తి అని అర్థం. వీరిని పూర్వమీమాంసకులు అంటారు.

**శంకరులవారి జవాబు** – ఒక వాదన వచ్చినప్పుడు దాన్ని మూడు కోణాల్లో వాదిస్తారు. శ్రుతిప్రమాణం, యుక్తిప్రమాణం, అనుభవప్రమాణం. నిత్యకర్మలు మోక్షాన్నిస్తాయని ఈ మూడింటిలో ఏ ప్రమాణంద్వారానూ నిరూపించలేము అంటారు శంకరులవారు.

ప్రమాణ అభావాత్

**పూర్వపక్షి వాదన 3** – నిత్యకర్మలు మోక్ష ఫలాన్నిస్తాయని నిరూపించటానికి ప్రమాణం ఉంది.

ప్రమాణమ్ అస్తి

మీమాంస సూత్రం ప్రకారం ఏ కర్మ చేసినా దానికి ఫలం ఉండితీరాలి.

**ప్రయోజనమనుద్దిశ్య మందోఽపి న ప్రవర్తతే**

ప్రయోజనం ఆశించకుండా మందబుద్ధి ఉన్నవ్యక్తి కూడా ఏ పనీ చేయడు. కాకపోతే అతను ఆశించే ప్రయోజనం అతని మందబుద్ధికి తగ్గట్టుగానే ఉండవచ్చు. కాని వేదాంతంలోని కర్మకాండలో కొన్నిచోట్ల కొన్ని యజ్ఞాలకు ఫలం చెప్పలేదు, అలాంటప్పుడు ఆ ఫలాన్ని మనం కలుపుకోవాలి అంటారు మీమాంసకులు.

ఫలాన్ని కలుపుకోవాలి అంటే దేని ఆధారంగా కలుపుకోవాలి? అది మన ఊహాజనితంగా ఉండకూడదు. అలా ఊహించుకుంటే ఎవరికి తోచింది వారు ఊహించుకుంటారు. అది అందరికీ సమానంగా ఉండదు. అందువల్ల దానికి ఏదో ఆధారం ఉండాలి. దానికి మీమాంసకులు రెండు రకాల ఆధారాలనిస్తారు.

ఎ) **పితృలోక న్యాయః** – కర్మ చేస్తే పితృలోక ఫలం పొందుతారు అని వేదంలో ఒకచోట వస్తుంది.

కర్మణా పితృలోకః

ఈ సూత్రం ప్రకారం ఫలం చెప్పకుండా కర్మలు ఎక్కడ చెప్పినా, దానికి పితృలోకఫలం అని చెప్పవచ్చు. దీన్ని కర్మణా పితృలోక న్యాయః అంటారు.

బి) **విశ్వజిత్ న్యాయః** – కొన్నిచోట్ల కొన్ని కర్మలకు ఫలం చెప్పకపోతే, వాటికి ఫలంగా స్వర్గలోకఫలం చెప్పవచ్చు అని వస్తుంది ఈ న్యాయంలో. అందరికీ స్వర్గలోక ఫలం ఇష్టం కాబట్టి ఈ ఫలాన్ని చెబుతారు. స్వర్గలోకం ఫలంగా వస్తుంది అంటే స్వర్గలోకం కోరుకునేవారు ఈ కర్మలను చేస్తారు. దీన్ని విశ్వజిత్ న్యాయః అంటారు. విశ్వజిత్ అనే కర్మకు చెబుతారు ఈ ఫలాన్ని. ఈ కర్మ కర్మణా పితృలోకః అని చెప్పిన చోట రాదు.

అందువల్ల కర్మఫలం పితృలోకం కాని, స్వర్గలోకం కాని అవుతుంది. ఇప్పుడు నిత్యకర్మకు కూడా కర్మఫలం చెప్పలేదు. అందువల్ల ఈ రెండు న్యాయాలను ఉపయోగించి పితృలోక ఫలం కాని, స్వర్గలోక ఫలం కాని వస్తుందేమో చూడాలి. కాని ఈ రెండు ఫలాలు కూడా ఇక్కడ వర్తించవు అంటాడు పూర్వపక్షి. ఎందుకు?

ఎ) **పితృలోక న్యాయః** – కర్మ చేస్తే పితృలోకం పొందుతారు అనే ఈ న్యాయం నిత్యకర్మకు వర్తించదు. ఎందుకంటే నిత్యకర్మ ఆ విషయం చెప్పిన అధ్యాయంలో రాదు. మన భారతీయ రాజ్యాంగం భారతదేశం మేరకే వర్తించినట్టుగా, ఆ కర్మ సూత్రం ఆ ప్రకరణం మేరకే వర్తిస్తుంది.

బి) **విశ్వజిత్ న్యాయః** – స్వర్గలోకఫలం వస్తుందని ఎందుకు చెబుతున్నది? స్వర్గలోకఫలాన్ని ఆశించి అయినా ఎవరైనా ఈ కర్మను చేస్తారని. కర్మను చేసే వ్యక్తిని అధికారి అంటారు. అందువల్ల ఒక అధికారిని పరిచయం చేయటంకోసం విశ్వజిత్‌కర్మ చెప్పింది కాని నిత్యకర్మ విషయంలో అధికారిని వెతుక్కోనవసరం లేదు. విశ్వజిత్‌యాగంలో ఏదైనా ఫలం కావాలనుకుని, ఎవరైనా ఆ యజ్ఞం చేస్తే అతను అధికారి అవుతాడు. అతనికి స్వర్గఫలాన్ని ఆశ చూపారు.

కాని నిత్యకర్మకు అధికారిని వెతుక్కోనవసరం లేదు. నిత్యకర్మ ప్రతి వైదికుడూ చేసితీరాలి. మనం జీవించి ఉంటే, నిత్యకర్మకు అధికారులమవుతాము. అందువల్ల అధికారి సిద్ధంగానే ఉన్నాడు. అధికారి ముందే ఉంటే అతనికి స్వర్గలోక ఫలం చూపించటం ఎందుకు?

ఈ విధంగా ఈ రెండు ఫలాలూ నిత్యకర్మకు వర్తించవు కాబట్టి, కొత్త ఫలాన్ని అందించాలి. అది మోక్షఫలం. అందువల్ల నిత్యకర్మకు ఫలం మోక్షం అంటాడు పూర్వపక్షి.

**శంకరులవారి జవాబు** – శంకరులవారు దీనికి ఒప్పుకోరు. యజ్ఞానికి ఎప్పుడైతే ఫలం మనం కలుపుకోవాలో, అప్పుడే దానంతట అదే విశ్వజిత్ న్యాయం వస్తుంది. విశ్వజిత్ న్యాయం ఉన్నదే ఫలం కలుపుకోవటంకోసం. మీరేమో అధికారి కల్పనకోసం అంటున్నారు. విశ్వజిత్ న్యాయం ఫలకల్పనకు వాడతారు కాని అధికారి కల్పనకు కాదు.

ఈ సూత్రం ప్రకారం నిత్యకర్మకు ఫలాన్ని కలుపుకోవాలనగానే, విశ్వజిత్ న్యాయం దానంతట అదే వస్తుంది. విశ్వజిత్ న్యాయం వస్తే స్వర్గఫలం వస్తుంది.

**నిత్యకర్మణాం స్వర్గఫలమేవ భవతి న తు మోక్షఫలమ్**

నిత్యకర్మకు స్వర్గఫలం వస్తుంది కాని మోక్షఫలం రాదు. అందువల్ల ఫలం రావాలి అంటే విశ్వజిత్ ఫలమే రావాలి.

**పూర్వపక్షి వాదన 4** – ఇప్పుడు పూర్వపక్షి ఇంకో మార్గంలో వస్తున్నాడు. సరే, మీ వాదన ఒప్పుకుంటాను. ఫలం కలుపుకోవాలంటే విశ్వజిత్ న్యాయం రావాలి, విశ్వజిత్ న్యాయం వస్తే, స్వర్గలోక ఫలం రావాలి. నిజమే. కాని మోక్షం అసలు ఫలమే కాదు. మోక్షాన్ని ఫలంగా చూస్తే కదా ఈ వాదన అంతా.

**నిత్య సిద్ధత్వాత్**

మోక్షం, ఫలం కాదు. అది నిత్యకర్మకు నిత్యసిద్ధం. అంటే మోక్షం సాధ్యం కాదు సిద్ధవస్తువు.

**శంకరులవారి జవాబు** – శంకరులవారు మనసారా నవ్వుకుంటారు. మోక్షం సిద్ధవస్తువు అయితే, దాన్ని నిత్యకర్మ ఫలంగా ఎలా అభివర్ణిస్తారు అంటారు.

**నిత్యసిద్ధస్య మోక్షస్య నిత్యకర్మఫలత్వం కథం భవతి**

ఒక పక్క మోక్షం నిత్యసిద్ధం అంటున్నావు, ఇంకోపక్క అది నిత్యకర్మ ఫలం అంటున్నారు. రెండింటికీ ఎలా పొత్తు కుదురుతుంది?

**పూర్వపక్షి వాదన 5** – అది నిత్యకర్మఫలం అవవచ్చు.

**నిత్యసిద్ధస్య మోక్షస్య నిత్యకర్మఫలత్వం సంభవతి**

అద్వైతులు అయినా మీరు కూడా మోక్షం సిద్ధవస్తువు అనే అంటారు, మళ్ళీ మీరే మోక్షం జ్ఞానఫలం అంటారు. **జ్ఞానాదేవ కైవల్యమ్**

జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది అంటారు. మీరు కూడా ఒక పక్క మోక్షం నిత్యసిద్ధం అంటున్నారు, ఇంకో పక్క అది జ్ఞానఫలం అంటున్నారు. మీరు జ్ఞానఫలం అనగా లేనిది నేను నిత్యకర్మ ఫలం అంటే తప్పేమిటి?

**శంకరుల జవాబు** – అవును, మేము మోక్షం జ్ఞానఫలం అంటాము నిజమే. కాని దాన్ని లక్ష్యార్థంగా తీసుకోవాలి. నిజానికి మోక్షం జ్ఞానఫలం కాదు. అజ్ఞానం నాకూ, మోక్షానికీ మధ్య దూరాన్ని ఏర్పరుస్తుంది. అజ్ఞాన నివృత్తి ఎప్పుడు కలుగుతుందో అప్పుడే నాకు మోక్షం కలుగుతుంది. నేను అప్పటికే ముక్తపురుషుడిని అయినా, అజ్ఞాననివృత్తి కలిగాకే నాకు ఆ విషయం తెలుస్తుంది. అజ్ఞానం కప్పిన ముసుగును తీస్తుంది జ్ఞానం. అందువల్ల జ్ఞానఫలం అంటే ఏమిటి?

**అజ్ఞాన నివృత్తిః ఏవ జ్ఞానఫలమ్**

**పూర్వపక్షి వాదన 6** – మీకు అజ్ఞాన నివృత్తి జ్ఞానఫలం అయితే, మాకు నిత్యకర్మలు అజ్ఞానాన్ని తొలగిస్తాయి. అంటే అజ్ఞానం తొలగితే మోక్షమే కదా! అంటే నిత్యకర్మలు పరోక్షంగా మోక్షాన్నిస్తాయి. తప్పేముంది?

**శంకరుల జవాబు** – జ్ఞానం, అజ్ఞానం పరస్పర విరుద్ధమైనవి. అదే కర్మ, అజ్ఞానం తీసుకుంటే అవి పరస్పర విరుద్ధమైనవి కావు. ఎందుకు? జ్ఞానం అజ్ఞానాన్ని నాశనం చేయగలదు కాని నిత్యకర్మ అజ్ఞానాన్ని నాశనం చేయలేదు. ఇది యుక్తి ప్రమాణానికే కాదు, అనుభవ ప్రమాణానికి కూడా తెలుస్తుంది.

ఉదాహరణకు నాకు కాకి రంగు ఏమిటో తెలియదు. నేను ఎన్ని కర్మలు చేసినా ఆ అజ్ఞానం తొలగదు. దీనికి తర్కం అవసరం లేదు, అనుభవమే చెబుతుంది. లౌకిక కర్మ చేసినా అజ్ఞానం తొలగదు, వైదిక కర్మ చేసినా అజ్ఞానం తొలగదు. విష్ణుసహస్రనామం చదివితే, పుణ్యం వస్తుందేమో కాని, కాకి రంగు గురించి నాకున్న అజ్ఞానం మాత్రం పోదు. కాకి గురించి తెలుసుకుంటే, అజ్ఞానం పోతుంది. ఇది దృష్టఫలం. కర్మ చేస్తే పోదు. అందువల్ల నిత్యకర్మ చేస్తే అజ్ఞానం పోతుందనేది సరైన వాదన కాదు.

**పూర్వపక్షి వాదన 7** – కర్మకు రెండు ఫలాలున్నాయి. దృష్టఫలం, అదృష్టఫలం. ఉదాహరణకు ఒక వ్యక్తికి అన్నదానం చేస్తే అతని ఆకలి తీరుతుంది. అతను తృప్తి చెందుతాడు. అది దృష్టఫలం. అది కనిపిస్తున్నది. కాని అన్నదానం చేస్తే అదృష్టఫలం కూడా వస్తుంది. మరణం తర్వాత ఆ వ్యక్తి స్వర్గలోకానికి వెళతాడు. ఆ విధంగా నిత్యకర్మకు రెండు ఫలాలున్నాయి – దృష్టఫలం, అదృష్టఫలం.

దృష్టఫలం అజ్ఞాన నివృత్తి చేయకపోవచ్చు కాని అదృష్టఫలం చేయవచ్చు కదా!

**శంకరుల జవాబు** – అదృష్టఫలం గురించి చెప్పేటప్పుడు ఒక సూత్రాన్ని గుర్తుంచుకోవాలి.

**దృష్టే సతి అదృష్టకల్పనా అన్యాయః**

కనపడేదానిద్వారా చెప్పగలిగిన దాన్ని, అదృష్టంగా చెప్పకూడదు. ఉదాహరణకు ఒక యజ్ఞం తీసుకోండి. అందులో అతను నెయ్యి వేస్తాడు, బ్రాహ్మణునికి దక్షిణ ఇస్తాడు, బ్రహ్మణుడు తీసుకుంటాడు. అన్నదానం చేస్తాడు. ఇవన్నీ దృష్టఫలాలు. కాని యజ్ఞం చేస్తే స్వర్గానికి వెళతాడనేది ప్రత్యక్ష ప్రమాణానికి అందదు. అప్పుడు దాన్ని అదృష్ట ఫలంగా చెబుతారు. దృష్టంగా కనబడేదాన్ని అదృష్టంగా చెప్పనవసరం లేదు.

ఉదాహరణకు యజ్ఞం చేసేముందు వడ్లని దంచాలి. వడ్లని దంచటం దృష్టఫలమా, అదృష్టఫలమా? దృష్ట ఫలమే! వడ్లని దంచటంవల్ల పుణ్యం వస్తుంది. అది అదృష్టఫలం.

ఇక్కడ జ్ఞానం అజ్ఞాన నివృత్తి చేస్తుంది. అజ్ఞాన నివృత్తి దృష్టఫలం. అజ్ఞాన నివృత్తిని దృష్టఫలంగా అభివర్ణించ గలిగినప్పుడు, దాన్ని అదృష్టఫలంగా చెప్పటం ఎందుకు?

**పూర్వపక్షి వాదన 8** – మళ్ళీ పూర్వపక్షి తన వాదనను మారుస్తాడు. నిత్యకర్మలు తక్కిన కర్మలకన్నా భిన్నంగా ఉన్నాయి. నైమిత్తిక కర్మలు, నిషిద్ధ కర్మలు, ప్రాయశ్చిత్త కర్మలు వేరు, నిత్యకర్మలు వేరు. తక్కిన కర్మలన్నీ పరిచ్ఛిన్న లేదా అనిత్య ఫలాలను ఇస్తే, నిత్యకర్మలు నిత్యఫలాలను ఇవ్వాలి. ఇవి నిత్యం కాబట్టి.

**శంకరులవారి జవాబు** – నిత్యకర్మ కూడా కర్మే! నిత్యకర్మ తక్కిన కర్మలకు భిన్నంగా ఉండవచ్చు. మీరు నిత్య పదం చూస్తున్నారు. నిత్య, నైమిత్తిక, ప్రాయశ్చితకర్మలలో నిత్యపదం చూస్తున్నారు, నేను కర్మ పదం చూస్తున్నాను అంటారు శంకరులవారు. నైమిత్తిక **కర్మ**, ప్రాయశ్చిత్త **కర్మ**, నిషిద్ధ **కర్మ**లు ఎలాగో నిత్య**కర్మ** కూడా కర్మే. మీరు నిత్యపదంలో వైలక్షణ్యాన్ని చూస్తే, నేను కర్మపదంలో సాలక్షణ్యాన్ని చూస్తున్నాను. అందువల్ల నిత్యకర్మ ఫలం కూడా **పరిచ్ఛిన్న ఫలమే**.

**పూర్వపక్షి వాదన 9** – నిత్యకర్మ కూడా కర్మే ఒప్పుకుంటాను కాని నిత్యకర్మల నిబంధనలు వేరు, తక్కిన కర్మల నిబంధనలు వేరు.

**నిమిత్త వైలక్షణ్యాత్**

తక్కిన కర్మలన్నీ ఎప్పుడో చేస్తారు, కాని నిత్యకర్మలు యావజ్జీవం చేస్తారు. ఎప్పుడో చేసే కర్మలకు, నిత్య కర్మలకు ఫలం ఒక్కటే ఎలా ఉంటుంది?

**శంకరులవారి జవాబు** – నిజమే, నిత్యకర్మల నిబంధనలు వేరు కాబట్టి, ఫలం కూడా వేరుగానే ఉండాలి కాని, అది కూడా పరిచ్ఛిన్న కర్మఫలాల పరిధిలోకే రావాలి. కర్మఫలాల పరిధి ముందే చూశాము – అవి ఆప్తి, ఉత్పత్తి, వికారం, సంస్కారం. నిత్యకర్మ ఫలం ప్రత్యేకంగా ఉంటుంది కాని ఈ నాలుగింటిలోనే ఉంటుంది. అంటే ఆప్తి ఇంకా ఎక్కువ, ఉత్పత్తి ఇంకా ఎక్కువ అలా ఉంటుంది.

**పూర్వపక్షి వాదన 10** – పరిచ్ఛిన్న ఫలాలన్నీ తక్కిన కర్మలకే సరిపోతాయి. నిత్యకర్మకు ఏమీ మిగలలేదు. ఒక్క మోక్షమే మిగిలింది. పారిశేషన్యాయం ప్రకారం, మిగిలిన మోక్షఫలాన్ని నిత్యకర్మకు అన్వయించాలి.

**శంకరుల జవాబు** – పరిచ్ఛిన్న ఫలాలు అనంతం. అవి అయిపోయాయి అనే ప్రసక్తి లేదు.

**పరిచ్ఛిన్న ఫలానామ్ అనంతత్వాత్ పారిశేష్యో న సంభవతి**

పరిచ్ఛిన్న ఫలాలకు అంతూపొంతూ లేదు. అవి ఇంక లేవు అనటానికి వీలులేదు. పారిశేష్యన్యాయం తక్కువ సంఖ్య ఉన్నచోట కుదురుతుంది కాని అనంతమైన సంఖ్య ఉన్నచోట కాదు. ఉదాహరణకు మీతో కలిపి ఐదుగురు ఒక గదిలో ఉన్నారు, మీరు మధ్యలో బయటకు వెళ్ళి వచ్చేసరికి ఫ్యాను తిరుగుతున్నది. తక్కిన నలుగురిలో ఎవరో ఒకరు వేసి ఉండాలి. మీరు అందులో ముగ్గురిని అడిగితే చాలు. వారు ముగ్గురూ వేసి ఉండకపోతే, పారిశేష్య న్యాయం ప్రకారం నాలుగవ వ్యక్తి వేసివుండాలి. అదే దాని బదులు ఆ గదిలో అనేకమంది ఉండుంటే,

ఆ న్యాయం ప్రయోగించలేరు. అలా పరిచ్ఛిన్న ఫలాలు అనంతం కాబట్టి దానికి పారిశేష్యన్యాయం చెల్లదు.

**పూర్వపక్షి వాదన 11** – నిత్యకర్మ మోక్ష ఫలాన్నివ్వలేకపోతే, కర్మ ఉపాసనల సముచ్చయం (కలిపి) చేస్తే దాని ఫలం అధికంగా ఉంటుంది కదా! దానికి అతను ఉదాహరణలు కూడా ఇస్తున్నాడు. మామూలుగా ప్రాణం తీసే విషాన్ని సరియైన మోతాదులో వాడితే రోగం తగ్గుతుంది. అలాగే పెరుగు జ్వరాన్ని కలిగించేదే అయినా, పంచదారతో కలిపి వాడితే పుష్టిని కలిగిస్తుంది. అలా కర్మ ఉపాసనల సముచ్చయం మోక్షాన్నివ్వవచ్చు కదా! కర్మఫలం అనిత్యమైనా, ఉపాసనసహిత కర్మఫలం నిత్యఫలం లేదా మోక్షం అవచ్చు కదా!

**శంకరులవారి జవాబు** – కర్మ ఉపాసనల సముచ్చయం కూడా మోక్షాన్నివ్వదు. దీనికి నాలుగు కారణాలు చెబుతున్నారు శంకరులవారు.

ఎ) **ప్రమాణ అభావాత్** – దీనికి శ్రుతి ప్రమాణం లేదు. కర్మ, ఉపాసనల సముచ్చయం చేస్తే మోక్షం వస్తుందని శ్రుతిలో ఎక్కడా లేదు.

విషం, పెరుగుల విషయంలో అనుభవ ప్రమాణం ఉంది. ప్రత్యక్ష ప్రమాణం ఉంది కాని మోక్షం విషయంలో అనుభవప్రమాణం లేదు. యుక్తిప్రమాణం కూడా లేదు. **ప్రమాణం నాస్తి.** శ్రుతి, యుక్తి, అనుభవప్రమాణాలేవీ లేవు.

బి) **ఫలాంతర శ్రుతేః** – ఒక పక్క శ్రుతి కర్మ ఉపాసనల సముచ్చయానికి ఫలం మోక్షం అని ఎక్కడా ఇవ్వకపోగా, వీటి ఫలం వేరే ఇస్తుంది. శ్రుతే పరిచ్ఛిన్న ఫలం చెబుతున్నప్పుడు, శ్రుతిని కాదని నిత్య ఫలం వస్తుందని ఎలా చెప్పగలరు?

**విద్యయా దేవలోకః – ఈశావాస్య**

ఇక్కడ విద్యయా అంటే కర్మ ఉపాసనల సముచ్చయం. ఎలా తెలుసు?

**కర్మణా పితృలోకః**

అంతకుముందు వాక్యంలో కర్మ చేస్తే పితృలోకానికి వెళతారని వస్తుంది. అందువల్ల ఇది సముచ్చయం గురించి చెబుతున్నది.

స్మృతి ప్రమాణం కూడా పరిచ్ఛిన్న ఫలాన్నే సూచిస్తున్నది. మనుస్మృతిలో కర్మ ఉపాసనల సముచ్చయానికి అత్యున్నత ఫలం హిరణ్యగర్భలోకం అని వస్తుంది. దీన్ని మించి వేరే ఫలం లేదని కూడా వస్తుంది.

**ఉపాసనా సహిత కర్మణః ఫలం మోక్షః న భవతి**

సి) **మోక్షస్య అనారంభత్వాత్** – మోక్షం ఉత్పత్తి చెందేది కాదని చూశాము. మోక్షం సిద్ధవస్తువు అని కూడా చూశాము. కాని సముచ్చయ ఫలం బ్రహ్మలోకానికి వెళ్ళేది అని చూశాము. అందువల్ల అది కూడా సరిపోదు.

డి) **యోగ్య ఫలస్య కల్ప్యత్వాత్** – ఉపాసన కలపటంవల్ల ఫలితం అధికంగా ఉంటుందనే మాట నిజమే కాని

అది కర్మఫల పరిధిలోనే ఉంటుంది. ఆప్తి, ఉత్పత్తుల పరిధి ఎక్కువగా ఉండవచ్చు కాని పూర్తిగా వేరే నిత్య ఫలం ఉండదు.

దీనికి అద్భుతమైన ఉదాహరణనిస్తున్నారు శంకరులవారు. కన్ను రంగు, రూపులను మాత్రమే చూడగలదు. కన్ను పరిధి అంతే. ఆ పరిధిని మనం మైక్రోస్కోప్, టెలిస్కోప్‌లాంటి పరికరాలను వాడి పెంచవచ్చు. దానివల్ల మామూలు కంటితో చూడలేని సూక్ష్మక్రిములను మైక్రోస్కోప్‌తో చూడగలము. అంతే కాని కంటిశక్తి పెంపొందించటంవల్ల కంటితో శబ్దాలు వినగలము లేదా స్పర్శను పొందగలము అనలేము కదా!

ఈ సూత్రం కర్మఫలాలకు కూడా వర్తిస్తుంది –

కేవల కర్మ చేస్తేస్వర్గలోకానికి వెళతాడు.

ఉపాసన కర్మల సముచ్చయం చేస్తే బ్రహ్మలోకానికి వెళతాడు.

అంటే అతని ఆప్తి పరిధి పెరిగింది. కాని ఆ పరిధిని మించి బయటకు రాలేదు.

శంకరులవారు గుడ్లగూబ ఉదాహరణను ఇస్తున్నారు. గుడ్లగూబకు అసాధారణమైన చూపుంది. మన చూపు వెలుతురులోనే పనిచేస్తే, గుడ్లగూబ చూపు చీకటిలో కూడా పనిచేస్తుంది. అంతే! అంతకన్నా లేదు. గుడ్లగూబ రంగు, రూపులనే కంటితో చూడగలదు కాని కంటితో వినలేదు.

అందువల్ల ఉపాసన సముచ్చయ కర్మ మెరుగైన ఫలాలను ఇవ్వగలదు అంటే, మెరుగైన **పరిచ్ఛిన్న** ఫలాలను మాత్రమే ఇవ్వగలదు.

పైన చెప్పిన నాలుగు కారణాల దృష్ట్యా, ఉపాసన సముచ్చయ ఫలం మోక్షం ఎన్నటికీ కానేరదు. అది ఇవ్వగలిగిన అత్యున్నత ఫలం హిరణ్యగర్భ లోకం.

ఇక్కడితో కర్మఫల విచారభాష్యం ముగిసింది. మూడవ బ్రాహ్మణములో హిరణ్యగర్భ లోకం పరిధి తెలుస్తుంది. మోక్షం కావాలంటే, నాలుగవ బ్రాహ్మణానికి రావాలి.

## మంత్రం 3.3.1

**అథ హైనం భుజ్యుర్లాహ్యాయనిః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యేతి హోవాచ॥ మద్రేషు చరకాః పర్యవ్రజామ తే పతఞ్చలస్య కాప్యస్యగృహానైమ తస్యాసీద్దుహితా గన్ధర్వగృహీతా తమపృచ్ఛామ కోఽసీతి సోఽబ్రవీత్సుధన్వాఽఽఙ్గిరస ఇతి తం యదా లోకానా మన్తానపృచ్ఛామాథైనమబ్రూమ క్వ పారిక్షితా అభవన్నితి పారిక్షితా అభవన్ స త్వా పృచ్ఛామి యాజ్ఞవల్క్య క్వ పారిక్షితా అభవన్నితి ॥**

**అథ హైనం భుజ్యుర్లాహ్యాయనిః పప్రచ్ఛ** – తర్వాత లాహ్యుని కుమారుడైన భుజ్యుడు అడిగాడు. అతను హిరణ్యగర్భలోకం గురించి అడిగాడు. అది అడిగే ముందు ఒక కథ చెప్పాడు.

**యాజ్ఞవల్క్యేతి హోవాచ** – ఓ యాజ్ఞవల్క్యా అని సంబోధించి ఈ విధంగా అడిగాడు.

**మద్రేషు చరకాః పర్యవ్రజామ** – మేము వ్రతం చేయటంకోసం మద్రదేశంలో తిరుగుతున్నాము.

**తే పతంచలస్య కాప్యస్యగృహానైమ** – అటువంటి మేము కపి గోత్రీయుడైన పతంచలుని ఇంటికి వెళ్ళాము.

**తస్యాసీద్దుహితా గంధర్వగృహీతా** – ఆయనకు గంధర్వునిచే ఆవేశించబడిన ఒక కుమార్తె ఉంది.

**తమపృచ్ఛామ కోఽసీతి** – ఆ గంధర్వుణ్ణి నువ్వెవరు అని మేము అడిగాము.

**సోఽబ్రవీత్సుధన్వాఽఽంగిరస ఇతి** – అంగిరసగోత్రానికి చెందిన సుధన్వుడను అని చెప్పాడు. గంధర్వునికి అపౌరుషేయ జ్ఞానం ఉంటుంది కాబట్టి మాకు అతని దగ్గర కొన్ని విషయాలు నేర్చుకోవాలని కుతూహలం కలిగింది. అందువల్ల అతన్ని లోకాల పరిధులు గురించి అడిగాము.

**తం యదా లోకానా మంతానపృచ్ఛామ** – భూలోక, భువర్లోక, సువర్లోక సరిహద్దులు గురించి అడిగాము.

**అథైన మబ్రూమ క్వ పారిక్షితా అభవన్నితి పారిక్షితా అభవన్ స త్వా పృచ్ఛామి** అప్పుడు మేము ఆ యక్షుణ్ణి పారిక్షితులు ఎక్కడ ఉన్నారు అని అడిగాము. ఆ గంధర్వుడు మాకు చెప్పాడు.

**యాజ్ఞవల్క్య క్వ పారిక్షితా అభవన్నితి** – ఓ యాజ్ఞవల్క్యా, పారిక్షితులు ఎక్కడ ఉన్నారు అని నేను ప్రశ్నిస్తున్నాను.

ఈ కథ చెప్పటంలో రెండు విషయాలు చెప్పకనే చెప్పినట్టయింది. ముందు ఏదో తెలియని పదం వాడి యాజ్ఞవల్క్యుణ్ణి బెదరగొడదామని చూస్తున్నాడు.

పరీక్షిత అంటే ఉత్తమ పుణ్యకర్మ. అది అశ్వమేధయాగం. పరీక్షిత కర్మ చేసేవారిని పారిక్షితులు అంటారు. యాజ్ఞవల్క్యునికి ఈ పదం తెలియదనుకున్నాడు. కాని ఆయనకు ఆ పదమూ తెలుసు, దానికి జవాబూ తెలుసు.

ఇంకో విషయం, 'నాకు ఈ విషయం మాములుగా తెలీదు. సాక్షాత్తూ గంధర్వుణ్ణించే పొందాను. అందువల్ల ఇది అపౌరుషేయం. ఇది నీకు తెలిసే అవకాశం లేదు,' అనే సందేశం అంతర్లీనంగా ఉంది.

మిగతా ఉపనిషత్తులన్నీ ఒక ఎత్తు; బృహదారణ్యకోపనిషత్తు ఒక ఎత్తు. అందుకే శంకరులవారు రాసిన భాష్యాలన్నిటిలోకీ ఇది చాలా పెద్దది. ఈ ఉపనిషత్తులో కూడా 3, 4 అధ్యాయాలు ప్రత్యేకమైనవి. ఎందుకంటే ఉపనిషత్తు బోధ గురు, శిష్యుల సంవాదం రూపంలో సాగినా, ఈ అధ్యాయాల్లో ప్రత్యేకత ఉంది. మిగిలిన ఉపనిషత్తుల్లో శిష్యునికి ఏమీ తెలియదు, ఒకవేళ కొంత తెలిసినా, గురువు చెప్పే విషయం తెలియదు. అందువల్ల బోధ కూడా వివరంగా ఉంటుంది. ఇక్కడ అలా కాదు. ఇది గురుశిష్యుల సంవాదం కాదు. ఇద్దరు సమ ఉజ్జీల మధ్య వాదం. ప్రశ్న అడిగిన వారికి వారి జవాబు తెలుసు.

ఆ విషయం ఇక్కడ భుజ్యువు చెప్పాడు కూడా. 'నాకు గంధర్వుడు చెప్పాడు, అది నిన్ను అడుగుతున్నాను, చెప్పు,' అన్నాడు. యాజ్ఞవల్క్యుడు గనుక చెప్పలేకపోతే జనకుడు ఇస్తానన్న వెయ్యి ఆవులు, బంగారు కొమ్ములు ఉన్నవి, భుజ్యువుకు వెళ్ళిపోతాయి. కాని యాజ్ఞవల్క్యునికి తెలుసు. అడిగిన వ్యక్తికి జవాబు తెలుసు కాబట్టి, ఇక్కడ జవాబులు కూడా సూక్ష్మంగా, తెలివిగా ఉంటాయి. వారి స్థాయికి తగ్గట్టు జవాబిస్తాడు యాజ్ఞవల్క్యుడు. ఆ విషయం రెండో మంత్రంలో చూస్తాము.

## మంత్రం 3.3.2

**స హోవాచోవాచ వై సోఽగచ్ఛన్ వై తే తద్యత్రాశ్వమేధయాజినో గచ్ఛన్తీతి క్వ న్వశ్వమేధయాజినో గచ్ఛన్తీతి ॥ ద్వాత్రిగ్ంశతం వై దేవరథాహ్న్యాన్యయం లోకస్తగ్ం సమన్తం పృథివీ ద్విస్తావత్పర్యేతి తాగ్ం సమన్తం పృథివీం ద్విస్తావత్సముద్రః పర్యేతి ॥ తద్యావతీ క్షురస్య ధారా యావద్వా మక్షికాయాః పత్రం తావానన్తరేణాకాశస్తానిన్ద్రస్సుపర్ణో భూత్వా వాయవే ప్రాయచ్ఛత్తాన్ వాయురాత్మని ధిత్వా తత్రాగమయద్యత్రాశ్వమేధయాజినోఽభవన్నిత్యేవమివ వై స వాయుమేవ ప్రశశగ్ంస ॥ తస్మాద్వాయురేవ వ్యష్టిర్వాయుస్సమష్టిరప పునర్మృత్యుం జయతి య ఏవం వేద తతో హ భుజ్యుర్లాహ్యాయనిరుపరరామ ॥**

**సహోవాచోవాచ వై సోఽగచ్ఛన్ వై తే తద్యత్రాశ్వమేధయాజినో గచ్ఛంతీతి** – ఆ యాజ్ఞవల్క్యుడీ విధంగా చెప్పాడు, 'అశ్వమేధయాగం చేసినవారు ఎక్కడికి వెళతారో, వీరు కూడా అక్కడికే వెళతారు అని ఆ గంధర్వుడు నిశ్చయంగా చెప్పాడు.'

భుజ్యువు యాజ్ఞవల్క్యుని పరీక్షించటానికి పెద్ద పదం వాడితే, యాజ్ఞవల్క్యుడు కూడా అతనికి తగ్గట్టుగానే జవాబు చెప్పాడు. అశ్వమేధ యాగం చేసినవారు ఎక్కడికి వెళతారో పారిక్షితులు కూడా అక్కడికే వెళతారు అన్నాడు. అంతేకాని ఆ లోకం ఏమిటో చెప్పలేదు. పైగా ఇదే గంధర్వుడు చెప్పాడు అన్నాడు.

**క్వ న్వశ్వమేధయాజినో గచ్ఛన్తీతి** – సరే, అశ్వమేధయాగం చేసినవారు ఎక్కడికి వెళతారు అని భుజ్యువు అడిగాడు. యాజ్ఞవల్క్యుడు వారు ఎక్కడికి వెళతారో చెప్పలేదు కాబట్టి అతను మళ్ళీ ప్రశ్న సూటిగా అడగాల్సి వచ్చింది. అప్పుడు యాజ్ఞవల్క్యుడు కూడా సూటిగా చెబుతాడు. ముందు ఒక్కొక్క లోకం కొలతలు చెప్పుకుంటూ వస్తాడు.

సూర్యభగవానుడు తన రథంతో ఒక రాత్రీ, పగలు ఎంతమేరకు తిరుగుతాడో, ఆ కొలతను దేవరథ అహ్న్యం అంటారు. భూలోకం దానికి 32 రెట్లు ఉంది. దానికి రెండు రెట్లు (32×2=64) పృథివీ తత్త్వం ఉంది. దానికి రెండు రెట్లు (64×2=128) సముద్ర తత్త్వం ఉంది. ఈ మూడు లోకాలూ అంటే అయంలోకం, పృథివీతత్త్వం, జల తత్త్వం బ్రహ్మాండంలో ఉన్నాయి. బ్రహ్మాండంయొక్క రెండు కపాలాలను (సగము చిప్పలను) అండ కపాలాలంటారు. అవి రెండూ కలిపి ఒక అండం ఆకారంలో ఉంటాయి. వాటి మధ్య చాలా సన్న స్థానం ఉంటుంది. అది ఎంత సన్నగా ఉంటుందంటే దాన్ని శాస్త్రం క్షురకత్తి కొనతోనూ, ఈగ రెక్కతోనూ పోల్చింది.

అగ్నిదేవుడు పక్షిరూపంలో ఈ అశ్వమేధయాజులను తీసుకువెళ్ళి వాయువుకు అందజేస్తాడు. ఆ వాయువు అశ్వమేధయాగం చేసినవారు ఎక్కడికి వెళ్ళాలో అక్కడికి తీసుకువెళతాడు. ఈ విధంగా ఆ గంధర్వుడు వాయువునే కొనియాడాడు.

అప్పుడు శాస్త్రం వాయువునే పొగుడుతున్నది. వాయువే వ్యష్టి, వాయువే సమష్టి. ఎవరైతే ఈ విధంగా ఉపాసిస్తాడో, అతను మృత్యువును జయిస్తాడు. ఎవరైతే హిరణ్యగర్భ ఉపాసన చేస్తాడో, అతను హిరణ్యగర్భ లోకాన్ని పొందుతాడు. ఈ వివరణతో మంత్రం చూద్దాము.

**ద్వాత్రిగ్ంశతం వై దేవరథాహ్న్యాన్యయం లోకః** – భూలోకం ముప్పయి రెండు దేవరథహ్న్యాలు ఉంది.

**తాగ్ం సమంతం పృథివీ ద్విస్తావత్పర్యేతి** – దానికి అన్ని వైపులా రెండు రెట్లు పృథివి దాని చుట్టూ ఉంది.

**తాం సమంతం పృథివీం ద్విస్తావత్సముద్రః పర్యేతి** – ఆ పృథివికి అన్ని వైపులా దానికి రెండు రెట్లు సముద్రం ఉంది.

**తద్యావతీ క్షురస్య ధారా యావద్వా మక్షికాయాః పత్రం తావానన్తరేణాకాశః** – అక్కడ చురకత్తి కొన ఎంత ఉంటుందో, ఈగ రెక్క ఎంత ఉంటుందో, అంత ఆకాశం మధ్యలో ఉంది.

**తానింద్రస్సుపర్ణో భూత్వా వాయవే ప్రాయచ్ఛత్** – ఇక్కడ ఇంద్రుడు అంటే అగ్ని. అగ్ని సుపర్ణుడై వారిని వాయువుకు ఇస్తాడు.

**తాన్ వాయురాత్మని ధిత్వా తత్రాగమయద్యత్రాశ్వమేధ యాజినోఽ భవన్నితి** – వాయువు వారిని తనలో స్థాపించుకొని, ఎక్కడ అశ్వమేధయాగం చేసిన వారు ఉంటారో, అక్కడికి చేరుస్తాడు.

**ఏవమివ వై స వాయుమేవ ప్రశశగ్ంస** – ఈ విధంగా ఆ గంధర్వుడు వాయువునే కొనియాడాడు.

**తస్మాద్వాయురేవ వ్యష్టిర్వాయుస్సమష్టిః** – అందువల్ల వాయువే వ్యష్టి, వాయువే సమష్టి.

**అప పునర్మృత్యుం జయతి య ఏవం వేద** – ఎవరైతే ఈ విధంగా ఉపాసిస్తారో, అతను మృత్యువును జయిస్తాడు.

**తతో హ భుజ్యుర్లాహ్యాయనిరుపరరామ** – అప్పుడు భుజ్యుర్లాహ్యాయనుడు శాంతించాడు.

## 3.4 ఉషస్త బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణమునుంచి పరావిద్య లేదా బ్రహ్మవిద్యలోకి అడుగు పెడుతున్నాము. అందువల్ల ఈ బ్రాహ్మణములు చాలా ముఖ్యమైనవి. వీటిలో బ్రహ్మ గురించిన కొన్ని అద్భుతమైన నిర్వచనాలను చూస్తాము.

మంత్రం 3.4.1

**అథ హైనముషస్తశ్చాక్రాయణః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యేతి హోవాచ యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాన్తరస్తం మే వ్యాచక్ష్వేతి ॥ ఏష త ఆత్మా సర్వాన్తరః కతమో యాజ్ఞవల్క్య సర్వాన్తరః ॥ యః ప్రాణేన ప్రాణితి స త ఆత్మా సర్వాన్తరో యోఽపానేనాపానీతి స త ఆత్మా సర్వాన్తరో యో వ్యానేన వ్యానీతి స త ఆత్మా సర్వాన్తరో య ఉదానేనోదానితి స త ఆత్మా సర్వాన్తర ఏష త ఆత్మా సర్వాన్తరః॥**

**అథ హైనముషస్తశ్చాక్రాయణః పప్రచ్ఛ** – తర్వాత చక్రుని కుమారుడైన ఉషస్తుడు ప్రశ్నించాడు.

**యాజ్ఞవల్క్యేతి హోవాచ** – ఓ యాజ్ఞవల్క్యా అని సంబోధించి ఈ విధంగా చెప్పాడు.

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాన్తరస్తమ్** – సాక్షాత్ అపరోక్షమైన బ్రహ్మ ఏదైతే ఉందో, అన్నింటిలోనూ సారంగా ఏదైతే ఉందో;

**తం మే వ్యాచక్ష్వేతి** – దాని గురించి నాకు చెప్పు.

ముందే చూసినట్టుగా ఈ అధ్యాయంలో ప్రశ్నలు అడిగేవారు కూడా పండితులే. అందువల్ల ఉషస్తుడు ముందుగా తానే బ్రహ్మ నిర్వచనం యిచ్చాడు. బ్రహ్మను నిర్వచించే అద్భుతమైన నిర్వచనాల్లో ఇది ఒకటి. శంకరులవారు దీన్ని తరచూ ఉటంకిస్తూ ఉంటారు. ముందు దీనిలో కొంత భాగాన్ని చూద్దాము.

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ** – బ్రహ్మ అంటే ఏమిటి?

**బృహత్తమత్వాత్ బ్రహ్మ –** అనంతమైనది, అన్నింటికన్నా పెద్దది.

అపరోక్షం అంటే ఏమిటి? ప్రమాణం ఉపయోగించవలసిన అవసరం లేకుండా తెలిసేది. స్వయం ప్రకాశకం. అపరోక్షం పదాన్ని అర్థం చేసుకునే ముందు మూడు పదాలను చూద్దాము. ప్రత్యక్షం, పరోక్షం, అపరోక్షం.

**ప్రత్యక్షం** – మన ఎదురుగుండా ఉండే వస్తువు. ఏదో ఒక ప్రమాణంద్వారా తెలుసుకుంటాము దాన్ని.

**పరోక్షం** – దూరంగా ఉన్న వస్తువు. ఉదాహరణకు అమెరికా. దాని గురించి వార్తాపత్రికలద్వారా అంటే సోషల్ మీడియాద్వారా తెలుసుకుంటాము. లేదా చంద్రుని గురించి తెలుసుకోవాలంటే అనుమాన ప్రమాణం (తర్కం) వాడతాము.

ఆ విధంగా మనకున్న ఐదు ప్రమాణాల్లో ఏదో ఒక ప్రమాణంద్వారా ప్రత్యక్ష వస్తువును కాని, పరోక్ష వస్తువుని కాని తెలుసుకుంటాము.

**అపరోక్షం** – ఈ ప్రమాణాలేవీ ఉపయోగించనవసరం లేకుండా తెలిసేది. అలా తెలిసేది ఒకటే ఉంది. అది 'అహం' లేదా 'నేను'. సబ్జెక్టు నయిన నేను.

**యత్ అపరోక్షం తదు బ్రహ్మ** – ప్రమాణం అవసరం లేకుండా తెలుసుకునేది ఏదైతే ఉందో, అది బ్రహ్మ.

దానికి **సాక్షాత్** పదం ఎందుకు కలిపాడు? ఎందుకంటే సాధారణంగా అపరోక్షం అంటే నేను లేదా అహం అని వస్తుంది కాని, శాస్త్రంలో ముఖ్యంగా తర్కశాస్త్రంలో ఒక్కోసారి అపరోక్షం అంటే ప్రత్యక్షం అని కూడా వస్తుంది. పరోక్షం కానిది అపరోక్షం. పరోక్షం కానిది ఏమిటి? ప్రత్యక్షం. అలా చూస్తే అపరోక్షానికి యింకో అర్థం– ప్రత్యక్షం.

ఈ విధంగా అపరోక్షానికి రెండు అర్థాలున్నాయి – ప్రత్యక్షం, ఆత్మ లేదా నేను. ఇక్కడ సాక్షాత్ పదం వేయటంవల్ల అది అపరోక్షాన్నే సూచిస్తున్నది. ఈ వాక్యం అర్థం – **ప్రమాణాలకతీతమైనది బ్రహ్మ.**

దీన్ని ఇంకొంచెం వివరిస్తున్నాడు.

**య ఆత్మా సర్వాంతరః** – ఇక్కడ ఆత్మా అంటే సారం; అన్నింటికీ సారం. మొత్తం చూస్తే సర్వవ్యాపి అయిన బ్రహ్మ, విశ్వంలో అన్నింటిలోనూ వాటి సారంగా ఉంది.

ఇదొక మహావాక్యం. **బ్రహ్మ సర్వస్య అంతరః** అనటంవల్ల అన్నింటికీ సారంగా ఉంది అని అర్థం. బ్రహ్మ అనేది ఒకటి ఉంది; అది ప్రమాణాల కతీతమైనది; అది జగత్తు అంతటికీ సారమైనది అని చెప్పి దాని గురించి నువ్వు ఇంకా చెప్పు అంటున్నాడు ఉషస్త.

బ్రహ్మ నిర్వచనం ఒక్క వాక్యంలో ఉషస్తుడు చెపితే యాజ్ఞవల్క్యుడు ఇంకొక వాక్యంలో చెప్పాడు.

**ఏష త ఆత్మా సర్వాంతరః** – ఈ నీ ఆత్మయే సర్వానికి సారం. నీ ఆత్మ అంటే స్థూల సూక్ష్మ శరీరాల్లో ఉన్న ఆత్మ. జగత్తు సారం తెలుసుకోవాలంటే ఎక్కడ వెతకాలి? ఎక్కడికో వెళ్ళనవసరం లేదు, నీ సారం తెలుసుకుంటే ప్రపంచసారం తెలుసుకున్నట్టే.

ఒక అల, తనను అలగా చూస్తే చాలా చిన్నది. అది తనలో నీరు ఉంది, తక్కిన అలల్లోనూ నీరు ఉంది అని తెలుసుకోవాలి. అలా తెలుసుకున్నా చాలదు. నువ్వేమిటి అంటే ఇంకా నేను అలనే అంటుంది. నా సారం నీరు. ఆ మాటకొస్తే నీరుగా సముద్రానికే నేను అధిష్టానం అని తెలుసుకోవాలి. ఎంత పెద్దగెంతో చూడండి! ఒక చిన్న అల, అలగా భావించుకుంటే అలే! అదే చిన్న అల, తనను నీటిగా అర్థం చేసుకుంటే సముద్రానికే సారం!

అలా నేను సూక్ష్మ, స్థూలశరీరాలుగా భావించుకుంటే చిన్న జీవిని! సర్వాంతరాత్మగా అర్థం చేసుకుంటే బ్రహ్మను.

**మన్నాథః శ్రీ జగన్నాథః మద్గురుః శ్రీ జగద్గురుః। మదాత్మా సర్వభూతాత్మా తస్మై శ్రీగురువే నమః॥ – గురుస్తోత్రం**

నాలో ఉన్న ఆత్మే అన్ని భూతాల (జీవుల) అంతరాత్మ.

కాని దీనితో ఉషస్తుడు తృప్తి చెందలేదు.

**కతమో యాజ్ఞవల్క్య సర్వాంతరః** – ఓ యాజ్ఞవల్క్యా, నా ఆత్మ లక్షణం ఏమిటి?

ఎలా విషయం రూపుదిద్దుకుంటోందో చూశారా? ముందేమో సర్వభూతాల సారం ఏమిటి అన్నాడు. నీలో ఉన్న సారమే వాటిలోనూ ఉంది అంటే సరే నాలో ఉన్న సారం ఏమిటి అన్నాడు.

**యః ప్రాణేన ప్రాణితి స త ఆత్మా సర్వాంతరః** – ఏదైతే ప్రాణంద్వారా ప్రాణక్రియను చేస్తున్నదో ఆ నీ ఆత్మే అన్నింటి లోపలా ఉంది.

**యోఽ పానేనాపానీతి స త ఆత్మా సర్వాంతరః** – ఏదైతే అపానంద్వారా అపానక్రియను చేస్తున్నదో, ఆ నీ ఆత్మే అన్నింటి లోపలా ఉంది.

**యో వ్యానేన వ్యానీతి స త ఆత్మా సర్వాంతరః** – ఏదైతే వ్యానంద్వారా వ్యానక్రియను చేస్తున్నదో, ఆ నీ ఆత్మే అన్నింటి లోపలా ఉంది.

**య ఉదానేనోదానితి స త ఆత్మా సర్వాంతరః** – ఏదైతే ఉదానంద్వారా ఉదానక్రియను చేస్తున్నదో, ఆ నీ ఆత్మే అన్నింటి లోపలా ఉంది.

**ఏష త ఆత్మా సర్వాంతరః** – ఈ నీ ఆత్మయే అన్నింటి లోపలా ఉంది.

ఆత్మ స్వయంగా ఏ పనీ చేయదు. ఆత్మ అకర్తా, అభోక్తా. ఆత్మ నిర్వికారం. కాని ఆత్మ సమక్షంలో తక్కిన అంగాలన్నీ సక్రమంగా పని చేస్తాయి. ఇక్కడ పంచప్రాణాలను తీసుకున్నాడు యాజ్ఞవల్క్యుడు. వాటి విధులను ఒకసారి చూద్దాము –

ప్రాణం – శ్వాసక్రియ
అపానం – విసర్జన క్రియ
వ్యానం – రక్త ప్రసరణ క్రియ
ఉదానం – తిరోగమన క్రియ
సమానం – జీర్ణక్రియ

సమానం గురించి చెప్పలేదు కాని మనం కలుపుకోవాలి. వీటిద్వారా ఆత్మ పని చేస్తున్నట్టుగా ఉంది అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. అకర్త అయిన ఆత్మ, కర్త అయిన స్థూల, సూక్ష్మశరీరాలకు చాలా దగ్గరగా ఉండటంవల్ల ఆత్మ పనిచేస్తున్నట్టుగా అనిపిస్తుంది. ఆత్మను **ఉపహితం** అనీ స్థూల సూక్ష్మశరీరాలను **ఉపాధి** అనీ అంటారు.

దీనికి మనం ఎప్పుడూ చూసే చెయ్యి–కాంతి ఉదాహరణను గుర్తు తెచ్చుకోవచ్చు. చెయ్యి–కాంతి విషయంలో మూడు విషయాలు గమనిస్తాము.

1. కాంతి చేతికి భిన్నంగా ఉంది.
2. కాంతి, చెయ్యి అంతటా వ్యాపించి ఉంది.
3. కాంతివల్లనే చెయ్యి ప్రకాశిస్తున్నది.

ఇదే సూత్రాన్ని కేనోపనిషత్తులో కూడా చూస్తాము.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః**

చెవి, ఆత్మవిషయం తీసుకుంటే ఈ మూడు విషయాలే శ్రోత్రస్య శ్రోత్రం నిర్వచనానికి వివరాలు –

1. ఆత్మ చెవికి భిన్నంగా ఉంది.
2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.
3. ఆత్మవల్లనే చెవికి చెవిశక్తి (వినికిడిశక్తి) వస్తుంది.

ఇదే విషయం అదే కేనోపనిషత్తులో యక్షుని కథద్వారా నిరూపింప బడుతుంది. అగ్నిదేవతను ఒక ఎండు గడ్డిపోచని కాల్చమంటాడు యక్షుడు. అగ్ని ఎంత ప్రతాపం చూపించినా, దాన్ని ఒక మూల కూడా కాల్చలేక పోయింది. ప్రళయం సమయంలో అగ్నిజ్వాలలు పాతాళలోకంనుంచి బ్రహ్మలోకం దాకా చెలరేగి పోతాయిట. అలాంటి అగ్ని ఒక మామూలు గడ్డిపోచను ఏమీ చేయలేక పోయిందంటే ఏమిటి అర్థం? అగ్నికి దహనశక్తి ఆత్మ లేదా బ్రహ్మ లేదా యక్షునివల్లనే వస్తుంది. అలాగే ఆత్మ శరీరంలో ఉన్నా శరీరానికి భిన్నంగా ఉంది. ఆత్మవల్లనే శరీరంలోని ప్రాణశక్తులు పని చేయగలుగుతున్నాయి.

**ఏష త ఆత్మా సర్వాంతరః** – అని చెప్పటంలో అర్థం అది. కాని ఉషస్తుకు కోపం వచ్చింది. ఎందుకంత క్లిష్టమైన జవాబిస్తున్నావు? ప్రత్యక్షంగా ఆత్మను నిర్వచించవచ్చు కదా అని చెప్పి, తన ప్రశ్నను మళ్ళీ అడిగాడు. ఆ ప్రశ్న అడిగేముందు ఎద్దు, గుర్రం గురించి అడిగితే ఎవరైనా ఎంత స్పష్టంగా చెబుతారో, నువ్వు కూడా అంత స్పష్టంగా చెప్పాలి అని అంటాడు. ఇదంతా తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.

## మంత్రం 3.4.2

**స హోవాచోషస్తశ్చాక్రాయణో యథా విబ్రూయాదసౌ గౌరసావశ్వ ఇత్యేవమేవైతద్వ్యపదిష్టం భవతి యదేవ సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాన్తరస్తం మే వ్యాచక్ష్వేతి ॥ ఏష త ఆత్మా సర్వాన్తరః కతమో యాజ్ఞవల్క్య సర్వాన్తరః ॥ న దృష్టేర్ద్రష్టారం పశ్యేర్న శ్రుతేశ్శ్రోతారం శృణుయా న మతేర్మన్తారం మన్వీథా న విజ్ఞాతేర్విజ్ఞాతారం విజానీయాః ॥ ఏష త ఆత్మా సర్వాన్తరోఽతోఽన్యదార్తం తతో హోషస్తశ్చాక్రాయణ ఉపరరామ ॥**

**స హోవాచోషస్తశ్చాక్రాయణః** – ఉషస్త చాక్రాయణుడు ఈ విధంగా అన్నాడు.

**యథా విబ్రూయాదసౌ గౌరసావశ్వ ఇత్యేవమేవైతద్వ్యపదిష్టం భవతి** – ఇది ఎద్దు, ఇది గుర్రము అని ఎలాగైతే ఎవరైనా చెబుతారో, నువ్వు చెప్పేది కూడా అట్లాగే ఉండాలి.

**యదేవ సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాంతరస్తం మే వ్యాచక్ష్వేతి** – తను అంతకుముంది ఇచ్చిన నిర్వచనాన్ని మళ్ళీ ఇచ్చి, మళ్ళీ దాని గురించి చెప్పమన్నాడు. ఆ నిర్వచనం ఏమిటి?

ఏ బ్రహ్మ అయితే సాక్షాత్తుగా అపరోక్షమో, ఏ ఆత్మ సర్వమునకు లోపల నున్నదో, దాన్ని నాకోసం స్పష్టంగా చెప్పు.

**ఏష త ఆత్మా సర్వాంతరః** – ప్రశ్న అదే అయినప్పుడు జవాబు కూడా అదే మళ్ళీ వస్తుంది. యాజ్ఞవల్క్యుడు అంతకుముందు చెప్పిన జవాబే మళ్ళీ చెప్పాడు.

ఈ నీ ఆత్మే అన్నింటిలోనూ వాటి సారంగా ఉంది. ఈ శరీరంలో ఉన్న ఆత్మే ప్రపంచం అంతటా ఉంది.

**కతమో యాజ్ఞవల్క్య సర్వాంతరః** – ఈ ప్రశ్నను కూడా అంతకుముందు ఉషస్తుడు అడిగాడు. ఈ నీ ఆత్మయే సర్వమునకు లోపల ఉంది అంటే ఈ ఆత్మ గురించి చెప్పు అని అప్పుడూ అడిగాడు, ఇప్పుడూ అడుగుతున్నాడు.

ఇప్పుడింక యాజ్ఞవల్క్యుడు అతన్ని విసిగించకుండా, ఇంకో నిర్వచనంతో ముందుకు వస్తున్నాడు. ఇది చాలా ముఖ్యమైన నిర్వచనం, శంకరులవారు తరచు దీన్ని ఉటంకిస్తుంటారు. ఇటువంటి మంత్రాలెన్నో ఉండటంవల్లనే బృహదారణ్యకోపనిషత్తు అన్ని ఉపనిషత్తులకూ మకుటంగా నిలిచింది.

ఈ భాగం సారాంశం, ఆత్మను ప్రత్యక్షంగా అంటే స్పష్టంగా నిర్వచించలేము. ఎందుకంటే ఇది ఆబ్జెక్టు కాదు.

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి। ఇతి శుశ్రుమ పూర్వేషాం యే నస్తద్వ్యాచచక్షిరే ॥** కేన. 1.4.

ఆత్మ తెలిసిన వస్తువూ కాదు, తెలియని వస్తువూ కాదు. అంటే దాని అర్థం ఆత్మ అసలు వస్తువే (ఆబ్జెక్ట్) కాదు. వస్తువును అనుభవించే నువ్వే ఆత్మవు. కాని మనం ఇన్నాళ్ళూ నేర్చుకున్న జ్ఞానం తీరుతెన్నులు ఏమిటి? ఒక వస్తువు గురించి వింటే, దాన్ని అనుభవంలో తెలుసుకోవాలి. ఉదాహరణకు కాశీ గురించి వింటే, అక్కడికెళ్ళి ప్రత్యక్షంగా అనుభవాలు పొందాలి.

ఇది నువ్వు అనుభవించే బాహ్య వస్తువు కాదని అన్నా అర్థం చేసుకోము. సరే అయితే నేను ధ్యానంలో ఆత్మ సాక్షాత్కారం పొందుతాను అనుకుంటారు. నేను ఆత్మ గురించి అంతా చక్కగా నేర్చుకున్నాను; పది ఉపనిషత్తులూ ఆకళింపు చేసుకున్నాను; నాకు బాగా అర్థమయింది అని ఒక పక్క అంటూ **ఆ బ్రహ్మ ఎప్పుడు వస్తాడో** అని ఆశగా ఎదురు చూస్తారు. అంటే బ్రహ్మ గురించిన పదాలను అర్థం చేసుకోకుండా వాడతారు.

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ

బ్రహ్మ సర్వాంతర్యామి

ఇది తెలుసుకున్న జ్ఞాని నిత్య, ముక్త, శుద్ధ పురుషుడు.

ఈ వ్యాక్యాలన్నీ చెబుతారు. అంతా అయ్యాక సరే, నీకు మోక్షం వస్తుందా అంటే ఏమంటారు?

ఏమో తెలియదు; స్వామీజీకి వస్తుందేమో కాని నాకు రాకపోవచ్చు; ఇంకా బ్రహ్మసూత్రాలు వినాలి నేను. అంటే దీని అర్థం ఏమిటి? వారికి వారు చెబుతున్న వాక్యాలు అర్థం కావటం లేదు. ఒక పక్క జ్ఞాని నిత్యముక్తుడు అని చెబుతూ ఇంకా మోక్షం వస్తుందో రాదో అనటం ఏమిటి?

ఇదంతా ఎందుకు అవుతోంది? ఏ అనుభవం చూసినా అది ఏదో ఒక ఆబ్జెక్టుకు చెందినదై ఉంటుంది. ఆ బ్రహ్మ లేదా ఆత్మ నేనే అని అని తెలుసుకోవాలి. ఆత్మ గురించి ఆబ్జెక్టుగా అనుకోకూడదని శాస్త్రం పరోక్షంగా చెబుతోంది. అంతే పరోక్షంగా యాజ్ఞవల్క్యుడు చెబుతున్నాడు.

ఆత్మను చూడలేము – కొంతమందికి ధ్యానంలో కూర్చుంటే కొన్ని రంగులు కనిపిస్తాయి – పసుపురంగు, నీలం రంగులు కనిపిస్తాయంటారు. ఆ రంగులు ఆత్మ కాదు.

ఆత్మను వినలేము – కొంతమందికి ధ్యానంలో కొన్ని శబ్దాలు వినబడతాయి. గంటలు మ్రోగినట్టుగా వినపిస్తాయి; అది ఆత్మ కాదు.

ఆత్మను వాసన చూడలేము – కొంతమందికి ధ్యానంలో చందనం వాసన వస్తుంది. అది ఆత్మ కాదు.

ఆత్మను మనస్సుతో తెలుసుకోలేము – మనస్సుతో ఆత్మను వస్తువుగా (ఆబ్జెక్టుగా) తెలుసుకోలేము. ఒక వస్తువుగా ఒక అనుభవంగా తెలిసిందేదో అది ఆత్మ కాదు.

ఆత్మను భావోద్రేకాలతో తెలుసుకోలేము – కొంతమంది ప్రేమ ప్రవహించటం అనుభవించాము అంటారు. అది ఆత్మ కాదు.

ఆత్మను స్పర్శతో తెలుసుకోలేము – కొంతమంది యోగులను స్పర్శిస్తే, వారినుంచి మనలోకి ఒక శక్తి ప్రవేశించినట్టుగా అనిపిస్తుంది. కాని అది ఆత్మ కాదు.

ఆత్మ ఒక సిద్ధాంతం కాదు; ఒక శక్తి కాదు; ఒక భావన కాదు. దయచేసి ఒక విషయం గమనించమని ప్రార్థన. ఈ పైన వర్ణించిన అనుభవాలనేమీ ఖండించటం లేదు. అవి లేవు అని కాని, అవి నిజం కాదు అని కాని అనటం లేదు. అలాంటి సిద్ధులు చాలామందికి ఉన్నాయి. కాదనటం లేదు. కాని అవి ఆత్మ కాదు; అనాత్మకు చెందినవి అంటున్నాము అంతే. ఒకవేళ అవే ఆత్మ అయితే, కృష్ణభగవానుడు యుద్ధభూమిలో అర్జునునికి జ్ఞానబోధ చేయటం ఎందుకు? కేవలం స్పర్శతో శక్తిని ఇచ్చేయవచ్చు కదా?

ఇది నిజమా కాదా అంటే ఇవి ఆత్మ అనుభవాలా కాదా తెలుసుకోవాలనుకుంటే రెండు చిన్న సూత్రాలు వాటికి అన్వయించి చూస్తే చాలు –

1. ఆత్మ ఆబ్జెక్టు కాదు. (ఆబ్జెక్టు అంటే సబ్జెక్టుకు భిన్నంగా ఉన్నది).
2. ఆత్మ వచ్చి పోయేది కాదు.

పైన ఉదహరించిన అనుభవాలన్నీ వచ్చి పోయేవే! పైగా అవి ఆబ్జెక్టుగా తెలుస్తున్నాయి. అందువల్ల మనం అనుభవం పొందినదేదీ ఆత్మ కాదు.

మరి అయితే ఆత్మ అనుభవం పొందటం ఎలా?

ఆత్మ అనుభవం పొందలేము.

ఆత్మ అనుభవం పొందనవసరం లేదు. ఎందుకంటే - అనుభవించే నేనే ఆత్మను కాబట్టి.

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

**ప్రతిబోధవిదితం మతమమృతత్వం హి విన్దతే ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతేఽ మృతమ్ ॥**- కేన

ఆత్మవల్లనే ప్రతి అనుభవమూ అవుతుంది కాని, ఆత్మ అనుభవం విడిగా ఉండదు. కన్నువల్లనే అన్నీ చూడగలుగుతున్నాము కాని కన్నును చూసుకోలేము కదా, అలా! అంతేకాదు -

**యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూగ్ంషి పశ్యతి।** కేన. 1.7.

ఏది కళ్ళద్వారా చూడబడదో, దేని మూలంగా కళ్ళు చూస్తాయో అదే ఆత్మ.

వినికిడి శక్తికి శ్రోతా
ఆలోచనా శక్తికి మంతా
జ్ఞానశక్తికి విజ్ఞాతా

ఈ శక్తులన్నిటిని మనస్సుయొక్క వృత్తులుగా తీసుకుంటే అవన్నీ దర్శనవృత్తి, శ్రవణవృత్తి, మనోవృత్తి, బుద్ధివృత్తులు అవుతాయి వరుసగా. అంటే వీటన్నిటినీ క్రోడీకరిస్తే ఆత్మ. నిర్వచనం ఇది -

సర్వమనోవృత్తి సాక్షి - ఆత్మ

**రూపం దృశ్యం లోచనం దృక్ తద్దృశ్యం దృక్తు మానసమ్। దృశ్యా ధీ వృత్తయః సాక్షీ దృగేవ న తు దృశ్యతే॥**

- దృగ్దృశ్య వివేకము - 1

**జగత్తు దృశ్యం, కన్ను దృక్ - దృక్-1**

కన్ను కూడా దృశ్యమే. కన్ను మూసుకుంటే మనస్సుకు తెలుస్తుంది.

**కన్ను దృశ్యం, మనస్సు దృక్ - దృక్-2**

మనస్సు కూడా దృశ్యమే. మనస్సులో లేచే అనేక ఆలోచనలు మనకు తెలుస్తున్నాయి. మనకు భిన్నంగా ఉండి, మనకు తెలుస్తోందంటే అది ఆబ్జెక్టు అని చూశాము. ఆబ్జెక్టు అంటే దృశ్యం.

**మనస్సు దృశ్యం, సాక్షిచైతన్యం దృక్- దృక్-3**

సాక్షిని చూసేది ఎవరు? దృగేవ న తు దృశ్యతే

**సాక్షి - ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్.**

దృగ్దృశ్య వివేకంలో మూడు దృక్కులను చూస్తాము. ఇప్పుడు అందులో కన్ను విషయం పక్కన పెట్టి తక్కిన రెండు దృక్కులే తీసుకుందాము. బృహదారణ్యకం దృశ్యాన్ని దృష్టి అనీ, దృక్కును ద్రష్ట అని వ్యవహరిస్తున్నది.

| | |
|---|---|
| **జగత్తు దృశ్యం, మనస్సు దృక్** | **– దృక్–1** |
| **మనస్సు దృశ్యం, సాక్షిచైతన్యం దృక్** | **– దృక్–2** |
| **జగత్తు ఎప్పటికీ దృశ్యమే** | **– అది దృక్కు కాలేదు** |
| **సాక్షి ఎప్పటికీ దృక్కే** | **– అది ఎన్నటికీ దృశ్యం కాలేదు** |

మనస్సు మాత్రం ఇటు దృక్‌గా అటు దృశ్యంగా పనిచేస్తుంది. ఎవరైనా మనస్సు దృశ్యమా, దృక్కా అని అడిగితే, వెంటనే బదులు చెప్పకూడదు. సాక్షి పరంగా అడుగుతున్నావా, జగత్తు పరంగా అడుగుతున్నావా అని ఎదురు ప్రశ్నించాలి.

జగత్తు పరంగా మనస్సు దృక్
సాక్షి పరంగా మనస్సు దృశ్యం

మనస్సు బాహ్యప్రపంచాన్ని, సాక్షి అంతర్గత మనస్సును చూస్తాయి.

**కామః సఙ్కల్పసన్దేహౌ శ్రద్ధాఽశ్రద్ధే ధృతీతరే**
**హ్రీర్ధీర్భీరిత్యేవమాదీన్ భాసయత్యేకధా చితిః –** దృగ్దృశ్య వివేకము – 4

మనస్సులో రేగే అనేక ఆలోచనలు – కోరికలు, సందేహం, శ్రద్ధ, అశ్రద్ధ వంటి అనేక ఆలోచనలను సాక్షిగా చూస్తుంది సాక్షిచైతన్యం. మనస్సులో ఆలోచనలు ఉన్నా, ఆలోచనలు లేకపోయినా, ఆ మనస్సును సాక్షీభూతంగా చూస్తుంది సాక్షిచైతన్యం.

**గమనిక:** ఇంచుమించు ఇవే పదాలు ఇదే బృహదారణ్యకంలోనే మొదటి అధ్యాయంలో మనస్సును వర్ణించేటప్పుడు వచ్చాయి. దృక్, దృశ్యం వివరణ ఇక్కడ వస్తోంది. అందువల్ల దృగ్దృశ్య వివేకానికి మూలం బృహదారణ్యాకం అని తెలుస్తుంది ఇది చూస్తే,

మనస్సునూ, సాక్షినీ రెండింటినీ దృక్కులుగా వ్యవహరించినా ఈ రెండింటి మధ్య కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి.

1. **సాక్షి నిర్వికార ద్రష్ట** – మనస్సు ద్రష్టగా పనిచేసినప్పుడు అది అనేక మార్పులకు లోనవుతుంది. కుండను చూస్తే కుండవృత్తి, గోడను చూస్తే గోడవృత్తి ఏర్పడుతాయి. అలా చూసే వస్తువులు మారుతూ వస్తాయి కాబట్టి, మనస్సులో ఏర్పడే వృత్తులు కూడా మారుతాయి. అందువల్ల మనస్సు **సవికార ద్రష్ట** అవుతుంది. దాని దృష్టి సవికారదృష్టి అవుతుంది. కాని ఇంతకుముందు చూసినట్టుగా మనస్సులో ఎన్ని ఆలోచనలు మారినా; మనస్సులో ఆలోచనలు ఉన్నా, ఆలోచనలు లేకపోయినా సాక్షి మారదు. అందువల్ల సాక్షి **నిర్వికార ద్రష్ట**.

2. **సాక్షి అప్రయత్నం** – మనస్సు ఒక విషయాన్ని చూడాలంటే ప్రయత్నపూర్వకంగా చూడాలి. ఈ గదిలో ఏమున్నాయి అని అడిగితే, అందులో మనం ఏంచూస్తామో వాటినే చెబుతాము. ఏం చూస్తామో అంటే మనస్సు వేటిమీద పోతుందో వాటినే చూస్తామన్నమాట. అంటే మనస్సుని ప్రయత్నపూర్వకంగా అటు తిప్పాలి. కాని మనస్సును చూసే సాక్షి ఏమీ ప్రయత్నం చేయనవసరం లేదు. ఆ మాటకొస్తే సాక్షిచైతన్యం సాక్షీభూతంగా చూస్తుంది అని పదేపదే వాడుతున్నాము కాని సాక్షి ప్రయత్నపూర్వకంగా చూడదు. ఎందుకంటే సాక్షి అకర్తా, అభోక్తా. సాక్షి సమక్షంలో అన్నీ తెలుస్తాయి. అందువల్ల సాక్షి అప్రయత్నం.

3. **సాక్షి నిత్యం** – మనస్సు సవికార ద్రష్ట. మనసు ప్రయత్నపూర్వకంగా చూడాలి. అది అనిత్యం. దాని పని ఎప్పుడు ఆగుతుంది? సుషుప్తిలో. అందువల్ల మనస్సు దృష్టి అనిత్యం కాని సాక్షి నిత్యం. సాక్షి నిర్వికారద్రష్ట. శూన్యం అనిపించేది మనస్సువల్ల. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును నిరంతరం చూస్తూనే ఉంటుంది సాక్షి. మనస్సు జాగ్రదావస్థలో పూర్తిగా విచ్చుకున్న పువ్వులా, స్వప్నావస్థలో అరవిచ్చిన మొగ్గలా, సుషుప్తిలో ముడుచుకున్న మొగ్గలా ఉంటుంది కాని ఈ మూడు స్థితుల్లోనూ మనస్సును సాక్షిగా చూస్తూనే ఉంటుంది చైతన్యం. అందువల్ల సాక్షి నిత్యం.

కాని మనస్సు జడమయినప్పుడు, మనస్సు ఎలా దృక్ అవుతుంది అనే ప్రశ్న ఉదయించవచ్చు. సాక్షి మనస్సును దృశ్యంగా చూసినప్పుడే మనస్సుకు చేతనత్వాన్ని ఇస్తుంది. అరువు తెచ్చుకున్న చేతనత్వంతో అది ఇంద్రియాలకు చైతన్యం ఇస్తుంది.

దీనికి చాలా ఉదాహరణలు ఉన్నాయి. సూర్యకాంతి ముందు అద్దం పెడితే, ఆ అద్దం సూర్యకాంతిని గోడమీద ప్రతిబింబింప చేస్తుంది. అద్దానికి స్వయంగా కాంతి లేదు. సూర్యుని కాంతిని అరువు తెచ్చుకుంది. సూర్యకాంతి చైతన్యం, అద్దం మనస్సు. అలా మనస్సు చైతన్యాన్ని ప్రతిబింబింప చేస్తుంది. అలా ప్రతిబింబంలా ఏర్పడిన చైతన్యాన్ని చిదాభాస అంటారు. ఆ చిదాభాస చేసే పనులనుబట్టి ప్రమాతా, కర్తా, శ్రోతా అంటాము.కాని సాక్షిచైతన్యం సర్వప్రమాణ అగోచరం. ఈ నేపథ్యంతో మంత్రంలో మిగతా భాగాన్ని చూద్దాము.

**న దృష్టేర్ద్రష్టారం పశ్యేః** – చూపును చూసే సాక్షిని నువ్వు చూడలేవు.

**న శ్రుతేశ్శ్రోతారం శృణుయాః** – శబ్దాన్ని వినే సాక్షిని నువ్వు వినలేవు.

**న మతేర్మంతారం మన్వీథాః** – మనస్సును మననం చేసే సాక్షిని నువ్వు మననం చేయలేవు.

**న విజ్ఞాతేర్విజ్ఞాతారం విజానీయాః** – బుద్ధిని తెలుసుకునే సాక్షిని నువ్వు బుద్ధిద్వారా తెలుసుకోలేవు.

అలా అయితే, సాక్షి ఉన్నట్టు ఎలా తెలుసు? జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థల్లో ఎరుకగా ఉన్నది సాక్షి. నేను నిద్రలేస్తే, మనస్సు నిద్ర లేస్తుంది; మనస్సుద్వారా జాగ్రద్ ప్రపంచాన్ని చూస్తాను; కాని నేను పడుకుంటే మనస్సు కూడా పడుకుంటుంది. జాగ్రత్ మనస్సు వస్తుంది; జాగ్రత్ మనస్సు పోతుంది కాని నాకు **అవస్థాత్రయం**లో జరిగే విషయాలన్నీ తెలుస్తున్నాయి. ఈ మంత్రం సారాంశాన్ని ఒక్కముక్కలో చెప్పాలంటే –
**సర్వమనోవృత్తి సాక్షి ఆత్మ.**

**ఏష త ఆత్మా సర్వాంతరః** – ఈ సాక్షిచైతన్యమే నీలో ఉంది. ఇదే సర్వానికి లోపల ఉన్నది.

**అతోఽన్యదార్తం** – అతః అన్యత్ ఆర్తం – ఈ వాక్యం చాలా ముఖ్యమైనది. అద్వైతానికి ఆయువుపట్టు ఇది. అతః అంటే సాక్షి కానిది; అన్యత్ – తక్కినవన్నీ (మనస్సు, జగత్తు); ఆర్తం – మిథ్య. ఆర్తంకు మూడు అర్థాలు ఉన్నాయి. వినాశి అంటే నాశనమయ్యేది అని ఒక అర్థం. ఆర్తియుక్తం అంటే దుఃఖకారణం అని ఇంకో అర్థం. మిథ్య అని మరో అర్థం. సాక్షి కాని దేనిమీద ఆధారపడినా సంసారి అవుతాము.

అతోఽన్యదార్తం – బ్రహ్మసత్యం, జగనిథ్యా

ఇంచుమించు ప్రతిబ్రాహ్మణమూ బ్రహ్మసత్యం, జగన్మిథ్యా అనే వేదాంత సారంతో ముగుస్తుంది. ఈ విధంగా యాజ్ఞవల్క్యుడు తన బోధను ముగించాడు.

**తతో హెూషస్తశ్చాక్రాయణ ఉపరరామ** – ఈ జవాబు విన్నాక ఉషస్త చాక్రాయణుడు విరమించాడు.

# 3.5. కహోల బ్రాహ్మణము

మంత్రం 3.5.1

**అథ హైనం కహోలః కౌషీతకేయః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యేతి హోవాచ యదేవ సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాన్తరస్తం మే వ్యాచక్ష్వేత్యేష త ఆత్మా సర్వాన్తరః ॥ కతమో యాజ్ఞవల్క్య సర్వాన్తరో యోఽశనాయాపిపాసే శోకం మోహం జరాం మృత్యుమత్యేతి ॥ ఏతం వై తమాత్మానం విదిత్వా బ్రాహ్మణాః పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి యా హ్యేవ పుత్రైషణా సా విత్తైషణా యా విత్తైషణా సాలోకైషణోభే హ్యేతే ఏషణే ఏవ భవతః ॥ తస్మాద్బ్రాహ్మణః పాణ్డిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్। బాల్యం చ పాణ్డిత్యం చ నిర్విద్యాథ మునిరమౌనం చ మౌనం చ నిర్విద్యాథ బ్రాహ్మణస్స బ్రాహ్మణః కేన స్యాద్యేన స్యాత్తేనేదృశ ఏవాతోఽన్యదార్తం తతో హ కహోలః కౌషీతకేయ ఉపరరామ ॥**

ఉషస్తుడు వెళ్ళాక వచ్చిన బ్రాహ్మణుడు కహోలుడు. అతని ఇంకో పేరు కౌషీతకేయుడు. కహోలుడు అడిగాడు కాబట్టి దీన్ని కహోల బ్రాహ్మణము అంటారు. ఇందులో మొదటి నాలుగైదు వాక్యాలు ముందు మంత్రంలో వచ్చినవే. వాటి సారాంశం –

ప్రశ్న – సాక్షాత్ అపరోక్షమైన బ్రహ్మ, సర్వమునకు లోపలనున్న ఆత్మ గురించి చెప్పు.
జవాబు – ఈ నీ ఆత్మయే సర్వమునకు లోపల ఉంది.

ప్రశ్న – ఈ ఆత్మ గురించి చెప్పు.

అంతకుముందు ఇదే పదాలతో సాక్షాత్తు ఇదే సంభాషణ ఉషస్తుకు, యాజ్ఞవల్క్యునికి మధ్య జరిగింది. మళ్ళీ అదే సంభాషణ ఇప్పుడు కూడా కొనసాగుతున్నది. అలా చెపితే పునరుక్తి దోషం రాదా అనే సందేహం రావచ్చు. ఒకే విషయాన్ని మళ్ళీ చెప్పటాన్ని పునరుక్తి దోషం అంటారు. కాని దీన్ని పునరుక్తి దోషంగా తీసుకోకూడదంటున్నారు శంకరులవారు. యాజ్ఞవల్క్యుడు ఆత్మ నిర్వచనం ఇచ్చాడు కాని, కహోలుడు ఇంకా వివరంగా తెలుసుకోవాలనుకున్నాడు.

పైగా ఇంకో కారణం కూడా ఉంది. ఆత్మను సర్వమనోవృత్తి సాక్షిగా అభివర్ణించాడు అంతకుముందు. అక్కడితో ఆగితే అది త్వం పద విచారణ అవుతుంది. కహోలుడు తత్ పద విచారణ, ఐక్యం కూడా కావాలనుకున్నాడు. ఆత్మ గురించి తెలుసుకుంటే చాలదు. ఆత్మ–బ్రహ్మల ఐక్యం తెలుసుకుంటేనే అది సంపూర్ణజ్ఞానం అవుతుంది.

**కతమో యాజ్ఞవల్క్య సర్వాన్తరః–** కహోలుడు ఆత్మ గురించి తెలుసుకోవాలనుకుంటున్నాడు.అందువల్ల ఆత్మ గురించిన ఇంకో నిర్వచనం ఇచ్చాడు యాజ్ఞవల్క్యుడు. **ఆత్మ అసంసారి.**

**యోఽ శనాయాపిపాసే శోకం మోహం జరాం మృత్యుమత్యేతి** – ఏదైతే ఆకలిని, దాహాన్ని, శోకాన్ని, మోహాన్ని, వృద్ధాప్యాన్ని, మృత్యువును అతిక్రమిస్తుందో అది ఆత్మ.

సాక్షి చైతన్యమైన నేను అసంసారిని. అంటే నేను నిత్యముక్త స్వరూపుడిని. ఈ నిత్యముక్తత్వం లేదా అసంసారిత్వం, ఈ కహోల బ్రాహ్మణములో అదనంగా ఇవ్వబడిన నిర్వచనం.

ఆత్మ అసంసారి అంటే సంసారం అంటే ఏమిటి అనే ప్రశ్న ఉదయిస్తుంది వెంటనే! సంసారాన్ని సాగరంతో పోలుస్తారు మామూలుగా.

ఐతరేయోపనిషత్తుకు శంకరభాష్యంలో సంసారవర్ణన చక్కగా వస్తుంది. దాని సారాంశం చూద్దాము – సంసారం ఆది అంతాలు తెలియని మహాసముద్రం; సముద్రంలోని నీరు అజ్ఞానం, కోరిక, కర్మలవల్ల కలిగే దుఃఖం; అందులో భయంకర జలజంతువులు తీవ్రరోగం, వార్ధక్యం, మృత్యువులు; ప్రాపంచిక విషయాల తృష్ణ తుఫానులాగా ఎగసిపడేటంత పెద్ద అలలుగా బుద్ధిని కల్లోలపరుస్తుంది. నరకంలో ఉన్నట్టుగా సంసార సముద్రంలో ఎందరో అవస్థలు పడుతున్నారు. సముద్రఘోషకు ధీటుగా వీరి హాహాకారాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ సంసారసాగరం దాటటానికి మార్గం ఉందా? పెద్ద ఓడల్లో చిన్న లైఫ్‌బోట్లు ఉన్నట్టుగా ఈ మహాసముద్రాన్ని దాటటానికి చిన్న తెప్ప ఉందిట. అది జ్ఞాన తెప్ప. దానికి తెడ్లు సత్యం, ఆర్జవం, దయ, అహింస, శమం, దమం, ధైర్యం. దానికి మార్గం సత్సాంగత్యం, సర్వత్యాగం.

ఇక్కడ అంటే బృహదారణ్యకంలో ఉపనిషత్తే ఆరు సమస్యలను పేర్కొంటున్నది. వీటిని **'షడూర్మి'** అంటారు. ఊర్మి అంటే అల. షడూర్మి అంటే ఆరు అలలు. సంసారం సాగరం అయితే, అందులో లేచే ఆరు రకాల సమస్యలు సాగరంలో పడిలేచే అలలు.

మనం సముద్రపుటొడ్డున నిలుచుంటే, అంతెత్తున ఎగసిపడే అలలు మనను అలవోకగా తాకి వెళ్ళిపోవచ్చు, మన పాదాలను కడిగి వెళ్ళవచ్చు, అప్రమత్తంగా ఉంటే మనను పడేయవచ్చు, లేదా గాలి బలంగా ఉంటే నీటిలోకి లాగేయవచ్చు కూడా! అలాగే సంసారంలో మనం ఎదుర్కొనే సమస్యలు కూడా – దూదిపింజంలా తేలిపోవచ్చు, మనను సుతారంగా తాకి వెళ్ళవచ్చు, మనను కింద పడేయవచ్చు, లేదా వాటిలో ముంచేయ వచ్చు కూడా! ఉపనిషత్తు పేర్కొన్న ఆరు ఆలలు – ఆకలి, దాహం, శోకం, మోహం, వృద్ధాప్యం, మృత్యువు.

**అశనాయః** – ఉదర నిమిత్తం బహుకృతవేషః. ప్రతి రెండు గంటల కొకసారి ఆకలి వేస్తూనే ఉంటుంది. ఆకలి తీరాలంటే, ఆహారం కావాలి; ఆహారం కావాలంటే సంపాదించాలి; సంపాదించాలంటే చదువు ఉండాలి; చదువు కావాలంటే స్కూల్లో చేరాలి; అంటే అతి చిన్న వయస్సునుంచే ఈ ఆకలి బాధలు తప్పవు. ప్రపంచంలో ఆకలి అనేది లేకపోయుంటే అనేక కార్యక్రమాలు జరగనే జరగవు.

ఆకలి తీరటంకోసం ఆహారం తినాలి కాని మనమేం చేస్తాము? అంతుపొంతూ లేకుండా ఆహారం తీసుకుంటాము. అక్కడ్నుంచి అజీర్ణం, గ్యాస్‌ట్రబుల్, ఫుడ్‌పాయిజన్ సమస్యలు చోటు చేసుకుంటాయి.

**పిపాస** – దాహం. దాహం తీర్చుకోవటానికి అనేక కూల్‌డ్రింకులు వచ్చాయి మార్కెట్‌లోకి. కొన్నిచోట్ల నీరు సమృద్ధిగా దొరకదు. అంతేకాదు, ఊరు మారితే, నీరు మారి, నీటివల్ల అనేక రోగాలు వస్తాయి. అందువల్ల పిపాస మహాసంసారానికి ఒక కారణం.

**శోకం** – అంటే మామూలుగా దుఃఖం, కాని శంకరులవారు దాన్ని అతృప్తి అంటున్నారు. ఎన్ని ఉన్నా ఇంకా ఏదో లేదనే కొరత. అతృప్తివల్లనే శోకం వస్తుంది. అది అపూర్ణత్వ భావానికి దారితీస్తుంది. దానివల్ల అనేక సమస్యలు.

**మోహం** – విపరీత ప్రత్యయ ప్రభవోऽ వివేకో భ్రమః – మోహమంటే అవివేకంవల్ల ఏర్పడిన భ్రాంతి. ఎటువంటి అవివేకం? రెండు విషయాల్లో అవివేకం చూపుతున్నాను. నేను పూర్ణుణ్ణి అని తెలియక అపూర్ణబుద్ధితో కొట్టుమిట్టాడుతున్నాను. అది మొదటి అవివేకం.

దానికి జవాబు తెలియకపోవటం రెండో అవివేకం. ఆత్మజ్ఞానం ఒక్కటే నాకు పూర్ణత్వాన్ని ఇస్తుంది అనేది తెలియదు. ఇది తెలియక, అనాత్మలో పూర్ణత్వం వెతుక్కుంటున్నాను. ఒక అనాత్మ పూర్ణత్వం ఇవ్వనప్పుడు, ఇంకో అనాత్మలో పూర్ణత్వం వెతుక్కుంటున్నాను.

**బాలస్తావత్క్రీడాసక్తః, తరుణస్తావత్తరుణీసక్తః।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః, పరమే బ్రహ్మణి కోऽపి న సక్తః॥** భజగోవిందమ్ - 7

బాల్యావస్థలో క్రీడల వెంట, తరుణవయస్సులో స్త్రీ వెంట, వృద్ధాప్యంలో చింతల వెంట పరుగులు తీస్తున్నాము కాని తృప్తి చెందటం లేదు. దానికి మార్గం తెలుసుకోవటం లేదు.

**జరా** – పులిలాగా మనను ఆక్రమించటానికి పొంచి ఉంది వృద్ధాప్యం. శరీరం ముడతలు పడటం, జుట్టు తెల్లబడటంబట్టి వృద్ధాప్యాన్ని గుర్తిస్తాము. ఈ ముడతలను దాచుకోవటానికి, తెల్లజుట్టును కప్పెట్టుకోవటానికి అనేక ప్రయత్నాలు చేస్తాము. అంతేకాదు వృద్ధాప్యంవల్ల అనేక సమస్యలు వస్తాయి. మతిమరుపు అనేది ఒక పెద్ద సమస్య.

**మృత్యువు** – అన్నింటిలోకి అత్యంత భీతికొల్పేది మృత్యువు. మరణభయం; అయినవారికి దూరమవుతామేమోననే బెంగ. కొంతమంది, 'నా మరణం గురించి నాకు భయం లేదు కాని, నా పిల్లలు చాలా చిన్నవారు, వారినెవరు చూస్తారు,' అంటారు.

ఆ విధంగా ఈ ఆరు సమస్యలు మనను సంసారంలో పడేస్తాయి.

అశనాయపిపాసలు – ప్రాణానికి చెందినవి
శోకమోహాలు – మనస్సుకు చెందినవి
జరామృత్యువులు – శరీరానికి చెందినవి

ఆ విధంగా ఈ ఆరూ, మూడు స్థాయిల్లో మనిషిని కుదిపి వేస్తాయి.

**అత్యేతి** – ఆత్మ మాత్రం వీటికి అతీతమైనది. ఈ సమస్యలు ఆత్మకు అంటవు. ఈ ఆరు సమస్యలు అనాత్మకు చెందినవి అంటే **ఉపాధి**కి చెందినవి. ఆత్మ **ఉపహితం**. ఆత్మకు వీటితో సంబంధం లేదు, అది నిత్య, ముక్త ఆత్మ.

ఈ **నిత్య, ముక్త ఆత్మ** వర్ణనను మహావాక్యంగా తీసుకోవచ్చు. ముందు బ్రాహ్మణములో త్వంపద విచారణ చూశాము; ఇప్పుడు తత్ పద ఐక్యం లేదా మహావాక్యాన్ని చూస్తున్నాము.

ఈ బ్రాహ్మణములో ఇంకో అంశాన్ని కూడా చూస్తాము.

ఈ ముఖ్యమైన భాగంలో, మోక్షానికి రెండు మార్గాలు సూచించ బడ్డాయి.

1. ప్రాథమిక సాధన – ఆత్మజ్ఞానం
2. సహకారీ సాధన – సన్న్యాసం

**ఏతం వై తమాత్మానం విదిత్వా** – ముందు ఆత్మ గురించిన కొంత అవగాహన ఉండాలి. దీన్ని ఆపాదాన జ్ఞానం లేదా పరోక్షజ్ఞానం అంటారు. ఒకవేళ నేను అణువుమీద పరిశోధన జరపాలనుకుంటే, ముందు నాకు అణువు గురించి కనీస జ్ఞానం ఉండాలి – అణువు అంటే ఏమిటి, దాన్ని ఎలా తెలుసుకోవాలి, ఏ పరికరం వాడాలి వంటి విషయాలు.

అలా ఆత్మ గురించి తెలుసుకోవాలంటే ఆత్మ గురించి బోధించే ఉపనిషత్తు ఉందని తెలియాలి. అది వేదాధ్యయనం చేసిన వ్యక్తికే తెలుస్తుంది. వేదాలు తెలియని వ్యక్తికి ఆత్మ లేదా బ్రహ్మ అనేది ఉందనే తెలియదు. వేదాధ్యయనం చేస్తే, అది జగత్కారణం ఒకటి ఉందనీ, దాన్ని బ్రహ్మ అంటారనీ చెబుతుంది. అంతేకాదు, అదే వేదం బ్రహ్మను తెలుసుకున్న వ్యక్తి మోక్షం పొందుతాడు అంటుంది.

**బ్రహ్మవిదా ఆప్నోతి పరం** – తైత్తిరీయం

వేద పూర్వభాగం అధ్యయనం చేయటంవల్ల కర్మకాండ తెలుస్తుంది; వేద అంతభాగం అధ్యయనం చేయటం వల్ల జ్ఞానకాండ అర్థమవుతుంది. వేద అధ్యయనంలో భాగంగా సంస్కృతం, మీమాంసవంటి వేద అంగాలు కూడా నేర్చుకుంటారు. ఆ విధంగా బ్రహ్మచారిగా కర్మకాండ గురించి నేర్చుకుని చిత్తశుద్ధి పొందుతారు. దాని తర్వాత బ్రహ్మజ్ఞానం పొందాలంటే సన్న్యాసాశ్రమం స్వీకరిస్తారు.

బ్రహ్మచారిగా గురుకులంలో ఉన్నప్పుడు, నాలుగు పురుషార్థాలు ఉన్నాయని నేర్చుకుంటారు – ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. ధర్మ అర్థ కామాలు కావాలంటే కర్మ చేయాలి. మోక్షం కావాలంటే జ్ఞానమొక్కటే మార్గం. బ్రహ్మచారి తనకు ఏం కావాలో తేల్చుకోవాలి. ధర్మార్థ కామాలకోసం వెంపర్లాడితే అది **అనాత్మ కోరిక** కిందకి వస్తుంది. ఈ అనాత్మ కోరికను మూడుగా విభజించింది ఉపనిషత్తు.

**బ్రాహ్మణాః పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి** – ఈ (ఆత్మను తెలుసుకుని) బ్రాహ్మణులు పుత్రైషణ, విత్తైషణ, లోకైషణలకు అతీతంగా ఎదిగి, తర్వాత భిక్షాటన చేస్తారు.

ఏషణ అంటే కోరిక, ఇచ్ఛా, కామం – ఏదైనా చెప్పవచ్చు. ఇవి మూడు కోరికలు అని చెబుతున్నది ఉపనిషత్తు.

పుత్రైషణ – పిల్లలు పుట్టాలనే కోరిక

విత్తైషణ – ఐశ్వర్యం కావాలనే కోరిక

లోకైషణ – పుణ్యలోకాలకు వెళ్ళాలనే కోరిక

వైరాగ్యం వచ్చినవారు ఈ కోరికలకు అతీతంగా ఎదుగుతారు.

అథ భిక్షాచర్యం చరంతి – దాని తర్వాత భిక్షాటన చేసి జీవిస్తారు. అంటే సన్న్యాసులు అవుతారు. అటువంటి సన్న్యాసులను పరమహంస పరివ్రాజకులంటారు. వారు నిత్యానిత్య వస్తువివేకం చేసి, ఆత్మవల్లనే మోక్షం వస్తుంది, అనాత్మవల్ల రాదు అని తెలుసుకుంటారు. అందువల్ల సర్వసంగపరిత్యాగం చేసి, సన్న్యాసం స్వీకరిస్తారు.

తర్వాత ఉపనిషత్తు ఈ కోరికలను మూడుగా విభజించినా, మూడూ ఒకటే అంటుంది మళ్ళీ. ఎందుకంటే అన్నీ కోరిక కిందకే వస్తాయి.

**యా హ్యేవ పుత్రైషణా సా విత్తైషణా** – ఏదైతే పుత్రైషణయో అదియే విత్తైషణ.

**యా విత్తైషణా సా లోకైషణా** – ఏదైతే విత్తైషణయో అదియే లోకైషణ. ఎందుకు?

**ఏషణే ఏవ భవతః** – అన్నీ కోరికల కిందకే వస్తాయి. అనాత్మమీద కోరిక. కోరుకునే వస్తువు మారుతుంది, కాని కోరిక అనే సత్యం మారదు. అందరిలోనూ కోరిక సమానంగా ఉంటుంది. కోరిక లేనివారు అంటూ ఉండరు. కాకపోతే కొందరు డబ్బుకోసం వెంపర్లాడితే కొందరు పుత్రులకోసం పాకులాడుతారు; మరికొందరు లోకాల కోసం తాపత్రయ పడతారు. అందరిదీ కోరికే! వస్తుభేదం ఉంటుంది, స్థాయీభేదం ఉంటుంది కాని కోరిక కోరికే! అందరూ అపూర్ణత్వంతో బాధపడుతున్నారు.

కాని ఇక్కడ ఉపనిషత్తు ఒక ఆటాడిస్తున్నది మనను. ముందు మూడు కోరికలను చెప్పింది, తర్వాత కోరిక పరంగా మూడూ ఒకటే అంది. అంతవరకూ బాగానే వుంది. కాని ఇప్పుడు ఈ రెండూ ఒకటే అంటున్నది.

**ఉభే హ్యేతే** – ఈ రెండు కోరికలూ. మూడు కోరికలు వివరించి, మూడింటి లోనూ సమానంగా కోరిక (ఏషణ) పదం ఉంది కాబట్టి మూడూ ఒకటే అని సమర్థించి, ఇప్పుడేమో రెండు ఏషణాలు అంటున్నది.

$$3 = 1 = 2$$

అదెలా సాధ్యం? ఇది అర్థం కావాలంటే మొదటి అధ్యాయంలోని ఐదవ బ్రాహ్మణములోకి తొంగి చూడాలి ఒకసారి.

> **సోఽయం మనుష్యలోకః పుత్రేణైవ జయ్యో**
> **నాన్యేన కర్మణా కర్మణా పితృలోకో విద్యయా దేవలోకః**– సప్తాన్న బ్రాహ్మణము – 1.5.16

పుత్రునివల్ల భూలోకం; కర్మవల్ల పితృలోకం; ఉపాసనవల్ల బ్రహ్మ లోకం పొందుతారు అని ఈ మంత్రం అర్థం. ఈ మంత్రంలో విద్య అంటే ఉపాసన. పుత్రులు ఉన్నవారు తిరిగి ఈ లోకంలోనే పుడతారు అంటే

పుత్రుడు సాధనం, మనుష్యలోకం సాధ్యం. అలా ఇక్కడ మనకు మూడు సాధనాలు, మూడు సాధ్యాలు ఉన్నాయి. భూలోకం, పితృలోకం, బ్రహ్మలోకాలు సాధ్యాలకింద వస్తాయి. కోరుకున్న లక్ష్యాలు అవి. అవి పొందటానికి చేసే సాధనలు పుత్రులను కనటం, కర్మ చేయటం, ఉపాసన చేయటం. చాలామందికి ఈ మూడు సాధన–సాధ్యాలమీద కోరిక ఉంటుంది అంటున్నది ఉపనిషత్తు.

కోరిక తీరే తతంగం ఏమిటి? దాన్ని విశ్లేషిస్తే అద్భుతంగా ఉంటుంది. ముందు ఎవరికైనా సాధ్యంమీద కోరిక ఉంటుంది. అంటే ఒక లక్ష్యం ఉంటుంది. ఉదాహరణకు మీరు టీవీ కొనాలనుకున్నారనుకోండి, టీవీ **సాధ్యం** అవుతుంది. అది కొనటానికి అవసరమైనంత డబ్బు కావాలి. అందువల్ల డబ్బు **సాధన** అవుతుంది.

ఇప్పుడేమయింది? మీ దృష్టి సాధ్యం మీంచి సాధనమీదకు మారింది. దానికి తగ్గ డబ్బు సంపాదించాలనే తపన బయలుదేరుతుంది. అలా ప్రతి మనిషికీ సాధన ఇచ్ఛ, సాధ్య ఇచ్ఛ ఉంటుంది. అంటే రెండు ఇచ్ఛలు (ఏషణ) చూశాము. సాధన ఇచ్ఛ, సాధ్య ఇచ్ఛ. ఇప్పుడు ఈ రెండింటినీ కహోల బ్రాహ్మణములో చెప్పిన మూడు ఏషణాలతో కలపాలి. అంటే సప్తాన్న బ్రాహ్మణాన్ని, కహోల బ్రాహ్మణాన్ని కలిపి అర్థం చేసుకోవాలి. ఇక్కడ మూడు ఏషణులు చూశాము కదా.

పుత్రైషణ – సాధన 1
విత్తైషణ – సాధన 2, 3
(కర్మ + ఉపాసన)

అలా ఈ రెండూ కలిపి ఒక సాధన అయింది.

లోకైషణ – సాధ్యం 1, 2, 3
(మనుష్యలోకం, పితృలోకం, బ్రహ్మలోకం)

ఆ విధంగా ఇక్కడి మూడు కోరికలను సాధన, సాధ్య ఇచ్ఛలుగా విడదీశాము. అలా అవి రెండు అయ్యాయి.

| | |
|---|---|
| అక్కడ మూడు సాధనలు | – పుత్రులు + కర్మ + ఉపాసన |
| ఇక్కడ అవి రెండు సాధనలు | – పుత్రైషణ + విత్తైషణ |
| అక్కడ మూడు సాధ్యాలు | – మనుష్యలోకం+పితృలోకం+బ్రహ్మలోకం |
| ఇక్కడ అది ఒక సాధ్యం | – లోకైషణ |

అలా 3=2 అయింది. మూడు కోరికలూ, సాధన, సాధ్య ఇచ్ఛలుగా మారాయి కాబట్టి ఉభేహ్యేతే అంటే ఈ రెండు సాధన సాధ్యాలు కూడా ఒకటే! **ఏషణే ఏవ భవత** – ఒకటే. ఏదైనా అనాత్మ కోరిక అనే అంశం కిందకి వస్తుంది.

అలా 3 = 2 = 1 అయింది.

సాధన సాధ్య ఇచ్ఛలను ఒక్కొక్కటిగా తీసుకుంటే అవి ఆరవుతాయి. కోరికలు ఆరయినా, మూడయినా, రెండయినా, ఒకటయినా వివేకిని బాధించవు. ఇక్కడ ఉపనిషత్తు రెండుగా చెప్పింది కాబట్టి, రెండు తీసుకుందాము. వివేకికి సాధన ఇచ్ఛ కాని, సాధ్య ఇచ్ఛ కాని ఉండవు. అదంతా అనాత్మ కిందకి వస్తుంది అతనికి. ఆత్మమీద మాత్రమే కోరిక ఉంటుంది. ఆత్మ సాధనా, సాధ్యమా? రెండూ కాదు. ఆత్మ సిద్ధవస్తువు.

జ్ఞాని జ్ఞానంకోసమే పాటుపడతాడు. అతనికి - పుత్రునిమీద కోరిక లేదు అంటే భార్యమీద కూడా కోరిక లేదు. విత్తంమీద కోరిక లేదు అంటే కర్మలమీద కూడా కోరిక లేదు. లోకంమీద కోరిక లేదు అంటే అశాశ్వత పుణ్యఫలాలమీద కోరిక లేదు.

ఇవన్నీ గృహస్థాశ్రమానికి చెందినవి. అందువల్ల అతను గృహస్థాశ్రమాన్ని ఎన్నుకోకుండా, సన్న్యాసం స్వీకరిస్తాడు అని శంకరులవారు అంటున్నారు. సన్న్యాసం స్వీకరిస్తే మోక్షం వస్తుందా? సన్న్యాసం సాక్షాత్తూ మోక్ష సాధన కాదు; సన్న్యాసం సహకారీ సాధన. దాన్ని జ్ఞాన అంగం అంటారు; సన్న్యాసి కూడా జ్ఞాన సాధన చేయాలి. అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి (వీటి గురించి రెండవ అధ్యాయంలో వివరంగా వచ్చింది). అది మంత్రంలో తర్వాత భాగంలో వస్తుంది. కాని ఇక్కడ కూడా శ్రవణ, మనన, నిదిధ్యాసనలను ప్రత్యక్షంగా పేర్కొనదు ఉపనిషత్తు. వాటికి వేరే పేర్లు ఇస్తుంది. అందువల్లనే ఉపనిషత్తును మనంతట మనం చదవకూడదు అంటారు. స్వామీజీ ఎప్పుడూ చెబుతారు శంకరులవారి భాష్యం లేకపోతే మనకు ఇలాంటి చోట అర్థమయ్యేది కాదు అని. స్వామీజీ శంకరులవారు చెప్పింది మనకు యథాతథంగా విడమరచి చెప్పకపోతే మనకు కూడా అర్థం కాదు (మీరు కూడా స్వామీజీ ప్రసంగం సి.డి.ద్వారా వింటే స్వామీజీ బోధను ఆస్వాదిస్తారు).

ఉపనిషత్తు ఇచ్చిన పేర్లేమిటి? శ్రవణానికి **పాండిత్యం**; మననానికి **బాల్యం**; నిదిధ్యాసనానికి **మౌనం**.

**తస్మాద్బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య** - శ్రవణం చేసి జ్ఞానం పొందుతాడు. శ్రవణాన్ని పాండిత్యంతో పోల్చింది. పాండిత్యం అంటే ఆత్మజ్ఞానం అని అర్థం.

**బాల్యేన తిష్ఠాసేత్** - ఒక బాలునికి రాగద్వేషాలు ఉండవు. అతనిది పాల మనస్సు అంటారు. అంటే పాలలాగా స్వచ్ఛమైన మనస్సు ఉంటుంది. కక్షలు, కావేషాలు, కుతంత్రాలు ఉండవు. ఈ అర్థాన్ని వేరే సందర్భంలో చూస్తాము. ఇక్కడ బాల్యం అంటే దార్ఢ్యం లేదా బలం. ఇక్కడ జ్ఞానబలం. అంటే తను పొందిన జ్ఞానాన్ని నిశ్చయజ్ఞానంగా తీర్చి దిద్దుకోవాలి. అది నిస్సంశయ జ్ఞానం అవాలి. అందులో సందేహాలకు తావు ఉండకూడదు. అహం బ్రహ్మ అస్మి అని దృఢంగా తెలుసుకోవాలి. ఈ దృఢీకరణాన్ని బాల్యం అంది ఉపనిషత్తు.

**బాల్యం చ పాండిత్యం చ నిర్విద్యాథ మునిః** - ముని అంటే మౌనంగా ఉండటం. అంటే వేదాంతం గురించి తప్ప వేరే ఏ విషయమూ ఆలోచించక పోవటం. అతనికి వేరే ఏ బాధ్యతలూ, ఏ బాదరబందీలు ఉండవు. ఇరవై నాలుగు గంటలూ బ్రహ్మనిష్ఠలోనే ఉంటాడు. మౌనం అంటే నిదిధ్యాసనం. నిదిధ్యాసనానికి ఇంకో పేరు బ్రహ్మాభ్యాస.

**అమౌనం చ మౌనం చ నిర్విద్యాథ బ్రహ్మణః** - ప్రతి ఒక్కరూ శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి బ్రహ్మనిష్ఠలో ఉండాలి. ఎవరైతే అలా బ్రహ్మనిష్ఠలో ఉంటారో అతనినే బ్రాహ్మణుడు అంటారు అని ఉపనిషత్తు చెబుతున్నది.

మౌనం అంటే నిదిధ్యాసనం అని చూశాము. అందువల్ల అమౌనం అంటే శ్రవణ, మననాలు. ఎవరైతే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి బ్రహ్మనిష్ఠలో ఉంటారో అప్పుడు అతన్ని బ్రాహ్మణుడు అంటారు.

తక్కినవారు బ్రాహ్మణులు కారా? వారిని అముఖ్య బ్రాహ్మణులు అంటారు. బ్రహ్మజ్ఞానం పొందినవారినే బ్రాహ్మణులు అంటారు.

వజ్రసూచికోపనిషత్తు అని ఒక ఉపనిషత్తు ఉంది. ఆ ఉపనిషత్తు కః బ్రాహ్మణః అని మొదలు పెడుతుంది. ఇదికాదు, ఇదికాదు అని అనేక అంగాలను త్రోసిపుచ్చుతూ చివరికి బ్రహ్మజ్ఞాని మాత్రమే నిజమైన బ్రాహ్మణుడు అని ముగిస్తుంది.

**స బ్రాహ్మణః కేన స్యాత్** – అటువంటి బ్రాహ్మణుడు ఎలా ప్రవర్తిస్తాడు? ఇంకోవిధంగా చెప్పాలంటే స్థితప్రజ్ఞుని లక్షణాలు ఏమిటి? ఇక్కడ ఒక్క ముక్కలో జవాబు చెబుతాడు యాజ్ఞవల్క్యుడు. దీన్నే వివరంగా అనేక శ్లోకాలతో వివరిస్తాడు కృష్ణపరమాత్ముడు.

**యేన స్యాత్తేనేదృశ ఏవ** – ఏనస్యాత్ అంటే ఎటువంటి జీవితం కావాలంటే అటువంటి జీవితం గడపవచ్చు. అతను ఎవరు? ఈదృశ్య ఏవ – శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసినవాడు. అంటే బ్రహ్మనిష్ఠ ఉన్న వ్యక్తి లేదా స్థితప్రజ్ఞుడు. అతనికి విధినిషేధాలు వర్తించవు. వీటిని యమ, నియమాలు అంటారు.

అతనికి యమ నియమాలు ఉండవు, ఎలాగన్నా ప్రవర్తించవచ్చు అనే అర్థం వస్తుంది. దీన్ని అందరూ తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. అలా శాస్త్రాన్ని తప్పుగా అర్థం చేసుకుంటారేమోననే సందేహం ఉన్న చోటల్లా శంకరులవారు దాన్ని వివరంగా చర్చిస్తారు. ఇక్కడ కూడా అలాగే చేస్తున్నారు. మామూలుగా ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించేవారిని యథేష్టాచారి అంటారు. అతను ఇష్టం వచ్చినట్లు తిరుగుతాడు, మాట్లాడతాడు, తింటాడు. కాని జ్ఞాని అలా చేయకూడదు. జ్ఞాని అని ఎవరిని అంది? శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి బ్రహ్మనిష్ఠలో ఉన్న వ్యక్తిని. అదేదీ చేయకుండా నేను జ్ఞానిని, నేను యమనియమాలు పాటించను అని అక్రమాలు చేయకూడదు ఎవరూ కూడా. అది చెడు ప్రవర్తన, చెడు ప్రభావం కూడా.

అతని మేరకు అది చెడు ప్రవర్తన అవుతుంది. అంతేకాదు అతను జ్ఞాని పేరుతో యథేష్టాచారిగా వ్యవహరిస్తే, అది సమాజంమీద చెడు ప్రభావానికి దారితీస్తుంది. అలా జ్ఞానినని విర్రవీగుతూ, తన ఇష్టం వచ్చినట్టు ఎవరైనా ఒకవేళ ప్రవర్తిస్తే అతనికీ, వీధికుక్కకూ ఏమీ తేడా లేదంటున్నారు సురేశ్వరాచార్యులు.

జ్ఞానికి విధినిషేధాలు వర్తించవు అనే మాటను జ్ఞానికి ప్రశంసగా తీసుకోవాలి కాని, జ్ఞానిని యథేచ్ఛగా సంచరించమని కాదని శంకరులవారు చెబుతున్నారు. యథేచ్ఛగా తిరగవచ్చుని, ఇష్టం వచ్చినట్టు తిరగవచ్చు అని ఎందుకు అంది?

జ్ఞానం వచ్చేవరకు, ఎవరైనా యమ, నియమాలను పాటించాలి. తన జీవితాన్ని సక్రమ మార్గంలో గడపటానికి, తన జీవితాన్ని అదుపులో పెట్టుకోవటానికి యమ, నియమాలు పాటించాలి. జ్ఞానం వచ్చాక విధినిషేధాలను పాటించనవసరం లేదంటుంది. ఎందుకంటే ఆ జ్ఞానమే జ్ఞానిని నడిపిస్తుందనే భరోసా ఉంది శాస్త్రానికి.

ధర్మబద్ధమైన జీవితం నడపటానికి ఏ విధి నిషేధాలు ఇంతవరకూ అతనికి ఎలా తోడ్పడ్డాయో, వాటి పని ఇప్పుడు జ్ఞానమే చేస్తుంది. అంతకు ముందు శాస్త్రం అతన్ని ధర్మబద్ధమైన జీవితం నడిపేలా చేస్తే, ఇప్పుడు శాస్త్రజ్ఞానం దానికి తోడ్పడుతుంది. అంతకుముందు అతనికి ప్రేరణ బాహ్యంగా ఉంటే, ఇప్పుడు ప్రేరణ అంతర్గతంగా ఉంటుంది; అంతకు ముందు ప్రయత్నపూర్వకంగా మంచి జీవితాన్ని నడిపితే, ఇప్పుడు అప్రయత్నంగా మంచి జీవితాన్ని నడుపుతాడు.

ఒక సంగీత విద్వాంసుడు సంగీతం నేర్చుకునే మొదట్లో తంబూరను వాడుతాడు. తంబూరద్వారా శ్రుతి చేసుకుంటాడు. కాని సంగీతమే జీవన పరమావధిగా చేసుకుని ఎప్పుడూ సంగీతధ్యాసలో ఉండటం మొదలు పెడితే అతను శ్రుతి చేసుకోవటానికి తంబూర అవసరం లేదు. అంటే బాహ్యప్రేరణ అవసరం లేదు; ప్రేరణ అంతర్గతంగా ఉంటుంది; అంతకు ముందు ప్రయత్నపూర్వకంగా శ్రుతి చేసుకుంటే, ఇప్పుడు అప్రయత్నంగా శ్రుతి చేసుకుంటాడు.

నిజమైన జ్ఞాని విధినిషేధాలను మీరి ప్రవర్తించలేడు. అందువల్ల అతను ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించటానికి ఆస్కారం లేదు. అజ్ఞానస్థితిలో శాస్త్రం కాపుకాస్తే, జ్ఞానస్థితిలో జ్ఞానం అడ్డు పడుతుంది.

**అతోఽన్యదార్తం** – బ్రహ్మ కానిది ఏదైనా మిథ్యయే. ఇదే వాక్యాన్ని నాల్గవ బ్రాహ్మణములో కూడా చూశాము. ఆర్తంకు మూడు అర్థాలున్నాయని కూడా చూశాము – అవి వినాశి, దుఃఖకారణం, మిథ్య. మిథ్య అర్థం తీసుకుంటాము ఇక్కడ. మళ్ళీ వేదాంతసారం వస్తుంది –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఈ ఉపనిషత్తులో అనేకచోట్ల ఈ అర్థం వస్తుంది. ఇంత స్పష్టంగా ఈ వాక్యం రాకపోయినా, శంకరులవారు బ్రహ్మసత్యం, జగన్మిథ్యా చెప్పాల్సి వచ్చినప్పుడల్లా ఈ వాక్యం చెబుతారు.

**అతోఽన్యదార్తమ్**

ఇంకోటి ఆయనకు ఇష్టమైనది –

**వాచాఽఽరంభణం వికారో నామధేయం – ఛాందోగ్యం**

**తతో హ కహోలః కౌషీతకేయ ఉపరరామ** – అప్పుడు యాజ్ఞవల్క్యుని జవాబుతో తృప్తిపడిన కహోల కౌషీతకేయుడు వెనుతిరిగాడు.

# సన్న్యాస విధి భాష్యం - 2

ఇక్కడ కూడా అదే సమస్య! గృహస్థాశ్రమంలో మోక్షం వస్తుందా, సన్న్యాసాశ్రమంలో మోక్షం వస్తుందా అని ప్రశ్న వేస్తున్నప్పుడు మనం దేనికి ప్రాముఖ్యతనిస్తున్నాము? **ఆశ్రమానికి**. మోక్షం పొందాలంటే **ఆశ్రమం** ముఖ్యమైన అంశం అనే అపోహవల్ల ఏర్పడింది ఈ ప్రశ్న. శాస్త్రం జ్ఞానం పొందటానికి రెండు అంశాలు ఉన్నాయని చెబుతుంది.

1. జ్ఞానం - సాక్షాత్ సాధన
2. సాధన చతుష్టయ సంపత్తి - సహకారీ సాధన

బ్రహ్మసూత్రాల్లో మొట్టమొదటి సూత్రమే దీన్ని వివరంగా చర్చిస్తుంది.

**అథాతో బ్రహ్మ జిజ్ఞాసా**

అథ అంటే సాధనచతుష్టయసంపత్తి పొందాక, జ్ఞానమార్గానికి రావాలి. జ్ఞానమార్గం అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయటం.

అందువల్ల మోక్షం పొందటానికి సహకారీ సాధన ఏమిటి? సాధనచతుష్టయసంపత్తి పొందటం. అంతేకాని ఏ ఆశ్రమం అన్నది ముఖ్యం కాదు. సాధనచతుష్టయసంపత్తిని పొందటానికి సన్న్యాసాశ్రమం మరింత సానుకూలంగా ఉంటుంది అంతే.

సామాన్య సూత్రం - సన్న్యాసాశ్రమం దీనికి అనువైనది.

దీనికి రెండు అసామాన్యాలు ఉన్నాయి.

1. సన్న్యాసిగా ఉండి, సాధన చతుష్టయసంపన్నుడు కాకపోవచ్చు.
2. గృహస్థు అయి కూడా సాధన చతుష్టయసంపన్నుడు అవచ్చు.

గీత అసామాన్య సూత్రం చెబుతున్నది.
ఉపనిషత్తు సామాన్య సూత్రం చెబుతున్నది.

శంకరులవారు **సన్న్యాస సహిత జ్ఞానం మోక్షకారణం** అని చెబుతున్నారు. సామాన్యసూత్రం సన్న్యాసం జ్ఞానం పొందటానికి అనువుగా ఉంటుంది; అసామాన్యసూత్రం గృహస్థాశ్రమంలో ఉండి కూడ, సాధన చతుష్టయసంపత్తి పొంది, జ్ఞానం పొందవచ్చు.

సాధన చతుష్టయ సంపత్తిలో నాలుగు అంశాలు ఉంటాయి. అవి - వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాది షట్కసంపత్తి. మొదటి మూడూ పొందటానికి గృహస్థాశ్రమం అనువైనది. నిజానికి గృహస్థాశ్రమమే లోకాన్ని పరీక్షించటానికి, అనుభవం పొందటానికి, దాన్నుంచి పరిపక్వత చెందటానికి, తర్వాత వైరాగ్యం

రావటానికి అనువుగా ఉంటుంది. నిత్యానిత్యవస్తువివేకం గృహస్థాశ్రమంలోనే చేయగలము.

కాని సాధనచతుష్టయసంపత్తిలో నాలుగవ అంశం ఉంది. అది శమాదిషట్కసంపత్తి. అంటే శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము. ఈ లక్షణాలు అలవరచుకోవాలి. మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించుకోవాలన్నా, ఏకాగ్రత చూపాలన్నా దానికి అంతర్ముఖంగా మారాలి. మనస్సు విశ్రాంతి చెందాలి. మనకేమో ఎంతసేపూ బాహ్యంగా పరుగులు తీయటం అలవాటు. పైగా దేవుడే మన ఇంద్రియాలను అలా బహిర్ముఖంగా చేశాడని చెబుతాము. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలంటే మనస్సును ప్రశాంతంగా, అంతర్ముఖంగా చేయాలి. ఎక్కువ సమయం దానికి కేటాయించాలి. ఈ విషయాలు పాటించటానికి సన్న్యాసాశ్రమం చక్కగా సరిపోతుంది.

గృహస్థాశ్రమంలో బాధ్యతలు, వ్యవహారాలు ఎక్కువ ఉంటాయి. బాధ్యత ఉన్నచోట బెంగ, ఒత్తిడి ఉంటాయి. బాధ్యత ఉన్నచోట బాహ్యముఖంగా ఉండాలి. ఎక్కువ సమయాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు కేటాయించలేము. నేర్చుకోవాలన్న తపన ఉన్నా, పూర్తి ఏకాగ్రత కుదరదు. కాలం వెంట పరుగులు తీయాలి. సన్న్యాసాశ్రమంలో అలాంటి పరుగులు ఉండవు.

అందువల్ల సాధనచతుష్టయసంపన్నులవటానికి, ముఖ్యంగా శమాది షట్కసంపత్తిని పెంపొందించుకోవటానికి సన్న్యాసాశ్రమం అనువైనదని శంకరులవారు చెబుతారు. కాని ప్రతిసామాన్య సూత్రానికి ఒక అసామాన్య అంశం ఉన్నట్టే ఇక్కడ కూడా ఉంది భగవద్గీతలో జనకునివంటి గృహస్థుణ్ణి చూస్తాము.

జనకుణ్ణి రాజర్షి అంటారు. ఆయన తన రాజసౌధం కాలిపోతున్నదని ఎవరో వచ్చి చెప్పినా చలించలేదు. మొత్తం మిథిలా నగరమే కాలిపోయినా తను చెక్కు చెదరనన్నాడు. అటువంటి మానసిక వైరాగ్యం పెంపొందించుకో గలిగితే ఏ ఆశ్రమంలో ఉన్నా ఫర్వాలేదు. అలా ఉపనిషత్తులో సామాన్య సూత్రాన్ని చూస్తే, భగవద్గీతలో అసామాన్య సూత్రాన్ని చూస్తాము.

ఇప్పుడు దీనిమీద పూర్వపక్షి చేసిన వాదోపవాదాలు చూద్దాము. పూర్వపక్షి అంటే వేదపూర్వభాగాన్ని నమ్ముతాడు; కర్మకాండకు ప్రాధాన్యం ఇస్తాడు.

**పూర్వపక్షి వాదన 1: ఏతం వై తమాత్మానం విదిత్వా –** ఈ వాక్యాన్ని అర్థవాదం వాక్యంగా తీసుకోవాలి అంటాడు అతను.

విధివాక్యం అంటే చేసితీరాలి, లేదా ఆజ్ఞావాక్యం అని చూశాము. అర్థవాదం అంటే ఒక విషయాన్ని పొగిడే వాక్యం. (ఈ వాక్యాల గురించి మొదట్లో చూశాము). అర్థవాదవాక్యం విడిగా ఉండలేదు. అది విధివాక్యంతో కలిసి ఉండాలి. అందువల్ల అర్థవాదవాక్యాన్ని పెద్దగా పట్టించుకోనవసరం లేదు.

పూర్వపక్షి ఇది అర్థవాద వాక్యం కాబట్టి దీన్ని పట్టించుకోనవసరం లేదు అంటాడు. అందువల్ల **భిక్షాచర్యం చరంతి** వాక్యానికి సన్న్యాసాశ్రమం తీసుకోవాలి అనే అర్థం నిజంగా తీసుకోనవసరం లేదు అంటాడు. గృహస్థాశ్రమంలో భిక్ష తీసుకోకూడదు. భిక్ష ఇవ్వాలి సన్న్యాసులకు. అందువల్ల భిక్ష సన్న్యాసాశ్రమానికి వర్తిస్తుంది. కాని పూర్వపక్షి దీన్ని విధివాక్యంగా తీసుకోకూడదు, అర్థవాదంగా పరిగణించవచ్చు అంటాడు.

**శంకరులవారి జవాబు**: ఈ వాదనను శంకరులవారు ఒప్పుకోరు. విధివాక్యం ముఖ్యమైన వాక్యం; అర్థవాదం విధివాక్యంమీద ఆధారపడి ఉంటుంది.

విధిశేషః అర్థవాదః

ఇదీ సూత్రం. కాని వేదాంతంలో వాక్యాలన్నీ విధివాక్యాలుగానే తీసుకోవాలి. వేదాంతం ప్రాథమికంగా బోధించేది జ్ఞానం. అందువల్ల జ్ఞానానికి సంబంధించిన వాక్యాలన్నిటినీ విధివాక్యాలుగా తీసుకోవాలి తప్ప అర్థవాదంగా తీసుకోకూడదు అంటారు శంకరులవారు.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః**
**తరతి శోకమాత్మవిత్**

**పూర్వపక్షి వాదన 2:** జ్ఞానం భాగం వరకూ అది విధివాక్యమే ఒప్పు కుంటాను కాని సన్న్యాసం గురించి చెప్పిన భాగం అర్థవాదం అంటాడు పూర్వపక్షి. జ్ఞానం భాగం విధి, సన్న్యాస భాగం అర్థవాదం అంటాడు.

**జ్ఞానే విధిః అస్తు సన్న్యాసే విధిః నాస్తి**

**శంకరులవారి జవాబు**: దీన్ని శంకరులవారు మీమాంస సూత్రంతో ఖండిస్తున్నారు. ఒకే వాక్యంలో ఒక భాగాన్ని విధిగాను, ఇంకో భాగాన్ని అర్థవాదంగానూ పరిగణించలేము. దీన్ని నిరూపిస్తూ మీమాంస శాస్త్రంలోంచే ఒక ఉదాహరణ ఇస్తారు.

**అభిషిత్వా హుత్వా భక్షయంతి**

సోమరసాన్ని తీసాక, హోమం చేసాక, మిగిలిన సోమరసాన్ని తాగాలి. ఇదీ ఈ వాక్యం అర్థం. ఇక్కడ విధి భక్షయంతికి వస్తుంది. సోమరసం తాగాలి – సోమరసం తీశాక, హోమం చేశాక భాగాల్లో విధి క్రియ లేదు. వ్యాకరణపరంగా చూస్తే, ఈ మూడు క్రియలూ ఒకటే వ్యక్తి చేయాలి. అంటే సోమరసం తీసే వ్యక్తి, హోమం చేసే వ్యక్తి, తాగే వ్యక్తి ముగ్గురూ ఒకరే! ఇది సూత్రం ఒకటి.

అలా మూడు పనులూ ఒకరే చేసేటప్పుడు, ఒక క్రియకు ఆజ్ఞాపదం వస్తే, తక్కిన రెండు క్రియలకు కూడా వాటిని అన్వయించుకోవాలి. విధి సోమరసం తాగటానికి మాత్రమే కాదు; సోమరసం తీయటానికి, హోమం చేయటానికి కూడా వర్తిస్తుంది.

ఈ సూత్రాన్ని మన వాక్యానికి అన్వయించి చూద్దాము. ఆత్మ గురించి తెలుసుకుని, భిక్షాచర్యం చేయాలి. ఇది వాక్యం. ఆత్మ గురించి తెలుసుకునేదీ, సన్న్యాసం స్వీకరించేదీ ఒకరే. అందువల్ల మొదటి సూత్రం వర్తిస్తుంది. విదిత్వా విధివాక్యం అయితే, చరంతిని కూడా విధివాక్యంగా తీసుకోవాలి.

**పూర్వపక్షి వాదన 3**: సంస్కృతభాషలో విధి వాక్యాలకు ప్రత్యేకమైన క్రియలు ఉంటాయి. వర్తమానకాలంలో ఉంటే అది విధి వాక్యం అవదు. **చరంతి** వర్తమానకాలంలోకి వస్తుంది.

**లట్ ప్రయోగాత్ విధిః నాస్తి**

వర్తమానకాలాన్ని లట్ లకారం అని కూడా అంటారు.

**శంకరులవారి జవాబు**: వేదంలో ప్రత్యేక పదాలు వస్తాయి. అవి చూడటానికి వర్తమానకాలంగా ఉంటాయి కాని, అది విధివాక్యం అని శంకరులవారు వాదిస్తారు. దాన్ని వేదంలో **లేట్ లకారం** అంటారు. అది చూడటానికి వర్తమానకాలంగా ఉంటుంది కాని కాదు. మళ్ళీ పూర్వమీమాంస శాస్త్రంలోంచే ఒక ఉదాహరణనిస్తారు.

**ఔదుంబరః యూపః భవతి**

యూపః అంటే యజ్ఞాల్లో బలి ఇచ్చే జంతువును కట్టే యూపస్థంభం. ఇక్కడ మన అంశం జంతువులను బలి ఇవ్వచ్చా, ఇవ్వకూడదా, కాదు. అందుకని దాన్ని చర్చించటం లేదు ఇప్పుడు. ఇప్పుడు ప్రశ్న ఆ యూపస్థంభానికి ఏ చెక్కని వాడాలి? దానికి ఏది పడితే అది వాడకూడదు. ఉదుంబర వృక్షంనుంచి మాత్రమే తీసుకోవాలి. ఈ వాక్యంలో భవతి అనే పదం వర్తమానకాలమైనా కూడా విధిగా చెప్పబడుతుంది.

**పూర్వపక్షి వాదన 4**: ఇప్పుడు వ్యాకరణ సూత్రాలను ప్రక్కన పెట్టి ఇంకో కోణంనుంచి వాదించటానికి ప్రయత్నిస్తాడు పూర్వపక్షి. వేదంలో ఇంకో **విధివాక్యం** ఉంది. ఏమిటది? **వేదపారాయణం ఎన్నడూ మానకూడదు; యజ్ఞోపవీతం తీయకూడదు; శిఖ తీయకూడదు** అని వేదమే చెప్పింది. ఎప్పుడైతే సన్న్యాసం తీసుకుంటాడో అప్పుడే అతను వేద పారాయణాన్ని, యజ్ఞోపవీతాన్ని, శిఖని – అన్నింటినీ వదిలివేయాలి. అప్పుడు వేదాన్ని ఖండించినట్టు కాదా అంటాడు పూర్వపక్షి.

**శంకరులవారి జవాబు**: మీరు యజ్ఞోపవీతంవంటివి తీసివేయాలి అనే వాక్యాలను వేదంలోంచి ఉటంకిస్తే నేను కూడా నా వాదనను బలపరిచే వేద వాక్యాలను ఉటంకిస్తాను అంటారు శంకరులవారు. యజ్ఞోపవీతం, వేదం, శిఖ ఇవేవీ వదలనవసరం లేదు అని దీని సారాంశం.

**పూర్వపక్షి వాదన 5**: సరే, మీరు వేదంలోంచే చెప్పారు, నేనూ వేదంలోంచే చెప్పాను. మీ ప్రకారం యజ్ఞోపవీతం వదలనవసరం లేదు. నా వాదన ప్రకారం వదలాలి కాని వేదం వదలకూడదు అంటున్నది.

ఇద్దరి వాదనలూ వేదంలో ఉంటే మీదే ఎందుకు తీసుకోవాలి, నా వాదననెందుకు మీరు అంగీకరించరు అంటాడు పూర్వపక్షి.

**శంకరులవారి జవాబు**: రెండు వేదవాక్యాలు పరస్పర విరుద్ధంగా ఉండి, ఏది తీసుకోవాలో నిర్ణయించుకోలేనప్పుడు, దాన్ని తర్కం లేదా యుక్తితో పరిష్కరించుకోవాలి.

దీనికి ఒక ఉదాహరణ చూద్దాము – స్వర్గం నిత్యం అని ఒకచోట వస్తుంది, ఇంకోచోట స్వర్గం అనిత్యం అని వస్తుంది.

స్వర్గం నిత్యమా, అనిత్యమా?

ఇదీ సమస్య. ఇక్కడ మీమాంస సూత్రం తీసుకోవాలి.

**స్వర్గః అనిత్యః కర్మఫలత్వాద్ ఘటవత్**

స్వర్గం అనిత్యం. ఎందుకు? అది కర్మఫలం కాబట్టి. అందువల్ల స్వర్గం అనిత్యం అనే వాక్యమే సరియైనది. మరి అయితే ఎందుకు స్వర్గాన్ని నిత్యంగా అభివర్ణిస్తున్నది? స్వర్గాన్ని మెచ్చుకోవటానికి చెబుతున్నది.

శ్రుతివాక్యం ప్రమాణవాక్యం, తక్కినది స్తుతివాక్యం.

ఇక్కడ కూడా ఒకచోట సన్యాసం స్వీకరించమంటున్నది, ఇంకొకచోట విధిగా చెప్పటం లేదు. అందువల్ల మీమాంస సూత్రం పెట్టి విశ్లేషిస్తే, శంకరులవారి వాదనే సత్యమని నిరూపిస్తుంది అది. శంకరులవారు జ్ఞానకర్మ సముచ్చయం కుదరదని నిరూపిస్తున్నారు. సందర్భం దొరికినప్పుడల్లా జ్ఞానకర్మ సముచ్చయం కుదరదని కూడా చెబుతూ ఉంటారు శంకరులు. సముచ్చయం అంటే రెండూ కలిపి చేయటం. ఎందుకంటే ఇవి రెండూ భిన్నంగా ఉంటాయి.

| **జ్ఞాన మార్గం** | **కర్మ మార్గం** |
|---|---|
| 1. దీన్ని నిష్కామంగా చేస్తారు | దీన్ని సకామంగా చేస్తారు |
| 2. ఇది నివృత్తి మార్గం | ఇది ప్రవృత్తి మార్గం |
| 3. ఇది ఆత్మ వైపు ప్రయాణం | ఇది అనాత్మవైపు ప్రయాణం |
| 4. ఇది అంతర్ముఖ ప్రయాణం | ఇది బాహ్యప్రయాణం |
| 5. ఇది శాశ్వత ఫలాన్నిస్తుంది | ఇది అనిత్య ఫలాన్నిస్తుంది. |
| 6. దీనికి కర్తృత్వభావన ఉండదు | దీనికి కర్తృత్వభావన ఉంటుంది |

అలా ఏ విధంగా చూసినా కర్మ, జ్ఞానాల మధ్య చాలా వ్యత్యాసం ఉంది. అందువల్ల జ్ఞానం పొందాలంటే కర్మ మార్గం కాదు, కర్మ సన్యాసం చేయాలి. అందువల్ల నా వాదనే సబబు అంటారు శంకరులవారు.

**పూర్వపక్షి వాదన 6**: సరే, సన్న్యాసమే చెపుతున్నది ఉపనిషత్తు కాని సన్న్యాసాశ్రమంలో కూడా యజ్ఞోపవీతం, శిఖ పెట్టుకోమంటుంది కదా ఉపనిషత్తు.

**శంకరులవారి జవాబు**: మీరు చెప్పింది కొంతమేరకు నిజమే. సన్న్యాసంలో రెండు రకాలు ఉన్నాయి– త్రిదండి సన్న్యాసం, పరమహంస సన్న్యాసం. త్రిదండి సన్న్యాసంలో యజ్ఞోపవీతం, శిఖ అన్నీ ఉంటాయి. కొన్ని కర్మలు కూడా చేయవచ్చు. త్రిదండి సన్న్యాసం బ్రహ్మలోకప్రాప్తికి అని శాస్త్రమే చెబుతుంది కూడా. మరణించాక ఈ త్రిదండి సన్న్యాసి బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడనుంచి క్రమముక్తి పొందుతాడు.

ఇది యజ్ఞోపవీత సహితసన్న్యాసం. బ్రహ్మలోకప్రాప్తి.

బ్రహ్మలోకప్రాప్తి వద్దనుకుంటే పరమహంస సన్న్యాసం స్వీకరించి వేదాంత విచారణ మాత్రమే చేయాలి. వీరికి యజ్ఞోపవీతం, శిఖలు ఉండవు.

ఇది యజ్ఞోపవీత రహితసన్న్యాసం. ఆత్మజ్ఞానప్రాప్తి.

**పూర్వపక్షి వాదన 7**: సన్న్యాసం గురించి వేదం మాట్లాడినప్పుడు భిక్ష తీసుకోవాలని విధివాక్యం చెపుతున్నది. భిక్ష తీసుకోవటమంటే అది వైదిక కర్మలోకి వస్తుంది; వైదిక కర్మ చేయాలంటే యజ్ఞోపవీతం ఉండాలి అంటాడు పూర్వపక్షి.

**శంకరులవారి జవాబు**: అవసరం లేదు. భిక్ష తీసుకోమని వేదం సానుకాల విధి వాక్యంగా చెప్పటం లేదు. ఆహారం తీసుకోమని ఎవరూ మనను ఆజ్ఞాపించనవసరం లేదు. వేదం ఆజ్ఞాపించాలంటే, వేదం లేనిచోట ఆహారం ఉండదు. భిక్ష తీసుకోమని ప్రత్యక్షంగా చెప్పటం లేదు కాబట్టి అది వైదికకర్మలోకి రాదు. ఎలాగూ తింటావు కాబట్టి, వేరే పద్ధతుల జోలికి వెళ్ళకుండా, భిక్ష స్వీకరించు అంటున్నది. అంటే తక్కిన పద్ధతుల జోలికి వెళ్ళకుండా భిక్ష తీసుకో అని దాని అర్థం.

ఈ విధంగా శంకరులవారు ఈ వాక్యం సన్న్యాసవిధిని సూచిస్తున్నదని నిరూపించారు.

ఇక్కడితో సన్న్యాస విధి భాష్యం - 2 అయిపోయింది.

# 3.6 - గార్గీ బ్రాహ్మణము

ఆరవ బ్రాహ్మణములో ప్రశ్న వేసినది గార్గి. ఆవిడని బ్రహ్మవాదిని అంటారు. బ్రహ్మజ్ఞానానికి అంకితమైనది. బృహదారణ్యకోపనిషత్తులో ప్రముఖవ్యక్తి ఈమె. అంతకు ముందు ఇంకో ముఖ్యమైన స్త్రీమూర్తిని చూశాము. ఆమె పేరు మైత్రేయి. ఆ బ్రాహ్మణాన్ని మైత్రేయీ బ్రాహ్మణము అంటారు.

చాలామంది గార్గి, మైత్రేయిల మధ్య పొరపాటు పడుతుంటారు. గార్గి యాజ్ఞవల్క్యుని భార్య కాదు. మైత్రేయి యాజ్ఞవల్క్యుని భార్య. అతని ఇంకో భార్య పేరు కాత్యాయని.

అంతకు ముందు రెండు బ్రాహ్మణాలలో సర్వాంతరం పదం ప్రవేశ పెట్టబడింది.

# సర్వాంతర పద భాష్యం

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాంతరః 3-4-1**

ఈ సర్వాంతరః పదం చాలా ముఖ్యమైన పదం. అందువల్ల మూడు బ్రాహ్మణాలలో అంటే ఆరు, ఏడు, ఎనిమిదవ బ్రాహ్మణాలలో ఈ అంశమే చర్చనీయాంశమైంది.

అంతరః అంటే అక్షరాలా తీసుకుంటే 'లోపల'. దాన్నించే అంతరాత్మ, అంతర్యామి పదాలు వచ్చాయి. కాని వేదాంతంలో అంతరః అర్థం వేరే వస్తుంది. ముందు మామూలు అర్థాన్ని ఒక ఉదాహరణతో చూద్దాము.

ఒక కుండ, అందులో నీరు ఉన్నాయనుకోండి. అప్పుడేమంటాము? కుండ **లోపల** నీరు ఉంది. లోపల అని చెప్పటానికి అంతరః అంటాము. కుండ లోపల నీరు ఉంది అంటే, కుండకి విడిగా ఉనికి ఉంది, నీరుకి విడిగా ఉనికి ఉంది. ఒకదానిమీద ఒకటి ఆధారపడి లేవు. కాని ఇప్పటి పరిస్థితి ఎలా ఉంది? విడిగా ఉనికి ఉన్న నీరు, విడిగా ఉనికి ఉన్న కుండ **లోపల** ఉంది. అవి ఒకదానిమీద ఒకటి ఆధారపడిలేవని ఎలా చెప్పగలము? కుండలోపల ఉన్న నీరుని ఇంకో పాత్రలోకి పోయగలము. అంటే అప్పుడు నీరు కుండ లేకపోయినా ఉంది. నీటిని తీసేశాము కాబట్టి కుండ కూడా నీరు లేకపోయినా ఉంది. అలా కుండలో నీరు ఉంది అంటే అది వేరు, ఇది వేరు అనే అర్థం మనకు మామూలుగా తెలిసిన అర్థం.

ఇప్పుడు వేదాంతంలో దాని అర్థం చూస్తే, దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది అది. వేదాంతంలో అంతరం అంటే అధిష్ఠానం. కుండకు అధిష్ఠానం ఏమిటి? మట్టి. ఆభరణాలకు అధిష్ఠానం బంగారం. అలలకు అధిష్ఠానం నీరు. శరీరానికి, ప్రపంచానికి అధిష్ఠానం ఆత్మ. ఆ విధంగా వేదాంతంలో సర్వాంతరం అంటే దాని అధిష్ఠానం.

మట్టిని కుండకు అధిష్ఠానం అంటే, మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదని అర్థం. అధిష్ఠానాన్ని అంతరాత్మ అని, అంతరతత్త్వం అని కూడా అంటారు. కుండ-మట్టి తీసుకుంటే మట్టి అంతరాత్మ, కుండ బాహ్యం అవుతాయి. కుండలేక పోయినా మట్టికి విడిగా ఉనికి ఉంది కాని, కుండకు లేదు.

అందువల్ల **మట్టి సత్యం, కుండ మిథ్య** అవుతాయి.

ఇంకా లోతుగా విశ్లేషిస్తే, అంతరతత్త్వం కారణం అవుతుంది, బాహ్యంగా ఉన్నది కార్యం అవుతుంది. అలాగే అంతరతత్త్వం అపరిచ్ఛిన్నం అవుతుంది; రెండోది పరిచ్ఛిన్నం అవుతుంది. అలాగే అంతరతత్త్వం సూక్ష్మం అవుతుంది; బాహ్యం స్థూలం అవుతుంది.

కార్యం స్థూలం, పరిచ్ఛిన్నం; కారణం సూక్ష్మం, అపరిచ్ఛిన్నం. కారణసూక్ష్మ అపరిచ్ఛిన్నాన్ని అంతరం అంటారు. అది కార్యస్థూల పరిచ్ఛిన్న బాహ్యానికి అంతరతత్త్వం అవుతుంది. పరిచ్ఛిన్నం అంటే పరిమితి ఉన్నది.

ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన తిరుగులేని సూత్రం ఇది – కారణసూక్ష్మ అపరిచ్ఛిన్న వస్తువు, కార్యస్థూల పరిచ్ఛిన్న వస్తువుకు అంతరాత్మ. కార్యం అంతటా కారణం వ్యాపించి ఉంటుంది; స్థూలం అంతటా సూక్ష్మం వ్యాపించి ఉంటుంది; పరిచ్ఛిన్నం అంతటా అపరిచ్ఛిన్నం వ్యాపించి ఉంటుంది. వ్యాపించేదాన్ని ఆంతరం అనీ, వ్యాపింపబడిన దాన్ని బాహ్యం అనీ అంటారు.

ఆంతరం వస్తువు అంతరాత్మ; బాహ్యవస్తువు బాహ్యరూపం; వాటిని మనం రెండుగా సూచిస్తున్నా, నిజానికి అవి రెండూ ఒకటే. ఎందుకంటే ఒకటి లేకుండా రెండోదానికి ఉనికి లేదు. కారణం లేకుండా కార్యానికి విడిగా ఉనికి లేదు; సూక్ష్మం లేకుండా స్థూలానికి విడిగా ఉనికి లేదు; అపరిచ్ఛిన్నం లేకుండా పరిచ్ఛిన్నానికి విడిగా ఉనికి లేదు. ఆంతరం లేకుండా బాహ్యానికి విడిగా ఉనికి లేదు.

అందువల్ల దేనికైనా ఆంతరం తెలుసుకోవాలంటే ఏంచేయాలి? ఏదైనా కార్యం తీసుకుని, దాని కారణం తెలుసుకోవాలి. ఆ కారణం, ఆ కార్యానికి ఆంతరతత్త్వం అవుతుంది. ఇప్పుడు ఆ కారణం వేరే వస్తువుకి కార్యమా కాదా అని చూడాలి. అది కూడా కార్యం అయితే దాని కారణం ఏమిటో తెలుసుకోవాలి. దాని కారణం, ఈ మొదటి కారణంకన్నా ఆంతరంగా, దానికన్నా సూక్ష్మంగా, దానికన్నా అపరిచ్ఛిన్నంగా ఉంటుంది.

అలా కార్యంనుంచి కారణానికి వెళ్ళి, ఆ కారణానికి కారణం వెతుక్కుంటూ వెళ్ళాలి. ఎంతవరకూ? దాని మూలకారణం లేదా ఆత్యంతిక సూక్ష్మం, ఆత్యంతిక అపరిచ్ఛిన్న వస్తువు వచ్చేదాకా! ఎప్పుడైతే మూలకారణం వస్తుందో, అప్పుడే అది సర్వాంతరం అవుతుంది.

బంగారాన్ని సర్వాంతరం అనలేము. అది ఆభరణాలకు మాత్రమే ఆంతరం. అలాగే నీరు అలలకు మాత్రమే ఆంతరం. కాని ఇప్పుడు కనుక్కోవాల్సింది సర్వాంతరం. అందువల్ల గార్గి ఫలానా దానికి అంతరం ఏమిటి అని మొదలు పెడుతుంది. దానికి ఒక ఆంతరం చెపితే దానికి ఆంతరం ఏమిటి అని అడుగుతుంది.

ఉదాహరణకు విజ్ఞానశాస్త్రంలో ఒక వస్తువులోని భాగాలను చూసుకుంటూ వెళితే అణువు, పరమాణువుల దాకా వెళతారు. అలాగే సర్వాంతరాన్ని వెతుక్కుంటూ వెళితే, మన బుద్ధి కాని, తర్కం కాని కొంత మేరకే వెళతుంది. దాని తర్వాత దాని పరిధి చాలదు. చివరికి చైతన్యానికి వెళ్ళాలి. చివరి అంశం వస్తువు కాదు, చేతన తత్త్వం. ఇది ప్రత్యక్ష ప్రమాణంవల్ల కాని, అనుమాన ప్రమాణంవల్ల కాని సాధ్యం కాదు. దీనికి ఆగమశాస్త్రాలు తీసుకోవాలి. అంటే మనకు లౌకికవిద్య తెలుసుకోవటానికి తోడ్పడే ఐదు ప్రమాణాలూ చాలవు. శబ్దప్రమాణం, దాన్నే శాస్త్ర ప్రమాణం అంటారు, తీసుకోవాలి.

ఈ బ్రాహ్మణములో నీరుతో మొదలుపెట్టి, అనేక లోకాలను దాటుకుంటూ చివరికి బ్రహ్మలోకంవరకూ వెళతాము. గార్గి బ్రహ్మలోకాలకి అంతరం ఏమిటని అడుగుతుంది. ఇక్కడ దానికి జవాబు రాదు. తర్వాత రెండు బ్రాహ్మణాలలో ఈ ప్రయాణం కొనసాగుతుంది.

బ్రహ్మలోకానికి అంతరతత్త్వం బ్రహ్మలోక అధిపతి అయిన హిరణ్యగర్భ. హిరణ్యగర్భను ఇక్కడ సూత్రంగా వ్యవహరిస్తున్నది ఉపనిషత్తు. మనం కూడా ఇకమీదట, హిరణ్యగర్భను సూత్రంగానే చూద్దాము. సూత్రం అంటే చిన్నదారం. ఉదాహరణకు ఒక ముత్యాలదండను తీసుకుంటే, వాటన్నిటినీ దగ్గరగా కలిపే దారం ఒకటుంటుంది. వాటిలోపల అంతర్లీనంగా, మనకు కనపడకుండా ఉంటుంది. కనపడకుండా ఉన్నా, వాటిని కలిపి ఉంచేది అదే.

అదే విధంగా బ్రహ్మలోకంవరకూ వెళ్ళగలము కాని సమష్టిబుద్ధి అయిన హిరణ్యగర్భతత్త్వం ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకు అందదు. యాజ్ఞవల్క్యుడు ఈ సూత్రానికి ఒక ప్రత్యేకపదం వాడుతున్నాడు

**అనతి ప్రశ్న్యాం వై దేవతామ్**

ప్రత్యక్ష అనుమాన ప్రమాణాల పరిధిలో ఈ దేవత గురించి ప్రశ్నలు వేయలేము, జవాబు చెప్పలేము అంటున్నాడు. **ఇక్కడితో సర్వాంతర పదంమీద భాష్యం అయిపోయింది.**

భూలోకంనుంచి బ్రహ్మలోకంవరకూ ఇక్కడ చూస్తాము. భూలోకం గురించి చెప్పలేదు. మనం కలుపుకుంటాము. తర్వాత వచ్చే బ్రాహ్మణాలలో బ్రహ్మలోకంనుంచి సూత్రం, సూత్రంనుంచి ఈశ్వరుడు (అంతర్యామి), ఈశ్వరునినుంచి నిర్గుణబ్రహ్మకు వెళతాము. ఇదీ మన ప్రయాణం.

లోకంనుంచి సూత్రం; సూత్రంనుంచి అంతర్యామికి; అంతర్యామినుంచి అక్షరం బ్రహ్మకు. ఏడవ బ్రాహ్మణములో సూత్రం, అంతర్యామిలను చూస్తే, ఎనిమిదవ బ్రాహ్మణములో అంతర్యామినుంచి నిర్గుణబ్రహ్మను చూస్తాము. గార్గిని అతి ప్రశ్నలు వేయకు, నీ తల ఊడిపడకుండు గాక అంటున్నాడు అంటే శబ్దప్రమాణానికి రాకపోతే నీ తల ఊడిపడవచ్చు అన్నట్టుగా వస్తుంది. అక్కడితో గార్గి ఆగుతుంది. ఈ నేపథ్యంతో మంత్రాలను చూద్దాము.

## మంత్రం 3.6.1

**అథ హైనం గార్గీ వాచక్నవీ పప్రచ్ఛ యాజ్ఞవల్క్యేతి హోవాచ యదిదగ్ం సర్వమప్స్వోతం చ ప్రోతం చ కస్మిన్ను ఖల్వాప ఓతాశ్చ ప్రోతాశ్చేతి ॥ వాయౌ గార్గీతి కస్మిన్ను ఖలు వాయురోతశ్చ ప్రోతశ్చేత్యన్తరిక్షలోకేషు గార్గీతి కస్మిన్ను ఖల్వన్తరిక్షలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి గన్ధర్వలోకేషు గార్గీతి కస్మిన్ను ఖలు గన్ధర్వలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేత్యాదిత్యలోకేషు గార్గీతి కస్మిన్ను ఖల్వాదిత్యలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి చన్ద్రలోకేషు గార్గీతి కస్మిన్ను ఖలు చన్ద్రలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి నక్షత్రలోకేషు గార్గీతి కస్మిన్ను ఖలు నక్షత్రలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి దేవలోకేషు గార్గీతి కస్మిన్ను ఖలు దేవలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతీన్ద్రలోకేషు గార్గీతి కస్మిన్ను ఖల్విన్ద్రలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి ప్రజాపతిలోకేషు గార్గీతి**

**కస్మిన్ను ఖలు ప్రజాపతి లోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి బ్రహ్మలోకేషు గార్గీతి ॥ కస్మిన్ను ఖలు బ్రహ్మలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి స హోవాచ గార్గి మాఽతిప్రాక్షీర్మా తే మూర్ధా వ్యపప్తదనతిప్రశ్న్యాం వై దేవతామతిపృచ్ఛసి గార్గి మాఽతిప్రాక్షీరితి తతో హ గార్గీ వాచక్నవ్యుపరరామ ॥**

**అథ హైనం గార్గీ వాచక్నవీ పప్రచ్ఛ** – యాజ్ఞవల్క్యుడు జవాబు చెప్పాక; గార్గి వాచక్నవి అనే స్త్రీ యాజ్ఞవల్క్యుడిని ప్రశ్న అడగటానికి వచ్చింది.

**యాజ్ఞవల్క్యేతి హోవాచ** – ఓ యాజ్ఞవల్క్యా అని పిలిచి, ఇలా అడిగింది.

**యదిదగ్ం సర్వమప్స్వోతం చ ప్రోతం చ కస్మిన్ను ఖల్వాప ఓతాశ్చ ప్రోతాశ్చేతి** – ఈ సర్వము ఏదైతే ఉందో, అది నీటిలో ఓతం, ప్రోతంలా వ్యాపించబడి ఉంది. కాని, నీరు దేనిలో ఓతం, ప్రోతంలా వ్యాపించబడి ఉన్నది?

ఓతం, ప్రోతం అంటే ఒక వస్త్రంలో నిలువుదారాలు, అడ్డదారాలు. వీటినే పడుగుపేక అని కూడా అంటారు. ఓతం, ప్రోతం పదాలను వేదాంతంలో తరచు చూస్తాము. ఇవి కారణాన్ని సూచిస్తాయి. కారణం, అంతరం, సూక్ష్మం, అపరిచ్ఛిన్నం – ఏదైనా వాడవచ్చు. ఓతం, ప్రోతం లేకపోతే వస్త్రానికి ఉనికి లేదు. అందువల్ల గార్గీ ఈ ఓతం, ప్రోతం పదాలను ఒకొక్క స్థాయికి వాడుతూ వస్తుంది. ఒకొక్క లోకానికి ఓతం, ప్రోతం ఏమిటి, అంటే ఆ లోకానికి ఆంతరతత్త్వం ఏమిటి, దాని సూక్ష్మతత్త్వం లేదా అపరిచ్ఛిన్నతత్త్వం ఏమిటి అని అడుగుతూ వస్తుంది.

మొదటి ప్రశ్నకు ఆవిడే నమూనాలాగా ఒక జవాబు ఇచ్చి, దాని ఆధారంగా ప్రశ్నలు వేస్తూ వస్తుంది. భూమికి కారణం నీరు. సృష్టి కారణం చూస్తే కూడా జలం, పృథివికి కారణం అవుతుంది. ఆ విధంగా నీరు పృథివికి ఓతం, ప్రోతం. అది చెప్పి నీటికి ఓతం, ప్రోతం ఏమిటి అని అడుగుతుంది.

**వాయౌ గార్గీతి** – ఓ గార్గీ, నీటికి ఓతం, ప్రోతం వాయువు అని యాజ్ఞవల్క్యుడు చెబుతాడు. వాయువుకు ఓతం, ప్రోతం ఏమిటి అంటుంది గార్గి. ఒక ప్రశ్న జవాబు చూస్తే మొత్తం సంభాషణ అంతా అలాగే సాగుతుంది. అందువల్ల ఆ లోకాలు మాత్రం చూస్తే చాలు. కస్మిన్నునుంచి గార్గి ప్రశ్న.

యాజ్ఞవల్క్యుని జవాబు. నీరు, వాయువు, అంతరిక్షలోకం, గంధర్వలోకం, ఆదిత్యలోకం, చంద్రలోకం, నక్షత్రలోకం, దేవలోకం, ఇంద్రలోకం, ప్రజాపతిలోకం, బ్రహ్మలోకం. అలా పన్నెండు లోకాలు జవాబులుగా చెబుతాడు యాజ్ఞవల్క్యుడు. ఈ లోకాలన్నీ పంచభూతాలతో ఏర్పడినవే. కాకపోతే వాటి సూక్ష్మత్వంలో తరతమ భావం ఉంది. అంటే పై లోకానికి వెళ్ళేకొద్దీ వాటి సూక్ష్మత్వం పెరుగుతూ వస్తుంది. ఉదాహరణకు చంద్రలోకం, నక్షత్రలోకం తీసుకుందాము. చంద్రలోకానికి ఆంతరలోకం నక్షత్రలోకం. రెండూ పంచభూతాలతో తయారుచేయబడినవే కాని, నక్షత్రలోకం యొక్క పంచభూతాలు, చంద్రలోకం యొక్క పంచభూతాల కన్నా సూక్ష్మతరంగా ఉంటాయి. అణువు కన్నా, పరమాణువు సూక్ష్మంగా ఉన్నట్టన్నమాట.

అలా లోకాలన్నీ దాటుకుంటూ, చివరిలోకం బ్రహ్మలోకానికి వస్తాడు యాజ్ఞవల్క్యుడు. అది సూక్ష్మతమం లోకం. అది పధ్నాలుగవ లోకం సృష్టి క్రమంలో.

గార్గీ బ్రహ్మలోకానికి ఆంతరం ఏమిటి అని అడుగుతుంది. అక్కడితో జడప్రపంచం అయిపోతుంది. బ్రహ్మలోకానికి కారణం బ్రహ్మలోక అధిపతి. ఆయన చేతన తత్త్వం. ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకు చేతన తత్త్వం అందదు. అందుకే విజ్ఞానశాస్త్రం కూడా ఈ చేతన తత్త్వాన్ని అందుకోలేక పోతుంది. దాన్ని తెలుసుకోవాలంటే ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలను ఒదిలి, శబ్దప్రమాణం లేదా శాస్త్రప్రమాణానికి రావాలి.

మన లౌకిక జ్ఞానంలో, పరీక్షల్లో 'అవుటాఫ్ సిలబస్' ప్రశ్న అంటుంటాము. అలా బ్రహ్మలోకానికి కారణం ఏమిటి అనే ప్రశ్న ప్రత్యక్ష అనుమాన ప్రమాణాల పరిధిలోంచి చూస్తే ఆ ప్రమాణాల పరిధిలోకి రాదు. దీనికి జవాబు లేదనటం లేదు, కాని ఆ ప్రమాణాల పరిధిలోకి రాదు. ఆ ప్రమాణాలను ఆధారం చేసుకుని అడిగితే చెన్నై, బెంగుళూరుల మధ్య దూరం ఎన్ని కిలోగ్రాములు ఉంది అని అడిగినట్లవుతుంది. కిలోగ్రాములు వాడే పరిధి వేరు, దూరం కొలిచే కొలత వేరు.

అందువల్ల హిరణ్యగర్భ గురించి ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాల పరిధిలో అడగవద్దు. అందువల్ల హిరణ్యగర్భను **అనతి ప్రశ్న్యాం వై దేవత** అంటున్నాడు. నువ్వు అతి ప్రశ్నలు వేస్తున్నావు, అలా వేస్తే నీ తల ఊడి పడవచ్చు అంటున్నాడు. ఈ నేపథ్యంతో వీటికి సంబంధించిన మంత్రభాగం చూద్దాము.

**కస్మిన్ను ఖలు బ్రహ్మలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి** – బ్రహ్మ లోకానికి ఓతం, ప్రోతం ఏమిటి?

**స హోవాచ గార్గి మాఽతిప్రాక్షీర్మా తే మూర్ధా వ్యపప్తత్** – యాజ్ఞవల్క్యుడు ఇలా అన్నాడు – ఓ గార్గీ అతి ప్రశ్నలు వేయవద్దు. నీ తల ఊడి పడకుండు గాక!

**అనతి ప్రశ్న్యాం వై దేవతామతిపృచ్ఛసి** – నువ్వు అతి ప్రశ్నలను వేయకూడని దేవతను గురించి నిశ్చయంగా అతి ప్రశ్నలను వేస్తున్నావు.

గార్గి మాఽతిప్రాక్షీరితి – ఓ గార్గీ! అతి ప్రశ్నలను వేయవద్దు అని యాజ్ఞవల్క్యుడు గార్గిని హెచ్చరిస్తున్నాడు.

దానికి శంకరులవారి భాష్యసారాంశం ఇది.

నీ ప్రశ్నను అతి ప్రశ్నగా వేయవద్దు. హిరణ్యగర్భకు సంబంధించిన ప్రశ్నను ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకు అతీతంగా, శాస్త్రోపదేశాన్ని ప్రమాణంగా స్వీకరించే పద్ధతిలో వేయాలి. అటువంటి హిరణ్యగర్భను అనుమాన ప్రమాణానికి గోచరంగా చేసే విధంగా నువ్వు ప్రశ్నించవద్దని అర్థం. అలా ప్రశ్నించే నీ తల తెగి నేలపై పడకుండు గాక!

ఈ ప్రశ్న అనుమాన ప్రమాణం ఆధారంగా ఉండటంవల్ల, ఆ ప్రశ్న ఆగమశాస్త్రాన్ని అతిక్రమించింది. అనుమాన ప్రమాణం పై ఆధారపడిన ప్రశ్న ఏ ఇంద్రాది దేవతలకు వర్తిస్తుందో, ఆ దేవతను అతిప్రశ్న అంటారు. అతిప్రశ్న కాకూడని దేవత (హిరణ్యగర్భుడు) అనతి ప్రశ్న అనబడుతుంది. అంటే కేవలం శాస్త్రప్రమాణం ద్వారా మాత్రమే తెలుసుకోవచ్చును అని అర్థం.

అటువంటి అనతిప్రశ్న అయిన దేవత గురించి నువ్వు అతిప్రశ్న వేస్తున్నావు. ఓ గార్గీ! అందువల్ల, నీకు మరణించాలనే కోరిక లేని పక్షంలో, అతిప్రశ్నను వేయకు అని యాజ్ఞవల్క్యుడు ఆగ్రహంతో పలికాడు.

**తతో హ గార్గీ వాచక్నవ్యుపరరామ** – అప్పుడు గార్గీ వాచక్నవీ వెనుదిరిగింది.

కాని ఆవిడ ఎనిమిదవ బ్రాహ్మణములో మళ్ళీ వస్తుంది. బహుశ ఆమె తెలుసుకుని ఉంటుంది, హిరణ్యగర్భుడు, ఈశ్వరుడు, నిర్గుణబ్రహ్మల గురించి వేదప్రమాణంద్వారానే తెలుసుకోవాలని. అప్పుడు అక్షరంబ్రహ్మ (నిర్గుణబ్రహ్మ) గురించి యాజ్ఞవల్క్యుడు చెబుతాడు. ప్రస్తుతానికి ఆమె వెనక్కి వెళ్ళింది. దీనితో ఈ బ్రాహ్మణము ముగిసింది.

సర్వాంతరం ఏమిటో తెలుసుకునే మన ఈ ప్రయాణంలో భూలోకంనుంచి మొదలుపెట్టి బ్రహ్మలోకంవరకూ చేరుకున్నాము. అక్కడిదాకా జడప్రపంచం వస్తుంది. దాన్నించి చేతన తత్త్వంలోకి అడుగుపెడతాము. బ్రహ్మలోకానికి అధిపతి హిరణ్యగర్భ, హిరణ్యగర్భకు కారణం ఈశ్వరుడు, ఈశ్వరునికి కారణం నిర్గుణబ్రహ్మ. అలా మనం బ్రహ్మలోకంనుంచి హిరణ్యగర్భకు, హిరణ్యగర్భనుంచి ఈశ్వరునికి, ఈశ్వరునినుంచి నిర్గుణబ్రహ్మకు ప్రయాణం చేస్తాము. ఈ మంత్రాలలో హిరణ్యగర్భను సూత్రం అనీ, ఈశ్వరుణ్ణి అంతర్యామి అనీ, నిర్గుణబ్రహ్మను అక్షరబ్రహ్మ అనీ చూస్తాము.

# 3.7 - అంతర్యామి బ్రాహ్మణము

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాంతరః - 3.4.1.**

అపరోక్ష బ్రహ్మ పదం బ్రహ్మయొక్క నిర్వచనం. ఈ నిర్వచనాన్ని నాలుగు, ఐదు బ్రాహ్మణాలలో చూశాము. సర్వాంతర పదాన్ని తీసుకుని ఆరు, ఏడు, ఎనిమిదవ బ్రాహ్మణాలలో విశ్లేషిస్తున్నది ఉపనిషత్తు.

సర్వాంతరం అంటే ఆంతర సారం. స్థూల ప్రపంచాన్ని విశ్లేషిస్తే, స్థూలవస్తువుయొక్క ఆంతరసారంగా సూక్ష్మవస్తువు ఉంటుంది. ఆంతరసారం అంటే మూడు విషయాలు గమనించాలి.

1. ఆంతరసారం కారణం అవుతుంది.
2. ఆంతరసారం కార్యంకన్నా సూక్ష్మంగా ఉంటుంది.
3. ఆంతరసారం సర్వవ్యాపకంగా ఉంటుంది, అంటే అపరిచ్ఛిన్నంగా ఉంటుంది.

అంటే ఆంతరసారం కారణం, సూక్ష్మం, అపరిచ్ఛిన్నం.
స్థూలవస్తువు కార్యం, స్థూలం, పరిచ్ఛిన్నం.

**కార్యభూత పరిచ్ఛిన్న స్థూలప్రపంచస్య కారణభూత సూక్ష్మ అపరిచ్ఛిన్న ప్రపంచః ఆంతర భవతి**

అలా పై లోకాలకి వెళ్ళినకొద్దీ ఒక్కొక్కలోకం దాని కింద లోకంకన్నా సూక్ష్మతరంగా ఉంటుందని చూశాము. సూక్ష్మతరమైనదేమిటో తెలిసే వరకూ మన ప్రయాణం కొనసాగుతుంది. గార్గీ బ్రాహ్మణములో బ్రహ్మలోకం వరకూ తీసుకువెళ్ళాడు యాజ్ఞవల్క్యుడు. అన్నీ పంచభూతాలతో చేయబడినవే అయినా, అవి ఒకదాన్ని మించి ఇంకోటి సూక్ష్మతరంగా ఉంటుందని చూశాము. దాని తర్వాత వచ్చేది ప్రత్యక్ష, అనుమానప్రమాణాల కందదని కూడా చూశాము.

తర్వాత స్థాయి హిరణ్యగర్భ. హిరణ్యగర్భ బ్రహ్మలోక అధిపతి. ఇక్కడ హిరణ్యగర్భను సూత్రంగా అభివర్ణిస్తున్నది ఉపనిషత్తు. సూత్రం అంటే దారం. దారం అనేక ముత్యాలను కలిపి ఉంచుతుంది. వాటిలో అంతర్లీనంగా ఉంటుంది. సూత్రం అన్నిటా ఉండి, అన్నిటినీ కలిపి ఉంచుతుంది. సూత్రం గురించి తెలుసుకోవాలంటే శాస్త్రప్రమాణానికి రావాలి.

| | |
|---|---|
| సూత్రం | - సమష్టి సూక్ష్మప్రపంచంయొక్క చైతన్యం |
| అంతర్యామి | - సమష్టి కారణంప్రపంచంయొక్క చైతన్యం |
| అక్షరం | - నిరుపాధిక బ్రహ్మ |

ఈ బ్రాహ్మణములో సూత్రం గురించి, అంతర్యామి గురించి తెలుసుకుంటాము. సర్వలోకాలకు ఆంతరం బ్రహ్మలోకం, బ్రహ్మలోకానికి ఆంతరం సూత్రం, సూత్రానికి ఆంతరం అంతర్యామి. అంతర్యామికి ఆంతరం నిర్గుణబ్రహ్మ. ఇదీ మన ప్రయాణం.

ఉపనిషత్తులన్నిటిలోకీ, ఈ ఉపనిషత్తులో కూడా అంతర్యామి అత్యంత ముఖ్యమైన అంశం కాబట్టి, ఈ బ్రాహ్మణాన్ని అంతర్యామి బ్రాహ్మణము అంటారు. మిగతా బ్రాహ్మణాలకు పేరు ప్రశ్న అడిగిన బ్రాహ్మణునిమీద వస్తే, ఈ బ్రాహ్మణానికి అంతర్యామి పేరు వచ్చింది.

ఈ అంతర్యామినే ఈశ్వరుడు అంటారు. ఈ ఈశ్వరునికే ఆలయాల్లో పూజలు, అభిషేకాలు జరుగుతాయి. ఈశ్వరునికి ప్రమాణం ఉపనిషత్తులలో ఈ అంతర్యామి బ్రాహ్మణము. ఈ బ్రాహ్మణము ఒక కథతో మొదలవుతుంది.

## మంత్రం 3.7.1

**అథ హైనముద్దాలక ఆరుణిః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యేతి హోవాచ మద్రేష్వవసామ పతఞ్చలస్య కాప్యస్య గృహేషు యజ్ఞమధీయానాస్తస్యాసీద్భార్యా గన్ధర్వగృహీతా తమపృచ్ఛామ కోఽసీతి సోఽబ్రవీత్కబన్ధ ఆథర్వణ ఇతి సోఽబ్రవీత్పతఞ్చలం కాప్యం యాజ్ఞికాగ్ంశ్చ వేత్థ ను త్వం కాప్య తత్సూత్రం యేనాయం చ లోకః పరశ్చ లోకస్సర్వాణి చ భూతాని సన్దృబ్ధాని భవన్తీతి సోఽబ్రవీత్పతఞ్చలః కాప్యో నాహం తద్భగవన్ వేదేతి సోఽబ్రవీత్పతఞ్చలం కాప్యం యాజ్ఞికాగ్ంశ్చ వేత్థ ను త్వం కాప్య తమన్తర్యామిణం య ఇమం లోకం పరం చ లోకగ్ం సర్వాణి చ భూతాని యోఽన్తరో యమయతీతి సోఽబ్రవీత్పతఞ్చలః కాప్యో నాహం తం భగవన్ వేదేతి సోఽబ్రవీత్పతఞ్చలం కాప్యం యాజ్ఞికాగ్ంశ్చ యో వై తత్కాప్య సూత్రం విద్యాత్తం చాన్తర్యామిణమితి స బ్రహ్మవిత్స లోకవిత్స దేవవిత్స వేదవిత్స భూతవిత్స ఆత్మవిత్స సర్వవిదితి ॥ తేభ్యోఽబ్రవీత్తదహం వేద తచ్చేత్త్వం యాజ్ఞవల్క్య సూత్రమవిద్వాగ్ంస్తం చాన్తర్యామిణం బ్రహ్మగవీరుదజసే మూర్ధా తే వ్యపతిష్యతీతి ॥ వేద వా అహం గౌతమ తత్సూత్రం తం చాన్తర్యామిణమితి ॥ యో వా ఇదం కశ్చిద్బ్రూయాద్వేద వేదేతి యథా వేత్థ తథా బ్రూహీతి ॥**

**అథ హైనముద్దాలక ఆరుణిః పప్రచ్ఛ** – తర్వాత ఉద్దాలక ఆరుణి ప్రశ్న అడిగాడు. ప్రతి ఒక్కరికి రెండు పేర్లు ఉంటాయని చూశాము. ఇక్కడ సవాలు చేసిన బ్రాహ్మణుని పేరు ఉద్దాలక ఆరుణి. కఠోపనిషత్తులో నచికేతుని తండ్రిగా చూసిన వాజశ్రవుడే ఈ ఉద్దాలకుడు.

**యాజ్ఞవల్క్యేతి హోవాచ** – ఓ యాజ్ఞవల్క్యా అని పిలిచి ఇలా అంటున్నాడు.

**మద్రేష్వవసామ పతంచలస్య కాప్యస్య గృహేషు యజ్ఞమధీయానా** – మేము యజ్ఞశాస్త్రాన్ని అధ్యయనం చేస్తూ మద్రదేశంలో పతంచలి కాప్యుని ఇంట్లో ఉన్నాము.

**తస్యాసీద్భార్యా గంధర్వగృహీతా** – అతని భార్యను ఒక గంధర్వుడు ఆవహించాడు.

**తమపృచ్ఛామ కోఽసీతి** – ఆ గంధర్వుణ్ణి మేము నువ్వెవరు అని అడిగాము.

**సోఽబ్రవీత్కబన్ధ ఆథర్వణ ఇతి** – నేను కబంధ ఆథర్వుణుణ్ణి అని చెప్పి,

**సోఽబ్రవీత్పతంచలం కాప్యం యాజ్ఞికాగ్ంశ్చ** – పతంచలి కాప్యుడిని, యజ్ఞం నేర్చుకుంటున్న మమ్మల్ని అడిగాడు.

**వేత్థ ను త్వం కాప్య తత్సూత్రమ్** – ఓ కాప్య! నీకు సూత్రం గురించి తెలుసా?

ఏమిటా సూత్రం? గంధర్వుడే నిర్వచిస్తున్నాడు సూత్రాన్ని.

**యేనాయం చ లోకః పరశ్చ లోకస్సర్వాణి చ భూతాని సందృబ్ధాని భవంతీతి** –సూత్రం ఈ లోకాన్ని, పరలోకాన్ని, అన్ని జీవాలను కలిపి ఉంచుతాడు.

**సోఽబ్రవీత్పతంచలః కాప్యో నాహం తద్భగవన్ వేదేతి** – పతంచల కాప్యుడు ఓ భగవాన్, ఆ సూత్రాత్మ నాకు తెలియదు అని చెప్పాడు.

భుజ్యు బ్రాహ్మణములో కూడా ఇటువంటి కథే చూశాము. అందులో కూడా పతంచల కాప్యుడు ఉన్నాడు. కాకపోతే అక్కడ ఆయన కూతురుని గంధర్వుడు ఆవహిస్తే, ఇక్కడ ఆయన భార్యను అదే గంధర్వుడు ఆవహించాడు. గంధర్వులు ఉన్నతజీవులు. అందువల్ల వారు చెప్పే విషయం కూడా అపౌరుషేయ విషయం అవుతుంది. గంధర్వుని గురించి చెప్పటంలో అంతరార్థం అదే. ఈ జ్ఞానం అపౌరుషేయ జ్ఞానం, ఇది మనిషి బుద్ధినించి వచ్చింది కాదు. గంధర్వుడు పతంచల కాప్యుడినే కాక, అక్కడ ఉన్న శిష్యులందరినీ కూడా ఉద్దేశించి అడిగాడు.

ఇక్కడ చాలా పేర్లు వచ్చాయి. ఉద్దాలకుడు యాజ్ఞవల్క్యుణ్ణి సవాలు చేయటానికి ముందుకు వచ్చాడు. సవాలు చేసేముందు యాజ్ఞవల్క్యునికి ఒక కథ చెబుతున్నాడు. కథలో పేర్లు పతంచల కాప్యుడు, కబంధ అథర్వుడు. పతంచల కాప్యుని భార్యను కబంధుడనే గంధర్వుడు ఆవహించాడు. ఆ గంధర్వుడు ఒక ప్రశ్న అడిగాడు. ఏమిటది?

నీకు సూత్రం గురించి తెలుసా అన్నాడు. అంటే హిరణ్యగర్భ తత్త్వం తెలుసా అన్నాడు. అనేక పూలను ఎలాగైతే దారం ఒక మాలగా కలిపి ఉంచుతుందో, అలా అన్ని జీవరాసులూ ఒకే విశ్వాత్మలో కలిసి ఉన్నాయి. ఈ సూత్రాత్మ గురించి నీకు తెలుసా అన్నాడు.

శంకరులవారు ఈ లోకాన్ని వర్తమాన శరీరంగాను, పరలోకాన్ని రాబోయే శరీరంగాను అభివర్ణిస్తున్నారు. అంతేకాదు, సర్వాణి భూతాని అంటే సకల జీవరాసులను కలిపి ఉంచుతాడు కాబట్టి హిరణ్యగర్భకు సూత్రం అనే పేరు వచ్చింది.

ఈ కథ ఎందుకు చెప్పాడంటే హిరణ్యగర్భ గురించి పండితుడు కూడా చెప్పలేడు. అతనికి తెలిసిన ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలు సరిపోవు. అందువల్ల గురువు పతంచల కాప్యుడు కూడా జవాబు చెప్పలేక పోయాడు. అందువల్లనే విజ్ఞానశాస్త్రానికి అందదు హిరణ్యగర్భ. ఇది పౌరుషేయ విషయం కాదు.

ఇంకో సందేశం కూడా అంతర్లీనంగా ఉంది. ఇది పరోక్షంగా యాజ్ఞవల్క్యుణ్ణి భయపెట్టే ప్రయత్నం. విద్య బోధించే గురువు పతంచల కాప్యునికే జవాబు తెలియలేదు. మామూలు మనిషివైన నీకెలా తెలుస్తుంది? కాని యాజ్ఞవల్క్యుడు మామూలు మనిషి కాదు, సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారం అంటారని అతనికి తెలియదు. పైపెచ్చు నేను గంధర్వునినుంచి నేర్చుకున్నాను, నీకా అవకాశం లేదు అని చెప్పటం.

ఇప్పుడు రెండవ ప్రశ్న వస్తుంది గంధర్వునినుంచి.

**సోఽబ్రవీత్పతంచలం కాప్యం యాజ్ఞికాగ్ంశ్చ వేత్థ ను త్వం కాప్య తమంతర్యామిణం** – అతడు పతంచల కాప్యను, యాజ్ఞికక్రియలను నేర్చుకుంటున్న ఆయన శిష్యులను ఉద్దేశించి ఇలా అడిగాడు – ఓ కాప్యా! అంతర్యామి గురించి నీకు తెలుసా?

అంతర్యామి ఎవరు? కబంధుడే నిర్వచిస్తున్నాడు.

**య ఇమం లోకం పరం చ లోకగ్ం సర్వాణి చ భూతాని యోఽంతరో యమయతీతి** – అతను లోపల ఉన్నవాడై ఈ లోకాన్ని, పరలోకాన్ని, అన్ని జీవాలను కూడా నియమించుతున్నాడు.

ఈ లోకం అంటే ఇప్పటి శరీరం, పరలోకం అంటే రాబోయే శరీరం.

**సోఽబ్రవీత్పతంచలః కాప్యో నాహం తద్భగవన్ వేదేతి** – ఆ పతంచల కాప్యుడు, ఓ భగవాన్, ఆ అంతర్యామిని నేను ఎరుగను అని చెప్పాడు.

అంతర్యామి ఎవరు? లోపల ఉండి నియంత్రించువాడు. అంతః అంటే లోపల ఉండి, యమయతి నియంత్రించేవాడు. కారు లోపల కూర్చుని కారుని నియంత్రించినట్టుగా భగవంతుడు జీవుల లోపల ఉండి నియంత్రిస్తాడు. ఎక్కడో వైకుంఠంలోనో, కైలాసంలోనో దూరంగా కూర్చోడు. అంతర్యామి అంటే ఈశ్వరుడు. ఇక్కడ అంతర్యామి పదం సరిగ్గా సరిపోతుంది. ఈశ్వరుడు అంటే పైకి చూస్తాము, అంతర్యామి అంటే లోపల ఉన్నాడు అని అర్థమవుతుంది. ఎవరిని నియంత్రిస్తాడు?

అన్ని శరీరాలను, అన్ని ప్రాణులను, హిరణ్యగర్భతో సహా అందరినీ నియంత్రిస్తాడు. నిజానికి హిరణ్యగర్భుడు ఉన్నతమైన జీవి అయితే, అంతర్యామి ఈశ్వరుడు. ఈ విద్య తెలుసుకున్నవాడు సర్వజ్ఞుడవుతాడు అన్నాడు గంధర్వుడు.

**సోఽబ్రవీత్పతంచలం కాప్యం యాజ్ఞికాగ్ంశ్చ యో వై తత్కాప్య సూత్రం విద్యాత్తం చాంతర్యామిణమితి** – అతడు పతంచల కాప్యుణ్ణి, అతని శిష్యులను ఉద్దేశించి, ఎవరైతే ఆ సూత్రాత్మను, ఆ అంతర్యామిని నిశ్చయంగా తెలుసుకుంటారో ఆ సూత్రాత్మకు లోపల ఉండి, ఆ సూత్రాత్మను నియంత్రించే అంతర్యామి గురించి తెలుసుకుంటారో అతను,

**స బ్రహ్మవిత్స లోకవిత్స దేవవిత్స వేదవిత్స భూతవిత్స ఆత్మవిత్స సర్వవిదితి** – బ్రహ్మవేత్త, లోకాలను తెలిసినవాడు, దేవతలను తెలిసినవాడు, వేదాలను తెలిసినవాడు, ప్రాణులను తెలిసినవాడు, ఆత్మను తెలిసినవాడు, సర్వం తెలిసినవాడు అవుతాడు.

సూత్రాత్మ గురించి, సూత్రాత్మను కూడా నియంత్రించే అంతర్యామి గురించి తెలుసుకున్న వ్యక్తి బ్రహ్మవేత్త అవుతాడు. అంటే పరమాత్మ తత్త్వం తెలిసినవాడు అవుతాడు. అలాగే లోకాలను, దేవతలను, ప్రమాణాలైన వేదాలను, సకల ప్రాణులను, ఆత్మను తెలుసుకున్నవాడు అవుతాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే సర్వజ్ఞుడు అవుతాడు.

ఇక్కడ కథను కొనసాగించుకోవాలి. గంధర్వుడు ఈ జ్ఞానాన్ని ఇంతగా పొగడటంవల్ల పతంచలుడు, తక్కిన విద్యార్థులు, ఉద్దాలకునితో సహా, గంధర్వుని శిష్యులుగా మారి, అతన్ని సూత్రం గురించి, అంతర్యామి గురించి బోధించమని అడిగారని, గంధర్వుడు అలాగే వారికి బోధించాడని, అందువల్ల ఉద్దాలకుడు కూడా సూత్రజ్ఞానం, అంతర్యామి జ్ఞానం పొందాడని అర్థం చేసుకోవాలి.

**తేభ్యోఽ బ్రవీత్తదహం వేద** – (అతడు) వారికి చెప్పాడు. ఆ అంతర్యామిని నేనెరుగుదును.

**తచ్చేత్త్వం యాజ్ఞవల్క్య సూత్రమవిద్వాగ్ంస్తం చాంతర్యామిణం** – ఓ యాజ్ఞవల్క్యా! నువ్వు ఆ సూత్రాత్మ, అంతర్యామిల గురించి తెలియకుండా,

**బ్రహ్మగవీరుదజసే** – బ్రహ్మవేత్తకు చెందిన గోవులను తీసుకొనివెళ్ళే పక్షంలో,

**మూర్ధా తే వ్యపతిష్యతీతి** – నీ తల ఊడి పడగలదు.

ఇక్కడ సవాలు మొదలవుతుంది. నేను గంధర్వునినుంచి సూత్రాత్మ, అంతర్యామిల గురించిన జ్ఞానం పొందాను. ఇప్పుడు నిన్ను వారి గురించి అడుగుతున్నాను. నేను బ్రహ్మవేత్తను అయ్యాను. నీకు తెలియకపోతే బ్రహ్మవేత్తకు చెందాల్సిన గోవులను నువ్వు తీసుకువెళ్ళలేవు. అవి నాకు చెందుతాయి. నువ్వు వాటికి జవాబులు చెప్పలేకపోతే, నీ తల ఊడి పడుతుంది అని చెప్పాడు. కాని యాజ్ఞవల్క్యుడు చెక్కుచెదరలేదు.

**వేద వా అహం గౌతమ తత్సూత్రం తం చాంతర్యామిణమితి** – ఓ గౌతమా, ఆ సూత్రాత్మను, ఆ అంతర్యామిని నేను ఎరుగుదును అని చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. ఉద్దాలకుని మరో పేరు గౌతముడు. ఇది విని కోపం వచ్చింది గౌతమునికి.

**యో వా ఇదం కశ్చిద్బ్రూయాద్వేద వేదేతి** – ఎవరైనా కూడా నాకు తెలుసు, నాకు తెలుసు అని చెప్పవచ్చు. గొప్పలు చెప్పటానికి అలా ఎవరైనా చెప్పవచ్చు. అలా గర్జించి ప్రయోజనం ఏముంది?

**యథా వేత్థ తథా బ్రూహీతి** – నీకేం తెలుస్తే, అది చెప్పు.

యాజ్ఞవల్క్యుడు సూత్రాన్ని ఒక మంత్రంలో నిర్వచించి, తక్కిన అన్ని మంత్రాల్లో అంతర్యామిని గురించి చాలా విపులంగా చర్చించాడు. అంతర్యామి పదం ఇందులో పదేపదే రావటంవల్ల ఈ బ్రాహ్మణానికి అంతర్యామి బ్రాహ్మణము అని పేరు వచ్చింది.

## మంత్రం 3.7.2

**స హోవాచ వాయుర్వై గౌతమ తత్సూత్రం వాయునా వై గౌతమ సూత్రేణాయం చ లోకః పరశ్చ లోకస్సర్వాణి చ భూతాని సన్దృబ్ధాని భవన్తి తస్మాద్వై గౌతమ పురుషం ప్రేతమాహుర్వ్యస్రగ్ంసిషతాస్యాఙ్గానీతి వాయునా హి గౌతమ సూత్రేణ సన్దృబ్ధాని భవన్తీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్యాన్తర్యామిణం బ్రూహీతి ॥**

సూత్రం, అంతర్యామిల గురించి చెప్పమని ఉద్దాలకుడు అడగటంవల్ల, యాజ్ఞవల్క్యుడు చెప్పటం మొదలుపెట్టాడు. ఈ మంత్రంలో సూత్రం గురించి వస్తుంది. సూత్రం అంటే హిరణ్యగర్భ అని మర్చిపోకూడదు. హిరణ్యగర్భ అంటే సర్వజ్ఞుడు అని అర్థం వస్తుంది. అందరినీ కలిపి ఉంచేవాడు అని రావాలంటే సూత్రం పదం సరిపోతుంది. సూత్రం అంటే దారం. ఒక దారం పూలన్నిటినీ కలిపి ఉంచినట్టుగా, హిరణ్యగర్భ అన్ని స్థూల సూక్ష్మశరీరాలను కలిపి ఉంచుతాడు. ఇక్కడ సూత్రం అర్థం సరిపోతుంది కాబట్టి హిరణ్యగర్భపదం వాడకుండా, సూత్రం వాడతాము.

**స హెూవాచ వాయుర్వై గౌతమ తత్సూత్రం** – ఆ యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పాడు – ఓ గౌతమా! ఆ సూత్రం నిశ్చయంగా వాయువే. వాయువు అంటే కేవలం గాలిగా తీసుకోకూడదు, వాయుదేవతగా తీసుకోవాలి. వాయుదేవత సమష్టి ప్రాణదేవత. సూత్రం గురించి గంధర్వుడు చెప్పాడని గౌతముడు చెప్పిన నిర్వచనాన్ని మళ్ళీ యథాతథంగా చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. ఏమిటది?

**వాయునా వై గౌతమ సూత్రేణాయం చ లోకః పరశ్చ లోకస్సర్వాణి చ భూతాని సంధృబ్ధాని భవంతి** – సూత్రం ఈ లోకాన్ని, పరలోకాన్ని, అన్ని జీవాలను కలిపి ఉంచుతాడు అని చెప్పాడు అక్కడ. ఇక్కడ అలా అన్నిటినీ కలిపి ఉంచే సూత్రం వాయువే అని చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. ఈలోకం అంటే ఈ శరీరం, పరలోకం అంటే తర్వాత రాబోయే శరీరం అని ముందే చూశాము. ప్రాణతత్త్వమే సూత్రం. ఎలా నిరూపిస్తాము?

**తస్మాద్వై గౌతమ పురుషం ప్రేతమాహుర్వ్యస్రగ్ంసిషతాస్యాంగానీతి** – ఓ గౌతమా, అందువల్లనే మరణించిన వ్యక్తిని ఉద్దేశించి, అతని అవయవాలు విడిపోయాయి అని చెబుతారు.

**వాయునా హి గౌతమ సూత్రేణ సంధృబ్ధాని భవంతీతి** – ఎందుకంటే ఓ గౌతమా, అవి వాయువు చేతనే కలిపి (దేహరూపంగా) ఉంచబడ్డాయి.

ఒక వ్యక్తి మరణించినప్పుడు ఏమంటాము? అతని ప్రాణం పోయింది అంటాము. అందువల్ల మరణాన్ని ప్రాణ ఉత్క్రాంతిగా అభివర్ణిస్తారు. ఎప్పుడైతే ప్రాణం శరీరాన్ని విడిచి వెళ్ళిపోతుందో, అప్పట్నుంచీ శరీరం జీవించలేదు. ప్రాణం ఉన్నంతసేపే శరీరానికి గౌరవం, శరీరానికి సేవలు. ప్రాణం పోయిన మరుక్షణం, శవం అంటే అందరికీ భయమే. అంతవరకూ తన ప్రాణంగా చూసుకున్న భార్య కూడా ఎంత త్వరగా శవదహనం చేయిద్దామా అని చూస్తుంది. అంతేకాదు శరీరం కుళ్ళిపోతుంది. అందువల్ల విజ్ఞానశాస్త్రపరంగా కూడా శరీరాన్ని ఎక్కువసేపు ఉంచటం మంచిది కాదు. ప్రాణం పోగానే, అతని అంగాలు పనిచేయటం మానేస్తాయి. దీనికి అన్వయ వ్యతిరేక పద్ధతి ఉపయోగించవచ్చు.

**ప్రాణ సత్త్వే శరీర సత్త్వమ్**

**ప్రాణ అభావే శరీరస్య ఏవ భవతి**

**తస్మాత్ప్రాణః ఏవ శరీరాధారః**

ప్రాణ తత్త్వమే జీవనానికి ఆధారం. ఈ జవాబుతో ఉద్దాలకుడు తృప్తి పడ్డాడు.

**ఏవమేవైతద్యాజ్ఞవల్క్యాంతర్యామిణం బ్రూహీతి** – ఓ యాజ్ఞవల్క్యా! ఈ సమాధానం నిశ్చయంగా యథార్థం. అంతర్యామిని గురించి చెప్పు.

మంత్రం 3.7.3

**యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అన్తరో యం పృథివీ న వేద యస్య పృథివీ శరీరం యః పృథివీమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.4

**యోఽప్సు తిష్ఠన్నద్భ్యోఽన్తరో యమాపో న విదుర్యస్యాపశ్శరీరం యోఽపోఽన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.5

**యోఽగ్నౌ తిష్ఠన్నగ్నేరన్తరో యమగ్నిర్న వేద యస్యాగ్నిశ్శరీరం యోఽగ్నిమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.6

**యోఽన్తరిక్షే తిష్ఠన్నన్తరిక్షాదన్తరో యమన్తరిక్షం న వేద యస్యాన్తరిక్షగ్ం శరీరం యోఽన్తరిక్షమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.7

**యో వాయౌ తిష్ఠన్ వాయోరన్తరో యం వాయుర్న వేద యస్య వాయుశ్శరీరం యో వాయుమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.8

**యో దివి తిష్ఠన్ దివోఽన్తరో యం ద్యౌర్న వేద యస్య ద్యౌశ్శరీరం యో దివమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.9

**య ఆదిత్యే తిష్ఠన్నాదిత్యాదన్తరో యమాదిత్యో న వేద యస్యాదిత్యశ్శరీరం య ఆదిత్యమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.10

**యో దిక్షు తిష్ఠన్ దిగ్భ్యోఽన్తరో యం దిశో న విదుర్యస్య దిశశ్శరీరం యో దిశోఽన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.11

**యశ్చన్ద్రతారకే తిష్ఠగ్ంశ్చన్ద్రతారకాదన్తరో యం చన్ద్రతారకం న వేద యస్య చన్ద్రతారకగ్ం శరీరం యశ్చన్ద్రతారకమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.12

**య ఆకాశే తిష్ఠన్నాకాశాదన్తరో యమాకాశో న వేద యస్యాకాశశ్శరీరం య ఆకాశమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.13

**యస్తమసి తిష్ఠగ్ంస్తమసోఽన్తరో యం తమో న వేద యస్య తమశ్శరీరం యస్తమోఽన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.14

**యస్తేజసి తిష్ఠగ్ంస్తేజసోఽన్తరో యం తేజో న వేద యస్య తేజశ్శరీరం యస్తేజోఽన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృత ఇత్యధిదైవమథాధిభూతమ్ ॥**

ఈ మంత్రాలన్నిటిలో అంతర్యామి స్వరూపం గురించి వస్తుంది. అంతర్యామి సూత్రం లోపల ఉండి సూత్రాన్ని నియంత్రిస్తాడు. ఇంకో విధంగా చెప్పాలంటే ఈశ్వరుడు హిరణ్యగర్భ లోపల ఉండి హిరణ్యగర్భను నియంత్రిస్తాడు. ఇక్కడ మళ్ళీ ఒకసారి మనం తత్త్వబోధలో నేర్చుకున్న ప్రతిబింబ చైతన్యాల గురించి గుర్తు తెచ్చుకోవాలి.

**శుద్ధ చైతన్యం**

| **వ్యష్టి ప్రతిబింబాలు** | **సమష్టి ప్రతిబింబాలు** |
|---|---|
| స్థూలశరీరం - విశ్వ | స్థూలప్రపంచం - విరాట్ |
| సూక్ష్మశరీరం - తైజస | సూక్ష్మప్రపంచం - హిరణ్యగర్భ |
| కారణశరీరం - ప్రాజ్ఞ | కారణప్రపంచం - ఈశ్వర |

హిరణ్య గర్భ - సమష్టి సూక్ష్మప్రపంచ సహితచైతన్యం.

ఈశ్వరుడు - సమష్టి కారణప్రపంచ సహితచైతన్యం.

అందువల్ల కారణశరీరం, సూక్ష్మశరీరాన్ని నియంత్రిస్తే, కారణప్రపంచం సూక్ష్మప్రపంచాన్ని నియంత్రిస్తుంది. అందువల్ల ఈశ్వరుడు హిరణ్యగర్భను నియంత్రిస్తాడు. సూత్రానికి అంతర్యామి ఆంతరంగా ఉంటాడు.

ప్రతి మంత్రంలోనూ అంతర్యామియొక్క ఐదు లక్షణాలు వివరించ బడ్డాయి.

1. **తిష్ఠన్** - అంతర్యామి ఎందులో ఉన్నాడో చెబుతుంది. హిరణ్యగర్భ ఎందులో ఉంటే, అంతర్యామి కూడా అందులోనే ఉంటాడు. తైజస ఎందులో ఉంటే ప్రాజ్ఞ కూడా అందులోనే ఉంటుంది. తైజస, ప్రాజ్ఞలు

వ్యష్టిపరంగా ప్రతిబింబచైతన్యాలని చూశాము. అవి వ్యష్టి స్థూలశరీరంలో ఉంటాయి. అలాగే హిరణ్యగర్భ, ఈశ్వరులు సమష్టిపరంగా ప్రతిబింబచైతన్యాలని చూశాము. వారు సమష్టి స్థూలప్రపంచంలో ఉంటారు.

2. **అంతరః** – ఆంతరం అంటే లోపల, బాహ్యంగా కాదు. భూమ్మీద నివసిస్తున్నాడు అంటే భూమి పైన అవవచ్చు, భూమిలోపల అవవచ్చు. కాని అంతర్యామి ఉండేది లోపల. ఏది పేర్కొంటే దాని లోపల.

3. **న వేద** – దేని లోపల ఉంటే, అది అంతరామ్యిని తెలుసుకోలేదు. అంటే హిరణ్యగర్భ అంతర్యామి గురించి తెలుసుకోలేదు. అంటే అంతర్యామి ఆబ్జెక్టు కాదు, అంటే విషయం కాదు. అంతర్యామి సబ్జెక్టు.

4. **శరీరం** – హిరణ్యగర్భ ఏ శరీరంలో ఉంటాడో, అంతర్యామి కూడా ఆ శరీరంలోనే ఉంటాడు. అంటే ఈశ్వరునికి విడిగా వేరే శరీరం లేదు. ఇందాక చూసినట్టుగా స్థూలప్రపంచమే ఈశ్వరునికి, హిరణ్యగర్భకు కూడా శరీరం. వ్యష్టిపరంగా చూస్తే తైజసకు, ప్రాజ్ఞకు కూడా వ్యష్టి స్థూలశరీరమే శరీరం.

5. **యమయతి** – లోపల ఉండి, నియంత్రిస్తాడు.

3–14 మంత్రాల వరకు ఈ పదాలు – తిష్ఠన్, అంతరః, న వేద, శరీరం, యమయతి – అన్నింటిలోనూ వస్తాయి. ఈ ఐదు పదాలూ అంతర్యామి స్వరూపాన్ని వర్ణిస్తాయని చూశాము. హిరణ్యగర్భను ఒక్కటిగా తీసుకోకుండా, యాజ్ఞవల్క్యుడు అనేక దేవతలుగా విభజించాడు.

మళ్ళీ తత్త్వబోధలోకి వెళ్ళాలి మనం. మన శరీరంలో 19 అంగాలు ఉన్నాయి – పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు. వీటన్నిటికీ అధిష్ఠానదేవతలు ఉన్నారు. ఉదాహరణకు కన్నుకు అధిష్ఠానదేవత సూర్యుడు; వాక్కుకు అధిష్ఠానదేవత అగ్ని; మనస్సుకు అధిష్ఠానదేవత చంద్రుడు అలా అనేక అధిష్ఠానదేవతలు ఉన్నారు. వీరందరికీ అధిష్ఠానదేవత హిరణ్యగర్భుడు. అందువల్ల హిరణ్యగర్భుణ్ణి ద్రష్టగా చూస్తే, ఆదిత్యుడు; హిరణ్యగర్భను శ్రోతగా చూస్తే దిగ్దేవత, అలా చెప్పుకుంటూ పోవచ్చు.

అందువల్ల యాజ్ఞవల్క్యుడు అంతర్యామి వీరందరిలో ఉండి, వీరిని నియంత్రిస్తున్నాడు అని చెప్పాడు. ఒకొక్క దేవతకూ ఈ ఐదు అంశాలను అన్వయించుకోవాలి. మన మనస్సులో హత్తుకుపోయేందుకు వీలుగా, అంతమంది దేవతల గురించి చెప్పాడు.

ఉదాహరణకు మనం మూడవ మంత్రం వివరణ చూస్తే చాలు, అదే వివరణ అన్ని మంత్రాలకూ కొనసాగుతుంది. మొట్టమొదటి దేవత పృథివిదేవత.

**యః పృథివ్యాం తిష్ఠన్** – అతను పృథివి యందున్నాడు. ఇక్కడ పృథివి అంటే స్థూలపృథివి. ఇది మొదటి అంశం.

**పృథివ్యా అంతరః** – అంతర్యామి పృథివి లోపల ఉన్నాడు. ఇక్కడ కూడా పృథివి అంటే స్థూలపృథివే. ఇది రెండవ అంశం.

**యం పృథివీ న వేద** – పృథివి తెలుసుకోలేదు. ఇక్కడ పృథివి అంటే పృథివీదేవత. పృథివీదేవత వేరే ఎవరో కాదు, హిరణ్యగర్భే. అందువల్ల హిరణ్యగర్భకు అంతర్యామి గురించి తెలియదు. ఇది మూడవ అంశం.

**యస్య పృథివీ శరీరం** – పృథివి అంతర్యామికి శరీరం. ఇక్కడ పృథివి అంటే దేవత కాదు, స్థూలపృథివి. అంతకు ముందు చూశాము కదా అంతర్యామి, సూత్రం (హిరణ్యగర్భ) ఒకే శరీరంలో ఉంటారని. అందువల్ల స్థూలపృథివి లోపల పృథివీదేవత (హిరణ్యగర్భ), అంతర్యామి ఉంటారు. ఇద్దరూ ఒకే శరీరాన్ని పంచుకుంటారు. అయితే మరి ఏమిటి తేడా? పృథివీ దేవత అంటే హిరణ్యగర్భ అంశం; అంతర్యామి అంటే ఈశ్వర అంశం. ఇద్దరికీ శరీరం ఒకటే అనేది నాలుగవ అంశం.

**యః పృథివీమంతరో యమయతి** – పృథివికి లోపల ఉండి, నియంత్రిస్తాడు. అంటే హిరణ్యగర్భను కూడా నియంత్రిస్తాడు. నిజానికి హిరణ్యగర్భను సమష్టి జీవుడు అంటారు. హిరణ్యగర్భ ఉన్నతమైన జీవి అయితే, అంతర్యామి ఈశ్వరుడు. ఉన్నతజీవిని కూడా అంతర్యామి నియంత్రిస్తాడు. ఇది ఐదవ అంశం.

**ఏష త ఆత్మాంతర్యామ్యమృతః** – ఈ అంతర్యామి నీయొక్క ఆత్మ. ఆయన అమృతుడు.

ఈ ఐదు అంశాలు ఉన్న ఈశ్వరుడే నీ ఆత్మ, నీ సారం అని ముగించాడు. ఈ అంతర్యామి అమృతం. ఈ ఐదు అంశాలనీ తక్కిన అన్ని మంత్రాలకు అన్వయించుకోవాలి. హిరణ్యగర్భను అనేక దేవతలుగా అభివర్ణించాడని చూశాము.

3–14 వరకూ వరుసగా చూసుకుంటూ వస్తే, ఆ దేవతలు ఈ వరుస క్రమంలో వస్తారు. పృథివీదేవత, జలదేవత, అగ్నిదేవత, అంతరిక్షదేవత, వాయుదేవత, ద్యులోకదేవత, ఆదిత్యదేవత, దిగ్దేవత, చంద్రతారకలదేవత, ఆకాశదేవత, తమస్దేవత, తేజస్దేవతలు.

**ఇత్యధిదైవమథాధిభూతమ్** – ఇంతవరకు అధిదైవం అయింది. ఇప్పుడు అధిభూతం గురించి వస్తుంది.

## మంత్రం 3.7.15

**యస్సర్వేషు భూతేషు తిష్ఠన్ సర్వేభ్యో భూతేభ్యోఽన్తరో యం సర్వాణి భూతాని న విదుర్యస్య సర్వాణి భూతాని శరీరం యస్సర్వాణి భూతాన్యన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృత ఇత్యధిభూతమథాధ్యాత్మమ్ ॥**

ఈ మంత్రం అధిభూత ప్రతిబంధ మంత్రం. ఇదే ఈశ్వరుడు. అన్ని జీవాలలో కూడా ఉన్నాడు. అధిభూతాన్ని భౌతిక శరీరాలుగా అభివర్ణిస్తారు. అదే వివరణ ఇందులో కూడా కొనసాగుతుంది. దాని తర్వాత అధ్యాత్మం. అవి 16 నుంచి 23 వరకూ వస్తాయి.

## మంత్రం 3.7.16

**యః ప్రాణే తిష్ఠన్ ప్రాణాదన్తరో యం ప్రాణో న వేద యస్య ప్రాణశ్శరీరం యః ప్రాణమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.17

**యో వాచి తిష్ఠన్ వాచోఽన్తరో యం వాఙ్ న వేద యస్య వాక్ శరీరం యో వాచమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.18

**యశ్చక్షుషి తిష్ఠగ్ంశ్చక్షుషోఽన్తరో యం చక్షుర్న వేద యస్య చక్షుశ్శరీరం యశ్చక్షురన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.19

**యశ్శ్రోత్రే తిష్ఠన్ శ్రోత్రాదన్తరో యగ్ం శ్రోత్రం న వేద యస్య శ్రోత్రగ్ం శరీరం యశ్శ్రోత్ర మన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.20

**యో మనసి తిష్ఠన్ మనసోఽన్తరో యం మనో న వేద యస్య మనశ్శరీరం యో మనోఽన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.21

**యస్త్వచి తిష్ఠగ్ంస్త్వచోఽన్తరో యం త్వఙ్ న వేద యస్య త్వక్ శరీరం యో త్వచమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.22

**యో విజ్ఞానే తిష్ఠన్ విజ్ఞానాదన్తరో యం విజ్ఞానం న వేద యస్య విజ్ఞానగ్ం శరీరం యో విజ్ఞానమన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥**

మంత్రం 3.7.23

**యో రేతసి తిష్ఠన్ రేతసోఽన్తరో యగ్ం రేతో న వేద యస్య రేతశ్శరీరం యో రేతోఽన్తరో యమయత్యేష త ఆత్మాఽన్తర్యామ్యమృతః ॥ అదృష్టో ద్రష్టాఽశ్రుతశ్శ్రోతాఽమతో మన్తాఽవిజ్ఞాతో విజ్ఞాతా ॥ నాన్యోఽతోఽస్తి ద్రష్టా నాన్యోఽతోఽస్తి శ్రోతా నాన్యోఽతోఽస్తి మన్తా నాన్యోఽతోఽస్తి విజ్ఞాతా ॥ ఏష త ఆత్మాఽన్తర్యామ్యమృతోఽతోఽన్యదార్తం తతో హోద్దాలక ఆరుణిరుపరరామ॥**

16 నుంచి 23 వరకూ ఉన్న మంత్రాలు వ్యష్టిలో ఉన్న అనేక అంగాలను పేర్కొంటాయి. వాటికి కూడా ఈ ఐదు అంశాలనూ తీసుకోవాలి. కాకపోతే ఇక్కడ స్థూలపృథివి చోట గోళకం తీసుకోవాలి. పృథివీదేవత చోట ఇంద్రియం తీసుకోవాలి. ఉదాహరణకు చక్షుషి తిష్ఠగ్ం అంటే కన్ను గోళకంలో ఉన్నాడు; చక్షుర్న వేద అంటే

చక్షురింద్రియానికి తెలియదు. యస్య చక్షుశ్శరీరం అంటే కన్ను ఇంద్రియానికీ (హిరణ్యగర్భకూ), అంతర్యామికీ శరీరం. అలా అంతర్యామి ఈ అన్ని అంగాలకీ లోపల ఉండి వాటిని నియంత్రిస్తున్నాడు.

మంత్రాలు 16నుంచి 23వరకూ వరుసగా చూసుకుంటూ వస్తే, ఆ అంగాలు ఈ వరుసక్రమంలో వస్తాయి. ఘ్రాణేంద్రియం (ప్రాణం), వాక్కు, చక్షువు, శ్రోత్రం, మనస్సు, త్వగింద్రియం, విజ్ఞానం(బుద్ధి), జననేంద్రియం.

ఇంతవరకూ చూసిన వర్ణనను క్రోడీకరిస్తే – ఈ ఐదు అంశాలను చూశాము.

1. అంతర్యామి అధిదైవం, అధిభూతం, అధ్యాత్మంలో ఉన్నాడు.
2. అంతర్యామి అధిదైవం, అధిభూతం, అధ్యాత్మంలో లోపల ఉన్నాడు.
3. అంతర్యామి గురించి అధిదైవం, అధిభూతం, అధ్యాత్మంకు తెలియదు.
4. అంతర్యామి అధిదైవం, అధిభూతం, అధ్యాత్మంకు చెందిన శరీరాలలో ఉన్నాడు.
5. అంతర్యామి అధిదైవం, అధిభూతం, అధ్యాత్మం లోపల ఉండి, వాటిని నియంత్రిస్తాడు. నిజానికి ఈ అంశంవల్లనే ఈశ్వరునికి అంతర్యామి పేరు వచ్చింది.

**అంతః యమయతి అంతర్యామి**

అంతర్యామి అందరినీ నియంత్రిస్తాడు, అంటే దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఈశ్వరుణ్ణి కర్మఫలదాత అంటారని చూశాము. అంటే ఆయనకు ఇష్టం వచ్చినట్టు, లేదా ఆయనకు తోచినట్టు మనను నియంత్రించడు. మనం చేసిన కర్మలకు తగ్గట్టుగా మనకు కర్మఫలాలను ఇస్తాడు. కర్మ వల్లే దేవత అయినా, జీవి అయినా ఆయా శరీరాలను పొందారు. అందువల్ల మన కర్మలనే పగ్గాలను తన చేతిలో ఉంచుకుని నియంత్రిస్తాడు.

అంతర్యామిని ఇలా నిర్వచించాక, యాజ్ఞవల్క్యుడు 23వ మంత్ర చివరిభాగంలో అంతర్యామి స్వరూప లక్షణాన్ని వివరిస్తున్నాడు.

**అదృష్టో ద్రష్టాఽ శ్రుతశ్శ్రోతాఽ మతో మన్తాఽ విజ్ఞాతో విజ్ఞాతా ॥ నాన్యోఽ తోఽ స్తి ద్రష్టా నాన్యోఽ తోఽ స్తి శ్రోతా నాన్యోఽ తోఽ స్తి మన్తా నాన్యోఽ తోఽ స్తి విజ్ఞాతా ॥ ఏష త ఆత్మాఽ న్తర్యామ్యమృతోఽ తోఽ న్యదార్తం తతో హొద్దాలక ఆరుణిరుపరరామ ॥**

ఇప్పుడు అంతర్యామియొక్క స్వరూపలక్షణాన్ని చూస్తాము. అంతర్యామిని రెండు కోణాల్లో చూస్తే –

సమష్టి పరంగా – సమష్టి కారణప్రపంచం లేదా మాయ
వ్యష్టి పరంగా – చైతన్యం లేదా సాక్షిచైతన్యం

అంతర్యామి అసలు స్వరూపం కారణప్రపంచం కాదు, సాక్షిచైతన్యం అని చూపించదలచుకున్నాడు యాజ్ఞవల్క్యుడు. కారణప్రపంచం ఒక ఉపాధి మాత్రమే; అది వ్యవహారం నడవటానికి వచ్చిన ఆగంతుక లక్షణం. స్వరూపలక్షణం సాక్షిచైతన్యం. అందువల్ల సాక్షిని ఈశ్వరసాక్షి అంటారు.

అంతర్యామి స్వరూపలక్షణమైన సాక్షిచైతన్యాన్ని ఇక్కడ అద్భుతంగా వివరించాడు. సాక్షిని ద్రష్టా, శ్రోతా, మన్తా, విజ్ఞాత అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. ద్రష్టపదం వాడినప్పుడు, ఇదే ఉపనిషత్తులో అంతకు ముందు రెండు సందర్భాలలో ద్రష్ట గురించిన రెండు నిర్వచనాలు వివరంగా చూశాము.

1.4.10 మంత్రం దగ్గర మహావాక్యభాష్యం చూశాము. 3.4.2. మంత్రంలో కూడా చూశాము.

**న దృష్టేర్ద్రష్టారం పశ్యేః**

చూపుని చూసే ఆత్మను నువ్వు చూడలేవు.

అక్కడ కూడా ద్రష్టా, శ్రోతా, మన్తా, విజ్ఞాతాపదాలు వచ్చాయి. మళ్ళీ ఒకసారి టూకీగా ఈ ద్రష్టపదానికి వచ్చే రెండు అర్థాలను చూద్దాము.

ద్రష్ట–1 – మనస్సు
ద్రష్ట–2 – సాక్షిచైతన్యం

మనస్సును చిదాభాస సహిత అంతఃకరణం, అహంకారం, ప్రమాతా అంటారు. ఇది మార్పులు చెందుతుంది. అందువల్ల దీన్ని సవికార ద్రష్ట అంటారు. ఈ మార్పులు వృత్తిలో అంటే ఆలోచనల్లో వస్తాయి. మనస్సు బాహ్య ప్రపంచాన్ని చూస్తుంది.

సాక్షి చైతన్యం నిర్వికార ద్రష్ట. దీనికి ఎలాటి మార్పులూ లేవు. మనస్సు బాహ్యప్రపంచాన్ని చూస్తే, సాక్షి మనస్సును చూస్తుంది. మనస్సులో కలిగే మార్పులను, మనస్సులో ఏర్పడే జ్ఞానాన్ని, మనస్సులో ఉన్న అజ్ఞానాన్ని– అన్నిటినీ చూస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే ఇది సర్వమనోవృత్తి సాక్షి.

ఆ విధంగా ద్రష్ట అంటే మనస్సు అవచ్చు; సాక్షి అవచ్చు. మనస్సుకు దృశ్యం బాహ్యప్రపంచం అయితే, సాక్షికి దృశ్యం మనస్సు. అందువల్ల వేదాంతంలో ద్రష్టా మాట వస్తే అది ఏ ద్రష్ట గురించి చెబుతున్నదో గమనించాలి.

బృహదారణ్యకోపనిషత్తులో ఎక్కువగా సాక్షిని సూచిస్తుంది ఈ ద్రష్టా పదం. 3.4.2. వ మంత్రంలో ద్రష్టాని సాక్షిగానే చూశాము. అదే సూత్రాన్ని ఈ సందర్భంలో కూడా ఉపయోగించి, ఇక్కడ ద్రష్టాని కూడా సాక్షిచైతన్యంగానే తీసుకోవాలి.

**అదృష్టో ద్రష్టాఽ శ్రుతశ్రోతాఽ మతో మంతాఽ విజ్ఞాతో విజ్ఞాతా**

సాక్షి అంటే వృత్తి సాక్షి అని చూశాము. ఎటువంటి వృత్తి?

ద్రష్టా – దర్శనవృత్తి సాక్షి
శ్రోతా – శ్రవణవృత్తి సాక్షి
మన్తా – మననవృత్తి సాక్షి
విజ్ఞాతా – విజ్ఞానవృత్తి సాక్షి

ఈ నాలుగు పదాలను తీసుకుంటే ఒకటే పదంలో చెప్పవచ్చు.

సాక్షి – సర్వమనోవృత్తి సాక్షి

అంతర్యామి స్వరూప లక్షణ నిర్వచనానికి ఇది ఒక భాగం. ఇప్పుడు ఇంకో భాగాన్ని చూద్దాము. అదృష్టః, అశ్రుతః, అమతః, అవిజ్ఞాతః –

అదృష్టః – ఆత్మ ఎప్పటికీ చూసేది కాని చూడబడేది కాదు
అశ్రుతః – ఆత్మ ఎప్పటికీ వినేది కాని వినబడేది కాదు
అమతః – ఆత్మ ఎప్పటికీ ఆలోచించేది కాని ఆలోచన కాదు
అవిజ్ఞాతః – ఆత్మ ఎప్పటికీ తెలుసుకునేది కాని తెలియబడేది కాదు

ఈ నాలుగు పదాలను తీసుకుంటే ఒకటే పదంలో చెప్పవచ్చు.

ఆత్మ ఎప్పటికీ సబ్జెక్టు కాని ఆబ్జెక్టు కాదు.

ఆత్మ అంటే ఈశ్వర ఆత్మ లేదా అంతర్యామి ఆత్మ. ఈ పై రెండు కలిపితే తదపి ద్రష్టా, శ్రోతా, మన్తా, విజ్ఞాతా అంతర్యామి అస్మి.

**నాన్యోఽతోఽస్తి ద్రష్టా నాన్యోఽతోఽస్తి శ్రోతా నాన్యోఽతోఽస్తి మంతా నాన్యోఽతోఽస్తి విజ్ఞాతా ఏష త ఆత్మాంతర్యామ్యమృతః** – ఈ నాలుగు వాక్యాలను కలిపి తీసుకోవాలి. శంకరులవారు తరచు ఈ వాక్యాలను ఉటంకిస్తుంటారు. ఇవి జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని ఎలా సూచిస్తాయో చూద్దాము.

అతః అన్యః ద్రష్టా నాస్తి

అతః అంటే అంతర్యామినః. అంతర్యామినః అన్య ద్రష్టా నాస్తి అంటే –

అంతర్యామి కాకుండా వేరే ద్రష్టా లేదు
అంతర్యామి కాకుండా వేరే శ్రోతా లేదు
అంతర్యామి కాకుండా వేరే మంతా లేదు
అంతర్యామి కాకుండా వేరే విజ్ఞాతా లేదు

అన్నిటినీ కలిపి ఒక్క వాక్యంలో చెప్పాలంటే – అంతర్యామి కాకుండా అనుభవించే వ్యక్తి వేరే లేడు. అంటే అంతర్యామి ఒక్కడే సబ్జెక్టు, తక్కినవన్నీ ఆబ్జెక్టులు. దీన్నించి మహావాక్యాన్ని ఎలా నిర్వచించగలము?

వ్యావహారిక పరిభాషలో ఏమంటాము? జీవుడు అనుభవించేవాడు; జగత్తు అనుభవించబడేది. అనేకమంది జీవులు ఉన్నారు కాబట్టి అనుభవించేవారు అనేకమంది ఉండాలి. కాని వేదాంతం ఏమంటున్నది?

అంతర్యామి ఒక్కడే అనుభవించేవాడు, అంతర్యామి కాకుండా అనుభవించేవాడు ఎవరూ లేరు. ఈ రెండు వాక్యాలను క్రోడీకరిస్తే ఏమి తెలుస్తుంది?

ఒక్క అంతర్యామే అనేక జీవులుగా విభజించబడినట్టుగా ఉంది. అనేక జీవులుగా పాత్ర వహిస్తున్నాడు కాని నిజానికి ఉన్నది ఒకటే అంతర్యామి.

**ఈశ్వర ఏవ జీవరూపేణ భాతి**

ఒకవేళ జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు అనుకుంటే ఏమవుతుంది? ఈశ్వరుడు ఒక అనుభవించే వ్యక్తి, జీవుడు ఇంకో అనుభవించే వ్యక్తి అవుతారు. అప్పుడు అథమపక్షం ఇద్దరు అనుభవించే వ్యక్తులు ఉండాలి. అదే ఉన్న అందరు జీవులనూ లెక్కలోకి తీసుకుంటే అనేక అనుభవించే వ్యక్తులు అవుతారు. కాని ఉపనిషత్తు ఏమంటున్నది? ఒక్కడే ఈశ్వరుడు ఉన్నాడు అంటున్నది. అనేక శరీరాలనుంచి అనుభవించేదంతా ఒక్కరే. వ్యష్టిశరీరాలను పరిగణనలోకి తీసుకోకపోతే, ఒక్కరే అనుభవించేవారు ఉన్నారు. అది ఈశ్వరుడు.

మహదాకాశం ఉదాహరణ చూస్తే అది అర్థమవుతుంది. ఉన్నది ఒక్కటే ఆకాశం. దాన్నే ఘటాకాశం అనీ, ఉదరాకాశం అనీ అంటారు. అలాగే అనేక జీవులు ఉన్నా అవి నామరూపాలు మాత్రమే. అనుభవించే వ్యక్తి ఒకరే. అది ఈశ్వరుడు.

**సమష్టి ఉపాధి పరంగా చూస్తే ఈశ్వరుడు, వ్యష్టి ఉపాధి పరంగా చూస్తే జీవుడు**

స్వరూపంలో తేడా లేదు, మాధ్యమంలోనే తేడా ఉంది. ఒక వందమంది స్వామీజీ ప్రసంగం వింటుంటే, ఒకటే చైతన్యం అనేక మనస్సులద్వారా వింటున్నది. అందువల్ల మనోవృత్తులు అనేకం కాని మనోవృత్తులను ప్రకాశింపజేసే చైతన్యం ఒక్కటే.

ఒకటే చైతన్యం ఉంటే ఒక వ్యక్తికి బాగా అర్థమవుతుంది, ఇంకో వ్యక్తికి సరిగ్గా అర్థమవదు. అలా ఎందుకు జరుగుతుంది? అర్థం కావటం విషయానికొచ్చేసరికి మనం మనస్సు స్థాయికి దిగామన్నమాట. మనస్సులో అనేక భేదాలు ఉన్నాయి. కాని చైతన్యం ఒకటే.

**వేదాఽహం సమతీతాని వర్తమానాని చార్జున ।**

**భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥**– గీత 7.26

అంతర్యామిగా నాకు భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు తెలుసు. నాకు అన్నీ తెలుసు కాని నేను అదృష్ట, ద్రష్టను; అమత మంతను.

అందువల్ల యాజ్ఞవల్క్యుడు తన నిర్వచనాన్ని ఈ వాక్యాలతో ముగిస్తున్నాడు.

**అతోఽన్యదార్తం** – అంతర్యామి సత్యం, అమృతం. తక్కినదంతా నాశన మయ్యేది, మిథ్య.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

అంతర్యామి మాత్రమే సత్యం, తక్కినదంతా మిథ్య. ఇంచుమించు ప్రతిబ్రాహ్మణము అతోఽన్యదార్తంతో ముగుస్తున్నది.

**తతో హోద్దాలక ఆరుణిరుపరరామ** – తరువాత ఉద్దాలక ఆరుణి వెను తిరిగాడు. దీనితో ఏడవ బ్రాహ్మణము అయిపోయింది. దీన్ని అంతర్యామి బ్రాహ్మణము అన్నా, ఆరుణి బ్రాహ్మణముగా కూడా వ్యవహరిస్తారు.

# 3.8 - అక్షర బ్రాహ్మణము

ఈ అక్షర బ్రాహ్మణంలో గార్గి తిరిగి వస్తుంది. ఆరవ అధ్యాయంలో ఆవిడ భూలోకంతో మొదలుపెట్టి, దాని ఓతం, ప్రోతం ఏమిటి అని అడుగుతూ వచ్చింది. ఓతం, ప్రోతం అంటే ఒక వస్త్రంలో నిలువుదారాలు, అడ్డదారాలు. వీటినే పడుగుపేక అంటారు. అంటే కారణం లేదా ఆంతరం ఏమిటని అర్థం. ఆ ప్రశ్నలకు జవాబు చెప్పుకుంటూ, చివరిలోకం బ్రహ్మలోకానికి వచ్చాడు యాజ్ఞవల్క్యుడు.

గార్గి బ్రహ్మలోకానికి ఆంతరం ఏమిటని అడిగింది, అక్కడితో జడప్రపంచం అయిపోతుంది. బ్రహ్మలోకానికి కారణం బ్రహ్మలోక అధిపతి. ఆయన చేతనతత్త్వం. ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకు చేతనతత్త్వం అందదు. అందుకే విజ్ఞానశాస్త్రం కూడా ఈ చేతనతత్త్వాన్ని అందుకోలేకపోయింది. అందువల్ల హిరణ్యగర్భ గురించి ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాల పరిధిలో అడగవద్దు అన్నాడు. అక్కడ హిరణ్యగర్భను **అనతి ప్రశ్న్యాం వై దేవతామ్** అని నిర్వచించి, నువ్వు అతి ప్రశ్నలు వేస్తున్నావు, అలా వేస్తే నీ తల ఊడిపడవచ్చు అన్నాడు. అప్పుడు గార్గి వాచక్నవి వెనుదిరిగింది.

బ్రహ్మలోకానికి ఓతం, ప్రోతం హిరణ్యగర్భ; హిరణ్యగర్భకు ఓతం ప్రోతం అంతర్యామి; అంతర్యామికి ఓతం ప్రోతం నిర్గుణబ్రహ్మ. ఆరవ బ్రాహ్మణములో భూలోకంనుంచి బ్రహ్మలోకందాకా వచ్చామని చూశాము. అంటే దాని తర్వాత మూడు మెట్లు ఉన్నాయి. అవి హిరణ్యగర్భ, అంతర్యామి, నిర్గుణబ్రహ్మ.

హిరణ్యగర్భ మొదటిమెట్టు.

హిరణ్యగర్భ – సమష్టి సూక్ష్మ ప్రపంచ సహిత చైతన్యం
అంతర్యామి – సమష్టి కారణ ప్రపంచ సహిత చైతన్యం
అక్షరం – నిష్ప్రపంచ చైతన్యం

కాని ఆ దశలకు వెళ్ళాలంటే ముందు చైతన్యం గురించి అర్థం కావాలి. చైతన్యం ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకు అందదని చూశాము. చైతన్యం అపౌరుషేయ విషయం. అందువల్ల ఇది ప్రమాణాలకు అందదు. కేవలం శాస్త్రప్రమాణంద్వారానే తెలుసుకోగలము.

అప్పుడు గార్గిని యాజ్ఞవల్క్యుడు బెదిరిస్తే అప్పుడు తాత్కాలికంగా ఊరుకుని, ఇప్పుడు మళ్ళీ రెట్టించిన ఉత్సాహంతో తిరిగివచ్చింది. ఈ బ్రాహ్మణములో రెండు ప్రశ్నలు అడగటానికి వచ్చింది. హిరణ్యగర్భకు ఓతం ప్రోతం ఏమిటి? అంతర్యామికి ఓతం ప్రోతం ఏమిటి? ముందు బ్రాహ్మణములో జవాబుద్వారా బ్రహ్మలోకానికి ఆంతరం హిరణ్యగర్భ అని చూసింది. హిరణ్యగర్భను సూత్రం అన్నాడు అందులో యాజ్ఞవల్క్యుడు.

గార్గి అడగబోయే ప్రశ్నలకు జవాబు మనకు తెలుసు. హిరణ్యగర్భకు ఆంతరం అంతర్యామి, అంతర్యామికి ఆంతరం అక్షరం. ఇంకో విధంగా చెప్పాలంటే సగుణ హిరణ్యగర్భకు ఆంతరం సగుణ ఈశ్వరుడు, సగుణ

ఈశ్వరునికి ఆంతరం నిర్గుణబ్రహ్మ. నిర్గుణబ్రహ్మను అక్షరబ్రహ్మ అంటారు. ఈ పదాన్ని ముండకోపనిషత్తులో చూస్తాము.

అక్షరబ్రహ్మ గురించి వస్తుంది కాబట్టి ఈ బ్రాహ్మణానికి అక్షర బ్రాహ్మణము అని పేరు వచ్చింది. అక్షరబ్రహ్మయొక్క ఆంతరం ఏమిటని అడగకూడదు. అదే చివరది.

మన ప్రయాణాన్ని పృథివితో మొదలుపెట్టి బ్రహ్మలోకానికి వచ్చాము. అక్కడ్నుంచి హిరణ్యగర్భ, ఈశ్వరుడు, నిర్గుణబ్రహ్మకు ప్రయాణించాలి. నిర్గుణబ్రహ్మే సర్వాంతరం బ్రహ్మ.

సర్వాంతరం పదం నాలుగవ బ్రాహ్మణములో ప్రవేశపెట్టబడింది. నాలుగు, ఐదు, ఆరు, ఏడు బ్రాహ్మణాలలో కొనసాగి, ఎనిమిదవ బ్రాహ్మణము నిర్గుణబ్రహ్మ సర్వాంతరం బ్రహ్మ అని ముగింపు పలుకుతుంది.

గార్గి రెట్టించిన ఉత్సాహంతో వచ్చినా, కొంత జంకు కూడా ఉంది. ప్రతి ఒక్కరూ ఒక్కసారి ప్రశ్న అడిగితే, ఈవిడ రెండవసారి మళ్ళీ వచ్చింది. పైగా మొదటిసారే యాజ్ఞవల్క్యుడు నువ్వు అతి ప్రశ్నలు వేస్తున్నావు, అలా వేస్తే నీ తల ఊడిపడవచ్చు జాగ్రత్త అని హెచ్చరించాడు కూడా. అయినా వచ్చింది కాబట్టి తక్కిన బ్రాహ్మణుల అనుమతి కోరుతుంది.

## మంత్రం 3.8.1

**అథ హ వాచక్నవ్యువాచ బ్రాహ్మణా భగవన్తో హన్తాహమిమం ద్వౌ ప్రశ్నౌ ప్రక్ష్యామి తౌ చేన్మే వక్ష్యతి న జాతుయుష్మాకమిమం కశ్చిద్బ్రహ్మోద్యం జేతేతి పృచ్ఛ గార్గీతి ॥**

**అథ హ వాచక్నవ్యువాచ** – తర్వాత గార్గి వాచక్నవి అడిగింది.

**బ్రాహ్మణా భగవంతో హంతాహమిమం ద్వౌ ప్రశ్నౌ ప్రక్ష్యామి** – పూజ్యనీయులైన ఓ బ్రాహ్మణులారా, మీరు అనుమతినిస్తే, నేను యాజ్ఞవల్క్యుణ్ణి రెండు ప్రశ్నలు అడుగుతాను. వారిని అనుమతి అడగటంలో అంతర్లీనంగా ఇంకొక ఉద్దేశం కూడా ఉంది. అనుమతితో పాటు వాళ్ళ దీవెనలు కూడా కోరుతున్నది. యాజ్ఞవల్క్యుని శాపం ఫలించకుండా వారు దీవించాలని ఆమె ఉద్దేశం.

**తౌ చేన్మే వక్ష్యతి న జాతు యుష్మాకమిమం కశ్చిద్బ్రహ్మోద్యం జేతేతి** – ఒకవేళ యాజ్ఞవల్క్యుడు ఈ ప్రశ్నలకు జవాబు చెప్పగలిగితే, ఇంక మీలో వేరెవ్వరూ ఆయనను బ్రహ్మవిద్యలో నిశ్చయంగా జయించలేరు అంది. కశ్చిద్బ్రహ్మోద్యం జేతా – అవి చాలా క్లిష్టమైన ప్రశ్నలు కాబట్టి, వాటికి అతను జవాబు చెప్పగలిగితే ఇంక ఈ బ్రహ్మవిద్యలో బలాబలాలు తేల్చుకోనవసరం లేదని ఆమె ఉద్దేశం. తనమీద తనకెంత నమ్మకముందో చూడండి. దీన్ని పొగరుగా భావించకూడదు. ఇది అక్షరవిద్య కాబట్టి దీన్ని మించిన విద్య లేదు.

దీన్ని ప్రథమ మల్లన్న న్యాయం అంటారు. అంటే మల్లయుద్ధంలో యోధుడు అనిపించుకోవాలంటే ప్రతి ఒక్కరితో పోటీ చెయ్యనవసరం లేదు. ఆ కాలంలో ప్రథమ మల్లన్నగా ఎవరైతే కీర్తి పొందాడో, అతన్ని ఓడిస్తే చాలు.

గార్గి పరోక్షంగా నేను అలాంటి ప్రథమ మల్లన్నను, నన్ను యాజ్ఞవల్క్యుడు ఓడిస్తే మిమ్మల్నందరినీ కూడా ఓడించినట్టే అర్థం, మీరు అనవసరంగా ప్రశ్నలు అడగనవసరం లేదు అంది. అంటే అతనికి వెయ్యి ఆవులను ఇచ్చేయవచ్చు అని ఆవిడ ఉద్దేశం. ఈ వాదనలన్నీ మొదటి బ్రాహ్మణములో జనకుడు ఎవరు వేదవిత్ అయితే అతనికి బంగారు తొడుగు ఉన్న వెయ్యి ఆవులను ఇస్తానని ప్రకటించటంవల్ల వచ్చాయని మర్చిపోకూడదు.

బ్రహ్మోద్యం = బ్రహ్మ + ఉద్యం, అంటే వేద + వాదః

వేదవాదః అంటే వేదబోధ. ఇక్కడ వేదాంతబోధ అనటం లేదు. వేద అంటున్నాము. ఎందుకంటే ఈ వాదనల్లో వేదపూర్వభాగం, వేద ఉత్తరభాగం రెండూ ఉన్నాయి.

**పృచ్ఛ గార్గీతి** – తక్కిన బ్రాహ్మణులు ఆమె కోరినట్టుగానే అనుమతిని ఇచ్చారు. అడుగు గార్గీ అన్నారు. విద్యను ఎవరిలో ఉన్నా, తక్కినవారు గౌరవిస్తారు.

## మంత్రం 3.8.2

**సా హోవాచాహం వై త్వా యాజ్ఞవల్క్య యథా కాశ్యో వా వైదేహో వోగ్రపుత్ర ఉజ్జ్యం ధనురధిజ్యం కృత్వా ద్వౌ బాణవన్తౌ సపత్నాతివ్యాధినౌ హస్తే కృత్వోపోత్తిష్ఠేదేవమేవాహం త్వా ద్వాభ్యాం ప్రశ్నాభ్యాముపోదస్థాం తౌ మే బ్రూహీతి పృచ్ఛ గార్గీతి ॥**

ఇప్పుడు యాజ్ఞవల్క్యునికేసి చూస్తుంది. అతన్ని భయపెడుతున్నాననుకుంది. కాని యాజ్ఞవల్క్యుడు చెక్కుచెదరడు. ఆయనను సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారంగా భావిస్తారు. అలాంటప్పుడు ఆయన కూడా సర్వజ్ఞుడు అవుతాడు.

**సా హోవాచాహః వై త్వా యాజ్ఞవల్క్య యథా కాశ్యో వా వైదేహో వోగ్రపుత్రః** – ఆమె ఇలా పలికింది. ఓ యాజ్ఞవల్క్యా! నేను కాశీరాజు లేదా విదేహరాజులాగా వచ్చాను.

**ఉజ్జ్యం ధనురధిజ్యం కృత్వా ద్వౌ బాణవంతౌ సపత్నాతివ్యాధినౌ హస్తే కృత్వోపోత్తిష్ఠేత్** – ఎలాగైతే అటువంటి వీరులు నారిత్రాడు లేని ధనుస్సుకు నారిత్రాడుని బిగించి, పదునైన కొనలుగల రెండు బాణాలను చేతిలో పట్టుకుని నిలిచివుంటారో,

**ఏవమేవాహం త్వా ద్వాభ్యాం ప్రశ్నాభ్యాముపోదస్థాం తౌ మే బ్రూహీతి** – అదే విధంగా నేను రెండు ప్రశ్నలతో నీ ఎదుట నిలిచివున్నాను. వాటికి నువ్వు జవాబులు చెప్పాలి.

**పృచ్ఛ గార్గీతి** – ఓ గార్గీ, అడుగు అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

నేను నిన్ను రెండు క్లిష్టమైన ప్రశ్నలు అడుగుతాను, ఎలా ఎదుర్కొంటావో చూడు అని యాజ్ఞవల్క్యుణ్ణి బెదిరిస్తున్నది. ఈ భావనను తెలియజేయటానికి విలుకాడి ఉదాహరణను ఇస్తున్నది.

మామూలుగా విల్లును ఎక్కుపెట్టి ఉంచరు. యుద్ధం చేసేముందే దాన్ని ఎక్కుపెడతారు. దాన్ని ఎక్కుపెట్టాక, బాణాన్ని తీస్తారు. ఆ బాణం అంచు పదునుగా ఉంటుంది. బాణాన్ని శరం అనీ, అంచును బాణం అనీ అంటారు. అంచును తీసి విషంలో ముంచి, క్రూరమృగాలను చంపటానికి వాడతారు.

గార్గి తను అలా విల్లును ఎక్కుపెట్టి, పదునైన బాణాలతో వచ్చి నీ ముందు నిలుచున్నాను అంటున్నది. అది కూడా మామూలు విలుకాడుగా కాదు, కాశీరాజు లేదా విదేహరాజు అంతటి బలశాలిని అంటున్నది. వారు వీరపరాక్రమాలలో పేరు ప్రఖ్యాతులు పొందినవారు. అంత శక్తివంతమైన ప్రశ్నలతో నిన్ను ఎదుర్కోబోతున్నాను అంటున్నది. అవి అతని బుద్ధికి సవాలు. యాజ్ఞవల్క్యుడు భయపడతాడు అనుకుంది. అతను తేలికగా పృచ్ఛ గార్గీతి అన్నాడు. అడుగు గార్గీ అన్నాడు.

## మంత్రం 3. 8. 3

**సా హెూవాచ యదూర్ధ్వం యాజ్ఞవల్క్య దివో యదవాక్ పృథివ్యా యదన్తరా ద్యావాపృథివీ ఇమే యద్భూతం చ భవచ్చ భవిష్యచ్చేత్యాచక్షతే కస్మింస్తదోతం చ ప్రోతం చేతి ॥**

ఈ ప్రశ్న హిరణ్యగర్భకు లేదా సూత్రానికి ఆంతరం ఏమిటి?

**సా హెూవాచ** – ఆమె ఇలా అడిగింది.

**యదూర్ధ్వం యాజ్ఞవల్క్య దివః** – యత్ అంటే సూత్రం. అది ద్యులోకం కంటే పైన ఉంది;

**యదవాక్ పృథివ్యా** – పృథివి కంటే కింద ఉంది;

**యదంతరా** – ద్యులోకానికీ, పృథివికీ మధ్యలో ఉంది;

**ద్యావాపృథివీ ఇమే** – తానే ద్యులోకంగా, పృథివీలోకంగా ఉంది;

**యద్భూతం చ భవచ్చ భవిష్యచ్చ** – అది భూతవర్తమానభవిష్యకాలాలలో కూడా ఉంది.

**ఇత్యాచక్షతే** – అని దేన్ని అంటారో,

**కస్మింస్తదోతం చ ప్రోతం చేతి** – దానికి ఓతం ప్రోతం ఏది?

గార్గే హిరణ్యగర్భను నిర్వచించింది. హిరణ్యగర్భను సర్వాత్మకంగా వర్ణించింది. ఆకాశానికి పైన, భూమికి కింద, రెండింటి మధ్యలో ఉండి, అన్ని కాలాల్లోనూ ఉండే హిరణ్యగర్భకు ఓతం, ప్రోతం ఏది? అంటే హిరణ్యగర్భ సర్వాంతర్యామి, కాలాతీతం. ఓతం, ప్రోతం అంటే పడుగుపేక అని చూశాము. అంటే హిరణ్యగర్భకు ఆంతరం ఏది? లేదా కారణం ఏది?

హిరణ్యగర్భను ఒక వస్త్రంతో పోలిస్తే, ఆ వస్త్రానికి పడుగుపేక లేకపోతే వస్త్రానికి ఉనికి లేనట్టే, హిరణ్యగర్భ ఉనికికి కారణం ఏది?

## మంత్రం 3. 8. 4.

**స హెూవాచ యదూర్ధ్వం గార్గి దివో యదవాక్ పృథివ్యా యదన్తరా ద్యావాపృథివీ ఇమే యద్భూతం చ భవచ్చ భవిష్యచ్చేత్యాచక్షత ఆకాశే తదోతం చ ప్రోతం చేతి ॥**

ఈ ప్రశ్నకు యాజ్ఞవల్క్యుడు జవాబు చెప్పాడు. కాని జవాబు చెప్పేముందు ఆమె చెప్పినదంతా మళ్ళీ చెప్పి, అటువంటి హిరణ్యగర్భకు ఆంతరం ఆకాశం అన్నాడు.

అంటే ఓ గార్గీ ద్యులోకం కంటే పైన ఉంది, పృథివికంటే కింది ఉంది; ద్యులోకానికి, పృథివికి మధ్యలో ఉంది; ద్యులోక, పృథివి లోకాలు కూడా తానే అయివుంది; భూతవర్తమానభవిష్యత్ కాలాలలో ఉంది అని దేన్ని అంటారో,

**ఆకాశే తదోతం చ ప్రోతం చేతి** – దానికి ఓతం ప్రోతం ఆకాశం. తత్ అంటే ఆ సూత్రానికి లేదా హిరణ్యగర్భకు.

ఇక్కడ ఆకాశం అంటే పంచభూతాలలో ఒకటైన ఆకాశం కాదు. ఆకాశం అంటే అవ్యాకృత ఆకాశం. అంటే ఈశ్వరుడు లేదా అంతర్యామి, లేదా మాయాసహిత బ్రహ్మ. ఈశ్వరుడు అంటే సమష్టి కారణప్రపంచ సహితచైతన్యం అని చూశాము. అందువల్ల ఆకాశం = ఈశ్వరుడు. అలా ఎలా చెప్పగలము? ఆకాశం కాశ్‌నుంచి వచ్చింది.

**ఆసమంతాత్ కాశతే ప్రకాశతే ఇతి ఆకాశః**

అంటే ఈశ్వరుడు లేకుండా, హిరణ్యగర్భకు ఉనికి లేదు. హిరణ్యగర్భ లేనిదే ప్రపంచం లేదు; ఈశ్వరుడు లేనిదే హిరణ్యగర్భుడు లేడు.

తర్వాత మెట్టు అలాగే ఈశ్వరుడు కూడా లేడు, ఉన్నది ఒక్కటే నిర్గుణబ్రహ్మ అంటాము. అందువల్ల అద్వైతం నచ్చదు అందరికీ. గార్గి వేసిన ఒక బాణం నిష్ఫలమైంది. యాజ్ఞవల్క్యుడు విజయం సాధించాడు.

## మంత్రం 3.8.5

**సా హోవాచ నమస్తేఽస్తు యాజ్ఞవల్క్య యో మ ఏతం వ్యవోచోఽపరస్మై ధారయస్వేతి పృచ్ఛ గార్గీతి ॥**

**సా హోవాచ నమస్తేఽస్తు యాజ్ఞవల్క్య** – తే నమః అస్తు – ఓ యాజ్ఞవల్క్యా నీకు నమస్కారం. ఎందుకు?

**యో మ ఏతం వ్యవోచః** – యః మే అంటే నువ్వు నా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పావు.

**అపరస్మై ధారయస్వేతి** – కాని మరో ప్రశ్నకు సిద్ధం అవు.

**పృచ్ఛ గార్గీతి** – ఓ గార్గీ, అలాగే అడుగు అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

గార్గి దూకుడుగా, యాజ్ఞవల్క్యుణ్ణి రెచ్చగొట్టేట్టుగా వచ్చినా, మొదటిప్రశ్నకు యాజ్ఞవల్క్యుడు సరిగ్గా సమాధానం చెప్పగానే అతని సమాధానానికి తలవొగ్గింది. ముందే చూసినట్టుగా ఆమెది అహంకారం కాదు, ఆత్మస్థైర్యం. అందువల్ల పూర్తిగా వెనక్కి తగ్గలేదు. ఇంకొక ప్రశ్న ఉంది, దానికి జవాబు చెప్పటానికి సిద్ధమవు అంది. ఆయన మళ్ళీ పృచ్ఛ గార్గీ అన్నాడు. అడుగు గార్గీ అన్నాడు.

రెండు ప్రశ్నలూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి కాబట్టి, గార్గి మొదటి ప్రశ్నను మళ్ళీ అడిగింది. అంతేకాదు, ఆ జవాబు నిజమా కాదా నిర్ధారణ చేసుకోవటానికి కూడా అడుగుతుంది. ఒక్కోసారి ఈ అనుభవం

మనకు కూడా జరుగుతూ ఉంటుంది. ఒక ప్రశ్నకు ఒకసారి జవాబు చెబుతాము కాని అదే ప్రశ్నను అవునా అని ఎవరైనా రెట్టించి అడిగితే, మనకు ఆ సమాధానం ఖచ్చితంగా తెలియకపోతే, ఏమో అనేస్తాము. అందువల్ల యాజ్ఞవల్క్యుణ్ణి పరీక్షించటానికి కూడా ఆ ప్రశ్న మళ్ళీ అడిగివుండవచ్చు. కాని యాజ్ఞవల్క్యుడు తన జవాబులో ఏ మాత్రం సందేహం లేదు కాబట్టి మళ్ళీ అదే జవాబు చెబుతాడు. అందువల్ల 3, 4 మంత్రాలనే మళ్ళీ 6, 7 మంత్రాలుగా చూస్తాము.

### మంత్రం 3.8.6

**సా హోవాచ యదూర్ధ్వం యాజ్ఞవల్క్య దివో యదవాక్ పృథివ్యా యదన్తరా ద్యావాపృథివీ ఇమే యద్భూతం చ భవచ్చ భవిష్యచ్చేత్యాచక్షతే కస్మింస్తదోతం చ ప్రోతం చేతి ॥**

### మంత్రం 3.8.7

**స హోవాచ యదూర్ధ్వం గార్గి దివో యదవాక్ పృథివ్యా యదన్తరా ద్యావాపృథివీ ఇమే యద్భూతం చ భవచ్చ భవిష్యచ్చేత్యాచక్షత ఆకాశ ఏవ తదోతం చ ప్రోతం చేతి కస్మిన్ను ఖల్వాకాశ ఓతశ్చ ప్రోతశ్చేతి ॥**

రాజా విక్రమార్కుని కొలువులో కాళిదాసు, ఇంకొక కవి ఉండేవారు. ఆ కవి కూడా కాళిదాసంత గొప్పవాడే అయినా రాజు కాళిదాసుపై పక్షపాతం చూపిస్తున్నట్టుగా రాణి భావించింది. అదే మాట రాజుని ప్రశ్నిస్తే, 'నేనొక నాటకమాడతాను, అప్పుడు నిజమేమిటో నీకే తెలుస్తుంది,' అన్నాడు.

రాజు, రాణి బిచ్చగాళ్ళ వేషం వేసుకుని, ఒక చిన్నబాబుని తీసుకుని రాజసౌధం ముందు కూర్చున్నారు. రాజు రాణితో ఇలా చెప్పాడు, 'నువ్వు ఆ బాబుమీద ముసుగువేసి, అతను చనిపోయినట్టుగా విలపించు. తక్కిన విషయం నేను చూసుకుంటాను.'

రాజు కవులందరికీ వార్త పంపాడు. ఆ బిచ్చగాడి ఏకైక పుత్రుడు మరణించాడనీ, అతను భగవంతుడిని వేడుకుంటే భగవంతుడు ఒక పద్యంలో మూడు పాదాలు మాత్రమే చెప్పిపంపాడనీ, ఏ కవి అయినా దాన్ని సరిగ్గా పూరిస్తే ఆ బాలుడు లేచికూర్చుంటాడనీ చెప్పించాడు. ఒక్కొక్క కవీ వచ్చి ప్రయత్నించారు కానీ లాభం లేకపోయింది. కాళిదాసుతో సమానస్థాయిలో ఉన్న కవి కూడా వచ్చాడు కానీ అతను కూడా బాలుడిని బ్రతికించ లేకపోయాడు.

చివరికి కాళిదాసు వంతు వచ్చింది. అతను కూడా అంతకుముందు కవి చెప్పిన పాదమే చెప్పాడు కాని ఆ బాలుడు లేవలేదు. అప్పుడు కాళిదాసు 'దేవుడు ఏమన్నాడు?' అని అడిగాడు. దానికి బిచ్చగాడి వేషంలో ఉన్న రాజు 'మరణించిన పుత్రుడు లేస్తాడు అన్నాడు,' అన్నాడు. 'అవును, నిజమే మరణించిన పుత్రుడు లేస్తాడు, ఇతను లేవలేదంటే ఇతను మరణించలేదు,' అని గట్టిగా చెప్పాడుట కాళిదాసు. అదీ జ్ఞానానికీ, జ్ఞాననిష్ఠకీ మధ్య ఉన్న భేదం. యాజ్ఞవల్క్యుడు జ్ఞాననిష్ఠలో ఉన్నాడు.

ఏడవ మంత్రం చివర్లో ప్రశ్న వస్తుంది.

**కస్మిన్ను ఖల్వాకాశ ఓతశ్చ ప్రోతశ్చేతి** – ఆకాశంయొక్క ఓతం ప్రోతం ఏదని అడిగింది గార్గి. ఆకాశం అంటే అంతర్యామి ఈశ్వరుడు అని మర్చిపోకూడదు.

చాలామందికి చివరిమెట్టు సగుణ ఈశ్వరుడు. విశిష్టాద్వైతం విష్ణుమూర్తే పరమాత్మ అంటే, శివభక్తులు శివుడే పరమాత్మ అంటారు. వారు నిర్గుణబ్రహ్మకు రారు. ఈ ప్రశ్నకు జవాబుగా యాజ్ఞవల్క్యుడు సగుణ ఈశ్వరునికన్నా పైస్థాయిలో నిర్గుణబ్రహ్మ ఉందని నిరూపించబోతున్నాడు.

అంటే ఈశ్వరుడు కూడా మిథ్య. జీవుడు, జగత్తు ఎంత సత్యమో, ఈశ్వరుడు కూడా అంతే సత్యం. అంటే జీవజగత్తు ఈశ్వరుడు అనే త్రిపుటి వ్యవహారికస్థాయికి చెందినది. ఈశ్వరుడు కూడా మిథ్య అనే అంశం చాలామంది జీర్ణించుకోలేరు కాని వారు జీర్ణించుకున్నా, జీర్ణించుకోలేకపోయినా అది సత్యం. వ్యావహారిక స్థాయిలో ఈశ్వరుడు కర్మఫలదాత. జీవుడు, జగత్తు తనను బాధిస్తోందని, ఈశ్వరునితో మొరపెట్టుకుంటాడు. తనకు వరాలు ప్రసాదించమని ఈశ్వరునికి పూజలు, యజ్ఞయాగాదులు, తపస్సులు చేస్తాడు. కాని ఇదంతా వ్యవహారికస్థాయిలో మాత్రమే జరుగుతుంది. పారమార్థికస్థాయికి ఎదిగితే ఈశ్వరునికి కూడా అధిష్ఠాన దేవత ఉంది. ఈశ్వరుడు సగుణ ఈశ్వరుడు; జీవుడు, జగత్తులు కూడా సగుణ జీవుడు, సగుణ ప్రపంచాలు.

వీటన్నిటికీ గుణాలు ఉంటాయి. జీవునిది నికృష్ట ఉపాధి అయితే, ఈశ్వరునిది ఉత్కృష్ట ఉపాధి. అక్షర నిర్గుణబ్రహ్మమీద సగుణ ఈశ్వరుణ్ణి ఆరోపించాము, సగుణ ఈశ్వరుణ్ణే కాదు, సగుణజీవిని, సగుణ జగత్తును కూడా ఆరోపించాము. అందువల్ల జ్ఞాని నేను నిర్గుణబ్రహ్మను, నేను జీవ, జగత్తు, ఈశ్వరులకు అధిష్ఠానాన్ని అని చెప్పవచ్చు. వ్యావహారికస్థాయికి ఇంకొక పేరు మిథ్య. నిర్గుణబ్రహ్మ పారమార్థికస్థాయికి చెందినది.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం చాలా కష్టమని గార్గి అభిప్రాయం. ఎందుకు? నిర్గుణబ్రహ్మను నిర్వచించటం కష్టం కాబట్టి.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాక్‌గచ్ఛతి నో మనః**

ఆత్మను కళ్ళు చూడలేవు, వాక్కు వివరించలేదు, మనస్సు అర్థం చేసుకోలేదు. అలాంటి ఆత్మను ఎలా వర్ణిస్తాడు? అలాగని వర్ణించలేకపోతే అతనికి అప్రతిపత్తిదోషం పట్టుకుంటుంది. అంటే ప్రతిపక్షిని పరాజయానికి గురిచేసే యుక్తి లేనట్టు అవుతుంది. అలాగని ఏదైనా చెపితే, చెప్పశక్యం కాని అక్షరం గురించి చెప్పినందుకు విప్రతిపత్తి అనే దోషం అంటుతుంది. అంటే వాక్కుకు అందని అక్షరాన్ని గురించి ఏం చెప్పినా, అది విరుద్ధ భావమే అవుతుంది. ఏం చేసినా అవస్థే. అందువల్ల అతని పరిస్థితి ముందు చూస్తే నుయ్యి, వెనక చూస్తే గొయ్యి అన్నట్టు ఉంది అనుకోవచ్చు.

ఇంతకుముందు కూడా చూశాము, ఒక వస్తువును వర్ణించటానికి ఐదు నియమాలు ఉండాలని. అవి ద్రవ్యం, గుణం, కర్మ, జాతి, సంబంధం.

**ద్రవ్యం** – ప్రత్యక్ష ప్రమాణానికి అందేటట్టుగా ఉండాలి. ప్రసిద్ధ వస్తువై ఉండాలి. సూర్యుడు ఎలా ఉంటాడంటే నేను సూర్యుణ్ణి వర్ణించనవసరం లేదు. బయటకు తీసుకువెళ్ళి సూర్యుణ్ణి చూపించవచ్చు.

**గుణం** – గుణాలు కలిగివుండాలి. పొట్టి, పొడుగు, నీలం, తెలుపు, మొదలైనవి.

**కర్మ** – ఒక వ్యక్తి చేసే పనినిబట్టి అతనిని వర్ణించవచ్చు. అతను డ్రైవరు, వంటవాడు, ఆఫీసరు, గుమాస్తా పదాలతో వర్ణించవచ్చు.

**జాతి** – ఒక ప్రత్యేకమైన జాతికి చెందినవాడిగా వర్ణించవచ్చు. మానవజాతికి చెందినవాడు.

**సంబంధం** – ఇతరులతో ఉన్న సంబంధాన్ని పట్టి నిర్వచించవచ్చు. అతను గురువు, ముఖ్యమంత్రి అనవచ్చు.

**శబ్ద ప్రవృత్తి నిమిత్తానామ్ అభావత్**

ఈ శబ్దాలద్వారా వర్ణించలేదు అక్షరబ్రహ్మను. ఎందుకు? అక్షరబ్రహ్మ

ద్రవ్యం కాదు – అప్రత్యక్షం కాబట్టి

గుణం లేదు – నిర్గుణం కాబట్టి

కర్మ చెయ్యదు – అకర్తా కాబట్టి

జాతి లేదు – స్వజాతి లేదు కాబట్టి

సంబంధం లేదు – అద్వైతం కాబట్టి.

అందువల్ల మాటలతో వర్ణించలేదు, అలాగని మౌనవ్యాఖ్యానమూ చెయ్యలేదు.

కాని యాజ్ఞవల్క్యునివంటి సర్వజ్ఞులకు అది సమస్యే కాదు. అతను ఎలా చెప్పాడో తర్వాత వచ్చే మంత్రంలో చూస్తాము.

మంత్రం 3.8.8

**స హోవాచైతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదన్తి ॥**

**అస్థూలమనణ్వహ్రస్వమదీర్ఘమలోహితమస్నేహమచ్ఛాయమతమోఽ వాయ్వనాకాశమసఙ్గమ రసమగన్ధమచక్షుష్కమశ్రోత్రమవాగమనోఽ తేజస్కమప్రాణమముఖమమాత్రమనన్తరమబాహ్యం న తదశ్నాతి కిఞ్చన న తదశ్నాతి కశ్చన ॥**

నేను అక్షరబ్రహ్మను వివరించి చెడ్డపేరు తెచ్చుకోను కాని, అంతకుముందు ఋషులు ఎలా చెప్పారో అలా నేను చెబుతాను అన్నాడు.

అయినా ఒక సందేహం కలుగుతుంది. యాజ్ఞవల్క్యుడు ప్రత్యక్షంగా చెప్పకుండా విప్రతిపత్తిదోషంనుంచి తప్పించుకున్నాడు కాని, ఋషులు ప్రత్యక్షంగా చెపితే, వారికి ఆ దోషం అంటదా? వారు ప్రత్యక్షంగా చెప్పలేదు, వారు చెప్పకనే చెప్పారు అంటారు. అదెలా సాధ్యం? నాకు అర్థం కాలేదని నాకు అర్థమయింది అంటారు. ఇదీ అర్థం చేసుకోవటం అంటే. బ్రహ్మను వివరించే తీరు అది.

వర్ణించశక్యం కాని బ్రహ్మను రెండు పద్ధతుల్లో వర్ణించవచ్చు. వాటిని నిషేధముఖవాక్యం, విధిముఖవాక్యం అంటారు. శాస్త్రంలో రెండూ ప్రసిద్ధి చెందిన పద్ధతులే. ఈ మంత్రంలో యాజ్ఞవల్క్యుడు నిషేధముఖవాక్యాన్ని

వాడాడు. అందువల్ల ఈ మంత్రం చాలా గొప్పమంత్రం. నిషేధముఖవాక్యం గురించి చెప్పాల్సినప్పుడు దీని గురించి చెబుతుంటారు శంకరులవారు. ఆత్మబోధలో కూడా ఇందులోని పదాలను వాడారు. దీని గురించి మళ్ళీ చూద్దాము. ముందు విధిముఖవాక్యం గురించి చూద్దాము.

**విధిముఖవాక్యం** – ఇది సానుకూల పద్ధతిలో బ్రహ్మ లక్షణాన్ని వివరిస్తుంది.

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ** – తైత్తిరీయం

ఒకపక్క సానుకూల పద్ధతిలో బ్రహ్మను వివరించలేమంటూ మళ్ళీ ఎలా సానుకూల పద్ధతిలో వివరిస్తారు? బ్రహ్మను వివరించాలంటే ఐదు గుణాలైన ద్రవ్యం, గుణం, కర్మ, జాతి, సంబంధాలు ఉండాలని చూశాము కదా. అంటే ఇది కూడా పూర్తిగా సానుకూలంగా నిర్వచించినట్టు కాదు. ఇది పరోక్షంగా బ్రహ్మను నిర్వచిస్తుంది. తైత్తిరీయంలో ఈ పద్ధతిని వాడింది ఉపనిషత్తు.

**సత్యం జ్ఞానం అనంతమ్ బ్రహ్మ**

**అనంతం** – ముందు అనంతం పదాన్ని చూద్దాము. అనంతం అంటే దేశకాలవస్తుపరిమితులు లేనిది. అంటే ఆది అంతములు లేనిది అనంతం. అంటే బ్రహ్మ సర్వవ్యాపకం, నిత్యం, అద్వితీయం.

**సత్యం** – సత్యం అంటే ఉనికి ఉన్న ఏ వస్తువైనా. ఉదాహరణకు గడియారం, పుస్తకం, కుర్చీ, జగత్తు. సత్యం యొక్క ఈ అర్థాన్ని బ్రహ్మకు అన్వయిస్తే, ఉనికి ఉన్న ప్రతి వస్తువూ బ్రహ్మ అవాలి కానీ, ఉనికి ఉన్న వస్తువుకు దేశకాల వస్తు పరిమితులు ఉంటాయి. ఇప్పుడు బ్రహ్మకు ఈ దేశకాల వస్తు పరిమితులు లేవని చూశాము. అందువల్ల సత్యం పదాన్ని అనంతంతో కలిపి చూడాలి.

ఏ వస్తువుకైనా మూడు భాగాలుంటాయి. అవి నామం, రూపం, ఉనికి (సత్తా).

ఉనికి ఉన్న పుస్తకం – పుస్తకం నామం, పుస్తకం రూపం, ఉనికి.
ఉనికి ఉన్న బల్ల – బల్ల నామం, బల్ల రూపం, ఉనికి.

రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఉనికి. నామరూపాలు మారుతాయి. అందువల్ల సత్యం అంటే నామరూపాలను భాగత్యాగం చేసి, నామరూప రహితసత్ (సత్తా) అంటాము. అంటే సత్యంయొక్క లక్ష్యార్థం తీసుకున్నాము వాచ్యార్థం కాదు.

**జ్ఞానం** – జ్ఞానం వాచ్యార్థం ఎఱుక. కుండ ఎఱుక, బల్ల ఎఱుక, పుస్తకం ఎఱుక మొదలైనవి.

ఇక్కడ కూడా ఏ వస్తువుకైనా మూడు భాగాలుంటాయి. అవి నామం, రూపం, ఎఱుక (చిత్).

ఎఱుక ఉన్న పుస్తకం – పుస్తకం నామం, పుస్తకం రూపం. ఎఱుక.
ఎఱుక ఉన్న బల్ల – బల్ల నామం, బల్ల రూపం. ఎఱుక.

రెండింటిలోనూ సమానంగా ఉంది ఎఱుక. ఈ ఎఱుక ఎక్కడ ఉంది? నా మనస్సులో. వృత్తి (ఆలోచన) రూపంలో. వృత్తిరూపంలో కలిగిన ఈ జ్ఞానాన్ని బ్రహ్మ అనలేము. ఎందుకంటే ఒక వస్తువును గురించిన వృత్తికి

దేశకాల వస్తుపరిమితులు ఉంటాయి. ఇప్పుడే బ్రహ్మకు ఈ దేశకాల వస్తుపరిమితులు లేవని చూశాము. అందువల్ల జ్ఞానం పదాన్ని కూడా అనంతంతో కలిపి చూడాలి. ఇక్కడ కూడా నామరూపాలు తీసేసి సమానంగా ఉన్న ఎఱుక తీసుకోవాలి. వస్తువు వృత్తి వస్తుంది, చిత్ ఉంటుంది; వస్తువు వృత్తి పోతుంది, చిత్ ఉంటుంది. అలా వృత్తులు వచ్చిపోయినా చిత్ మాత్రం అనంతంగా ఉంటుంది. అందువల్ల చిత్ లేదా జ్ఞానం అంటే నామరూప రహిత చిత్. అలా లక్ష్యార్థంద్వారా చిత్‌ను కూడా నిర్వచిస్తాము. ఆ విధంగా

సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ = నామరూపరహిత సత్

నామరూపరహిత చిత్, దేశకాలవస్తు పరిచ్ఛేదరహిత అనంతమ్.

**నిషేధముఖవాక్యం** – దీన్ని నేతి–నేతి పద్ధతి అని కూడా అంటారు. న ఇతి, న ఇతి అంటూ ఒక్కొక్కదాన్నీ ఇది కాదు, ఇది కాదు అని నిషేధించుకుంటూ వస్తాము. అలా నిషేధించుకుంటూ వస్తే ఏం మిగులుతుంది? ఏమీ మిగలదు అంటారు కొందరు. కాని అది నిజం కాదు. ఈ గదిలో ఎవరూ లేరని నేను చెపితే, చెప్పిన నేను తప్ప ఎవరూ లేరని అర్థం. ఆ విధంగా ప్రతిదీ నిషేధించుకుంటూ వస్తే నిషేధించిన నేను మిగులుతాను.

ఒక కథలో ఒక రాజు రాజకుమారికి పెళ్ళి చేద్దామని స్వయంవరం ప్రకటించాడు. ఎందరో రాజకుమారులు వచ్చారు. వారికి ఎన్నో పోటీలు నిర్వహించారు. వాటిల్లో ఇద్దరు గెలుస్తూ వచ్చారు. ఇద్దరూ సమానస్థాయిలో నిలిచారు. వారిలో ఎవరిని ఎన్నుకోవాలి అన్నది సమస్య. రాజుకు ఒకరు నచ్చితే, రాజకుమారికి ఇంకొకరు నచ్చారు. ఆ విషయం రాజకుమార్తెకు తన చెలికత్తెద్వారా తెలిసింది. ఎటూ తేల్చుకోలేక, రాజు ఇద్దరి పేర్లూ రెండు చీటీలమీద రాసి, ఎవరి పేరుని రాజకుమారి తీస్తే, అతన్ని రాజకుమారి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించాడు. కాని రాజు రెండు చీటీలమీద తనకి నచ్చిన అబ్బాయి పేరే రాశాడు. కాని అది కూడా రాజకుమార్తెకు తన అంతరంగిక చెలికత్తెద్వారా తెలిసింది.

తండ్రిని మించిన తనయ ఈ రాజకుమార్తె. చాలా తెలివిగా సమస్యను పరిష్కరించింది. తను ఒక చీటీ తీసి, 'నాకు కాబోయే భర్త పేరు పలకటానికి నాకు సిగ్గుగా ఉంది. అందువల్ల నేను అతని పేరు పలకను. మీరు రెండవ చీటీ తీసి చూడండి. అందులో ఏ పేరు ఉంటే, అది కాకుండా రెండో పేరు నేను తీసిన చీటీలో ఉంటుంది,' అంది. ఇది నేతి నేతి పద్ధతి. తన భర్త పేరు పలకకుండా, తనకు కావాల్సిన భర్తను పొందింది.

ఆ విధంగా అన్నీ నిషేధించుకుంటూపోతే మిగిలేది ఏదో అది ఆత్మ.

ఇలా నిషేధించటంద్వారా మిగిలింది సాక్షి లేదా ఆత్మ అంటాము. బాగానే ఉంది కాని, అన్నీ నిషేధించాక మిగిలింది సాక్షి అని నాకెలా తెలుస్తుంది? ఆ సాక్షిని ఎవరు చూపిస్తారు? సాక్షిని ఎవరూ చూపించనవసరం లేదు. సాక్షి **స్వయంప్రకాశకజ్యోతి,** సాక్షి అంటే నేను.

సాక్షి స్వయంప్రకాశకజ్యోతి అంటే, అన్నింటినీ నిషేధించక ముందు కూడా సాక్షి ఉందా, లేదా? స్వయం ప్రకాశకజ్యోతి అంటే ఎప్పుడూ ఉండే జ్యోతి అని అర్థం. అయితే మళ్ళీ ఇంకో ప్రశ్న. ఎప్పుడూ ఉండే జ్యోతి అంటే నిషేధం చెయ్యకముందూ ఉండాలి, నిషేధం చేశాక కూడా ఉండాలి. సాక్షి గనుక అలా నిషేధం చెయ్యక ముందు కూడా ఉంటే, నిషేధం ఎందుకు చెయ్యాలి?

నిషేధం చెయ్యకముందూ సాక్షి ఉంది. అంటే 'నేను' ఉన్నాను కాని ఆ నేనుమీద అనేక గుణాలను ఆరోపించి ఆ గుణాలే నేను అనుకుంటున్నాను. ఎలా తెలుసు ఆ విషయం? ఎందుకంటే నేను లావుగా ఉన్నాను, నాకు జలుబు చేసింది, నాకు చికాకుగా ఉంది లాంటి మాటలు వాడుతున్నాము. అవన్నీ శరీరానికి, ఇంద్రియాలకు, మనస్సుకు చెందిన పదాలు. నేను శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు అని నిషేధించుకుంటూ వస్తే మిగిలేది గుణాలు లేని నేను. ఈ గుణాలు లేని నేనే అక్షరబ్రహ్మను.

మనస్సు మేలుకోగానే మొట్టమొదట జాగృతం చెందేది జ్ఞాతా అనే నేను. సుషుప్తిలో మనస్సు కూడా పడుకుంటుంది. సుషుప్తినుంచి లేవగానే ముందు మనస్సు మేలుకుంటుంది. అప్పుడు మేలుకునే మొదటి గుణం– ప్రమాతా. తర్వాత నేను మనిషిని, నేను భర్తనులాంటి గుణాలు వచ్చి చేరతాయి. మొదటి గుణాన్ని అహంకారం అంటారు. ఈ గుణాలను నిషేధించుకుంటూ వస్తే మిగిలేది శుద్ధసాక్షి చైతన్యం. అదే ఈ మంత్రం సారాంశం. ఇప్పుడు మంత్రాన్ని చూద్దాము.

1. **ద్రవ్యం కాదు** – వస్తువు కాదు.
   **అస్థూలమ్** – అది స్థూలము కాదు; **అనణు** – సూక్ష్మం కాదు; **అహ్రస్వమ్** – పొట్టిది కాదు; **అదీర్ఘమ్** – పొడుగుది కూడా కాదు; వీటినిబట్టి ఆత్మ ద్రవ్యం కాదని తెలుస్తున్నది. ద్రవ్యం అయితే స్థూలంగానో, సూక్ష్మంగానో, పొట్టిగానో, పొడవుగానో ఉంటుంది. అక్షరబ్రహ్మ అవ్యవహారం.

2. **గుణం లేదు** – గుణాలు లేవు.
   **అలోహితమ్** – ఎఱుపు కాదు. ఎఱుపు అంటే ఒక ఎఱ్ఱ రంగునే కాదు, మొత్తం అన్ని రంగులనీ తీసుకోవాలి; **అస్నేహమ్** – ద్రవ్యం కాదు. ముందేమో ఘనపదార్థం కాదు అంది. ఇప్పుడు ద్రవపదార్థం కాదు అంటున్నది. **అచ్ఛాయమ్** – నీడ కాదు; **అతమః** – అలాగని చీకటి కూడా కాదు.

3. **పంచభూతాలు కాదు**
   **అవాయుః** – వాయువు కాదు; **అనాకాశమ్** – ఆకాశం కాదు. తక్కిన భూతాలను కలుపుకోవాలి.

4. **సంబంధం లేదు**
   **అసంగమ్** – దేనితోనూ సంబంధం లేదు.

5. **జ్ఞానేంద్రియాలు లేవు**
   **అరసమ్** – రుచి లేదు; **అగంధమ్** – వాసన లేదు; **అచక్షుష్కమ్** – కన్ను లేదు; **అశ్రోత్రమ్** – చెవులు లేవు.

   జ్ఞానేంద్రియాలు లేవు కాబట్టి కర్మ చెయ్యదు.

6. **కర్మేంద్రియాలు లేవు –** కర్మ లేదు.
   **అవాక్** – వాక్కు లేదు.

7. **మనస్సు లేదు**
   **అమనః** – మనస్సు లేదు.

**అతేజస్కమ్** – తేజస్సు లేదు. చాలామంది ఆత్మ అంటే ఒక కాంతి అనుకుంటారు. ఇక్కడ ఆ అపోహ కూడా తొలుగుతుంది. కాంతి కాకపోతే ఆత్మను జ్యోతి అని ఎందుకు అంటారు? జ్యోతి అంటే శాస్త్రంలో తనంతట తాను ప్రకాశిస్తూ, ఇతర వస్తువులను ప్రకాశింపజేసేది. ఆత్మ – జ్యోతి ఎందుకయిందంటే ఆత్మ సమక్షంలో మనస్సు చైతన్యం పొందుతుంది.

8. **పంచప్రాణాలు కాదు**

**అప్రాణం** – ప్రాణం కాదు.

ఈ విధంగా సూక్ష్మశరీరంలో ఉన్న 19 అంగాలను నిషేధించటం జరిగింది. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతకరణాలు, పంచప్రాణాలు. ఇప్పుడు ఇంకా కొన్ని నిషేధముఖలక్షణాలు చూస్తాము. వాటిలో కొన్నింటినే పేర్కొంది ఉపనిషత్తు తక్కినవి మనం కలుపుకోవాలి.

**అముఖమ్** – ముఖం లేదు; **అమాత్రమ్** – కొలవబడదు; **అనంతరమ్** – లోపల లేదు; **అబాహ్యమ్** – అలాగని బయటా లేదు. ఇలా అన్నింటినీ నిషేధించుకుంటూ రావటంద్వారా మిగిలిందేమిటి? నేను సాక్షిచైతన్యాన్ని. ఇంకా కొన్ని లక్షణాలను చెబుతున్నాడు.

**న తదశ్నాతి కించన** – అది దేనినీ తినదు; **న తదశ్నాతి కశ్చన** – అలాగైతే దాన్ని ఏదైనా తింటుందా అంటే దాన్ని ఏదీ తినదు.

అది ఏదీ తినదు, దాన్ని ఏదీ తినదు అంటే అర్థం ఆత్మ కర్తా కాదు, భోక్తా కాదు. ఇంకో భాషలో చెప్పాలంటే ఆత్మ భోక్తా కాదు, భోగ్యం కాదు. అది అనుభవించదు. అనుభవించబడే వస్తువూ కాదు. ఈ అక్షరబ్రహ్మకు ఏ అనుభవమూ లేదు, దాన్ని ఎవరూ అనుభవించలేరు. అంటే ఎవరూ అక్షరబ్రహ్మను అనుభవించలేరు. అందువల్ల యాజ్ఞవల్క్యుడు చెబుతున్నాడు, 'ఎన్నడూ బ్రహ్మ అనుభవం పొందాలని చూడకండి, అలా బ్రహ్మ అనుభవం పొందాలని చూస్తే బ్రహ్మను కాదనుకున్నట్టే అర్థం.'

ఈ మంత్రంలో 25 నిషేధపదాలద్వారా బ్రహ్మను వర్ణించటం జరిగింది. దీనిద్వారా ఆ బ్రహ్మను నేను అనుభవించలేను. నేను అనుభవించనవసరం లేదు కూడా; ఎందుకంటే ఆ బ్రహ్మను నేనే కాబట్టి. బ్రహ్మ అన్నా, ఆత్మ అన్నా, సాక్షిచైతన్యం అన్నా ఒకటే అని మర్చిపోకూడదు. ఈ మంత్రంద్వారా ఆత్మ అకర్తా, అభోక్తా అని నిరూపించబడుతుంది.

## మంత్రం 3.8.9

**ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచన్ద్రమసౌ విధృతౌ తిష్ఠత ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి ద్యావాపృథివ్యౌ విధృతే తిష్ఠత ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి నిమేషా ముహూర్తా అహోరాత్రాణ్యర్ధమాసా మాసా ఋతవస్సంవత్సరా ఇతి విధృతాస్తిష్ఠన్త్యేతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి ప్రాచ్యోఽన్యా నద్యస్స్యన్దన్తే శ్వేతేభ్యః పర్వతేభ్యః ప్రతీచ్యోఽన్యా యాం యాం చ దిశమన్వేతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి దదతో మనుష్యాః ప్రశగ్ంసన్తి యజమానం దేవా దర్వీం పితరోఽన్వాయత్తాః ॥**

ఈ మంత్రంలో సానుకూల పదాలతో వర్ణించలేని అక్షరబ్రహ్మే, వ్యావహారికస్థాయిలో ఈశ్వరునిగా ఉన్నాడని చెబుతున్నాడు యాజ్ఞవల్క్యుడు. మనం పూజ చేసేది మాయాఉపాధిలో ఉన్న అంతర్యామి ఈశ్వరునికి.

నిర్గుణబ్రహ్మకు పూజ చెయ్యలేము. నిర్గుణబ్రహ్మ ఎవరిమీదా అనుగ్రహం కురిపించలేదు. అయితే నిర్గుణబ్రహ్మకన్నా సగుణ ఈశ్వరుడు గొప్పా? ఎవరు అనుగ్రహం కురిపిస్తే వారు గొప్ప కదా అనుకుంటే అది తప్పు. నిర్గుణబ్రహ్మ పారమార్థికస్థాయికి చెందినది. అక్కడ జీవ, జగత్తు, ఈశ్వరుడు అనే త్రిపుటి లేదు. ఉన్నదొక్కటే అద్వైతబ్రహ్మ. అనుగ్రహం కోరేది ఎవరు? అనుగ్రహం ఇచ్చేది ఎవరు? జీవుడు, ఈశ్వరుడు భిన్నంగా లేరు. అందువల్ల నిర్గుణబ్రహ్మ అనుగ్రహాన్ని ఇవ్వలేదు అంటే నిర్గుణబ్రహ్మ అనుగ్రహాన్ని ఇవ్వనవసరం లేదని అర్థం. అనుగ్రహం ఇవ్వాలంటే మాయావేషం వేసుకోవాలి. కృష్ణపరమాత్మే చెబుతాడు, 'నేను మాయా వేషం వేసుకుని ఈశ్వరుణ్ణి అయ్యాను.'

ఈ మంత్రంలో యాజ్ఞవల్క్యుడు అక్షరబ్రహ్మను అంతర్యామిగా వర్ణిస్తున్నాడు. చెప్పాల్సిన అంశం అక్షరబ్రహ్మ అయితే అంతర్యామి గురించి ఎందుకు చెబుతున్నాడు? నిర్గుణబ్రహ్మ గురించి మాట్లాడి సగుణ ఈశ్వరునిలోకి ఎందుకు వెళ్ళాడు? ఎందుకంటే అక్షరబ్రహ్మే అంతర్యామి. వాళ్ళిద్దరి మధ్య భేదం ఉన్నట్టు కనిపించినా రెండూ ఒకటే.

మాయాసహిత అక్షరం అంతర్యామి; మాయారహిత అంతర్యామి అక్షరం. కాని ఈ బ్రాహ్మణంలో ఈశ్వరుడు పదం వాడలేదు. ఆకాశం అనే పదం వచ్చింది. ఆకాశం అన్నా, ఈశ్వరుడు అన్నా, అంతర్యామి అన్నా ఒకటే. ఇవన్నీ పర్యాయపదాలు. ఈ ఈశ్వరుడు సగుణ ఈశ్వరుడు, మాయావిశిష్ట ఈశ్వరుడు. ఈశ్వరునికి అతీతంగా ఏదైనా ఉందా?

వ్యావహారిక ప్రపంచంలో ఈశ్వరుడే అత్యంత ఉన్నతస్థాయిలో ఉన్నాడు. ఈశ్వరుడే సృష్టికర్త; ఈశ్వరుడే స్థితికర్త; ఈశ్వరుడే లయకర్త; ఈశ్వరుడే అనుగ్రహకర్త; ఈశ్వరుడే కర్మఫలదాత. ఈశ్వరుణ్ణే కొలవాలి. ఇదంతా వ్యావహారిక స్థాయిలో.

పారమార్థికస్థాయికి వెళితే నిర్గుణబ్రహ్మ ఉంది. ఆ నిర్గుణబ్రహ్మే ఈశ్వరునికి అధిష్ఠానం. ఆ నిర్గుణబ్రహ్మే అక్షరబ్రహ్మ. అందువల్ల అక్షరబ్రహ్మే వ్యావహారిక ప్రపంచంలో జీవ, జగత్తు, ఈశ్వరుల అధిష్ఠానం. అక్షరబ్రహ్మ సత్త్వగుణప్రధాన మాయతో కూడి ఈశ్వరునిగానూ, రజోగుణప్రధాన మాయతో కూడి జీవునిగానూ, తమోగుణ ప్రధాన మాయతో కూడి జగత్తుగానూ ఏర్పడిందని విద్యారణ్యులవారు పంచదశిలో వివరించారు.

అందువల్ల జీవ, జగత్తు, ఈశ్వరులు అక్షరబ్రహ్మయొక్క మాయావేషం. అక్షరబ్రహ్మ పారమార్థిక స్థాయికి చెందింది. కాని అక్షరబ్రహ్మ నిర్గుణం కాబట్టి, అక్షరబ్రహ్మ సృష్టికర్త కాదు. అక్షరబ్రహ్మ కారణమూ కాదు, కార్యమూ కాదు; అక్షరబ్రహ్మ అనుగ్రహ కర్తా కాదు, అనుగ్రహ స్వీకర్తా కాదు.

బ్రహ్మను అనంత కళ్యాణగుణాలు ఉన్నట్టుగా వర్ణిస్తాము. ఆ వర్ణన సగుణ ఈశ్వరునికి వర్తిస్తుంది. నిర్గుణబ్రహ్మకు సుగుణాలూ లేవు, దుర్గుణాలూ లేవు. ఇలాంటి నిర్గుణబ్రహ్మ పారమార్థికస్థాయిలో ఉందని చెప్పే ఘనత ఒక్క అద్వైత వేదాంతానికే చెల్లింది.

విశిష్టాద్వైతం సగుణబ్రహ్మతో ఆగిపోతుంది. ఆ సిద్ధాంతంలో నిర్గుణబ్రహ్మ లేదు. అలాంటి నిర్గుణబ్రహ్మను నేతినేతి పద్ధతిద్వారా ముందు మంత్రంలో వర్ణించాడు.

ఇప్పుడు ఒక మెట్టు కిందికి దిగివచ్చి, ఆ అక్షరబ్రహ్మనే సానుకూలంగా వర్ణిస్తున్నాడు. కాని అక్షరబ్రహ్మను సానుకూలంగా వర్ణించాలంటే అక్షరబ్రహ్మకు కొన్ని గుణాలను ఆపాదించాలి. కాని ఎప్పుడైతే సగుణాలు ఆపాదిస్తాడో అది అక్షరబ్రహ్మ అవదు; అంతర్యామి అవుతాడు. అందువల్ల ఈ తొమ్మిదవ మంత్రంలో అక్షరబ్రహ్మనే అంతర్యామిగా వర్ణిస్తాడు యాజ్ఞవల్క్యుడు.

అక్షరాన్ని వర్ణించమంటే అంతర్యామిని ఎలా వర్ణిస్తాడు? అవి రెండూ భిన్నం కాదా అంటే చూడటానికి భిన్నంగా ఉన్నా రెండూ ఒకటే. అక్షరబ్రహ్మే అంతర్యామిగా సగుణ ఈశ్వరునిగా, మాయాఉపాధితో ఉంది. మాయాసహిత అక్షరం అంతర్యామి; మాయారహిత అంతర్యామి అక్షరం.

నిర్గుణబ్రహ్మ + మాయ = ఈశ్వరుడు; ఈశ్వరుడు – మాయ = నిర్గుణబ్రహ్మ.

సగుణ ఈశ్వరుని గుణాలు – సృష్టికర్త, స్థితికర్త, లయకర్త, అనుగ్రహకర్త, కర్మఫలదాత, సర్వజ్ఞుడు. సర్వశక్తివంతుడు, సర్వాంతర్యామి, సర్వేశ్వరుడు.

అంతర్యామిని సగుణబ్రహ్మ అనీ, అక్షరబ్రహ్మను నిర్గుణబ్రహ్మ అనీ అంటే ఈ సగుణ, నిర్గుణబ్రహ్మలు ఒక నాణేనికి ఇరుపక్కలా ఉన్న బొమ్మా, బొరుసు అనవచ్చా? అలా అనలేము. ఒక నాణేనికి బొమ్మా, బొరుసులు అంటే రెండూ ఒకే స్థాయికి చెందినవై ఉండాలి; రెండూ ఒకే సత్యానికి చెందినవై ఉండాలి. సముద్రంలో నిశ్చల అడుగుభాగం, పైకెగసిపడే అలల భాగం రెండూ ఒకే సత్యానికి చెందినవి.

కాని సగుణ, నిర్గుణ బ్రహ్మలు అలా కాదు. సగుణబ్రహ్మ వ్యావహారిక సత్యానికి చెందితే, నిర్గుణబ్రహ్మ పారమార్థిక సత్యానికి చెందుతుంది. అందువల్ల మనం విశిష్టాద్వైతాన్ని కొంతమేరకు స్వీకరిస్తాము. వారు చెప్పింది స్వీకరిస్తూనే, అడుగున ఒక చిన్న మాట కలుపుతాము. అది వ్యావహారిక స్థాయికి చెందుతుంది కాని, పారమార్థిక స్థాయిలో ఉన్నది నిర్విశేష అద్వైతం.

ఈ తొమ్మిదవ మంత్రంలో అంతర్యామిని వర్ణిస్తున్నాడు. ఈ నేపథ్యంతో ఈ మంత్రాన్ని చూద్దాము.

**ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః** – ఓ గార్గీ, ఈ అక్షరంయొక్క ఆజ్ఞవల్లనే సూర్యచంద్రులు ఉన్నారు. అంతర్యామి అన్నిటినీ నియంత్రిస్తున్నాడు. ఇక్కడ ఉపనిషత్తు ఒక అద్భుతమైన పదాన్ని వాడుతున్నది. ఈ పదాన్ని ఇంతవరకూ ఏ ఉపనిషత్తులోనూ చూడము. అది ప్రశాసన. మాయాసహిత బ్రహ్మను 'శాస్త' అనీ, ఆ బ్రహ్మ ఆజ్ఞను శాసనం అనీ అంటున్నది. ఆ అక్షరం ఆజ్ఞవల్లనే సూర్యచంద్రులు పనిచేస్తున్నాయి. విధృతౌ అంటే వాటి స్థానంలో నిలబెడుతున్నాడు. అక్షరం అంటే అంతర్యామిరూప అక్షరం అని తీసుకోవాలి.

సూర్యచంద్రుల కదలిక, ఋతువులు అన్నీ ప్రకృతి నియమాల ప్రకారం జరుగుతాయి. ఆ నియమాలను నియమించేది అక్షరబ్రహ్మ. మధ్యలో గార్గిని సంబోధిస్తూ అలాంటి కొన్ని నియమాలను వివరిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి ద్యావాపృథివ్యౌ విధృతే తిష్ఠతః** – ఈ అక్షరబ్రహ్మ శాసనంవల్లనే ద్యులోక, పృథివీలోకాలు వాటి స్థానంలో స్థిరంగా నిలబడి ఉన్నాయి.

**ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి నిమేషా ముహూర్తా అహోరాత్రాణ్యర్ధమాసా మాసా ఋతవస్సంవత్సరా ఇతి విధృతాస్తిష్ఠంతే** – కాలతత్త్వం ఒక క్రమపద్ధతిలో సాగుతోందంటే అది అంతర్యామిరూప అక్షరబ్రహ్మవల్లనే. కాలతత్త్వంలో కొన్ని అంశాలు పేర్కొన్నాడు. ఏమిటవి? నిముషాలు. ముహూర్తాలు (45 నిముషాలు), రాత్రింబవళ్ళు, పక్షాలు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు. అంటే కాలాన్ని అన్ని రకాలుగానూ వర్ణించాడు.

**ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి ప్రాచ్యోఽన్యా నద్యస్స్యందంతే శ్వేతేభ్యః పర్వతేభ్యః ప్రతీచ్యోఽన్యా యాం యాం చ దిశమను** – ఓ గార్గీ, ఈ అంతర్యామి రూప అక్షరబ్రహ్మవల్లనే తెల్లని పర్వతాలనుంచి తూర్పువైపు, తక్కిన దిక్కులవైపు ప్రవహించే నదులు ప్రవహిస్తున్నాయి. నదులు కిందికి ప్రవహించి, వ్యవసాయానికి తోడ్పడుతున్నాయంటే అది కూడా అంతర్యామి నియంత్రణవల్లనే. సముద్రంలోని నీరు ఆవిరై, మేఘాలు ఏర్పడి, మేఘాలు వర్షించి, ఆ వర్షాలు నదులుగా మారి, ఆ నదులు మళ్ళీ సముద్రంలోకి ప్రవహిస్తాయి.

ఈ అంతర్యామి ఆజ్ఞానుసారం కొన్ని నదులు మంచుకొండలైన హిమాలయాలనుంచి, తూర్పువైపు బంగాళాఖాతంలోకి ప్రవహిస్తే, మరికొన్ని నదులు పడమరవైపు ప్రవహిస్తాయి. కొన్ని వేరే దిక్కుల్లో ప్రవహిస్తాయి. ఎటు వెళ్ళినా, అంతర్యామి శాసనంవల్లనే అవి అలా వెళతాయి.

అంతేకాదు, ఇక్కడ అంతర్యామిని పరోక్షంగా **పుణ్య అదృష్టదాత** అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఇది అర్థం చేసుకోవాలంటే కొన్ని అంశాలు గుర్తు తెచ్చుకోవాలి. మన శాస్త్రం రెండు రకాల ఫలాల గురించి చెబుతుంది. అవి దృష్టఫలం, అదృష్టఫలం. దృష్టఫలం అంటే కంటికి కనిపించే ఫలం; అదృష్టఫలం అంటే కంటికి కనపడని ఫలం. ఈ రెండవ ఫలం పుణ్యమో, పాపమో ఇస్తుంది.

అదృష్టఫలం కంటికి కనబడదు కాబట్టి, మనుష్యులు దాన్ని అదుపులో పెట్టలేరు. కంటికి కనబడితే కదా దాన్ని అదుపులో పెట్టటమో, మార్చటమో చెయ్యగలిగేది. అందువల్ల అదృష్టఫలాన్ని ఒప్పుకుంటే అదృష్టఫలదాత ఒకరు ఉన్నారని ఒప్పుకుని తీరాలి. ఆ అదృష్టఫలదాత మానవమాత్రుడు కాదని కూడా ఒప్పుకుని తీరాలి. ఎందుకంటే మనిషి కంటికే కనపడనిదాన్ని, మనిషి ఎలా అదుపులో పెట్టగలడు?

అదృష్టఫలదాత ఈశ్వరుడు.

**ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి దదతో మనుష్యాః ప్రశగ్ంసంతి** – ఈ ఈశ్వరునివల్లనే మనుష్యులు దానం చేసేవారిని మెచ్చుకుంటున్నారు. ఎవరైనా దానగుణం ఉన్న వ్యక్తిని మెచ్చుకుంటే ఈశ్వరుణ్ణి మెచ్చుకుంటున్నట్టు అర్థం. అదెలా సాధ్యం? దానం చేసే క్రియనే తీసుకుంటే, పైకి కనపడేది ఏమిటి? దానం చేసేవాని దగ్గర ఉన్న డబ్బు తగ్గుతుంది. అవునా? అందువల్ల కొంతమంది చూస్తూచూస్తూ దానం చెయ్యలేరు. దానం చేస్తే వారికి నిలువ ఉన్న డబ్బు తగ్గిపోతుందనే అభద్రతా భావన ఏర్పడుతుంది. అలా చూస్తే దానాన్ని మెచ్చుకోకూడదు.

కాని మనం దానం చేసే వ్యక్తిని మెచ్చుకుంటాము. ఎందుకు? పైకి ధననష్టంలా కనబడ్డా, మనుష్యులు దానం చేసే వ్యక్తిని మెచ్చుకుంటారు. వేదాలు కూడా మెచ్చుకుంటాయి. అంటే కనపడని మంచి ఫలితం ఉందన్న మాటేగా! కనబడని సానుకూల ఫలాన్ని అంగీకరిస్తే, ఆ అదృష్టకర్మఫలదాతను కూడా అంగీకరించాలి. అంటే అంతర్యామిని అంగీకరించాలి.

**యజమానం దేవా దర్వీం పితరోఽన్వాయత్తాః** – దేవతలు యజ్ఞం చేసేవారిమీద, పితృదేవతలు దర్వీహోమం చేసేవారిమీదా ఆధారపడుతున్నారు.

ఇక్కడ కూడా ఒక ప్రత్యేకమైన విషయాన్ని చెబుతున్నాడు యాజ్ఞవల్క్యుడు. దేవతలు మనుష్యులకన్నా ఎక్కువ అనీ, వారికి మనకన్నా ఎక్కువ శక్తులున్నాయనీ, వారు మనకన్నా ఎక్కువగా చేసిన పుణ్యకర్మలవల్ల దేవలోకాల్లో ఉన్నారనీ మనకు తెలుసు. కాని ఈ మంత్రంలో దేవతలు, మనుష్యులు చేసే యజ్ఞాలమీద ఆధారపడి ఉన్నారు అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు.

సాధారణంగా హెచ్చుస్థాయిలో ఉన్న వ్యక్తి, తక్కువస్థాయిలో ఉన్న వ్యక్తిమీద దేనికీ ఆధారపడదు. కాని దేవతలు మనుష్యులమీద యజ్ఞాలకోసం ఆధారపడ్డారంటే అది కూడా అంతర్యామి ఆజ్ఞవల్లనే. యజమానం అంటే మనుష్యులు.

అలాగే పితృదేవతలు కూడా మనుష్యులకన్నా శక్తిమంతులు. ఒక వ్యక్తి చనిపోగానే పితృదేవత అవుతాడు. ఆ పితృదేవతలు అదృష్టఫలాన్ని ఇస్తారు. అందువల్లనే, ఇంట్లో ఏదైనా శుభకార్యం చేసేముందు పితృదేవతలకు నాంది శ్రాద్ధం చేస్తారు. అంతేకాదు, భగవద్గీతలో దేవకర్మకన్నా పితృకర్మ గొప్పదని వస్తుంది. అందువల్ల మనుష్యులను శ్రాద్ధకర్మలను మానవద్దంటారు.

ఇంతకీ ఇక్కడ ఉపనిషత్తు చెప్పబోయేది ఏమిటంటే తమ పిల్లలను పైలోకాలనుంచి ఆశీర్వదించగలిగినంత శక్తి ఉన్నా, వారు వారి శ్రాద్ధకర్మలకు పిల్లలమీద ఆధారపడాలి అని. ఇది కూడా అంతర్యామి శాసనం. ఆ విధంగా అంతర్యామి ప్రకృతిసూత్రాలను నియంత్రిస్తాడు.

## మంత్రం 3.8.10

**యో వా ఏతదక్షరం గార్గ్యవిదిత్వాఽస్మింల్లోకే జుహోతి యజతే తపస్తప్యతే బహూని వర్షసహస్రాణ్యన్తవదేవాస్య తద్భవతి యో వా ఏతదక్షరం గార్గ్యవిదిత్వాఽస్మాల్లోకాత్ప్రైతి స కృపణోఽథ య ఏతదక్షరం గార్గి విదిత్వాఽస్మాల్లోకాత్ప్రైతి స బ్రాహ్మణః ॥**

ఇది కూడా చాలా ముఖ్యమైన మంత్రం. జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది, తక్కిన సాధ్యాలవల్ల రాదని నొక్కి వక్కాణిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**అక్షర జ్ఞానాత్ ఏవ మోక్షః**

ఒక సాధకుడు గొప్ప ఉపాసకుడు అవవచ్చేమో కాని, అతను సంసారీ ఉపాసకుడే అవుతాడు. జ్ఞానం పొందందే మోక్షం పొందలేడు. **జ్ఞానాదేవ కైవల్యమ్**

అంటే ఉపాసనలు వ్యర్థమా? ఉపాసనలను కించపరచటం లేదు. అవి వ్యర్థమైతే శాస్త్రం వాటి గురించి చెప్పదు. కాని అక్కడే ఆగిపోవద్దంటుంది శాస్త్రం. కర్మ, ఉపాసనలు, చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఇచ్చి, జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తాయి. అక్కడ్నుంచి జ్ఞానానికి రావాలి.

**కర్మకాండ లేనిదే జ్ఞానకాండ అసాధ్యం**
**జ్ఞానకాండకు రానిదే కర్మకాండ అసంపూర్ణం**

జ్ఞానం అంటే హిరణ్యగర్భ జ్ఞానమో, అంతర్యామి జ్ఞానమో కాదు; జ్ఞానం అంటే నిర్గుణబ్రహ్మజ్ఞానం. ఇది సత్యం, ఇది సత్యం, పునః సత్యం. ఈ జన్మలో కాకపోయినా వచ్చే జన్మలోనైనా జ్ఞానానికి వచ్చి, జ్ఞానం పొందితేనే జననమరణ వృత్తంనుంచి బయటపడతాడు. నేను నమ్మను అంటే సరే నీ ఇష్టం అని వదిలేస్తాము కాని వారు చెప్పింది స్వీకరించలేము – ఎందుకంటే శాస్త్రమే నొక్కివక్కాణిస్తుంది జ్ఞానంవల్ల మాత్రమే మోక్షం వస్తుందని.

**యో వా ఏతదక్షరం గార్గ్యవిదిత్వాఽస్మింల్లోకే జుహోతి యజతే తపస్తప్యతే బహూని వర్షసహస్రాణి** – ఓ గార్గీ, ఎవరైతే ఈ అక్షరబ్రహ్మను తెలుసుకోకుండా హోమాలు, యజ్ఞాలు, అనేక వేల సంవత్సరాలు తపస్సు చేస్తారో,

**అంతవ దేవాస్య తద్భవతి** – వారికి పరిచ్ఛిన్నఫలం మాత్రమే కలుగుతుంది. మోక్షం రాదు.

జుహోతి అంటే హోమం, యజతి అంటే యజ్ఞం. ఈ రెండింటి మధ్యా సూక్ష్మభేదం ఉంది. ఒక వస్తువును ఎవరికన్నా ఇచ్చేముందు నేను యజమానిని, ఇచ్చేశాక అతను యజమాని. ఆ ఇవ్వటం రెండు దశల్లో జరుగుతుంది. ముందు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవటం, తర్వాత ఇవ్వటం.

ఇవ్వాలని నిర్ణయం తీసుకోవటాన్ని సంకల్పం అంటారు. ఒకవేళ ప్రజాపతి దేవతకు ఇవ్వాలనుకుంటే అగ్ని ముందు కూర్చుని, ప్రజాపతయే స్వాహా అనాలి. కాని ప్రజాపతయే స్వాహా అనేటప్పుడు, సంకల్పం చెప్పాలి.

'ప్రజాపతయే ఇదం నమమ,' అని చెబుతూ అగ్నిలో వెయ్యాలి. ఇది నాది కాదని చెప్పాలి. ఇలా వెయ్యటాన్ని ప్రక్షేపం అంటారు. మనం వేసే ప్రతి ఒక్క ఆహుతిలోనూ సంకల్పం భాగం ఉంటుంది, ప్రక్షేపం భాగం ఉంటుంది. సంకల్పం భాగాన్ని యాగం అనీ, ప్రక్షేపం భాగాన్ని హోమం అనీ అంటారు. అంటే దేవతలకు వేసే ద్రవ్యాన్ని చేతిలో పట్టుకుని సంకల్పం చెప్పటం యాగం అయితే, చేతిలో పట్టుకుని సంకల్పం చెప్పిన ద్రవ్యాన్ని అగ్నిలో ప్రక్షేపం చెయ్యటం హోమం. యాగం చెయ్యనిదే హోమం అసాధ్యం. హోమం చెయ్యని యాగం అసంపూర్ణం. అందువల్ల ఎవరైనా నేను యాగం చేస్తున్నాను అన్నా, హోమం కూడా చేస్తున్నట్టు అర్థం. అలాగే ఎవరైనా నేను హోమం చేస్తున్నానంటే యాగం కూడా చేస్తున్నట్టు అర్థం. ఆ విధంగా జుహోతి అంటే హోమం, యజతి అంటే సంకల్పం.

కాని ఈ రెండూ కూడా మోక్షానికి దారితీయవు అన్నాడు యాజ్ఞవల్క్యుడు. అలాగే తపస్ తప్యతే అంటే ఉపాసన చెయ్యటం. అది కూడా ఎన్నాళ్ళు? బహూని వర్షసహస్రాణి – కొన్ని వేల సంవత్సరాలు. కొంతమంది

యజ్ఞయాగాదులు చేస్తేనో, తపస్సు చేస్తేనో మోక్షం వస్తుంది అనుకుంటారు కాని అవి అసంపూర్ణం అని మనకు ఈ మంత్రంలో తెలుస్తున్నది.

వేదాంత శ్రవణమనన నిదిధ్యాసన చెయ్యాలి. జ్ఞానమే సాక్షాత్ సాధన, కర్మ ఉపాసనలు సహకారీ సాధనలు మాత్రమే. నిజానికి భగవంతుడు భక్తుని ముందు ప్రత్యక్షమైనా కూడా మోక్షం రాదు. ఈ మాట విని కలత చెందకూడదు, దానిలోని వివరాన్ని అర్థం చేసుకోవాలి. అయితే ఎవరైనా హిరణ్యగర్భ లేదా అంతర్యామి లేదా అక్షరబ్రహ్మ లోకాలకు వెళితే వారి పరిస్థితి ఏమిటి?

ముందు అక్షరబ్రహ్మలోకం లేదు. అక్షరబ్రహ్మ అద్వైతబ్రహ్మ. ఉన్నదొక్కటే. ఆ అక్షరబ్రహ్మ నిర్వచనం ఎనిమిదవ మంత్రంలో చూశాము – అస్థూలమనణు.... అందువల్ల భగవంతుడు భూలోకంలో ప్రత్యక్షమైనా, భక్తుడే బ్రహ్మలోకానికి వెళ్ళినా అతను నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందనిదే మోక్షం పొందడు. అక్షరబ్రహ్మ మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది; సగుణదర్శనం మోక్షాన్ని ప్రత్యక్షంగా ఇవ్వదు కాని, పరోక్షంగా దారితీస్తుంది. దీన్ని ఆధారంగా తీసుకుని గౌడపాదులవారు మాండూక్య కారికల్లో ఉపాసకునికి మోక్షాన్ని పొందే అదృష్టం లేదంటారు.

**యో వా ఏతదక్షరం గార్గ్యవిదిత్వాఽస్మాల్లోకాత్ప్రైతి స కృపణః** – ఓ గార్గీ, ఎవరైతే ఈ అక్షరబ్రహ్మను తెలుసుకోకుండా మరణిస్తాడో, అటువంటి వ్యక్తి దీనుడు.

అంటే ఎవరైతే యాగాలు, హోమాలు, తపస్సులు చేసి, అక్షరబ్రహ్మను తెలుసుకోకుండా మరణిస్తారో వారిది దీనమైన పరిస్థితి అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. అయితే వీటిమీద మన దృక్పథం ఎలా ఉండాలి? కర్మకాండలు పూర్తిగా కొట్టిపారేయకూడదు, అలాగని అవే అంతిమలక్ష్యం అనుకోకూడదు. వాటికి విలువను ఇవ్వకపోవటమూ తప్పే, వాటినుంచి మోక్షం ఆశించటమూ తప్పే.

**అక్షర జ్ఞానేన ఏవ మోక్షః**

**సగుణదర్శనమ్ ఏక సోపానమేవ భవతి న తు సాక్షాత్ మోక్షసాధనమ్.** అది తెలియకుండా జ్ఞానమార్గానికి రాకుండా మరణించిన వ్యక్తిని స కృపణః అంటున్నాడు. మనుష్యజన్మను ఎత్తామంటేనే జీవితమనే ఆటలో క్వార్టర్‌ఫైనల్‌కి వచ్చినట్టు అర్థం; ముముక్షుత్వం ఉంటే సెమీఫైనల్‌కు వచ్చినట్టు అర్థం. మహా ఉపాసకులు అయితే ఫైనల్‌కి వచ్చి ఓడిపోయినట్టు అర్థం. అంటే ఉపాసనకు వచ్చి, చనిపోయేలోపు జ్ఞానం పొందకపోతే ఫైనల్‌కి వచ్చి ఓడిపోయినట్టు అర్థం. ఇప్పుడు జ్ఞానం పొందినవాని పరిస్థితి ఏమిటో చెబుతున్నాడు.

**అథ య ఏతదక్షరం గార్గి విదిత్వాఽస్మాల్లోకాత్ప్రైతి స బ్రాహ్మణః** – దాని బదులుగా ఎవరైతే మరణించేలోపు ఈ అక్షరబ్రహ్మను తెలుసుకుంటారో, అతను బ్రాహ్మణుడు. ఇంచుమించు అవే పదాలు. అవిద్వాత్ అస్మాలోకాత్ప్రైతి– తెలుసుకోకుండా మరణించిన వ్యక్తి పరిస్థితి – స కృపణః. అతను దీనుడు. విదిత్వాత్ అస్మాలోకాత్ప్రైతి – తెలుసుకుని మరణించిన వ్యక్తి పరిస్థితి – స బ్రాహ్మణ – అతను జ్ఞాని అవుతాడు.

జ్ఞానిని మాత్రమే బ్రాహ్మణుడు అంటారు. తక్కిన బ్రాహ్మణులను అముఖ్య బ్రాహ్మణులు అంటారు. మళ్ళీ జ్ఞాని అంటే ఎవరో మర్చిపోకూడదు. ఆ జ్ఞాని విరాట్ జ్ఞాని కాదు, హిరణ్యగర్భ జ్ఞాని కాదు, ఈశ్వరజ్ఞాని కూడా కాదు. వీరందరికీ అధిష్ఠానం అయిన అక్షరబ్రహ్మజ్ఞాని.

ఈ మంత్రంలో అక్షరం అంటే నిర్గుణబ్రహ్మ. ముందు మంత్రంలో అక్షరం అంటే అంతర్యామిరూప అక్షరం. అక్షరం అనే పదానికి అనేక అర్థాలుంటాయి. ముండకోపనిషత్తులో నిర్గుణబ్రహ్మను అక్షరంబ్రహ్మ అన్నా కూడా, మళ్ళీ ఒకచోట మాయ అని అర్థం వస్తుంది. అక్షరాత్ పరతః పరః అంటే మాయకన్నా శ్రేష్ఠం నిర్గుణబ్రహ్మ అని అర్థం.

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**

**క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥ - గీత 15- 16**

గీతలో కూడా అక్షరం అంటే మాయ అని అర్థం వస్తుంది.

ఈ మంత్రంలో, ఈ సందర్భంలో ఏ అర్థం తీసుకోవాలో తెలుసుకోవాలి. ఇక్కడ అర్థం నిర్గుణబ్రహ్మ. ఎందుకు తీసుకోవాలో మీమాంసశాస్త్రం, బ్రహ్మసూత్రాలు విశ్లేషిస్తాయి. ఆ విశ్లేషణ కావాలంటే బ్రహ్మసూత్రాల్లోకి వెళ్ళాలి. ఇప్పుడు అక్షరం అంటే నిర్గుణబ్రహ్మ అని తెలుసుకుంటే చాలు.

## మంత్రం 3.8.11

**తద్వా ఏతదక్షరం గార్గ్యదృష్టం ద్రష్ట్రశ్రుతగ్ం శ్రోత్రమతం మన్త్రవిజ్ఞాతం విజ్ఞాతృ నాన్యదతోఽస్తి ద్రష్టృ నాన్యదతోఽస్తి శ్రోతృ నాన్యదతోఽస్తి మన్తృ నాన్యదతోఽస్తి విజ్ఞాత్రే తస్మిన్ను ఖల్వక్షరే గార్గ్యాకాశ ఓతశ్చ ప్రోతశ్చేతి॥**

ఈ మంత్రంలో మళ్ళీ అక్షరబ్రహ్మను నిర్వచిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. నిజానికి అక్షరబ్రహ్మ నిర్వచనం ఎనిమిదవ మంత్రంలోనే నిషేధముఖ లక్షణంగా చూశాము. ఇప్పుడు ఇక్కడ వేరే రూపంలో చూస్తాము.

**ఎవ్వర్ ది సబ్జెక్ట్ నెవ్వర్ ది ఆబ్జెక్ట్**

అక్షరబ్రహ్మ అంటే ఎప్పటికీ నువ్వే కాని, ఎన్నటికీ విషయవస్తువు కాదు. ఇదీ ఈ మంత్రంయొక్క సారాంశం.

**అదృష్టమ్ అశ్రుతగ్మ్ అమతమ్ అవిజ్ఞాతమ్** - అంటే ఆత్మను చూడలేము, వినలేము, ఆలోచించలేము, తెలుసుకోలేము. అంటే ఆత్మ అసలు వస్తువే కాదు.

**తద్వా ఏతదక్షరం గార్గ్యదృష్టం ద్రష్ట శ్రుతగ్ం శ్రోత్రమతం మంత్రవిజ్ఞాతం విజ్ఞాతృ** - అంటే ఆత్మ చూసేదే కాని చూడబడేది కాదు; వినేదే కాని వినబడేది కాదు; ఆలోచించేదే కాని ఆలోచించబడేది కాదు; తెలుసుకొనేదే కాని తెలియబడేది కాదు. అంటే ఆత్మ ద్రష్టా, శ్రోతా, మంతా, విజ్ఞాతా.

**ఆత్మ సబ్జెక్టు కాని ఆబ్జెక్టు కాదు**

కాని ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. విజ్ఞాత అనే పదం వాడినప్పుడు రెండు రకాల విజ్ఞాతలు ఉన్నాయి. అవి మనస్సు, ఆత్మ. మనస్సు బాహ్యప్రపంచాన్ని చూస్తే, ఆత్మ మనస్సును చూస్తుంది. ఆత్మ, మనస్సు రెండూ ద్రష్టలే అయినా వాటి రెండింటి మధ్య అనేక భేదాలున్నాయి.

1. మనస్సు వికారం చెందుతుంది. మనస్సు సవికార ద్రష్ట, సవికార శ్రోత, సవికార మంత, సవికార జ్ఞాత అవుతుంది. ఆత్మ నిర్వికార ద్రష్ట, నిర్వికార శ్రోత, నిర్వికార మంత, నిర్వికార జ్ఞాత అవుతుంది.
2. మనస్సు కర్మ చేస్తుంది. కాని ఆత్మ జ్ఞాత అయినా అది కర్మలోకి రాదు. సన్నిధిమాత్రేన ఆత్మ జ్ఞాత అవుతుంది.

ఆత్మ చూస్తుంది, వింటుంది, ఆలోచిస్తుంది, తెలుసుకుంటుంది అంటే అనేక ఆత్మలు ఉన్నాయనుకునే ప్రమాదముంది. ఎంతమంది జీవులు ఉంటే అన్ని ఆత్మలు ఉన్నాయా? లేవు. అక్షరబ్రహ్మకు భిన్నంగా వేరే ఆత్మ లేదు.

**నాన్యదతోఽస్తి ద్రష్ట** – దీనికంటే భిన్నంగా చూసేది ఇంకొకటి లేదు;

**నాన్యదతోఽస్తి శ్రోత** – దీనికంటే భిన్నంగా వినేది ఇంకొకటి లేదు;

**నాన్యదతోఽస్తి మంత** – దీనికంటే భిన్నంగా ఆలోచించేది ఇంకొకటి లేదు;

**నాన్యదతోఽస్తి విజ్ఞాత** – దీనికంటే భిన్నంగా తెలుసుకునేది ఇంకొకటి లేదు.

ఇది ఒక మహావాక్యమంత్రం. ఎందుకంటే మనం మామూలుగా జీవాత్మ ఒక సబ్జెక్టు, పరమాత్మ ఇంకొక సబ్జెక్టు అనుకుని, అందువల్ల రెండు సబ్జెక్టులు ఉన్నాయి అనుకుంటాము. కాని ఉపనిషత్తు జీవాత్మ = పరమాత్మ అంటుంది. జీవాత్మ పరమాత్మలు రెండు భిన్న సబ్జెక్టులు కావు అంటుంది. ఉన్నదొక్కటే ఆత్మ. ఆ ఆత్మమీదనే జీవాత్మ, పరమాత్మలు ఆరోపించబడ్డారు.

**అస్మిన్ను ఖల్వక్షరే గార్గ్యాకాశ ఓతశ్చ ప్రోతశ్చేతి** – ఈ అక్షరం బ్రహ్మ అంతర్యామియొక్క ఓతం, ప్రోతం అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

ఇక్కడ కూడా ఒక విషయాన్ని గమనించాలి. అంతర్యామిని సూత్రంయొక్క ఓతం ప్రోతం అని వర్ణించినప్పుడు కూడా (3.7.23) ఇవే పదాలను, ఇదే నిర్వచనాన్ని వాడాడు యాజ్ఞవల్క్యుడు. సూత్రం, అంతర్యామి సగుణబ్రహ్మలు కాని అక్షరబ్రహ్మ నిర్గుణబ్రహ్మ.

రెండింటికీ ఒకే నిర్వచనం వాడినా, ఒక సూక్ష్మభేదం ఉంది. అంతర్యామిని నిర్వచించినప్పుడు పుల్లింగం వాడితే, ఇప్పుడు అక్షరం బ్రహ్మను నిర్వచించటానికి నపుంసకలింగం వాడాడు. ఈ సమానమైన నిర్వచనాన్నిబట్టి అంతర్యామి, అక్షరబ్రహ్మలు ఒకటేనని తెలుస్తున్నది. ముందే చూశాము –

**మాయాసహిత బ్రహ్మ = ఈశ్వరుడు; మాయారహిత ఈశ్వరుడు = నిర్గుణబ్రహ్మ**

# అక్షరం - అంతర్యామిల మధ్య భేదం

రెండూ ఒకటే అయినా, వాటి మధ్య కొన్ని సూక్ష్మభేదాలున్నాయి. ఈ భేదాలను నిరూపించటానికి శంకరాచార్యులు ఒక పూర్వపక్షి మూడు విషయాలు వాదించినట్టుగా భావించి, వాటికి సమాధానాలు చెబుతున్నారు.

మూడు వాదనలు – అంతర్యామి అక్షరంయొక్క ఒక అవస్థ; అంతర్యామి అక్షరంయొక్క శక్తి; అంతర్యామి అక్షరంయొక్క ఉత్పత్తి. శంకరులవారు ఈ మూడు వాదనలనూ ఖండిస్తారు.

1. **అంతర్యామి అక్షరంయొక్క ఒక అవస్థ** – అక్షరబ్రహ్మకు అవస్థాభేదం లేదు. ఎందుకంటే అక్షరబ్రహ్మకు భిన్న అవస్థలు ఉంటే, అది మార్పులు చెందాలి. నీరుకు మూడు అవస్థలు ఉన్నాయి. మంచు, నీరు, ఆవిరి. నీరుకు మార్పు ఉంది కాబట్టి అవస్థాభేదం ఉంది. కాని అలా అక్షరబ్రహ్మయొక్క మంచు స్థితి విరాట్, నీటి స్థితి హిరణ్యగర్భ, ఆవిరి స్థితి అంతర్యామి అనకూడదు. అక్షరం నిర్వికారం.
2. **అంతర్యామి అక్షరంయొక్క శక్తి** – ఇదే జవాబు. అక్షరం నిర్వికారం. శక్తిలో వికారాలు ఉంటాయి. ఒకరోజు శక్తి పెరుగుతుంది, ఒకరోజు శక్తి తగ్గుతుంది. అలా అక్షరానికి కూడా శక్తి ఉంటే అక్షరం కూడా నీరసించిపోతుంది.
3. **అంతర్యామి అక్షరంయొక్క ఉత్పత్తి** – అక్షరబ్రహ్మ కారణం కాదు. అక్షరం కారణం అయితే అంతర్యామి కార్యం అవుతుంది. కాని అక్షరంనుంచి సృష్టి జరగదు. మాయాసహిత ఈశ్వరునినుంచే అంటే అంతర్యామినుంచే సృష్టి జరుగుతుంది.

అంతర్యామి అక్షరంయొక్క ఇంకొక అవస్థ కాకపోతే, దాని శక్తి కాకపోతే, దాన్నించి పుట్టకపోతే, మరి అంతర్యామి ఎవరు?

అంతర్యామి అక్షరబ్రహ్మమీద ఆరోపించబడ్డాడు. తాడుమీద పాముని ఆరోపించినట్టుగా, అక్షరంమీద అంతర్యామి ఆరోపించబడ్డాడు. అంతర్యామి మిథ్య లేదా వ్యావహారిక సత్యం; అక్షరం సత్యం లేదా పారమార్థిక సత్యం. ఇంకో విధంగా చెప్పాలంటే పారమార్థిక దృష్ట్యా అంతర్యామి అక్షరం; వ్యావహారిక దృష్ట్యా అక్షరం అంతర్యామి.

అహం బ్రహ్మ అస్మి చెప్పినట్టే ఇది. పారమార్థిక దృష్ట్యా నేను బ్రహ్మను. వ్యావహారిక దృష్ట్యా నేను జీవిని. అంతర్యామి లక్ష్యార్థం అక్షరం. అందువల్ల ఒకే నిర్వచనాన్ని అక్షరం బ్రహ్మకూ, అంతర్యామికీ కూడా వాడవచ్చు. ఈ నిర్వచనాన్ని ఇచ్చాక యాజ్ఞవల్క్యుడు తన వాదనను ముగిస్తున్నాడు.

ఇందులో గార్గి రెండు ప్రశ్నలు అడిగింది.

1. **కస్మిగ్ంం స్తదోతం చ ప్రోతం చేతి** – సూత్రానికి లేదా హిరణ్యగర్భకు ఓతం ప్రోతం ఏది?

**జవాబు** – ఆకాశే తదోతం చ ప్రోతం చేతి – దానికి ఆకాశం ఓతం ప్రోతం. ఆకాశం అంటే అంతర్యామి లేదా ఈశ్వరుడు.

2. **కస్మిన్ను ఖల్వాకాశ ఓతశ్చ ప్రోతశ్చేతి** – ఆకాశానికి ఓతం ప్రోతం ఏది?

**జవాబు** – ఏతస్మిన్ను ఖల్వక్షరే గార్గ్యాకాశ ఓతశ్చ ప్రోతశ్చేతి – అక్షరం ఆకాశానికి ఓతం ప్రోతం.

బ్రహ్మలోకందాకా వచ్చి ఆగిపోయిన సర్వాంతరం అక్షరబ్రహ్మదాకా వస్తుంది ఈ బ్రాహ్మణములో. బ్రహ్మలోకానికి అధిష్ఠానం హిరణ్యగర్భ లేదా సూత్రం; సూత్రానికి అధిష్ఠానం అంతర్యామి లేదా ఆకాశం; ఆకాశానికి అధిష్ఠానం నిర్గుణబ్రహ్మ లేదా అక్షరం.

ఆ విధంగా యాజ్ఞవల్క్యుడు అక్షరాన్ని విజయవంతంగా నిర్వచించాడు. నిర్వచనాలకి అందని అక్షరాన్ని నిర్వచించాడు. అది కూడా రెండు నిర్వచనాలు చెప్పాడు.

1. **అస్థూలమనణ్వహ్రస్వమదీర్ఘం ... 3.8.8**
2. **అదృష్టం ద్రష్టృశ్రుతగ్ం శ్రోత్ర ... 3.8.11**

టూకీగా చెప్పాలంటే అక్షరం సర్వమనోవృత్తిసాక్షి.

బ్రహ్మవిద్య గురించిన సంవాదం నాలుగవ బ్రాహ్మణములో మొదలైంది. ఐదు బ్రాహ్మణాల్లో బ్రహ్మవిద్య గురించి, బ్రహ్మనిర్వచనం గురించీ చెప్పాడు. వీటిలో నాలుగవ బ్రాహ్మణములోని నిర్వచనం చాలా ముఖ్యమైన నిర్వచనం –

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాన్తరః**

ఇది ఒక మహావాక్యం కూడా. తక్కిన బ్రాహ్మణాలన్నీ ఈ నిర్వచనంయొక్క వ్యాఖ్యానాలే. ముఖ్యంగా సర్వాంతరః పదాన్ని విశ్లేషణకు తీసుకున్నాడు. సర్వాంతరం అంటే సారం. దాన్ని ఓతం ప్రోతంగా వాడింది గార్గి.

## మంత్రం 3.8.12

**సా హోవాచ బ్రాహ్మణా భగవన్తస్తదేవ బహు మన్యేధ్వం యదస్మాన్నమస్కారేణ ముచ్యేధ్వం న వై జాతు యుష్మాకమిమం కశ్చిద్బ్రహ్మోద్యం జేతేతి తతో హ వాచక్నవ్యుపరరామ ॥**

గార్గి పూర్తిగా తృప్తి చెందింది. అందువల్ల గార్గి వెనక్కి తగ్గటానికి నిశ్చయించుకుంది. ఆవిడ వెనక్కి తగ్గినా ఇంకొకరు ముందు వస్తారేమోనని ఆవిడ ఈ బ్రాహ్మణము మొదట్లో అన్న మాటలు గుర్తు చేస్తోంది. నా ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుడు జవాబు చెప్పగలిగితే, మీరెవరూ ఇంక అతన్ని ప్రశ్నించనవసరంలేదు అంది.

**తౌ చేన్మే వక్ష్యతి న వై జాతుయుష్మాకమిమం కశ్చిద్బ్రహ్మోద్యం జేతేతి** – 3.8.1

ఆ విషయం ఈ మంత్రంలో మళ్ళీ గుర్తు చేస్తున్నది గార్గి.

**సా హోవాచ బ్రాహ్మణా భగవంతః** – ఓ పూజ్యనీయులైన బ్రాహ్మణులారా అంది గార్గి.

**తదేవ బహు మన్యేధ్వమ్** – తత్ అంటే నేను అంతకుముందు చెప్పినమాటను మీరు మన్నించండి. ఏమిటది?

**యదస్మాన్నమస్కారేణ ముచ్యేధ్వమ్** – అతనికి నమస్కారం చెప్పి, అతన్నుంచి విముక్తులవండి.

**న వై జాతు యుష్మాకమిమం కశ్చిద్బ్రహ్మోద్యం జేతేతి** – ఇవే మాటలు అంతకుముందు కూడా చెప్పింది. మీలో ఎవరైనా, ఎప్పుడైనా ఈ బ్రహ్మావాదనలో అతనితో గెలవలేరు. బ్రహ్మావాదన అంటే వేదపూర్వభాగం, వేద అంతభాగం రెండూ వస్తాయి.

**తతో హ వాచక్నవ్యుపరరామ** – ఈ మాటలు చెప్పి గార్గి వాచక్నవి విరమించింది.

దీనితో అక్షర బ్రాహ్మణము అయిపోయింది. గార్గి ఇంకెవరినీ ప్రశ్నలు అడగవద్దు అని చెప్పినా కూడా, ఇంకొక బ్రాహ్మణుడు యాజ్ఞవల్క్యునితో వాదానికి దిగుతాడు.

# 3.9 - శాకల్య బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో మొదటిభాగంలో హిరణ్యగర్భ మహిమ గురించి వస్తుంది. 1-9 మంత్రాలు ఆ అంశాన్ని వివరిస్తాయి. ఈ మహిమ శాకల్య ఋషి అడిగిన ప్రశ్నకు సమాధానంగా వస్తుంది. శాకల్యుడు అడిగాడు కాబట్టి దీన్ని శాకల్య బ్రాహ్మణము అంటారు. ఇందులో యాజ్ఞవల్క్యుడు ఒక హిరణ్యగర్భే అనేక అంతులేని దేవతలుగా వ్యక్తమవుతున్నారు అన్నాడు.

మంత్రం 3.9.1

**అథ హైనం విదగ్ధశ్శాకల్యః పప్రచ్ఛ కతి దేవా యాజ్ఞవల్క్యేతి స హైతయైవ నివిదా ప్రతిపేదే యావన్తో వైశ్వదేవస్య నివిద్యుచ్యన్తే ॥**

**త్రయశ్చ త్రీ చ శతా త్రయశ్చ త్రీ చ సహస్రేత్యోమితి హోవాచ కత్యేవ దేవా యాజ్ఞవల్క్యేతి త్రయస్త్రిగ్ంశదిత్యోమితి హోవాచ కత్యేవ దేవా యాజ్ఞవల్క్యేతి షడిత్యోమితి హోవాచ కత్యేవ దేవా యాజ్ఞవల్క్యేతి త్రయ ఇత్యోమితి హోవాచ కత్యేవ దేవా యాజ్ఞవల్క్యేతి ద్వావిత్యోమితి హోవాచ కత్యేవ దేవా యాజ్ఞవల్క్యేత్యధ్యర్ధ ఇత్యోమితి హోవాచ కత్యేవదేవా యాజ్ఞవల్క్యేత్యేక ఇత్యోమితి హోవాచ కతమే తే త్రయశ్చ త్రీ చ శతా త్రయశ్చ త్రీ చ సహస్రేతి ॥**

**అథ హైనం విదగ్ధశ్శాకల్యః పప్రచ్ఛ** - తర్వాత విదగ్ధశాకల్యుడు యాజ్ఞవల్క్యుణ్ణి ఈ విధంగా ప్రశ్నించాడు.

**కతి దేవా యాజ్ఞవల్క్యేతి** - ఓ యాజ్ఞవల్క్యా, దేవతలు ఎంతమంది?

**స హైతయైవ నివిదా ప్రతిపేదే యావంతో వైశ్వదేవస్య నివిద్యుచ్యంతే** - వైశ్వదేవసూక్తంలో కొన్ని మంత్రపదాలు పఠించబడతాయి. వాటికి నివిదమని పేరు. ఆ నివిదంలో ఎంతమంది దేవతలు ఉన్నారని శ్రుతి చెబుతున్నదో, అంతమంది దేవతలు ఉన్నారు.

**త్రయశ్చ త్రీ చ శతా త్రయశ్చ త్రీ చ సహస్రేత్యోమితి** - అంటే మూడువేల మూడు వందల ఆరుగురు (3306). త్రయశ్చ త్రీ చ శతా  అంటే మూడు వందల మూడు; త్రయశ్చ త్రీ చ సహస్రేతి అంటే మూడువేల మూడు. వెరసి మూడువేల మూడు వందల ఆరుగురు (3306) దేవతలు. అంటే శాకల్యుడు **ఓమితి** అన్నాడు. అంటే సరే అని అంగీకరించాడు. ప్రతి ప్రశ్నకు జవాబు తర్వాత ఓమితి వస్తుంది.

**కత్యేవ దేవా యాజ్ఞవల్క్యేతి త్రయస్త్రిగ్ంశదిత్యోమితి** - దేవతలు ఎంతమంది? ముప్పయి ముగ్గురు (33);**షడితి**- ఆరుగురు; **త్రయ ఇతి** - ముగ్గురు; **ద్వావితి** - ఇద్దరు; **అధ్యర్ధ ఇతి** - ఒకటిన్నర; **ఏక ఇతి** - ఒక్కరు.

ఒక్క హిరణ్యగర్భే 3306 దేవతలుగా, 33 దేవతలుగా, 6, 3, 2, 1½, 1 గా ప్రకటితమవుతున్నాడు. ఇవన్నీ ఒక్క హిరణ్యగర్భుయొక్క భిన్నరూపాలు, భిన్న మహిమలు మాత్రమే.

**త్రయశ్చ త్రీ చ శతా త్రయశ్చ త్రీ చ సహస్రేతి** – దీన్ని నివిదవాక్యం అంటారు. ఇది వైశ్వదేవ సూక్తంలో వస్తుంది. ఇప్పుడు ఈ 3306 దేవతలు ఎవరని అడుగుతున్నాడు శాకల్యుడు. నిజానికి ఆ పేర్లన్నీ చెప్పుకుంటూ వస్తే బృహదారణ్యకానికి అంతూపొంతూ ఉండదు. అందువల్ల 3306 దేవతల గురించి టూకీగా చెప్పి, తక్కిన దేవతల పేర్లు చెప్పుకొస్తాడు.

### మంత్రం 3.9.2

**స హోవాచ మహిమాన ఏవైషామేతే త్రయస్త్రిగ్ంశత్త్వేవ దేవా ఇతి కతమే తే త్రయస్త్రిగ్ం శదిత్యష్టౌ వసవ ఏకాదశ రుద్రా ద్వాదశాదిత్యాస్త ఏకత్రిగ్ంశదిన్ద్రశ్చైవ ప్రజాపతిశ్చ త్రయస్త్రిగ్ంశావితి ॥**

**స హోవాచ మహిమాన ఏవైషామేతే త్రయస్త్రిగ్ంశత్త్వేవ దేవా ఇతి** – ఆ యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పాడు. 3306 దేవతల పేర్లు చెప్పటం కష్టం. 33 దేవతలే పేరు పొందినవారు; తక్కినవారు వీరి మహిమలు మాత్రమే.

**కతమే తే త్రయస్త్రిగ్ం శదితి** – అయితే ఈ 33 దేవతలు ఎవరు అన్నాడు శాకల్యుడు.

**అష్టౌ వసవ ఏకాదశ రుద్రా ద్వాదశాదిత్యాస్త ఏకత్రిగ్ంశదింద్రశ్చైవ ప్రజాపతిశ్చ త్రయస్త్రిగ్ంశావితి** – ఎనిమిది మంది వసువులు, పదకొండుమంది రుద్రులు, పన్నెండుమంది ఆదిత్యులు, వెరసి ముప్పయి ఒక్కరు. ఇంద్రుడు, ప్రజాపతి కలిసి ముప్పయి ముగ్గురు.

### మంత్రం 3.9.3

**కతమే వసవ ఇత్యగ్నిశ్చ పృథివీ చ వాయుశ్చాన్తరిక్షం చాదిత్యశ్చ ద్యౌశ్చ చన్ద్రమాశ్చ నక్షత్రాణి చైతే వసవ ఏతేషు హీదగ్ం సర్వగ్ం హితమితి తస్మాద్వసవ ఇతి ॥**

**కతమే వసవ ఇతి** – వసువులెవరు?

**అగ్నిశ్చ పృథివీ చ వాయుశ్చాంతరిక్షం చాదిత్యశ్చ ద్యౌశ్చ చంద్రమాశ్చ నక్షత్రాణి చైతే వసవః** – యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పాడు. అగ్ని, పృథివి, వాయువు, అంతరిక్షం, ఆదిత్యుడు, ద్యులోకం, చంద్రుడు, నక్షత్రాలు కలిపి వసువులు. **ఏతేషు హీదగ్ం సర్వగ్ం హితమితి తస్మాద్వసవ ఇతి–**

సర్వం హితం అంటున్నది ఉపనిషత్తు ఈ వసువులను. అంటే ఈ సృష్టిలో ఉన్న ఐశ్వర్యం అంతా ఈ వసువులలో అంతర్లీనంగా ఉంది.

### మంత్రం 3.9.4

**కతమే రుద్రా ఇతి దశేమే పురుషే ప్రాణా ఆత్మైకాదశస్తే యదస్మాచ్ఛరీరాన్మర్త్యాదుత్క్రామన్త్యథ రోదయన్తి తద్యద్రోదయన్తి తస్మాద్రుద్రా ఇతి ॥**

**కతమే రుద్రా ఇతి** – రుద్రులు ఎవరు?

**దశేమే పురుషే ప్రాణా ఆత్మైకాదశః** – దీనికి జవాబు ఆధ్యాత్మపరంగా చెబుతున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఏకాదశ రుద్రులు, దశ ఇంద్రియాలు, ఒక మనస్సు అంటున్నాడు. ఇక్కడ ప్రాణా అంటే ఇంద్రియాలు. పంచజ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు. ఆత్మ అంటే ఇక్కడ మనస్సు. వీటిని రుద్రులు అని ఎందుకన్నాడో ఉపనిషత్తే కారణం చెబుతున్నది.

**తే యదస్మాచ్ఛరీరాన్మర్త్యాదుత్క్రామంత్యథ రోదయంతి తద్యద్రోదయంతి తస్మాద్రుద్రా ఇతి** – ఒక జీవి మరణించాక అతని శరీరంనుంచి ఈ పదకొండు అంగాలు నిష్క్రమించి, అతని పరివారాన్ని అతనికోసం రోదించేటట్టు చేస్తాయి కాబట్టి వీటిని రుద్రులు అన్నారు.

**రోదయతి ఇతి రుద్రః**

## మంత్రం 3.9.5

**కతమ ఆదిత్యా ఇతి ద్వాదశ వై మాసాస్సంవత్సరస్యైత ఆదిత్యా ఏతే హీదగ్ం సర్వమాదదానా యన్తి తే యదిదగ్ం సర్వమాదదానా యన్తి తస్మాదాదిత్యా ఇతి ॥**

**కతమ ఆదిత్యా ఇతి** – పన్నెండు ఆదిత్యులు ఎవరు అని శాకల్యుడు అడిగాడు.

**ద్వాదశ వై మాసాస్సంవత్సరస్యైత ఆదిత్యా** – సంవత్సరానికి ఉన్న పన్నెండు నెలలే ఆదిత్యులు. ఒక్కొక్క నెలా ఒక్కొక్క ఆదిత్యుడు. ఉన్నదొక్కటే సూర్యుడైనా, ఒక్కొక్క నెలలో ఒక్కొక్క కోణంలో కనిపిస్తాడు. రంగులు, ఆకారాలు మారతాయి. ఎందుకు వాటిని ఆదిత్యులు అన్నారు? యాజ్ఞవల్క్యుడు దానికి తమాషా అయిన కారణం చెపుతున్నాడు.

**ఏతే హీదగ్ం సర్వమాదదానా యంతి తే యదిదగ్ం సర్వమాదదానా యంతి తస్మాదాదిత్యా ఇతి** – ఎందుకంటే, ఈ సర్వాన్నీ లాక్కొని వెళుతున్నారు. ఈ సర్వాన్నీ లాక్కొని వెళుతున్నారు కాబట్టి ఆదిత్యులు అనబడుతున్నారు.

ఆదిత్యుడు కాలతత్త్వాన్ని సూచిస్తాడు. సూర్యుడు ఉదయించీ, అస్తమించినప్పుడల్లా ఒక్కొక్క రోజు గడిచి పోతుంది. మనకు రోజురోజుకూ వయసు పెరుగుతూ, దారుఢ్యం తగ్గుతూ వస్తుంది. కాలతత్త్వం రూపంలో సూర్యుడు నెమ్మదిగా మన శక్తులనూ, మన యవ్వనాన్నీ, మన ఇంద్రియాలనూ, మన ప్రజ్ఞను, మన శరీరశోభనూ, మన ఐశ్వర్యాన్నీ తీసుకువెళ్ళిపోతాడు. అక్కడితో ఆగకుండా చివరికి మనను కూడా తీసుకువెళ్ళిపోతాడు.

ఆదిత్య = అది + త్య = తీసుకుని + పోయేది

**హరతి నిమేషాత్ కాలః సర్వం** – భజగోవిందం

ధనం, యవ్వనం, బంధుజనం, వీటన్నిటినీ చూసుకుని మిడిసిపాటు పడకూడదు. ఎందుకంటే, కాలం అన్నింటినీ హరించివేస్తుంది. ఆదిత్యుడు అన్నిటినీ తీసుకునివెళ్ళిపోతాడు కాబట్టి ఆదిత్యుడు అయ్యాడు.

## మంత్రం 3.9.6

**కతమ ఇన్ద్రః కతమః ప్రజాపతిరితి స్తనయిత్నురేవేన్ద్రో యజ్ఞః ప్రజాపతిరితి కతమః స్తనయిత్నురిత్యశనిరితి కతమో యజ్ఞ ఇతి పశవ ఇతి ॥**

33 మంది దేవతలు ఎవరంటే 8 వసువులు, 11 రుద్రులు, 12 ఆదిత్యులు, ఇంద్రుడు, ప్రజాపతి అని చూశాము. అందులో వసువులను, రుద్రులను, ఆదిత్యులను పేర్కొన్నాడు యాజ్ఞవల్క్యుడు. శ్రాద్ధకర్మలలోనూ, తక్కిన కర్మలలోనూ ఈ వసురుద్ర ఆదిత్యులకు పూజలు జరుగుతాయి. ఈ మంత్రంలో తక్కిన ఇద్దరినీ అంటే ఇంద్రుడు, ప్రజాపతులను చూస్తాము.

**కతమ ఇంద్రః కతమః ప్రజాపతిరితి** – ఇంద్రుడు ఎవరు? ప్రజాపతి ఎవరు?

**స్తనయిత్నురేవేంద్రో యజ్ఞః ప్రజాపతిరితి** – మెరుపే ఇంద్రుడు, యజ్ఞం ప్రజాపతి అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు.

**కతమః స్తనయిత్నురిత్యశనిరితి** – మెరుపు ఏది అని శాకల్యుడు అడిగితే ఉరుము అన్నాడు యాజ్ఞవల్క్యుడు. ఉరుములు, మెరుపులను కలిపి ఇంద్రదేవత అంటారు.

**కతమో యజ్ఞ ఇతి పశవ ఇతి** – యజ్ఞం ఏదని శాకల్యుడు అడిగితే పశువులు అని చెప్పాడు యాజ్ఞవల్క్యుడు.

ప్రజాపతికి కూడా రెండు నిర్వచనాలు చెప్పాడు. అవి యజ్ఞం, పశువు. పశువు అంటే ముఖ్యంగా ఆవు. యజ్ఞాన్ని పశువును ఎందుకు సమానం చేస్తున్నాడంటే, పశువు లేనిదే యజ్ఞం చెయ్యటం సాధ్యం కాదని చెబుతారు శంకరులవారు. ఆవునుంచి ఐదు వస్తువులు వస్తాయి. అందువల్ల యజ్ఞమే పశువు, పశువే యజ్ఞం. ఇక్కడితో 33 దేవతల గురించి అయిపోయింది. ఇప్పుడు ఆరుగురు దేవతలు ఎవరని అడగబోతున్నాడు.

## మంత్రం 3.9.7

**కతమే షడిత్యగ్నిశ్చ పృథివీ చ వాయుశ్చాన్తరిక్షం చాదిత్యశ్చ ద్యౌశ్చైతే షడేతే హీదగ్ం సర్వం షడితి॥**

**కతమే షడితి** – ఆరుగురు దేవతలు ఎవరు?

**అగ్నిశ్చ పృథివీ చ వాయుశ్చాంతరిక్షం చాదిత్యశ్చ ద్యౌశ్చేతే షడేతే హీదగ్ం సర్వం షడితి** – అగ్ని, పృథివి, వాయువు, అంతరిక్షం, ఆదిత్యుడు, ద్యులోకం – ఆరుగురు దేవతలు. ఈ సర్వమూ ఈ ఆరే అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు.

ఈ ఆరు పేర్లూ ఇంతకుముందే చూశాము. అష్టవసువులు ఎవరు అంటే ఈ ఆరుగురినీ కాక చంద్రుడు, నక్షత్రాలనూ కలిపి అష్టవసువులు అన్నాడు. ఇప్పుడు చివరి రెండూ తీసేసి ఆరుగురు దేవతలు అన్నాడు.వీరిని షడ్దేవతలు అంటారు. మనం లౌకిక జీవితంలో కూడా ఎప్పుడైనా కొంతమందిని తగ్గించాలంటే అలా ముఖ్యం కానివారిని తగ్గించుకుంటూ వస్తాము. ఉన్న ఆరుగురిలోంచి ఇంకా తగ్గించుకువస్తే, ముగ్గురే మిగులుతారు. అది వచ్చే మంత్రంలో చూస్తాము.

## మంత్రం 3.9.8

**కతమే తే త్రయో దేవా ఇతీమ ఏవ త్రయో లోకా ఏషు హీమే సర్వే దేవా ఇతి కతమౌ తౌ ద్వౌ దేవావిత్యన్నం చైవ ప్రాణశ్చేతి కతమోఽధ్యర్ధ ఇతి యోఽయం పవత ఇతి ॥**

**కతమే తే త్రయో దేవా ఇతీమ ఏవ త్రయో లోకా ఏషు హీమే సర్వే దేవా ఇతి** – ఆ ముగ్గురు దేవతలు ఎవరు? రెండు రెండు కలిపి చెప్పాడు. మూడు లోకాలు. ఎందుకంటే ఆ దేవతలు ఆయా లోకాల్లో ఉన్నారు. మూడు లోకాలు అంటే పృథివి, అంతరిక్షం, స్వర్గలోకం. అంటే పృథివీదేవత, అంతరిక్షదేవత, స్వర్గలోకదేవతలే ముగ్గురు దేవతలు.

**కతమౌ తౌ ద్వౌ దేవావిత్యన్నం చైవ ప్రాణశ్చేతి** – ఇద్దరు దేవతలు ఎవరు? అన్నం, ప్రాణం అన్నాడు యాజ్ఞవల్క్యుడు. ఎందుకంటే ఈ రెండూ లేకుండా మనం జీవించలేము.

**కతమోఽధ్యర్ధ ఇతి యోఽయం పవత ఇతి** – ఒకటిన్నర దేవత ఎవరు? ఈ వీచే వాయువు అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. వాయువును ఒకటిన్నర దేవతగా ఎందుకన్నాడో శాకల్యునికి అర్థం కాలేదు. అదే అడుగుతున్నాడు వచ్చే మంత్రంలో.

## మంత్రం 3.9.9

**తదాహుర్యదయమేక ఇవైవ పవతేఽథ కథమధ్యర్ధ ఇతి యస్మిన్నిదగ్ం సర్వమధ్యార్ధ్నోత్తేనాధ్యర్ధ ఇతి కతమ ఏకో దేవ ఇతి ప్రాణ ఇతి స బ్రహ్మ త్యదిత్యాచక్షతే ॥**

**తదాహుర్యదయమేక ఇవైవ పవతేఽథ కథమధ్యర్ధ ఇతి** – ఈ వాయువు ఒక్క దేవతేనా అన్నట్టుగా వీస్తోంది. అలాంటప్పుడు, ఒకటిన్నర ఎలా అవుతుంది? ఇది శాకల్యుని ప్రశ్న.

**యస్మిన్నిదగ్ం సర్వమధ్యార్ధ్నోత్తేనాధ్యర్ధ ఇతి** – ఈ సర్వమూ వాయువువల్లనే సమృద్ధిని పొందుతున్నది కాబట్టి వాయువు అధ్యర్థం. అధ్యర్థం పదంలో రెండు అర్థాలున్నాయి. ఒక అర్థం ఒకటిన్నర, ఇంకొక అర్థం అధికమైన సమృద్ధికి మూలం. అధ్యర్థః పదం రుధ్ ధాతువునుంచి వచ్చింది. సమృద్ధి పదం దాన్నుంచే వచ్చింది. యస్మిన్నిదం సర్వం అధ్యార్ధ్నోత్ అంటే అన్నీ సమృద్ధిని పొందుతున్నాయి.

**కతమ ఏకో దేవ ఇతి** – ఒక్క దేవత ఎవరు?

**ప్రాణ ఇతి స బ్రహ్మ త్యదిత్యాచక్షతే** – ప్రాణం. అదే బ్రహ్మ. దాని గురించి త్యత్ (అది) అని చెబుతున్నాడు.

ప్రాణతత్త్వం లేనిదే తక్కిన అంగాలేవీ పనిచెయ్యలేవు. అందువల్ల ప్రాణాన్ని **స బ్రహ్మ** అన్నాడు. ఇక్కడ బ్రహ్మ అంటే సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ కాదు. ఇక్కడ ప్రాణం అంటే హిరణ్యగర్భ. అంటే సమష్టి సూక్ష్మ ప్రపంచ అధిష్ఠానదేవత. హిరణ్యగర్భను పరోక్షదేవత అని కూడా అంటారు. ఆ విధంగా ఈ మంత్రాల్లో హిరణ్యగర్భ స్తుతి చూస్తాము.

### సర్వదేవతా రూపేణ హిరణ్యగర్భ ఏవ వర్తతే

హిరణ్యగర్భ ఎలా అందరు దేవతలు అయ్యాడో వివరంగా చూశాము. హిరణ్యగర్భే ఏకదేవత, ఒకటిన్నర దేవత, ఇద్దరు దేవతలు, ముగ్గురు దేవతలు, ఆరుగురు దేవతలు, ముప్పయి ముగ్గురు దేవతలు, చివరికి 3306 దేవతలు. అంటే అనంతదేవతారూపుడు. అందువల్ల హిరణ్యగర్భను విస్తరింపజేస్తే అనంతదేవతారూపుడు, కుంచిస్తే ఏకదేవతారూపుడు. ఇదీ హిరణ్యగర్భ మహిమ.

కాకపోతే ఈ భాగంలో హిరణ్యగర్భ పదం వాడలేదు. ప్రాణం అన్నాడు. ఈ చివరి మంత్రంలో హిరణ్యగర్భకు మూడు పేర్లు చూశాము. ప్రాణం, బ్రహ్మ, త్యత్.

ఇప్పుడు రాబోయే మంత్రాల్లో అంటే 10-17 మంత్రాల్లో హిరణ్యగర్భ ఉపాసన చూస్తాము.

మంత్రం 3.9.10

**పృథివ్యేవ యస్యాఽఽయతనమగ్నిర్లోకో మనోజ్యోతిర్యో వై తం పురుషం విద్యాత్సర్వస్యాఽఽత్మనః పరాయణగ్ం స వై వేదితా స్యాత్। యాజ్ఞవల్క్య వేద వా అహం తం పురుషగ్ం సర్వస్యాఽఽత్మనః పరాయణం యమాత్థ య ఏవాయగ్ం శారీరః పురుషస్స ఏష వదైవ శాకల్య తస్య కా దేవతేత్యమృతమితి హోవాచ ॥**

మంత్రం 3.9.11

**కామ ఏవ యస్యాఽఽయతనగ్ం హృదయం లోకో మనోజ్యోతిర్యో వై తం పురుషం విద్యాత్సర్వస్యాఽఽత్మనః పరాయణగ్ం స వై వేదితా స్యాత్। యాజ్ఞవల్క్య వేద వా అహం తం పురుషగ్ం సర్వస్యాఽఽత్మనః పరాయణం యమాత్థ య ఏవాయం కామమయః పురుషస్స ఏష వదైవ శాకల్య తస్య కా దేవతేతి స్త్రియ ఇతి హోవాచ ॥**

మంత్రం 3.9.12

**రూపాణ్యేవ యస్యాఽఽయతనం చక్షుర్లోకో మనోజ్యోతిర్యో వై తం పురుషం విద్యాత్సర్వస్యాఽఽత్మనః పరాయణగ్ం స వై వేదితా స్యాత్। యాజ్ఞవల్క్య వేద వా అహం తం పురుషగ్ం సర్వస్యాఽఽత్మనః పరాయణం యమాత్థ య ఏవాసావాదిత్యే పురుషస్స ఏష వదైవ శాకల్య తస్య కా దేవతేతి సత్యమితి హోవాచ ॥**

మంత్రం 3.9.13

**ఆకాశ ఏవ యస్యాఽఽయతనగ్ం శ్రోత్రం లోకో మనోజ్యోతిర్యో వై తం పురుషం విద్యాత్సర్వస్యాఽఽత్మనః పరాయణగ్ం స వై వేదితా స్యాత్। యాజ్ఞవల్క్య వేద వా అహం తం పురుషగ్ం సర్వస్యాఽఽత్మనః పరాయణం యమాత్థ య ఏవాయగ్ం శ్రౌత్రః ప్రాతిశ్రుత్కః పురుషస్స ఏష వదైవ శాకల్య తస్య కా దేవతేతి దిశ ఇతి హోవాచ ॥**

మంత్రం 3.9.14

**తమ ఏవ యస్యాఽఽయతనగ్ం హృదయం లోకో మనోజ్యోతిర్యో వై తం పురుషం విద్యాత్సర్వస్యాఽఽత్మనః పరాయణగ్ం స వై వేదితా స్యాత్। యాజ్ఞవల్క్య వేద వా అహం తం పురుషగ్ం**

**సర్వస్యాఽఽత్మనః పరాయణం యమాత్థ య ఏవాయం ఛాయామయః పురుషస్స ఏష వదైవ శాకల్య తస్య కా దేవతేతి మృత్యురితి హోవాచ ॥**

మంత్రం 3.9.15

**రూపాణ్యేవ యస్యాఽఽయతనగ్ం చక్షుర్లోకో మనోజ్యోతిర్యో వై తం పురుషం విద్యాత్సర్వస్యాఽఽత్మనః పరాయణగ్ం స వై వేదితా స్యాత్। యాజ్ఞవల్క్య వేద వా అహం తం పురుషగ్ం సర్వస్యాఽఽత్మనః పరాయణం యమాత్థ య ఏవాయమాదర్శే పురుషస్స ఏష వదైవ శాకల్య తస్య కా దేవతేత్యసురితి హోవాచ ॥**

మంత్రం 3.9.16

**ఆప ఏవ యస్యాఽఽయతనగ్ం హృదయం లోకో మనోజ్యోతిర్యో వై తం పురుషం విద్యాత్సర్వస్యాఽఽత్మనః పరాయణగ్ం స వై వేదితా స్యాత్। యాజ్ఞవల్క్య వేద వా అహం తం పురుషగ్ం సర్వస్యాఽఽత్మనః పరాయణం యమాత్థ య ఏవాయమప్సు పురుషస్స ఏష వదైవ శాకల్య తస్య కా దేవతేతి వరుణ ఇతి హోవాచ ॥**

మంత్రం 3.9.17

**రేత ఏవ యస్యాఽఽయతనగ్ం హృదయం లోకో మనోజ్యోతిర్యో వై తం పురుషం విద్యాత్సర్వస్యాఽఽత్మనః పరాయణగ్ం స వై వేదితా స్యాత్। యాజ్ఞవల్క్య వేద వా అహం తం పురుషగ్ం సర్వస్యాఽఽత్మనః పరాయణం యమాత్థ య ఏవాయం పుత్రమయః పురుషస్స ఏష వదైవ శాకల్య తస్య కా దేవతేతి ప్రజాపతిరితి హోవాచ ॥**

ఈ ఎనిమిది మంత్రాలు హిరణ్యగర్భ ఉపాసన గురించి చెబుతున్నాయి. ఇవి ఉపాసనభాగం కాబట్టి, ఇంచుమించు అన్ని మంత్రాలు ఒక్కలాగే ఉంటాయి కాబట్టి, మనం ఈ మంత్రాలకు అర్థాలను వివరంగా చూడటం లేదు. ఈ ఉపాసనను **అష్టవిధ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. అంటే హిరణ్యగర్భను ఎనిమిది రూపాలలో ఊహించుకుంటారు.

హిరణ్యగర్భయొక్క రూపాన్ని పురుషః అంటారు. అందువల్ల ఈ ఉపాసనను **అష్టపురుష హిరణ్యగర్భ ఉపాసన** అని కూడా అంటారు. హిరణ్యగర్భ సమష్టిదేవత కాబట్టి ఆయనే సమష్టిలోనూ, వ్యష్టిలోనూ ఉన్నాడు.

హిరణ్యగర్భ అంతటా ఉన్నా, హిరణ్యగర్భయొక్క ఎనిమిది అంశాలు తీసుకున్నాడు యాజ్ఞవల్క్యుడు ఉపాసనకు. ఒక్కొక్క అంశాన్ని పురుషుడు అంటారని చూశాము కదా. ఒక్కొక్క పురుషునికి నాలుగు విశేషణాలను వాడాడు. అవి ఆయతనం, లోకం, జ్యోతి, దేవత. ముందు వీటి అర్థాలు చూద్దాము.

ఆయతనం అంటే నివాసస్థానం. లోకం అంటే చూడటానికి తోడ్పడే పరికరం. దానిని దర్శనకరణం అంటారు. జ్యోతి అంటే ఆలోచనకు తోడ్పడే పరికరం. దానిని మననకరణం అంటారు. చివరగా దేవత అని వస్తుంది. ఇక్కడ దేవత అంటే కారణం. ఆ విధంగా ఎనిమిది పురుషులకు ఎనిమిది ఆయతనాలు, ఎనిమిది లోకాలు, ఎనిమిది జ్యోతులు, ఎనిమిది దేవతలు ఉన్నాయి.

కొన్నిచోట్ల ఈ పేర్లు స్పష్టంగా ఉన్నాయి, కొన్నిచోట్ల స్పష్టంగా లేవు. శంకరులవారి భాష్యం పుణ్యమా అని అవేమిటో, వాటికి ఆ పేర్లు ఎందుకు వచ్చాయో తెలుస్తుంది. కాకపోతే, మనం ఆ వివరాల జోలికి పోవటం లేదు ఇప్పుడు. ప్రస్తుత కాలమానపరిస్థితుల్లో ఇటువంటి వైదిక ఉపాసనలు లేవు. ఇది కేవలం మనం అర్థం చేసుకోవటానికి చూస్తున్నాము అంతే.

**అష్టవిధ హిరణ్యగర్భ ఉపాసన**

| మంత్రం | పురుషుడు | ఆయతనం | లోకం | జ్యోతి | దేవత |
|---|---|---|---|---|---|
| 10 | శారీర పురుషుడు | పృథివి | అగ్ని | మనస్సు | అమృతం (అన్నం) |
| 11 | కామమయ పురుషుడు | కామం | హృదయం | మనస్సు | స్త్రీ |
| 12 | ఆదిత్యస్థ పురుషుడు | సామాన్యరూపం | కన్ను | మనస్సు | సత్యం (కన్ను) |
| 13 | శ్రౌత్ర పురుషుడు | ఆకాశం | చెవి | మనస్సు | దిక్‌దేవత |
| 14 | ఛాయాపురుషుడు | తమస్సు | హృదయం | మనస్సు | మృత్యువు |
| 15 | ఆదర్శస్థ పురుషుడు (ప్రతిబింబం) | విశేషరూపం (ప్రతిబింబం) | కన్ను | మనస్సు | ప్రాణం (అసువు) |
| 16 | జలస్థ పురుషుడు (నీటిలో ప్రతిబింబం) | జలం | హృదయం | మనస్సు | వరుణుడు |
| 17 | పుత్రమయ పురుషుడు | రేతస్సు | హృదయం | మనస్సు | ప్రజాపతి (పితా) |

ఇది అష్టవిధ హిరణ్యగర్భ ఉపాసన. ఈ ఉపాసనను సకామ ఉపాసనగా చేస్తే, అన్నం సమృద్ధిగా దొరుకుతుంది; ప్రాణశక్తి బాగుంటుంది. నిష్కామ ఉపాసనగా చేస్తే చిత్తఏకాగ్రత, చిత్త వైశాల్యత కలిగి, ఆత్మజ్ఞాన యోగ్యతాప్రాప్తి కలుగుతుంది. ఇప్పుడు 20-24 మంత్రాల వరకూ పంచవిధ హిరణ్యగర్భ ఉపాసన చూస్తాము. 18,19వ మంత్రాలు ఉపోద్ఘాత మంత్రాలు.

## మంత్రం 3.9.18

**శాకల్యేతి హోవాచ యాజ్ఞవల్క్యస్త్వాం స్విదిమే బ్రాహ్మణా అఙ్గారావక్షయణమక్రతా ౩ ఇతి॥**

ఇందులో ఉపోద్ఘాతం వస్తుంది. యాజ్ఞవల్క్యుడు శాకల్యుణ్ణి ఏడిపిస్తున్నాడు. శాకల్యుడు యాజ్ఞవల్క్యునిమీద ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు. ఆ ప్రశ్నల వర్షంతో యాజ్ఞవల్క్యుణ్ణి ఓడించలేకపోగా, తనే ఓడిపోతున్నాడు. యాజ్ఞవల్క్యుడు తడుముకోకుండా జవాబులు చెబుతున్నాడు. అంతేకాదు, ఇవన్నీ నువ్వే అడుగుతున్నావా?

నీ వెనక దాక్కొని వీరు నిన్ను రెచ్చగొడుతున్నారా అంటాడు. ఇంతవరకూ శాకల్య అడుగుతూనే ఉన్నా యాజ్ఞవల్క్యుడు ఓపిగ్గా 'వదైవ శాకల్య,' అంటే ఇంకా అడుగు శాకల్య అంటూనే వచ్చాడు. కాని ఇక్కడ అతనికి అనుమానం వచ్చి అడుగుతాడు. ఏమని?

**శాకల్యేతి హోవాచ యాజ్ఞవల్క్యస్త్వాం స్విదిమే బ్రాహ్మణా అంగారావక్షయణమక్రతా ౩ ఇతి** – ఓ శాకల్యా అని సంబోధించి యాజ్ఞవల్క్యుడు ఇలా అడిగాడు – ఈ బ్రాహ్మణులు నిన్ను నిజంగా నిప్పులను తీసే పటకారుగా చేశారా అనిపిస్తున్నది నాకు.

నిన్ను పిచ్చివాణ్ణి చేసి తక్కిన బ్రాహ్మణులు నిన్ను ఆడిస్తున్నట్టుగా తోస్తున్నది అంటున్నాడు. పైగా ఈ భావనను ఒక ఉదాహరణతో సహా చెబుతాడు. అంగావక్షయణం అంటే నిప్పులను నొక్కి తీసే పటకారు లాంటి సాధనం. అంటే తనను తాను నిప్పులతో పోల్చుకుంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. తన జోలికి వస్తే ఆ నిప్పులతో కాలిపోతామని భయమేసి, శాకల్యుణ్ణి ఆ నిప్పులను పట్టుకునే పటకారుగా ముందుకు తోశారు తక్కిన బ్రాహ్మణులు అంటున్నాడు. దానివల్ల వారికేమీ కాదు, నువ్వు కాలిపోతావు జాగ్రత్త అని హెచ్చరిస్తున్నాడు. నిన్ను బలిపశువును చేశారు సుమా అని హెచ్చరిస్తున్నాడు పైనుంచి.

కాని శాకల్యుడు ఆ వ్యంగ్యాన్ని కాని, ఆ హెచ్చరికను కాని పట్టించుకోడు. అది తర్వాత వచ్చే మంత్రంలో చూస్తాము.

## మంత్రం 3.9.19

**యాజ్ఞవల్క్యేతి హోవాచ శాకల్యో యదిదం కురుపఞ్చాలానాం బ్రాహ్మణానత్యవాదీః కిం బ్రహ్మ విద్వానితి దిశో వేద సదేవాస్సప్రతిష్ఠా ఇతి యద్దిశో వేత్థ సదేవాస్సప్రతిష్ఠాః ॥**

**యాజ్ఞవల్క్యేతి హోవాచ శాకల్యో యదిదం కురుపంచాలానాం బ్రాహ్మణానత్సవాదీః కిం బ్రహ్మ విద్వానితి** – యాజ్ఞవల్క్యునితో శాకల్యుడు ఇలా అంటాడు, ఓ యాజ్ఞవల్క్యా, నువ్వు బ్రహ్మావాదివైనా కురుపంచాలదేశ బ్రాహ్మణులను తిరస్కరించి మాట్లాడుతున్నావు.

వారేం నన్ను బలిపశువును చెయ్యలేదు. నా అంతట నేను అడుగుతున్నాను. పైగా వారేం తక్కువవారు కాదు, వారు గొప్ప బ్రాహ్మణులు అన్నాడు. నువ్వు బ్రహ్మను తెలుసుకుని ఈ విధంగా బ్రాహ్మణులను తిరస్కరించి మాట్లాడావా అన్నాడు.

**దిశో వేద సదేవాస్సప్రతిష్ఠా ఇతి** – యాజ్ఞవల్క్యుడు అతని ప్రశ్నకు సమాధానంగా, నాకు ఈ బ్రహ్మవిజ్ఞానం ఉందని దిక్కులకు సంబంధించిన విజ్ఞానం గురించి చెబుతాడు.

వచ్చే మంత్రంనుంచి 24వ మంత్రం వరకూ (20–24) వారి సంభాషణ రూపంలో పంచదిక్కులలో ఉన్న హిరణ్యగర్భ ఉపాసన గురించి వస్తుంది. దాన్ని **పంచదిక్‌రూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. ఒక్కొక్క దిక్కుకు మూడు అంశాలు ఉంటాయి. అవి ప్రతిష్ఠ 1, ప్రతిష్ఠ 2, ప్రతిష్ఠ 3. దీన్ని కూడా పట్టికరూపంలో చూడవచ్చు.

మంత్రం 3.9.20

కిన్దేవతోఽస్యాం ప్రాచ్యాం దిశ్యసీతి ఆదిత్యదేవత ఇతి॥ స ఆదిత్యః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి చక్షుషీతి కస్మిన్ను చక్షుః ప్రతిష్ఠితమితి రూపేష్వితి చక్షుషా హి రూపాణి పశ్యతి కస్మిన్ను రూపాణి ప్రతిష్ఠితానీతి హృదయ ఇతి హెూవాచ హృదయేన హి రూపాణి జానాతి హృదయే హ్యేవ రూపాణి ప్రతిష్ఠితాని భవన్తీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య ॥

మంత్రం 3.9.21

కిన్దేవతోఽస్యాం దక్షిణాయాం దిశ్యసీతి యమదేవత ఇతి స యమః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి యజ్ఞ ఇతి కస్మిన్ను యజ్ఞః ప్రతిష్ఠిత ఇతి దక్షిణాయామితి కస్మిన్ను దక్షిణా ప్రతిష్ఠితేతి శ్రద్ధాయామితి యదా హ్యేవ శ్రద్ధత్తేఽథ దక్షిణాం దదాతి శ్రద్ధాయాగ్ం హ్యేవ దక్షిణా ప్రతిష్ఠితేతి కస్మిన్ను శ్రద్ధా ప్రతిష్ఠితేతి హృదయ ఇతి హెూవాచ హృదయేన హి శ్రద్ధాం జానాతి హృదయే హ్యేవ శ్రద్ధా ప్రతిష్ఠితా భవతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య ॥

మంత్రం 3.9.22

కిన్దేవతోఽస్యాం ప్రతీచ్యాం దిశ్యసీతి వరుణదేవత ఇతి స వరుణః కస్మిన్ ప్రతిష్ఠిత ఇత్యప్స్వితి కస్మిన్న్వాపః ప్రతిష్ఠితా ఇతి రేతసీతి కస్మిన్ను రేతః ప్రతిష్ఠితమితి హృదయ ఇతి తస్మాదపి ప్రతిరూపం జాతమాహుర్హృదయాదివ సృప్తో హృదయాదివ నిర్మిత ఇతి హృదయే హ్యేవ రేతః ప్రతిష్ఠితం భవతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య ॥

మంత్రం 3.9.23

కిన్దేవతోఽస్యాముదీచ్యాం దిశ్యసీతి సోమదేవత ఇతి స సోమః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి దీక్షాయామితి కస్మిన్ను దీక్షా ప్రతిష్ఠితేతి సత్య ఇతి తస్మాదపి దీక్షితమాహుస్సత్యం వదేతి సత్యే హ్యేవ దీక్షా ప్రతిష్ఠితేతి కస్మిన్ను సత్యం ప్రతిష్ఠితమితి హృదయ ఇతి హెూవాచ హృదయేన హి సత్యం జానాతి హృదయే హ్యేవ సత్యం ప్రతిష్ఠితం భవతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య ॥

మంత్రం 3.9.24

కిన్దేవతోఽస్యాం ధ్రువాయాం దిశ్యసీత్యగ్నిదేవత ఇతిసోఽగ్నిః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి వాచీతి కస్మిన్ను వాక్ప్రతిష్ఠితేతి హృదయ ఇతి కస్మిన్ను హృదయం ప్రతిష్ఠితమితి ॥

**పంచదిక్ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

| మంత్రం | దిక్ | దేవత | ప్రతిష్ఠ 1 | ప్రతిష్ఠ 2 | ప్రతిష్ఠ 3 |
|---|---|---|---|---|---|
| 20 | తూర్పు | ఆదిత్యుడు | కన్ను | రూపాలు | హృదయం |
| 21 | దక్షిణం | యముడు | యజ్ఞం | దక్షిణ, శ్రద్ధ | హృదయం |
| 22 | పడమర | వరుణుడు | జలం | రేతస్సు | హృదయం |
| 23 | ఉత్తరం | సోముడు | దీక్ష | సత్యం | హృదయం |
| 24 | ఊర్ధ్వం | అగ్ని | వాక్కు | బుద్ధి(హృదయం) | – |

ఈ విధంగా హిరణ్యగర్భను పంచదేవతల రూపంలో ఉపాసన చెయ్యాలి. పంచదేవతలు – ఆదిత్యుడు, యముడు, వరుణుడు, సోముడు, అగ్ని. ప్రతి ఉపాసనలోనూ మూడు ప్రతిష్ఠలు చూశాము. ప్రతిష్ఠ అంటే ఆధారం. దేనికి ఏది ఆధారం? ఒక ఉదాహరణను చూద్దాము.

**మంత్రం 20** – తూర్పుదిక్కుకి దేవత ఆదిత్యుడు అని చూశాము. ఆదిత్యునికి ఆధారం ఎవరు? కన్ను. పట్టికలో కుడివైపు ఉన్న పదం, ఎడమవైపు ఉన్న పదానికి ఆధారం. అంటే కన్ను ఆదిత్యునికి ఆధారం. ప్రతిష్ఠ రెండు రూపాలు. అది కన్ను అనే ప్రతిష్ఠకు ఆధారం. ప్రతిష్ఠ మూడు హృదయం. అది రూపాలకు ప్రతిష్ఠ.

ఒకదానికొకటి ఎలా ఆధారమో శంకరాచార్యులు వివరిస్తారు. ఈ అంశమే తీసుకుంటే, ఆదిత్యుణ్ణి చూసేది కన్ను. కన్ను చూస్తేనే ఆదిత్యుడు ఉదయిస్తున్నాడు, అస్తమిస్తున్నాడు అని తెలుస్తుంది. కన్నుకు ఆధారం రూపాలు అన్నాము. రూపాలను చూడటానికే కన్ను నియోగించబడింది. అంటే రూపాలను చూడగలిగితే, కన్ను బాగా పనిచేస్తున్నట్టు తెలుస్తుంది. ఆ కన్ను ఆ రూపాలను చూడాలంటే మనస్సు కన్ను వెనుక ఉండాలి.

హృదయం అంటే మనస్సు. శాస్త్రం ప్రకారం మనస్సు హృదయంలో ఉంటుంది. అంటే మనస్సు రూపానికి ఆధారం, రూపం కంటికి ఆధారం, కన్ను ఆదిత్యునికి ఆధారం.

**మంత్రం 21** – దక్షిణదిశలో ఉన్న దేవత యముడు. యమునికి ప్రతిష్ఠ యజ్ఞం. యజ్ఞానికి ప్రతిష్ఠ దక్షిణ. దక్షిణకి ప్రతిష్ఠ శ్రద్ధ. ఎందుకంటే శ్రద్ధ ఉంటేనే దక్షిణ ఇస్తాడు. శ్రద్ధకు ప్రతిష్ఠ హృదయం.

**మంత్రం 22** – పడమర దిక్కులో ఉన్న దేవత వరుణుడు. వరుణునికి ప్రతిష్ఠ జలం. జలానికి ప్రతిష్ఠ రేతస్సు. రేతస్సుకు ప్రతిష్ఠ హృదయం.

**మంత్రం 23** – ఉత్తరదిక్కులో ఉన్న దేవత సోముడు. సోమునికి ప్రతిష్ఠ దీక్ష, దీక్షకు ప్రతిష్ఠ సత్యము. సత్యానికి ప్రతిష్ఠ హృదయం.

**మంత్రం 24** – ఊర్ధ్వదిక్కులో దేవత అగ్ని. అగ్నికి ప్రతిష్ఠ వాక్కు, వాక్కుకు ప్రతిష్ఠ బుద్ధి(హృదయం).

1. **జగత్తు–నామరూపకర్మ** – చివరి హిరణ్యగర్భను, మొదటి హిరణ్యగర్భను కలిపి తీసుకుంటే నామరూపాలతో కలిసివున్నాడు హిరణ్యగర్భ. ప్రతిష్ఠ 1లో అంశాలు చూస్తే యజ్ఞం, జలం, దీక్ష వచ్చాయి. అంటే ఈ మూడూ

కర్మకు చెందిన అంశాలు. ఇప్పుడు ఈ ఐదింటినీ కలిపి చూస్తే హిరణ్యగర్భ నిర్వచనం నామం, రూపం, కర్మ. ఈ నిర్వచనం ఈ ఉపనిషత్తులోనే మొదటి అధ్యాయం చివర్లో చూశాము.

పంచవిధ హిరణ్యగర్భ అంటే సమష్టి ప్రపంచం. సమష్టి ప్రపంచం అంటే **నామరూపకర్మ** అని అర్థం అవుతున్నది.

2. **మనస్సు జగత్తుకు ఆధారం** – ఈ పట్టికలో ఇంకొక విషయం చూస్తే పంచవిధ హిరణ్యగర్భకు చివరి ప్రతిష్ఠ హృదయం అని గమనిస్తాము. అంటే ఆ హిరణ్యగర్భ ఏ దిక్కులో ఉన్నా, ఏ దేవత అయినా – నామరూపకర్మ అయినా అన్నింటికీ అంతిమ ఆధారం హృదయం.

హృదయం అంటే ఏమిటి? శాస్త్రంలో హృదయం అంటే మనస్సు. అంటే నామరూపకర్మాత్మక జగత్తును మనస్సు సహాయం లేనిదే అనుభవించలేము. అంటే మనస్సు లేకపోతే నామం లేదు, రూపం లేదు, కర్మ లేదు. ఈ విషయాన్ని మన అనుభవం కూడా నిరూపిస్తుంది. ఎలా? సుషుప్తిలో మనస్సు పడుకున్నప్పుడు నామరూపకర్మాత్మక జగత్తు లేదు. దీన్నిబట్టి మొత్తం జగత్తు మనోమయం అని అర్థం అవుతున్నది.

జగత్తును ఐదు ఇంద్రియాల సహాయంతో చూస్తాము. అంటే జగత్తు రూపరసశబ్దస్పర్శగంధాత్మకంగా ఉంటుంది. ఈ రూపరసశబ్దస్పర్శగంధాత్మక జగత్తును మన పంచేంద్రియాలు లేకపోతే అనుభవించలేము. మన పంచేద్రియాలు మనస్సు లేకపోతే పనిచెయ్యలేవు. ప్రపంచానికి ఆధారం ఇంద్రియాలు, ఇంద్రియాలకు ఆధారం మనస్సు. అందువల్ల ఈ శబ్దాది ప్రపంచానికి మనస్సే ఆధారం. ఈ విషయాన్ని అందంగా వర్ణిస్తారు సద్దర్శనంలో.

జగత్తు శబ్దాది రూపం; దానికి ఇంద్రియాలు లేనిదే ఉనికి లేదు, ఇంద్రియాలకు మనస్సు లేనిదే ఉనికి లేదు. అందువల్ల మనస్సు ముఖ్యమైనది. అందువల్ల హృదయం ప్రతిష్ఠ అయింది. ఇది ఈ సద్దర్శనం శ్లోకం సారాంశం.

దీనితో పంచవిధ హిరణ్యగర్భ ఉపాసన అయిపోయింది. 24వ మంత్రం చివర్లో శాకల్యుడు ఇంకొక ప్రశ్న అడిగాడు. యాజ్ఞవల్క్యుడు అన్నిటికీ హృదయం ఆధారం అన్నాడు కదా, దానినిబట్టి వచ్చిన ప్రశ్న ఇది –

**కస్మిన్ను హృదయం ప్రతిష్ఠితమితి** – హృదయానికి ప్రతిష్ఠ ఏది? ఇది ప్రశ్న. దానికి జవాబు తర్వాత వచ్చే మంత్రంలో చూస్తాము.

## మంత్రం 3.9.25

**అహల్లికేతి హెూవాచ యాజ్ఞవల్క్యో యత్రైతదన్యత్రాస్మన్మన్యాసై యద్ధ్యేతదన్యత్రాస్మత్స్యాచ్ఛ్వానో వైనదద్యుర్వయాగ్ంసి వైనద్విమథ్నీరన్నితి ॥**

హృదయానికి ప్రతిష్ఠ ఏది? ప్రశ్న, దీనికి జవాబు, హృదయానికి ప్రతిష్ఠ శరీరం. హృదయం అంటే మనస్సు అని మర్చిపోకూడదు. మనస్సుకు ఆధారం శరీరం. కాని యాజ్ఞవల్క్యుడు ఈ జవాబును ఇంత ప్రత్యక్షంగా ఇవ్వడు. తెలిసిన విషయాలను కూడా ప్రత్యక్షంగా చెప్పదు ఈ ఉపనిషత్తు. బృహదారణ్యకోపనిషత్తు ప్రత్యేకత అది. పరోక్షంగా చెబుతుంది, లేదా రెండు వ్యతిరేక పదాలతో చెబుతుంది.

ఇక్కడ యాజ్ఞవల్క్యుడు పరోక్షంగా చెబుతున్నాడు. మనస్సు గనుక శరీరంలో లేకపోతే, శరీరం శవం అవుతుంది. దాన్ని రెండు వ్యతిరేకపదాలతో చెబుతాడు. అది కూడా అంత తేలిగ్గా చెప్పడు.

**యత్రైతదన్యత్రాస్మన్మన్యాసై యద్ధ్యేతదన్యత్రాస్మత్స్యాచ్ఛ్వానో వైనదద్యుర్వయాగ్ంసి వైనద్విమథ్నీరన్నితి** – మనస్సు లేకపోతే శరీరం శవం అవుతుంది అని చెప్పకుండా, శరీరంలో మనస్సు లేకపోతే శరీరాన్ని కుక్కలు తింటాయి, లేదా పక్షులు పీకిపీకి ముక్కలు చేస్తాయి అంటాడు. మనస్సు శరీరంలో లేకపోతే శరీరం మరణించినట్టే, అంటే మనస్సు శరీరంలో ఉంటే శరీరం జీవించివున్నట్టు అర్థం. దీన్నిబట్టి మనస్సు శరీరానికి ఆధారం.

ఈ సందర్భంలో శంకరాచార్యులవారు ఒక ఉపసిద్ధాంతాన్ని వివరిస్తున్నారు. మనస్సు–శరీరాలను విశ్లేషిస్తే ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. అంటే ఒకటి లేకుండా ఇంకొకదానికి ఉనికి లేదు. అందువల్ల మనస్సు శరీరానికి ఆధారమా, శరీరం మనస్సుకు ఆధారమా అంటే చెప్పటం కష్టం. ఇలా ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉండే అంశాన్ని తైత్తిరీయోపనిషత్తులోని భృగువల్లీలో ప్రతిష్ఠా ప్రతిష్ఠిత సంబంధం చూసినప్పుడు చూశాము. ఈ ఉపనిషత్తులో కూడా మధుకాండంలో చూశాము. ఈ ప్రపంచంలో ఒకదానిమీద ఒకటి ఆధారపడివుందని దీని సారాంశం.

ఇప్పుడు మనస్సు–శరీరాలు ఒకదానిమీద ఒకటి ఎలా ఆధారపడివున్నాయో చూద్దాము.

**మనస్సు ప్రతిష్ఠా, శరీరం ప్రతిష్ఠితం** – అంటే మనస్సు ఆధారం, శరీరం ఆధేయం. మనస్సుమీద శరీరం ఆధారపడివుంది. మనస్సు లేకపోతే శరీరం కొన్ని గంటలు కూడా జీవించలేదు. శరీరంలో ప్రాణం ఉన్నంత వరకే ఎవరైనా యోగక్షేమాలు అడిగేది. శరీరంలోంచి ప్రాణం పోతే ఆఖరికి భార్య కూడా ఆ కట్టెను పట్టుకోవటానికి భయపడుతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే.

**శరీరం ప్రతిష్ఠా, మనస్సు ప్రతిష్ఠితం** – మనస్సు శరీరంమీద ఎలా ఆధారపడి ఉంటుంది? మనస్సు శరీరం లేకపోయినా ఉంటుంది అనుకుంటాము. ఎందుకంటే, స్థూలశరీరం మరణించినా, మనస్సు లేదా సూక్ష్మ శరీరం లోకాలకు ప్రయాణిస్తుందనీ, ఇంకొక శరీరాన్ని తీసుకుంటుందనీ చూశాము. అంటే శరీరం లేకపోయినా మనస్సు ఉన్నట్టేగా? కాదు. ఎందుకంటే శరీరం లేకపోయినా మనస్సు ఉంటుంది కాని, శరీరం లేకుండా మనస్సు **పనిచెయ్యలేదు**.

శరీరం లేకపోతే మనస్సు సుఖదుఃఖభోగాలను అనుభవించలేదు. అంటే మనస్సు స్వతంత్రంగా కర్తా, భోక్తా అవలేదు. మనస్సు కర్తా, భోక్తా అవాలంటే అది ఇంకొక శరీరాన్ని తీసుకోవాలి. ఆ శరీరం ఈ లోకంలోనే అవాలని నియమం లేదు. అది పితృలోకంలో కావచ్చు, బ్రహ్మలోకంలో కావచ్చు.

ఆ విధంగా మనస్సు శరీరంమీద దాని ఉనికికోసం ఆధారపడిలేదు కాని అది పని చెయ్యటంకోసం ఆధారపడివుంది. పనిచెయ్యకుండా ఉనికి ఉన్నా అది లేనట్టే అంటారు శంకరులవారు. పనిచెయ్యని మనస్సు (అవ్యక్తంలో ఉన్న మనస్సు) ఉన్నా లేనట్టే. అంటే పనిచెయ్యని మనస్సు లేదనటం లేదు, జాగ్రత్తగా చూడండి, ఉన్నా లేనట్టే అంటున్నాము.

వేదాంతంలో ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయని చెపితే, అది మిథ్యాత్వాన్ని సూచిస్తుంది. ఈ మిథ్యాత్వంలో ఏది గొప్పో చెప్పలేము. అలాంటి జంటే కర్మ-జన్మ.

కర్మ వల్ల జన్మనెత్తుతున్నామా, జన్మనెత్తటం వల్ల కర్మ చేస్తున్నామా అంటే దానికి జవాబు లేదు. కర్మముందా? జన్మముందా? ఇది ఒక అంతుపట్టని ప్రశ్న. అలాగే ఫ్రీవిల్-విధి జంట. ఫ్రీవిల్‌మీద విధి ఆధారపడి ఉందా, విధిమీద ఫ్రీవిల్ ఆధారపడి ఉందా? దీని గురించి తరతరాలుగా చర్చ సాగుతోంది కాని నేటివరకూ ఈ సమస్యకు పరిష్కారం దొరకలేదు. ఎందుకంటే రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. అయినా వాదిస్తూపోతే, వాదనే మిగులుతుంది కాని మోక్షం రాదు.

జగత్తులో అన్నీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. అందువల్ల జగత్తు మిథ్య. దీన్ని శరీరం-హృదయం సంబంధంద్వారా సూచించవచ్చు.

తక్కిన బ్రాహ్మణులందరూ ప్రశ్నలు అడిగి విరమించారు. శాకల్య మాత్రం ప్రశ్నల తూటాలను ఆపటం లేదు. యాజ్ఞవల్క్యునికి అసహనం పెరుగుతున్నది. అప్పటికే ఒకసారి అతన్ని హెచ్చరించాడు. తను నిప్పులాగా మండుతున్నాడని, అతను నిప్పును పట్టుకునే పటకారులాగా వాడబడుతున్నాడనీ హెచ్చరించాడు. తెలివైన వ్యక్తి ఆ హెచ్చరికను అందుకుని, సద్దుమణుగుతాడు. కాని శాకల్యుడు వెనుకంజ వెయ్యలేదు. అలా అడుగుతూనే ఉన్నాడు.

**అహల్లికేతి హోవాచ యాజ్ఞవల్క్య** – ఓ ప్రేతా అని సంబోధించాడు యాజ్ఞవల్క్యుడు. అహల్లిక అంటే ప్రేతం అని అర్థం. అలా ఎందుకు సంబోధించాడో శంకరులవారు వివరించలేదు. అందువల్ల ఉపభాష్యకారులు దాన్ని విశ్లేషించారు. ప్రేతం రాత్రిపూటనే పనిచేస్తుంది, పగలు పనిచెయ్యదు. ప్రేతం ఒకచోటినుంచి ఇంకొక చోటికి ఎగిరినట్టుగా, శాకల్యుడు ఒక ప్రశ్ననుంచి ఇంకొక ప్రశ్నకు ఎగురుతున్నాడు అంటారు వారు.

ప్రేతా అన్నా కూడా శాకల్యుడు ఆగడు. చివరికి శాకల్యుడు అంతమవుతాడు. అది తెలియక, శాకల్యుడు తర్వాత వచ్చే మంత్రంలో ఇంకొక ప్రశ్న వేస్తాడు.

### మంత్రం 3.9.26

**కస్మిన్ను త్వం చాత్మా చ ప్రతిష్ఠితౌ స్థ ఇతి ప్రాణ ఇతి కస్మిన్ను ప్రాణః ప్రతిష్ఠిత ఇత్యపాన ఇతి కస్మిన్న్వపానః ప్రతిష్ఠిత ఇతి వ్యాన ఇతి కస్మిన్ను వ్యానః ప్రతిష్ఠిత ఇత్యుదాన ఇతి కస్మిన్నూదానః ప్రతిష్ఠిత ఇతి సమాన ఇతి ॥**

**స ఏష నేతి నేత్యాత్మాఽగృహ్యో న హి గృహ్యతేఽశీర్యో న హి శీర్యతేఽసఙ్గో న హి సజ్యతేఽసితో న వ్యథతే న రిష్యతి॥**

**ఏతాన్యష్టావాయతనాన్యష్టౌ లోకా అష్టౌ దేవా అష్టౌ పురుషాస్స యస్తాన్ పురుషాన్నిరుహ్య ప్రత్యుహ్యాత్యక్రామత్తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి తం చేన్మే న వివక్ష్యసి మూర్ధా తే విపతిష్యతీతి। తగ్ం హ న మేనే శాకల్యస్తస్య హ మూర్ధా విపపాతాపి హాస్య పరిమోషిణోఽస్థీన్యప జహ్రూరన్యన్మన్యమానాః ॥**

**కస్మిన్ను త్వం చాత్మా చ ప్రతిష్ఠితౌ స్థ ఇతి** – శరీరం, హృదయాలకు ఏది ప్రతిష్ఠ?

**ప్రాణ ఇతి** – శరీరం, హృదయాలకు ప్రతిష్ఠ ప్రాణం.

ముందు మంత్రాల్లో అన్నిటికీ ఆధారం మనస్సు (హృదయం) అని చూశాము. ఇంతకుముందు మంత్రంలో శరీరం మనస్సుకు ప్రతిష్ఠ అని చూశాము. ఇక్కడ శరీరానికి ప్రతిష్ఠ ఏమిటి అన్నాడు.

దీనికి జవాబు తేలిగ్గా చెప్పాలంటే పంచప్రాణాలు. శరీరానికి ప్రతిష్ఠ పంచప్రాణాలు. ఈ విషయం కూడా మనకు అనుభవపూర్వకంగా తెలుసు. శరీరంలో ప్రాణం ఉన్నంతవరకే అది నిలిచివుంటుంది. ఎవరైనా మరణిస్తే, అతని ప్రాణం పోయింది అంటాము. ప్రాణం పోకముందు కూడా ఏదైనా నొప్పి వస్తే, ప్రాణం గిల్లార్చుకు పోయింది అంటాము. ఎవరైనా సతాయిస్తుంటే, నా ప్రాణాలు తోడకురా అంటాము. వీటన్నిటినీబట్టి శరీరానికి ఆధారం ప్రాణం. కాని ఈ భావాన్ని వివరంగా చెబుతున్నది ఉపనిషత్తు.

**కస్మిన్ను ప్రాణః ప్రతిష్ఠిత ఇత్యపాన ఇతి** – ప్రాణానికి ఆధారం ఏది? అపానం.

**కస్మిన్న్వపాన ప్రతిష్ఠిత ఇతి వ్యాన ఇతి** – అపానానికి ఆధారం ఏది? వ్యానం.

**కస్మిన్ను వ్యాన ప్రతిష్ఠిత ఇత్యుదాన ఇతి** – వ్యానానికి ఆధారం ఏది? ఉదానం.

**కస్మిన్న్వుదానః ప్రతిష్ఠిత ఇతి సమాన ఇతి** – ఉదానానికి ఆధారం ఏది? సమానం.

ఈ విధంగా శరీరానికి ప్రతిష్ఠ ప్రాణం; ప్రాణానికి ప్రతిష్ఠ అపానం; అపానానికి ప్రతిష్ఠ వ్యానం; వ్యానానికి ప్రతిష్ఠ ఉదానం; ఉదానానికి ప్రతిష్ఠ సమానం.

ఇక్కడ కూడా శరీరం–ప్రాణాల మధ్య ప్రతిష్ఠా–ప్రతిష్ఠితం సంబంధం ఉంది. ఈ సంబంధాన్ని తైత్తిరీయంలో కూడా చూస్తాము.

**ప్రాణేన శరీరం ప్రతిష్ఠితమ్** – ఒక కోణంలో ప్రాణశక్తివల్లే శరీరం పనిచేస్తోంది. ప్రాణం వల్లే శరీరానికి చేతనశక్తి, క్రియాశక్తి సమకూరుతాయి.

**శరీరే ప్రాణః ప్రతిష్ఠితః** – ఇంకొక కోణంలో ప్రాణశక్తి శరీరం అనే పెట్టెలో ఉన్నప్పుడే ఈ క్రియాకలాపం అంతా జరుగుతుంది. అందువల్ల ప్రాణానికి శరీరం ఆధారం; శరీరానికి ప్రాణం ఆధారం.

ఈ విధంగా మూడు అంశాలు మిగిలాయి. అవి – మనస్సు, శరీరం, ప్రాణం. ముందు మంత్రంలో మనస్సు, శరీరాలను చూశాము. ఇక్కడ ప్రాణాన్ని చూస్తున్నాము. ఈ రెండు మంత్రాలనూ కలిపి చూస్తే మనస్సు, శరీరం, ప్రాణాలు ఒకదానిమీద ఒకటి ఆధారపడివున్నాయి. ఇవి మూడూ ఒక త్రికోణం.

ఇప్పుడు స ఏష నేతి నేతి... న రిష్యతి – వరకూ తర్వాత చూద్దాము. ఈ వాక్యాలు యాజ్ఞవల్క్య, శాకల్యుల సంవాదం అయ్యాక రావాలి. అందువల్ల ఈ సంవాదం కొనసాగిద్దాము.

శాకల్యుని దగ్గర ఉన్న ప్రశ్నలన్నీ అడిగేశాడు. అతను అడిగిన ప్రశ్నల సారాంశం – హిరణ్యగర్భ స్తుతి, అష్టవిధ హిరణ్యగర్భ, పంచవిధ హిరణ్యగర్భ, హృదయం, శరీరం, ప్రాణం. వీటి తర్వాత అడగటానికేమీ మిగలలేదు అతని దగ్గర.

ఈ ప్రశ్నలను విశ్లేషిస్తే, ఇవన్నీ మిథ్యా ప్రపంచానికి చెందినవి. అంటే అతనికి మిథ్యా ప్రపంచానికి మించి ఏమీ తెలియదు. ఇంతవరకూ యాజ్ఞవల్క్యుడు శాకల్యుడు వదిలిన ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పాడు. ఇప్పుడు యాజ్ఞవల్క్యుని వంతు వచ్చింది. అతను శాకల్యుణ్ణి ప్రశ్నిస్తాడు.

అష్టవిధ హిరణ్యగర్భ ఉన్న మిథ్యా ప్రపంచానికి అధిష్ఠాన పరమాత్మ ఎవరని అడిగాడు యాజ్ఞవల్క్యుడు. అష్టవిధ హిరణ్యగర్భుడు మిథ్య; పంచవిధ హిరణ్యగర్భుడు మిథ్య; హృదయం మిథ్య; శరీరం మిథ్య; ప్రాణం మిథ్య. ఇటువంటి మిథ్యా ప్రపంచానికి అధిష్ఠానం ఎవరు?

అంటే ఈ ప్రశ్న పరమాత్మకు చెందినది. ఆ పరమాత్మ స్వరూపం ఏమిటి? పరమాత్మ ఈ మిథ్యాప్రపంచాన్ని సృష్టించాడు; ఆయనలోకే ఈ ప్రపంచం లయమవుతుంది. మిథ్యా ప్రపంచానికి అతీతంగా ఉన్నాడు పరమాత్మ. అతీతంగా ఉన్నాడంటే, మిథ్యాజగత్తు వ్యావహారికస్థాయికి చెందితే, బ్రహ్మ పారమార్థికస్థాయికి చెందుతుంది.

**ఏతాన్యష్టావాయతనాన్యష్టౌ లోకా అష్టౌ దేవా అష్టౌ పురుషాః** – ఈ ఎనిమిది ఆయతనాలు, ఎనిమిది లోకాలు, ఎనిమిది దేవతలు, ఎనిమిది మంది పురుషులు – ఇవన్నీ మనం అష్టవిధ హిరణ్యగర్భ ఉపాసన పట్టికలో చూశాము. ఇవన్నీ కలిపి మిథ్యా ప్రపంచం వస్తుంది.

**సః యస్తాన్ పురుషాన్నిరుహ్య ప్రత్యుహ్యాత్యక్రామత్తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి** – ఈ అష్టవిధ పురుషుని సృష్టికర్త ఎవరు? అష్టవిధ పురుషుని లయకర్త ఎవరు? అష్టవిధ పురుషునికన్నా అతీతంగా ఉన్నది ఎవరు? నిరుహ్య అంటే సృష్టి; అంటే సృష్టి చేసేది ఎవరు? ప్రత్యుహ్య అంటే లయం. అంటే లయం చేసేది ఎవరు? అత్యక్రామత్ అంటే అతీతంగా. ఈ జగత్తుకు సృష్టికర్త, లయకర్త, అతీతుడు ఎవరు? యాజ్ఞవల్క్యుడు ఒక బిరుదు ఇస్తున్నాడు.

**ఔపనిషదం పురుషం** – అది ఔపనిషదం పురుషుడు. ఆ ఔపనిషదం పురుషుడు ఎవరు? సర్వ అధిష్ఠానం పరమాత్మ ఎవరు?

అష్టౌపురుషః అంటే సమష్టి హిరణ్యగర్భ. హిరణ్యగర్భను అష్టవిధ పురుషః అన్నాడు యాజ్ఞవల్క్యుడు. పురుష పదాన్ని అనేక అర్థాలతో వాడుతుంది శాస్త్రం. సందర్భాన్నిబట్టి దానికి తగ్గ అర్థాన్ని తీసుకోవాలి మనం. జీవుడు పురుషుడు; విరాట్ పురుషుడు; హిరణ్యగర్భ పురుషుడు; ఈశ్వరుడు పురుషుడు; చైతన్యం పురుషుడు. కాకపోతే జీవ, ఈశ్వర, హిరణ్యగర్భ, విరాట్‌లకు పురుషశబ్దం వాడినప్పుడు వారు సగుణ పురుషులు లేదా సోపాధిక పురుషులు.

కాని శుద్ధచైతన్యానికి పురుషః శబ్దం వాడినప్పుడు అది నిర్గుణ చైతన్యాన్ని సూచిస్తుంది. అంటే ఈ మంత్రంలోనే మూడుసార్లు పురుషః వచ్చింది, రెండు భిన్న అర్థాలతో. అష్టవిధ పురుషః, పంచవిధ పురుషః పదాలు హిరణ్యగర్భను సూచిస్తున్నాయి అంటే సగుణబ్రహ్మను సూచిస్తున్నాయి. కాని అష్టవిధ పురుషుని లేదా పంచవిధ పురుషుని సృష్టించిన పురుషుడు ఎవరని ప్రశ్న వచ్చినప్పుడు అది నిరుపాధికబ్రహ్మకు వర్తిస్తుంది.

నువ్వు అష్టవిధ పురుషుడు లేదా పంచవిధ పురుషుడి గురించి మాట్లాడితే నేను ఔపనిషదం పురుషుని గురించి మాట్లాడతాను. ఈ **ఔపనిషదం పురుషుడు** పదం చాలా ముఖ్యమైన పదం. శంకరులవారు దీన్ని తరచు

ఉటంకిస్తూ ఉంటారు. అంటే శాకల్యా నీకు సోపాధిక పురుషుని గురించే తెలుసు కాని, నిరుపాధిక పురుషుని గురించి తెలియదని దాని అర్థం. అష్టవిధ పురుషుడు అయింది, పంచవిధ పురుషుడు అయింది. ఇప్పుడు ఏకవిధ పురుషుడి గురించి వస్తుంది.

ఔపనిషదం పురుషం అంటే ఉపనిషత్తుద్వారా మాత్రమే తెలుసుకోదగిన పురుషుడు. అంటే నిర్గుణబ్రహ్మజ్ఞానం ఉపనిషత్తులలో మాత్రమే దొరుకుతుంది. అంటే తక్కినవన్నీ కుదరవనే అర్థం. పరమాత్మను ప్రత్యక్షప్రమాణం, అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోలేము. పరమాత్మను వేదపూర్వభాగమైన కర్మకాండద్వారా తెలుసుకోలేము; ఉపాసనకాండద్వారా తెలుసుకోలేము.

**సర్వ ప్రమాణ అగోచరః పరమాత్మా**

ధ్యానంద్వారా తెలుసుకోలేము. గౌతమబుద్ధుడు ధ్యానంద్వారా తెలుసుకోలేదా అంటారు కొందరు. శాస్త్రంద్వారా జ్ఞానం పొందటం అనేక మార్గాలలో ఒకటి అంటారు కొందరు. ఈ ఒక్కపదం **ఔపనిషదం పురుషం** అన్ని వాదనలనూ కొట్టివేస్తుంది. ఉపనిషత్తుద్వారానే నేర్చుకోవాలి, ఉపనిషత్తు ఒక్కటే మార్గమని నొక్కివక్కాణించటానికి శంకరులవారు ఈ పదాన్ని ఉటంకిస్తూ ఉంటారు తన భాష్యంలో. నిజానికి ఈ పదం మనకు కొత్తకాదు – శాంతిపాఠంలో చూస్తాము.

**సర్వం బ్రహ్మౌపనిషదం**

సర్వం బ్రహ్మ ఔపనిషదం అని ఋగ్వేద శాంతిపాఠంలో వస్తుంది. రెండూ ఒక్కటే. కాకపోతే అక్కడ బ్రహ్మపదం వస్తే ఇక్కడ పురుషః పదం వచ్చింది.

కొంతమంది భాష్యకారులు ఔపనిషదం పురుషం అంటే జ్ఞాని అని వర్ణిస్తారు. పేర్లు ఏవైనా అర్థం ఒకటే. బ్రహ్మజ్ఞాని బ్రహ్మకు భిన్నంగా ఉండడు. అందువల్ల జ్ఞానివేరు, పరమాత్మ వేరు కాదు. జ్ఞానినే సృష్టికర్త, లయకర్త అంటారు. జ్ఞాని ప్రపంచంతో వ్యవహారం నడిపినప్పుడు వ్యవహారిక ప్రపంచ సృష్టికర్త; దాన్నించి విడివడి ఆత్మలో లయమయినప్పుడు లయకర్త అవుతాడు. ఆ విధంగా ఔపాధిక పురుషుడు అంటే పరమాత్మ, జ్ఞాని అని రెండు అర్థాలు వస్తాయి. కాని ఇక్కడ పరమాత్మ సరిపోతుంది.

యాజ్ఞవల్క్యుడు అటువంటి పరమాత్మ గురించి చెప్పు అని అడగటమే కాక, అతన్ని బెదిరిస్తాడు కూడా. ఏమని?

**తం చేన్మే న వివక్ష్యసి మూర్ధా తే విపతిష్యతీతి** – ఒకవేళ నువ్వు దానికి జవాబు చెప్పలేకపోతే, నీ తల ఊడి పడగలదు అన్నాడు. అంటే నువ్వు మరణిస్తావు అని అర్థం.

అంతకుముందు కూడా యాజ్ఞవల్క్యుడు అతన్ని హెచ్చరించాడు. నువ్వు నిప్పుతో చెలగాటమాడుతున్నావు అన్నాడు. అయినా లెక్క చెయ్యలేదు శాకల్యుడు. ఇప్పుడు ప్రత్యక్షంగానే బెదిరించాడు. నువ్వు జవాబు చెప్పలేకపోతే నీ తల తెగిపడుతుంది అన్నాడు.

**తగ్ం హ న మేనే శాకల్యస్తస్య హ మూర్ధా విపపాత** – తం హ న మేనే అంటే ఆ పురుషుని గురించి శాకల్యునికి తెలియదు. ఇక్కడనుంచి శ్రుతి వచనం. యాజ్ఞవల్క్యుడు చెప్పలేదు, శాకల్యుడు మాట్లాడటం లేదు. శాకల్యునికి జవాబు తెలియకపోవటంవల్ల అతని తల ఊడి పడిందని ఉపనిషత్తు చెప్పింది. అంతేకాదు –

**అపి హాస్య పరిమోషిణోఽ_స్థీన్యప జహ్రురన్యన్మన్యమానాః** – అంతేకాక, అతని శిష్యులు అతని ఎముకలను పితృసంస్కారంకోసం ఇంటికి తీసుకువెళుతుండగా, దొంగలు వాటిని కూడా అపహరించారు. ఎందుకు? అది ధనమో, విలువైన నగలో అని భావించారు.

ఇంతకుముందు ఈ కథ కర్మప్రకరణంలో వచ్చింది. అక్కడ యాజ్ఞవల్క్యునితో శాకల్యుడు వాదించినప్పుడు యాజ్ఞవల్క్యుడు అతనిని శపించాడుట. పుణ్యక్షేత్రము కాని ప్రదేశంలో, పుణ్యతిథి కాని కాలంలో నువ్వు మరణిస్తావు; నీ ఎముకలు కూడా ఇంటికి చేరవు అని శపించాడుట. అతడు అదే విధంగా మరణించాడు. అందువల్ల జ్ఞానిని పరాభవించకూడదు.

ఈ కథలో మరీ ఎక్కువగా లీనమవకూడదు అంటున్నారు శంకరులవారు. అది నిజంగా జరిగిందో, జరగలేదో మనకు అనవసరం. దానిమీద మనం సమయం వ్యర్థం చెయ్యకూడదు. ఉపనిషత్తు ఈ గాథను చెప్పటంలోని ఉద్దేశం బ్రహ్మవేత్తను పరాభవించకూడదు అనీ, బ్రహ్మవిద్య గొప్పతనం చూపించటానికీను.

తత్త్వబోధలో కూడా ఈ విషయాన్ని చూస్తాము. జ్ఞానిని మెచ్చుకున్న వ్యక్తికి పుణ్యమూ, అవమానపరిచిన వ్యక్తికీ పాపమూ కలుగుతాయి. అంటే అతని పుణ్యపాపాలు ఇతనికి మారవు కాని బ్రహ్మజ్ఞానితో గౌరవంగా ప్రవర్తించాలి కాని అతన్ని అవమానపరచకూడదు అని అర్థం.

ఇంతకీ యాజ్ఞవల్క్యుడు అడిగిన ప్రశ్నకు జవాబు రాలేదు. శాకల్యునికి కర్మకాండ, ఉపాసనకాండ మాత్రమే తెలుసు. యాజ్ఞవల్క్యుడు కూడా జవాబు చెప్పడు. ఎందుకంటే ఈ అధ్యాయాన్ని జల్పం అన్నాము. అంటే ఇందులో బోధ ప్రధానంగా ఉండదు. ఎదుటి వ్యక్తిని వాదనలో ఓడించటమే లక్ష్యంగా ఉంటుంది. శాకల్యుడు యాజ్ఞవల్క్యుని శిష్యుడు కాదు. అతను వాదనలో ఓడించటానికి వచ్చాడు. ఎప్పుడైతే శాకల్యుణ్ణి ఓడించాడో, అక్కడితో యాజ్ఞవల్క్యుని బాధ్యత తీరిపోయింది. యాజ్ఞవల్క్యుడు తన ప్రశ్నకు జవాబు చెప్పడు, చెప్పనవసరం లేదు కూడా.

కాని అది వింటున్న మనకు ఆ జవాబేమిటో తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది కదా. అందువల్ల ఉపనిషత్తే జవాబు చెబుతుంది. మంత్రం అయిపోయింది కదా ఎక్కడ చెబుతుంది అంటే అంతకు ముందు మధ్యలో మనం కొన్ని వాక్యాలను వదిలేశాము. అక్కడ చెప్పింది.

ఉపనిషత్తు జవాబు చెప్పినట్టయితే, అది చివర్లో చెప్పకుండా, యాజ్ఞవల్క్యుడు ప్రశ్న కూడా అడగకముందే ఎందుకు చెప్పింది? దానికి శంకరులవారు జవాబు చెబుతారు. ఉపనిషత్తుకు ఆత్మ గురించి చర్చ చాలా ఇష్టం. ఆత్మ గురించిన చర్చకోసం చాలాసేపు ఓపిగ్గా ఎదురుచూసింది కాని, ఎంతసేపూ చర్చ ఇతర విషయాల గురించే సాగింది. ఇప్పుడింక ఆత్మ గురించి రాబోతోంది అని గ్రహించగానే ముందే చెప్పేసింది.

ఇలాంటి సందర్భం మన దైనందిన జీవితంలో కూడా చూస్తాము. భార్యాభర్తలు ఇద్దరూ ఎక్కడో బయట ఊరుకు వెళ్ళారు, వారికి ఏదో అద్భుతమైన సంఘటన జరిగింది. ఇంటికి వచ్చిన బంధువుకు ఆ విషయాన్ని వివరించటం మొదలుపెడతాడు భర్త. కాని ఎక్కడో మొదలుపెడతాడు. ఎంతకీ అసలు విషయానికి రాడు. ఎదుటివ్యక్తికి కుతూహలం కలిగించాలని అతని ఉద్దేశం. కాని భార్యకు అంతదాకా వేచివుండే ఓపిక ఉండదు. ఆవిడ టక్కున చివరి అంశం చెప్పేస్తుంది. అలాంటి సన్నివేశమే అది.

ఇప్పుడు మనం చూడబోయే భాగం చాలా ముఖ్యమైన భాగం. ఇదే నిర్వచనాన్ని ఇదే ఉపనిషత్తులో మూడుసార్లు చూస్తాము. 4.2.43లో, 4.4.22లో, 4.5.15లో మళ్ళీ.

ఇప్పుడు ఆ పదాలను చూద్దాము.

**స ఏష నేతినేతి ఆత్మా** – ఈ ఆత్మ ఇది కాదు, ఇది కాదు అని నిరూపించబడింది. నిజానికి ఈ నేతినేతి భాగాన్ని 2.3.6లో కూడా చూశాము. దీని అర్థం ఏమిటి? అన్నింటినీ నిషేధించుకుంటూ వస్తే, చివరికి మిగిలేది ఏమిటో, అది ఆత్మ.

**సర్వనిషేధ అవధిః**

అవధి అంటే మిగిలినది లేదా అధిష్ఠానం. ఎందుకు ఆత్మనిషేధపద్ధతిని ఉపయోగించాలి? ఎందుకు ప్రత్యక్షంగా వర్ణించదు? ఇదంతా 2.3.6లో వివరంగా చూశాము. ఎందుకంటే ఆత్మ మాటలకందదు. **శబ్దప్రవృత్తి నిమిత్తాని.** మాటలకందాలి అంటే ఐదు లక్షణాలు ఉండాలని చూశాము. అవి – ద్రవ్య, జాతి, గుణ, క్రియ, సంబంధాలు. ఆత్మకు ఈ ఐదు లక్షణాలూ లేవు. ఆత్మను వాక్కు నిర్వచించలేదు అంటాము.

ఒకపక్క ఆత్మను పదాలతో నిర్వచించలేము అంటూ మీరు పదేపదే ఆత్మ పదాన్ని ఎలా వాడుతున్నారు? ఆత్మను వర్ణించటానికి వాడే పదాలు మిథ్యాపదాలు. అవి ఆత్మయొక్క మిథ్యాగుణాలను వర్ణిస్తాయి. ఆ మాటకొస్తే ఆత్మపదం కూడా మిథ్యాపదమే.

ఆత్మ అంటే ఏమిటి? నేను లేదా సబ్జెక్టు. సబ్జెక్టు పదం ఎప్పుడు వాడతాము? దాని ఎదురుగా ఒక ఆబ్జెక్టు ఉంటే. అంటే జగత్తు ఆబ్జెక్టుగా ఉన్నప్పుడు, ఆ జగత్తును చూసే నేను సబ్జెక్టును. ఆబ్జెక్టు లేకపోతే సబ్జెక్టు హోదా లేదు. ఆ విధంగా ఆత్మ పదం కూడా మిథ్యే. సత్యం జ్ఞానం అనంతం పదాలు కూడా సానుకూలంగా వాడిన పదాలు కావని చూశాము.

గౌడపాదులవారు మాండూక్యకారికల్లో ఒక మెట్టు పైకి ఎక్కిస్తారు. అద్వైతం పదం కూడా లేదు అంటారు. ద్వైతం కాదని చెప్పటానికి అద్వైతం వాడతాము కాని పారమార్థికస్థాయిలో అది అనిర్వచనీయం. మౌనవాఖ్యానం మాత్రమే. ఇప్పుడు ఇక్కడ చెప్పిన నిర్వచనాన్ని చూద్దాము.

**అగృహ్యో న హి గృహ్యతే** – ఆత్మ అగృహ్యము. ఎందుకంటే ఆత్మ గ్రహించబడటం లేదు. ఎందుకు? ఆత్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి. అంటే ఆత్మ సర్వప్రమాణ అగోచరం.

**అశీర్యో న హి శీర్యతే** – ఆత్మ శిథిలమవదు. అపక్షీయ రహితం. జరారహితం. ఎందుకంటే మార్పులేదు.

**అసంగో న హి సజ్యతే** – అది అసంగం. ఎందుకంటే అది దేనినీ తగుల్కోవటం లేదు.

గౌడపాదులవారు సబ్జెక్టు–ఆబ్జెక్టు సంబంధం కూడా లేదు అంటారు. ఎందుకంటే సబ్జెక్టు–ఆబ్జెక్టు సంబంధం ఉండాలంటే రెండూ ఒకేస్థాయి సత్యాలకు చెంది ఉండాలి. కాని ఆత్మ పారమార్థికస్థాయికి చెందితే, జగత్తు వ్యావహారికస్థాయికి చెందినది. ఆత్మ, అనాత్మల సంబంధం ఉండదు. తర్కశాస్త్రంలో నాలుగు రకాల సంబంధాల గురించి వస్తుంది. కాని ఆత్మ విషయంలో అవేవీ వర్తించవు.

**న వ్యథతి** – ఆత్మకు దేశకాల వస్తుపరిచ్ఛేదం లేదు. అందువల్ల ఆత్మకు ఏమీ దుఃఖం లేదు, బాధ లేదు. అందువల్ల ఆత్మ అసంగం.

**న రిష్యతి** – అంటే న నశ్యతి. అంటే ఆత్మకు మరణం లేదు. ఆత్మ, పరమాత్మ, బ్రహ్మ పదాలు ఒకటేనని మర్చిపోకూడదు. ఈ జవాబు శాకల్యునికి తెలియలేదు. అందువల్ల అతని తల తెగిపడిందనీ, అంతిమ సంస్కారం కూడా జరగలేదనీ చూశాము.

## మంత్రం 3.9.27

**అథ హోవాచ బ్రాహ్మణా భగవన్తో యో వః కామయతే స మా పృచ్ఛతు సర్వే వా మా పృచ్ఛత యో వః కామయతే తం వః పృచ్ఛామి సర్వాన్ వా వః పృచ్ఛామీతి తే హ బ్రాహ్మణా న దధృషుః ॥**

అప్పుడు అక్కడ హఠాత్తుగా నిశ్శబ్దం పేరుకుంది. ఇంకెవరైనా బ్రాహ్మణుడు వచ్చి తనను ప్రశ్నిస్తాడో లేదో తెలియని పరిస్థితి యాజ్ఞవల్క్యునిది. అందరూ అయిపోయారని నిశ్చయంగా తెలుసుకున్నాకే, తను ఆ వెయ్యి ఆవులను తీసుకెళ్ళగలడు. కాని అక్కడ నిశ్శబ్దం తాండవిస్తోంది. ఎవరో ఒకరు ఆ నిశ్శబ్దాన్ని ఛేదించాలి. ఎనిమిది మంది వచ్చి ప్రశ్నలు అడిగారు – చివరివ్యక్తి తల తెగిపడి మరణించాడు. అందువల్ల ముందు యాజ్ఞవల్క్యుడే మాట్లాడాడు.

**అథ హోవాచ** – అథ అంటే తర్వాత. అంటే కొంతసేపు బ్రాహ్మణులు మాట్లాడకుండా ఉన్నాక, యాజ్ఞవల్క్యుడే సంభాషణను మొదలుపెట్టాడు అని ఉపనిషత్తే చెపుతున్నది.

**బ్రాహ్మణా భగవంతో యో వః కామయతే స మా పృచ్ఛతు సర్వే వా మా పృచ్ఛత** – పూజ్యనీయులైన ఓ బ్రాహ్మణులారా! మీలో ఎవరు కావాలనుకుంటే వారు నన్ను ప్రశ్నించవచ్చు. లేదా మీరందరూ కలిసి నన్ను ప్రశ్నించవచ్చు.

**యో వః కామయతే తం వః పృచ్ఛామి సర్వాన్ వా వః పృచ్ఛామీతి** – మీలో ఎవరిని అడగమంటే, వారిని నేను ప్రశ్నిస్తాను. లేదా మిమ్మల్నందరినీ కలిపి ప్రశ్నిస్తాను.

మీరు నన్ను ఒంటరిగా ప్రశ్నించవచ్చు. ఒకవేళ ఒంటరిగా రావటానికి భయమయితే, అందరూ కలిసి కూడా ప్రశ్నించవచ్చు అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. మీరు అడగటానికి సిద్ధంగా లేకపోతే, నేను అడుగుతాను. వాటికి మీలో ఒక్కరు కాని, అందరూ కలిసి కాని జవాబు చెప్పవచ్చు. ఏమన్నారు వారు?

**తే హ బ్రాహ్మణా న దధృషుః** – ఆ బ్రాహ్మణులు ఎవరూ ధైర్యం చెయ్యలేకపోయారు.

అందువల్ల అందరినీ ఉద్దేశించి యాజ్ఞవల్క్యుడే ఒక ప్రశ్న వేశాడు. తర్వాత వచ్చే మంత్రంలో ఏడు మంత్రాలు ఉన్నాయి కాని, అన్నింటినీ కలిపి ఒకటే మంత్రంగా తీసుకోవాలి. ఇంతకుముందు శాకల్యుణ్ణి ఔపనిషదం పురుషం గురించి అడిగాడు. కాని ఇప్పుడు అందరినీ అడుగుతాడు. ఇంచుమించు అలాంటి ప్రశ్నే. ఇది కూడా పరమాత్మ గురించే. ఇక్కడ జవాబు జగత్కారణం పరమాత్మ అని రావాలి. దానికి సంబంధించిన ప్రశ్న వస్తుంది ఇప్పుడు.

### మంత్రం 3.9.28

**తాన్ హైతైః శ్లోకైః పప్రచ్ఛ –**
**యథా వృక్షో వనస్పతిస్తథైవ పురుషోఽమృషా ।**
**తస్య లోమాని పర్ణాని త్వగస్యోత్పాటికా బహిః ॥ 01**
**త్వచ ఏవాస్య రుధిరం ప్రస్యన్ది త్వచ ఉత్పటః ।**
**తస్మాత్తదాతృణ్ణాత్ ప్రైతి రసో వృక్షాదివాహతాత్ ॥ 02**
**మాంసాన్యస్య శకరాణి కినాటగ్ం స్నావ తత్ స్థిరమ్ ।**
**అస్థీన్యన్తరతో దారూణి మజ్జా మజ్జోపమా కృతా ॥ 03**
**యద్వృక్షో వృక్ణో రోహతి మూలాన్నవతరః పునః ।**
**మర్త్యస్స్విన్మృత్యునా వృక్ణః కస్మాన్మూలాత్ప్రరోహతి ॥ 04**
**రేతస ఇతి మా వోచత జీవతస్తత్ప్రజాయతే ।**
**ధానారుహ ఇవ వై వృక్షోఽఞ్జసా ప్రేత్య సమ్భవః ॥ 05**
**యత్సమూలమావృహేయుర్వృక్షం న పునరాభవేత్ ।**
**మర్త్యస్స్విన్మృత్యునా వృక్ణః కస్మాన్మూలాత్ప్రరోహతి ॥ 06**
**జాత ఏవ న జాయతే కో న్వేనం జనయేత్పునః ।**
**విజ్ఞానమానన్దం బ్రహ్మ రాతిర్దాతుః పరాయణం తిష్ఠమానస్య తద్విద ఇతి ॥ 07**

ఇంతకుముందు శాకల్యునితో సంవాదం జరిగినప్పుడు జగత్తును అష్టవిధ పురుషునిగానూ, పంచవిధ పురుషునిగానూ వర్ణించాడు. ఇప్పుడు జగత్తు విషయం ఎత్తకుండా జీవుణ్ణి సృష్టించింది ఎవరని అడిగాడు. కాని ఆ ప్రశ్న అడిగేముందు యాజ్ఞవల్క్యుడు ఒక అద్భుతమైన పోలిక చూపిస్తున్నాడు, జీవునికీ, వృక్షానికీ మధ్య. ఈ పోలిక మనకు కొత్తకాదు. భగవద్గీత 15వ అధ్యాయంలో జగత్తును వృక్షంతో పోలుస్తాడు కృష్ణపరమాత్మ.

ఇక్కడ జీవుణ్ణి వృక్షంతో పోలుస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఏయే భాగాలను ఎలా పోల్చాడో చూద్దాము.

మంత్రం 1 **యథా వృక్షో వనస్పతిస్తథైవ పురుషోఽమృషా ।**
**తస్య లోమాని పర్ణాని త్వగస్యోత్పాటికా బహిః ॥**

**యథా వృక్షో వనస్పతిస్తథైవ పురుషోఽ మృషా** – లోకంలో పెద్దదైన చెట్టుతో పురుషుణ్ణి పోల్చాడు.

1. **తస్య లోమాని పర్ణాని** – జీవుని రోమాలు చెట్టుకు ఆకులు వంటివి.

2. **త్వగస్యోత్పాటికా బహిః** – అతని చర్మం చెట్టుకు బయట ఉండే బెరడు. చెట్టుకు మూడు పొరలుంటాయి. బయట ఉండే పొరను బెరడు అంటారు. జీవుని చర్మం ఆ బెరడులాగా ఉంది.

మంత్రం 2 **త్వచ ఏవాస్య రుధిరం ప్రస్యన్ది త్వచ ఉత్పటః ।**
**తస్మాత్తదాతృణ్ణాత్ప్రైతి రసో వృక్షాదివాహతాత్ ॥**

3. **త్వచ ఏవాస్య రుధిరం ప్రస్యంది త్వచ ఉత్పటః** – అతని చర్మంనుంచి రక్తం, చెట్టు బెరడునుంచి జిగురు స్రవిస్తాయి.
**తస్మాత్తదాతృణ్ణాత్ప్రైతి రసో వృక్షాదివాహతాత్** – గాటు పెట్టిన చెట్టునుంచి రసం వచ్చినట్టుగా, గాయపడిన శరీరంనుంచి రక్తం స్రవిస్తుంది.

మంత్రం 3 **మాంసాన్యస్య శకరాణి కినాటగ్ం స్నావ తత్ స్థిరమ్ ।**
**అస్థీన్యన్తరతో దారూణి మజ్జా మజ్జోపమా కృతా ॥**

4. **మాంసాన్యస్య శకరాణి** – ఆ వ్యక్తి మాంసం చెట్టులోని రెండవ బెరడు.

5. **కినాటగ్ం స్నావ తత్ స్థిరమ్** – చెట్టుయొక్క లోపలి మూడవ పొరను కినాటం అంటారు. అది వస్త్రంలాంటి పొర. అది వ్యక్తియొక్క నరంలా గట్టిగా ఉంటుంది.

6. **అస్థీన్యంతరతో దారూణి** – నరాల లోపలి ఎముకలు. అంటే బోన్. చెట్టుకు కట్టెలు. అస్థీ అంటే ఎముకలు, దారూ అంటే కట్టెలు.

7. **మజ్జా మజ్జోపమా కృతా** – ఎముకల లోపలి మూలుగు, చెట్టుయొక్క కట్టె లోపలి చేవలాగా ఉంది. మజ్జని బోన్‌మారో అంటారు.

ఆ విధంగా చెట్టుకు, మనిషికీ పోలికలను చూశాము ఇందులో.

ఆకులు = రోమాలు; జిగురు = రక్తం; పైన బెరడు = చర్మం; లోపలి బెరడు = మాంసం; మూడవ బెరడు/పొర = నరం; లోపలి బెరడు లోపలి కట్టెలు = నరాల లోపలి ఎముకలు; కట్టె లోపలి చేవ = ఎముక లోపలి మూలుగు.

ఇంతవరకూ పోలికే వచ్చింది కాని ప్రశ్న రాలేదు.

మంత్రం 4 **యద్వృక్షో వృక్ణో రోహతి మూలాన్నవతరః పునః ।**
**మర్త్యస్స్విన్మృత్యునా వృక్ణః కస్మాన్మూలాత్ప్రరోహతి ॥**

చెట్టును నరికితే, వేరునుంచి మరో కొత్త చెట్టు వస్తుంది. అలా మనిషి మృత్యువుతో నరకబడితే, ఏ మూలం (కారణం)నుంచి జన్మిస్తాడు?

చెట్టును పైన నరికితే మళ్ళీ చెట్టు చిగురిస్తుంది. అలాగే యమధర్మరాజు జీవుడనే చెట్టును నరికితే, అతను దేన్నుంచి పుడతాడు? అంటే ఈ ప్రశ్న అర్థం జీవకారణం ఏది? అంటే జగత్కారణం ఏది?

దీనికి జవాబు బ్రాహ్మణులు చెప్పేలోపు యాజ్ఞవల్క్యుడే మూడు జవాబులు రావచ్చని ఊహించి, ఆ మూడింటినీ కొట్టివేస్తాడు. అవి –

మంత్రం 6 **యత్సమూలమావృహేయుర్వృక్షం న పునరాభవేత్ ।**
**మర్త్యస్స్విన్మృత్యునా వృక్ణః కస్మాన్మూలాత్ప్రరోహతి ॥**

1. **జీవుడు మళ్ళీ పుట్టడు**

ముందు ఆరవ మంత్రం చూద్దాము. చెట్టు నరకబడితే మళ్ళీ పుట్టదు. అందువల్ల దేనినుంచి పుడుతుంది అనే ప్రశ్నకు ఆస్కారం లేదని ఎవరైనా అనవచ్చు. కాని అది సబబు కాదు.

చెట్టును కూకటివేళ్ళతో సహా పెకళించివేస్తే చెట్టు మళ్ళీ పుట్టదు నిజమే కాని దాని వేరు చెక్కుచెదరకుండా ఉంటే, అది మళ్ళీ పుడుతుంది. అదే విధంగా జీవి యొక్క అజ్ఞానాన్ని కూకటివేళ్ళతో సహా పెకళించివేస్తే జీవుడు జ్ఞానం పొంది మళ్ళీ పుట్టడు. కాని అజ్ఞానమనే మూలం అలాగే చెక్కుచెదరకుండా ఉంటే, జీవుడు మళ్ళీ పుడతాడు. **ధానారుహ ఇవ వై వృక్షోఽ ంజసా ప్రేత్య సంభవః.** ధానా అంటే విత్తు. నరకవేయబడిన చెట్టు మళ్ళీ విత్తునుంచి కాని, కాండంనుంచి కాని రావటం చూస్తూనే ఉంటాము. అలాగే జీవుడు కూడా మళ్ళీ వస్తాడు. దేన్నించి వస్తాడనేది ప్రశ్న.

మంత్రం 5 **రేతస ఇతి మా వోచత జీవతస్తత్ప్రజాయతే ।**
**ధానారుహ ఇవ వై వృక్షోఽ ఞ్జసా ప్రేత్య సమ్భవః ॥**

2. **రేతస్సునుంచి పుడతాడు**

రేతస్సునుంచి మళ్ళీ పుడతాడని చెపితే అది సబబు కాదు. రేతస్సు అంటే పురుషబీజం. రేతస్సు ఉండాలంటే ఒక జీవుడు ఉండాలి. ఇక్కడ ప్రశ్న జీవుడు దేన్నించి పుడతాడు అని.

జీవుడు పురుషబీజంనుంచి పుడతాడు, పురుషబీజానికి జీవుడు కావాలి. అంటే దీన్ని అన్యోన్య ఆశ్రయదోషం అంటారు. అందువల్ల జీవుడు రేతస్సునుంచి పుట్టాడు అనకూడదు. అప్పుడు రేతస్సు దేనినుంచి పుట్టింది అని ఇంకొక ప్రశ్న వస్తుంది. అందువల్ల ప్రశ్న ఇంకా స్పష్టంగా ఉండాలంటే జీవుడు, రేతస్సు ఎక్కడనుంచి పుట్టారు?

మంత్రం 7 **జాత ఏవ న జాయతే కో న్వేనం జనయేత్పునః ।**

**విజ్ఞానమానన్దం బ్రహ్మ రాతిర్దాతుః పరాయణం తిష్ఠమానస్య తద్విద ఇతి॥**

3. **స్వభావ వాదన**

పురుషుడు పుట్టే ఉన్నాడు కదా అనటం కూడా సరికాదు. పురుషుడు మళ్ళీ పుడుతున్నాడు కదా, అతను మళ్ళీ పుట్టేటట్టు చేసేది ఎవరు?

కొంతమంది అసలు ఈ జననమరణ వృత్తం లేదంటారు. దీన్ని స్వభావవాదన అంటారు. పునర్జన్మను నమ్మితేనే మళ్ళీ పుట్టటం విషయం వస్తుంది. అసలు ఈ వృత్తమే లేదంటారు వారు. అనుకోకుండా పుట్టాడు జీవుడు అంటారు వారు. దీనికి యాజ్ఞవల్క్యుడు వివరంగా జవాబు చెప్పడు కాని శంకరులవారు తక్కిన భాష్యకారులు సమాధానం చెబుతారు.

**కృతహాస అకృత ఆగమ దోషము** – స్వభావవాదనను ఒప్పుకుంటే ఈ కృతహాస అకృత ఆగమదోషం కలుగుతుంది. ఏమిటా దోషం?

స్వభావవాదన ప్రకారం ఇప్పుడొక జీవి మరణించాడు, ఇంకొక జీవి పుట్టాడు. మరణించిన ఈ జీవికీ, పుట్టిన కొత్త జీవికీ సంబంధం లేదు. ఎందుకంటే వారు పునర్జన్మను నమ్మరు. అలాంటప్పుడు మరణించిన జీవి చేసిన పుణ్యపాపాలను పూర్తిగా అనుభవించకుండానే మరణిస్తాడు. అది ఒక దోషం.

కొత్తగా పుట్టే జీవికి పాత పాపపుణ్యాలు ఉండవు. శాస్త్రం ప్రకారం అతను కొత్త జన్మను తన పూర్వజన్మ పుణ్యపాపాలవల్ల పొందుతాడు. కాని ఇక్కడ పాత జన్మ ప్రసక్తే లేదు కాబట్టి ఆ జన్మనుంచి తెచ్చే పుణ్యపాపాల ప్రసక్తే లేదు. అంటే అతని జన్మ అనుకోకుండా జరుగుతుంది. దేవుడు తనకి తోచినట్టు వారికి జన్మనిచ్చినట్టు అవుతుంది. ఒకరికి మనుష్యజన్మ, ఒకరికి జంతుజన్మ, అలాగే మనుష్యజన్మలో కూడా ఒకరికి సుఖం, ఒకరికి దుఃఖం ఇచ్చినట్టు అవుతుంది.

అలాగైతే దేవుడు పక్షపాతవైఖరి చూపినట్టు అవుతుంది. మరణించిన వ్యక్తి పుణ్యపాపాల ఫలాలను అనుభవించకుండా మరణించాలి; పుట్టిన వ్యక్తి తను చెయ్యని పుణ్యపాపాల ఫలాలను అనుభవించాలి. రెండూ సాధ్యం కాదు. ప్రకృతి నియమాలను అధిగమించినట్టు అవుతుంది. ధర్మశాస్త్రాన్ని అధిగమించినట్టు అవుతుంది. జీవుడు కొత్తగా పుట్టాడంటే పూర్వజన్మ కర్మవల్ల; పూర్వజన్మ కర్మవల్ల పుట్టాడంటే జననమరణ వృత్తం ఉండటంవల్ల. అందువల్ల స్వభావవాదన చెల్లదు.

ఈ మూడు కారణాలనూ మళ్ళీ ఒకసారి చూస్తే – చెట్టు మళ్ళీ పుట్టదు అనలేము, చెట్టు పుట్టటం చూస్తున్నాము; రేతస్సువల్ల పుడతాడు అనకూడదు, రేతస్సుకు కూడా ఒక జీవి ఉండాలి; జీవుడు తనంతట తానే పుడతాడు అనకూడదు, అది పూర్వజన్మమీద ఆధారపడివుంటుంది.

**కో న్వేనం జనయేత్పునః** – ఈ జీవిని మళ్ళీ పుట్టేటట్టు చేసేది ఎవరు? ఇది ప్రశ్న. అంటే జీవవృక్షానికి మూలం ఏమిటి?

దీనికి జవాబు బ్రహ్మ. దీనికి జవాబు బ్రాహ్మణులు చెప్పలేకపోయారు. యాజ్ఞవల్క్యుడు కూడా జవాబు చెప్పడు. ముందే చూసినట్టుగా ఇది జల్పప్రధానం. ఇందులో ఎదుటి వ్యక్తిని ఓడించటమే ప్రధానంగా

ఉంటుంది కాని, జ్ఞానబోధ చెయ్యటం కాదు. వారు అడిగిన ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుడు జవాబులు చెప్పాడు కాని, యాజ్ఞవల్క్యుడు అడిగిన ప్రశ్నలకు ఎవరూ జవాబు చెప్పలేకపోయారు.

అందువల్ల శంకరులవారు ముగిస్తారు ఈ కథను. ఈ అధ్యాయం మొదట్లో జనకుడు ఒక పండితసభను ఏర్పాటు చేశాడనీ, దానిలో ఎవరైతే బ్రహ్మవేత్తగా గెలుస్తారో అతనికి కొమ్ములకు బంగారు తొడుగులు ఉన్న వెయ్యి ఆవులను కానుకగా ఇస్తాననీ చెప్పాడు. ఎవరితోనూ వాదోపవాదాలు చెయ్యకముందే యాజ్ఞవల్క్యుడు తన శిష్యుణ్ణి పిలిచి ఆ ఆవులను తన ఆశ్రమానికి తరలించమన్నాడు. అది చూసి భరించలేని బ్రాహ్మణులు దాన్ని అహంకారంగా భావించారు.

యాజ్ఞవల్క్యుడు అది అహంకారం కాదని, తను చాలా చిన్నవాడిననీ, తనకు అవసరం కాబట్టి తీసుకు వెళుతున్నాననీ చెప్పాడు. ఎనిమిది మంది బ్రాహ్మణులు అతన్ని ప్రశ్నించారు. గార్గి రెండుసార్లు ప్రశ్నించింది. అందరికీ విజయవంతంగా జవాబు చెప్పాడు. అతను అడిగినవాటికి వారు చెప్పలేకపోయారు. అందువల్ల యాజ్ఞవల్క్యుడు ఆ ఆవులను తీసుకునివెళ్ళాడు అని అర్థం చేసుకోవాలి.

ఇక్కడితో బ్రాహ్మణులతో యాజ్ఞవల్క్యుని సంవాదం ముగిసింది. కాని యాజ్ఞవల్క్యుని ప్రశ్నకు జవాబు రాలేదు. అందువల్ల మళ్ళీ ఉపనిషత్తే అందుకుని జవాబు చెబుతుంది. నిజానికి ఉపనిషత్తే ఈ కథను మొదలు పెట్టింది. ఉపనిషత్తే జవాబుతో ముగిస్తున్నది. మూలం ఏమిటి? బ్రహ్మ మూలం. సృష్టి విషయం వచ్చినప్పుడు మాయాసహిత బ్రహ్మ అని అర్థం చేసుకోవాలి.

ఉపనిషత్తులో బ్రహ్మ పదం చాలాసార్లు వస్తుంది. అది మాయాసహిత బ్రహ్మ గురించి చెబుతున్నదో, మాయారహిత బ్రహ్మ గురించి చెబుతున్నదో తెలియదు. సందర్భాన్నిబట్టి మనమే అర్థం చేసుకోవాలి.

జీవి సృష్టికి మూలమైన బ్రహ్మ స్వరూపం ఏమిటి? **విజ్ఞానమానందం బ్రహ్మ**. ఉపనిషత్తే బ్రహ్మను విజ్ఞానం, ఆనందం అని రెండు పదాలతో నిర్వచించింది. విజ్ఞానం అంటే చిత్, ఆనందం అంటే ఆనందం. అందువల్ల విజ్ఞానమానందం అంటే చిదానంద బ్రహ్మ.

వేరే ఏ ఉపనిషత్తు కూడా బ్రహ్మను సచ్చిదానంద ఆత్మగా నిర్వచించలేదు. ఇక్కడే చిదానందబ్రహ్మగా చూస్తున్నాము. అందువల్ల ఈ వాక్యం చాలా ప్రత్యేకమైనది. శంకరులవారు దీన్ని తరచూ ఉటంకిస్తుంటారు.

**విజ్ఞానం** – ఇక్కడ విజ్ఞానం పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. విజ్ఞానం అంటే ఏదో ఒక వస్తువు గురించిన ఏదో ఒక జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని ప్రమాణజన్య జ్ఞానం అంటారు. అనేక వస్తువుల గురించిన జ్ఞానం మనస్సులో కలుగుతుంది. దాన్ని వృత్తిజ్ఞానం అని కూడా అంటారు. అది బుద్ధిలో కలిగే జ్ఞానం.

**ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।**

**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥** – **గీత** 15.16

వేదాంత ప్రమాణంద్వారా నేర్చుకున్న బ్రహ్మజ్ఞానం కూడా బుద్ధిలో కలిగే జ్ఞానమే. అంటే మనస్సులో కలిగే వృత్తిజ్ఞానం. వృత్తిజ్ఞానం పదానికి విజ్ఞానం అని తరచు వాడుతారు. కాని ఇక్కడ విజ్ఞానం పదం అర్థం వృత్తిజ్ఞానం కాదు. ఇక్కడ విజ్ఞానం అంటే శుద్ధజ్ఞానం లేదా ఎఱుక. ఆ ఎఱుక లేకపోతే బుద్ధి పనిచెయ్యదు. ఈ ఎఱుకను స్వరూపజ్ఞానం అంటారు.

స్వరూపజ్ఞానానికి, వృత్తిజ్ఞానానికి మధ్య ఉన్న భేదం ఏమిటి? వృత్తిజ్ఞానం బుద్ధిలో కలిగే జ్ఞానం, స్వరూప జ్ఞానం వచ్చిపోయే జ్ఞానం కాదు, బుద్ధిని చైతన్యవంతం చేసే జ్ఞానం.

అహం బ్రహ్మ అస్మి అనే బ్రహ్మజ్ఞానం వృత్తిజ్ఞానమా, స్వరూపజ్ఞానమా? ఈ బ్రహ్మజ్ఞానం కూడా వృత్తిజ్ఞానమే. బుద్ధి పదునుగా ఉంటేనే ఈ జ్ఞానాన్ని పొందగలము. ఇందులో ఏ విధమైన సందేహమూ లేదు. వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనలవల్ల ఏర్పడిన జ్ఞానం కాబట్టి దీన్ని వృత్తిజ్ఞానం అంటారు.

బ్రహ్మజ్ఞానాన్ని స్వరూపజ్ఞానం అని ఎందుకనకూడదు? ఎందుకంటే అలా బ్రహ్మజ్ఞానాన్ని స్వరూపజ్ఞానం అనుకుంటే, అది ఎప్పటికీ శాశ్వతంగా ఉండాలి. అది బుద్ధిలో కలుగనవసరం లేదు. బుద్ధిలో కలుగనవసరం లేదంటే దాన్ని నేర్చుకోవటానికి ఒక ప్రమాణం అవసరం లేదు. దాన్ని నేర్పించటానికి గురువూ అవసరం లేదు.

బ్రహ్మజ్ఞానం వృత్తిజ్ఞానం. దాన్ని అఖండాకార వృత్తిజ్ఞానం అంటారు. బ్రహ్మజ్ఞానం వృత్తిజ్ఞానం కాని బ్రహ్మ స్వరూపజ్ఞానం, నిత్యజ్ఞానం, నిర్వికారజ్ఞానం. ఇది చాలా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అందువల్ల విజ్ఞానం అంటే **ఎఱుక**, నిర్విశేషచైతన్యం లేదా నిర్విశేష **చిత్**.

**ఆనందం** – మామూలుగా ఆనందం అంటే అనుభవంలోకి వచ్చే ఆనందం. కాని ఇక్కడ ఆనందం అర్థం వేరు. శంకరులవారు ఇది సంవేద్య సుఖం కాదు అంటున్నారు. అంటే ఇది అనుభవంలోకి వచ్చే సుఖం కాదు. అయితే ఏమిటది? అది నువ్వే. నువ్వే బ్రహ్మానందానివి.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్ నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

కాని ఆనందం చూసి పొరపాటు పడుతున్నారు చాలామంది. ఆనందం అంటే మామూలు ఆనందం అనీ, బ్రహ్మానందం అంటే ప్రత్యేకమైన ఆనందం లేదా ఆధ్యాత్మిక ఆనందం అనీ అంటారు.

కాని అనుభవంలోకి వచ్చే ఏ ఆనందం కూడా బ్రహ్మానందం కాదు. అది స్వీకరించటమెలా? దీని వెనకనున్న తర్కం ఏమిటి? ఇక్కడ నిర్వచనం ఏమిటి? **ఆనందం బ్రహ్మ**. అంటే –

ఆనందం = బ్రహ్మ; బ్రహ్మ = ఆనందం

ఆనందం = బ్రహ్మ అని శ్రుతి చెబుతుంటే ఆనందస్వరూపం కూడా బ్రహ్మస్వరూపమే అయివుండాలి. కాని ఆనందాన్ని అనుభవంలోకి వచ్చే ఆనందంగా తీసుకుంటే, దాన్ని ఎన్నటికీ బ్రహ్మతో సమానం చెయ్యలేము. దానికి మూడు కారణాలను చూద్దాము.

1. **బ్రహ్మ ఆబ్జెక్టు కాదు** – బ్రహ్మ, అనుభవించబడే ఆబ్జెక్టు కాదు; బ్రహ్మ, అనుభవించే సబ్జెక్టు అయిన నేను. అనుభవాలన్నీ ఆబ్జెక్టుల గురించిన అనుభవాలు. అందువల్ల అనుభవంలోకి వచ్చిన ఆనందాన్నీ, బ్రహ్మనూ ఎన్నడూ సమానం చెయ్యలేము.

2. **బ్రహ్మ నిర్వికారం** – బ్రహ్మ నిర్వికారం అంటే బ్రహ్మకు మార్పులేదు. కాని అనుభవంలోకి వచ్చే ఆనందాలన్నిటికీ తారతమ్యాలు ఉంటాయి. ప్రియ, మోద, ప్రమోదాలనే తారతమ్యాలుంటాయని తైత్తిరీయంలో చూస్తాము. అనుభవంలోకి వచ్చే ఆనందాలన్నీ సవికారం, బ్రహ్మ ఆనందం నిర్వికారం. అందువల్ల బ్రహ్మానందాన్ని అనుభవించలేము.

3. **బ్రహ్మ అనాగమాపాయి** – బ్రహ్మ అనాగమాపాయి అంటే బ్రహ్మకు రాకపోకలు లేవు. కాని అనుభవంలోకి వచ్చే ఆనందాలన్నీ, సిద్ధులతో సహా, వచ్చిపోతాయి. అనుభవంలోకి వచ్చే ఆనందాన్ని ఆగమాపాయి అంటారు, బ్రహ్మానందం అనాగమాపాయి. అందువల్ల ఈ రెండూ ఒకటి కాదు.

అనుభవంలోకి వచ్చే ఆనందాలను కోశానందం అంటారు. కోశానందాన్ని ఎన్నటికీ బ్రహ్మానందంతో సరిపోల్చలేరు. అంటే సిద్ధులు పొందటం అసత్యమా? జాగ్రత్తగా చూడండి, అనవసరంగా ఆవేశం చెందకండి. సిద్ధులు పొందటం అక్షరాలా నిజమే. అందులో ఏమాత్రం అబద్ధం లేదు. వేదాంతం కూడా మహాత్ములకుండే సిద్ధులను అంగీకరిస్తుంది. చాలామందికి అలాంటి ఆనందాలేవో కలిగేవుంటాయి. నిర్వికల్పసమాధిలో ఆనందం పొంది ఉండవచ్చు; ఆనందబాష్పాలు రాల్చి ఉండవచ్చు. వాటిని మనం త్రోసిపుచ్చటం లేదు.

అవి బ్రహ్మానందంలోకి రావు అంటున్నాము అంతే. అవన్నీ కోశానందంలోకి వస్తాయి. అనుభవంలోకి వచ్చే ప్రతి ఆనందం కూడా, అది ఎంత గొప్పదైనా సరే, కోశానందమే. బ్రహ్మ నిర్వచనం బ్రహ్మానందం. అది బ్రహ్మ స్వరూపం. ఈ రెండింటికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. ఏమిటది?

శాస్త్రమే వివరిస్తున్నది. బ్రహ్మానందం అంటే స్వరూప ఆనందం. కోశానందం అంటే మనస్సులో ప్రతిబింబించిన ఈ స్వరూపానందం. అందువల్ల కోశానందం అంటే బ్రహ్మానందం కాదు, అది బ్రహ్మ ప్రతిబింబ ఆనందం. ఈ ప్రతిబింబ ఆనందం అంటే వేరే ఏదో కాదు, అది కోశానందం అని చూశాము కదా. అంటే ఆనందమయ కోశానందం. దీన్ని వివరంగా తైత్తిరీయోపనిషత్తులో చూస్తాము. బ్రహ్మానందం బింబానందం. అది ప్రకటితమవదు. అది అనుభవించే నేనే, అంటే నేను ఆనందస్వరూపుణ్ణి.

ఆనందానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి వాచ్యార్థం, ఇంకొకటి లక్ష్యార్థం. వాచ్యార్థం కోశానందం, లక్ష్యార్థం బ్రహ్మానందం. అనుభవంలోకి రాని అనుభవించే వ్యక్తి, సాక్షిచైతన్యం, బ్రహ్మానందం. అందువల్ల ఇక్కడ ఆనందం పదానికి వాచ్యార్థం తీసుకోకూడదు, లక్ష్యార్థం తీసుకోవాలి. ఈ అయోమయాన్ని తొలగించటానికి ఆనందం పదాన్ని ఆనందంగా వర్ణించరు. దాన్ని పూర్ణత్వం అంటారు. అంటే ఆనందం = పూర్ణత్వం.

విజ్ఞానమానందం బ్రహ్మ అంటే చిత్ ఆనందం బ్రహ్మ. సత్ కలుపుకుంటే బ్రహ్మ నిర్వచనం పూర్తి అవుతుంది.

**సత్ చిత్ ఆనందం బ్రహ్మ.**

ఇప్పుడు బ్రహ్మ ఈశ్వరుని రూపంలో అందరికీ ఆశ్రయం అంటున్నది ఉపనిషత్తు.

**రాతిర్దాతుః పరాయణం** – రాతిః అంటే ధనం. ఇక్కడ దానం చేసే వ్యక్తి అని అర్థం. దానకర్త అంటే యజ్ఞాలు చేసే వ్యక్తి. ఇంకో విధంగా చెప్పాలంటే కర్మకాండను పాటించే వ్యక్తి. అటువంటి వ్యక్తిని రక్షించేవాడు బ్రహ్మ. ఎటువంటి బ్రహ్మ? మాయాసహితబ్రహ్మ లేదా ఈశ్వరుడు.

ఈ వాక్యంలో ఈ భాగం కర్మఠులకు ఈశ్వరుడు కర్మఫలదాత అని చెబుతున్నది ఉపనిషత్తు. వైదిక జీవనం గడిపితే, తోటివారు మనకు సహాయం చేసినా చెయ్యకపోయినా, ప్రభుత్వం సహాయం చేసినా చెయ్యకపోయినా, ప్రపంచం సహాయం చేసినా చెయ్యకపోయినా, ఈశ్వరుడు దానికి తగ్గ ఫలాన్నిస్తాడు. ఈశ్వరుడు మన ధర్మకర్మను చూస్తూనే ఉంటాడు. అందువల్లనే ధర్మం రక్షిస్తుంది అంటారు.

**కర్మఫలదాతృరూపేణ సోపాధిక బ్రహ్మ పరాయణం భవతి**

ఇదే బ్రహ్మ జ్ఞానిని కూడా రక్షిస్తాడు. కాని కేవలం జ్ఞానం ఉంటే చాలదు. జ్ఞాననిష్ఠలో ఉండాలి. అంటే నేను = ఆత్మ = బ్రహ్మ అనే జ్ఞాననిష్ఠలో నిలబడగలగాలి.

**తిష్ఠమానస్య తద్విద ఇతి** – బ్రహ్మనిష్ఠలో ఉన్న జ్ఞానికి నిరుపాధిక బ్రహ్మ ఆశ్రయం.

**ఉపాదాన కారణరూపేణ నిరుపాధిక బ్రహ్మ పరాయణం భవతి**

కర్మకాండను పాటించే అజ్ఞానికి బ్రహ్మ నిమిత్తకారణంగా ఆశ్రయం అయితే, జ్ఞానం పొంది నిష్ఠలో ఉన్న జ్ఞానికి బ్రహ్మ ఉపాదానకారణంగా ఆశ్రయం. దీనితో యాజ్ఞవల్క్య ప్రశ్నకు జవాబు వచ్చింది.

జీవిని మళ్ళీ పుట్టేటట్టు ఎవరు చేస్తున్నారు? బ్రహ్మమూలం.

ఈ ప్రశ్న, జవాబులను చూసేముందు ఒక విషయం గుర్తుంచుకోవాలి. వేదాంతసారం జీవ–ఈశ్వర ఐక్యం. జీవుడే ఈశ్వరుడు, ఈశ్వరుడే జీవుడు. కాని ఇక్కడ బ్రహ్మ కారణం లేదా మూలం అంటున్నది ఉపనిషత్తు. అంటే బ్రహ్మ కారణం, జీవి కార్యం. ఒకచోట జీవి = ఈశ్వరుడు అంటూ, ఇంకొకచోట ఈశ్వరుడు కారణం, జీవి కార్యం అంటున్నది కదా, తనను తాను ఖండించుకుంటున్నట్టు కాదా? కాదు. ఎందుకంటే ఐక్యం చెప్పేటప్పుడు అది పారమార్థికస్థాయినుంచి, భేదం చెప్పేటప్పుడు అది వ్యావహారికస్థాయినుంచి. అందువల్ల వ్యావహారికస్థాయిలో ఉన్న అజ్ఞానిని సోపాధిక బ్రహ్మగా రక్షిస్తే, పారమార్థికస్థాయికి ఎదిగిన జ్ఞానికి నిరుపాధిక బ్రహ్మగా ఆశ్రయం అవుతుంది.

ఇక్కడితో తొమ్మిదవ బ్రాహ్మణము అయిపోయింది. మూడవ అధ్యాయము అయిపోయింది.

# అధ్యాయము 3 - సారాంశము

అధ్యాయం 3లో 9 బ్రాహ్మణములు ఉన్నాయి. వాటిలో మొదటి మూడు ఉపాసనల గురించి చెపితే, తర్వాత వచ్చే 5 బ్రహ్మవిద్య గురించి చెపితే, ఆఖరి బ్రాహ్మణము రెండింటి గురించీ చెబుతుంది. ఇప్పుడు ఒక్కొక్క బ్రాహ్మణము గురించీ చూద్దాము.

**1. అశ్వల బ్రాహ్మణము** – ఇది ఒక కథతో మొదలవుతుంది. జనకుడు వేదపండిత సభ ఏర్పాటుచేసి బ్రహ్మవేత్తకు వెయ్యి ఆవులను బహుమానంగా ఇస్తానని ప్రకటించాడు. బ్రాహ్మణులందరూ వచ్చారు. యాజ్ఞవల్క్యుడు ఆ ఆవులను తీసుకుపొమ్మని తన శిష్యునికి చెప్పగా, దాన్ని అహంకారంగా భావించారు తక్కిన బ్రాహ్మణులు. ఒక్కొక్క బ్రాహ్మణుడూ అతనితో సంవాదానికి దిగారు. మొదట అశ్వలుడు అనే బ్రాహ్మణుడు సంవాదానికి దిగటంవల్ల దీనికి అశ్వల బ్రాహ్మణము అని పేరు వచ్చింది.

ఇందులో నాలుగు కర్మాంగ ఉపాసనలను, నాలుగు సంపదుపాసనలను చూశాము. కర్మాంగ ఉపాసనలు అంటే కర్మలో భాగంగా చేసే ఉపాసనలు. వీటి ఫలం బ్రహ్మలోక ప్రాప్తి. సంపదుపాసన అంటే నికృష్ట వస్తువుమీద ఉత్కృష్ట దేవతను ఆవాహన చేసి, ఉపాసన చెయ్యటం.

**2. ఆర్తభాగ బ్రాహ్మణము** – ఆర్తభాగుడు అనే బ్రాహ్మణుడు అడగటంవల్ల ఈ పేరు వచ్చింది. ముందు బ్రాహ్మణంలో ఉపాసకునికి బ్రహ్మలోకప్రాప్తి అని చూశాము. కాని ఇక్కడ హిరణ్యగర్భ (బ్రహ్మ) కూడా పరిచ్ఛిన్నుడని చూశాము. హిరణ్యగర్భను గ్రహాలు, అతిగ్రహాలు పరిచ్ఛిన్నుణ్ణి చేస్తాయి. గ్రహాలు అంటే ఇంద్రియాలు, అతిగ్రహాలు అంటే విషయవస్తువులు. దీనిద్వారా కర్మాంగ ఉపాసనలు, సంపదుపాసనలు బ్రహ్మలోకం వరకే తీసుకువెళతాయి కాని మోక్షాన్ని ఇవ్వవు అని అర్థమవుతున్నది.

11వ మంత్రం ముఖ్యమైన మంత్రం. దానిద్వారా జ్ఞానంవల్ల మాత్రమే మోక్షం పొందుతారని అర్థమవుతుంది.

**3. భుజ్యు బ్రాహ్మణము** – భుజ్యువు అనే బ్రాహ్మణుడు యాజ్ఞవల్క్యుణ్ణి ప్రశ్నలు అడగటంవల్ల ఈ బ్రాహ్మణానికి ఆ పేరు వచ్చింది. ఇందులో బ్రహ్మలోకం వివరణ వచ్చింది. దానిద్వారా కూడా అది పరిచ్ఛిన్నం అని అర్థమవుతుంది.

ఇక్కడివరకూ ఉపాసనలు చూశాము. ఇప్పుడు బ్రహ్మవిద్య మొదలువుతుంది.

**4. ఉషస్త బ్రాహ్మణము** – ఉషస్తుడు అనే బ్రాహ్మణుడు యాజ్ఞవల్క్యుణ్ణి ప్రశ్నలు అడగటంవల్ల ఈ బ్రాహ్మణానికి ఆ పేరు వచ్చింది. బ్రహ్మస్వరూపం లేదా ఆత్మస్వరూపంయొక్క నిర్వచనం వస్తుంది ఈ బ్రాహ్మణములో. మొదటి రెండు మంత్రాలు ఇందులో ముఖ్యమైన మంత్రాలు.

**5. కహోల బ్రాహ్మణము** – కహోలుడు అనే బ్రాహ్మణుడు యాజ్ఞవల్క్యుణ్ణి ప్రశ్నలు అడగటంవల్ల ఈ బ్రాహ్మణానికి ఆ పేరు వచ్చింది. ఇందులో జీవ–ఈశ్వర ఐక్యం వచ్చింది; శ్రవణ, మనన, నిదిధ్యాసనలు

సాక్షాత్తు సాధనగా వర్ణించబడ్డాయి; సన్న్యాసం సహకారీ సాధనగా వర్ణించబడింది. ఈ బ్రాహ్మణము మొత్తం చాలా ముఖ్యమైన బ్రాహ్మణము.

**6. గార్గీ బ్రాహ్మణము** – గార్గి అనే బ్రాహ్మణ స్త్రీ యాజ్ఞవల్క్యుణ్ణి ప్రశ్నించటంవల్ల ఈ బ్రాహ్మణానికి ఆ పేరు వచ్చింది. ఇందులో సర్వాంతరః పద విశ్లేషణ వచ్చింది. భూలోకంనుంచి మొదలుపెట్టి, బ్రహ్మలోకంవరకూ సాగుతుంది వారి ప్రయాణం. సర్వాంతరః అనే బదులు ఒక్కొక్క దానికి ఓతం, ప్రోతం ఏది అని అడుగుతూ వచ్చింది. బ్రహ్మలోకానికి ఓతం ప్రోతం ఏది అంటే అది తర్కానికి అందదని, అతిప్రశ్నలు వెయ్యకూడదని చెప్పి గార్గిని ఆపాడు.

**7. అంతర్యామి బ్రాహ్మణము** – ఉద్దాలక ఆరుణి అనే బ్రాహ్మణుడు యాజ్ఞవల్క్యుణ్ణి ప్రశ్నలు అడిగినా ఈ బ్రాహ్మణములో ముఖ్యాంశం అంతర్యామి కాబట్టి దీనికి అంతర్యామి బ్రాహ్మణము అనే పేరు వచ్చింది. హిరణ్యగర్భ, ఈశ్వరుల నిర్వచనాలు చూస్తాము కాబట్టి ఈ బ్రాహ్మణము కూడా చాలా ముఖ్యమైన బ్రాహ్మణము. కాకపోతే వారిని వేరే పేర్లతో చూస్తాము ఇక్కడ. హిరణ్యగర్భని సూత్రం అనీ, ఈశ్వరుణ్ణి అంతర్యామి అనీ, ఆకాశం అనీ చూస్తాము. ఇందులో ముఖ్యమైన మంత్రాలు 2, 15, 23.

**8. అక్షర బ్రాహ్మణము** – గార్గి మళ్ళీ వచ్చి ప్రశ్నించింది. అడిగిన అంశం అక్షరబ్రహ్మ గురించి కాబట్టి ఈ బ్రాహ్మణానికి అక్షర బ్రాహ్మణము అనే పేరు వచ్చింది. ముందు బ్రాహ్మణములో బ్రహ్మలోకానికి ఓతం ప్రోతం ఏది దగ్గర ఆగింది. ఇప్పుడు బ్రహ్మలోకానికి ఆధారం బ్రహ్మ అనీ, బ్రహ్మకు ఆధారం ఈశ్వరుడనీ, ఈశ్వరునికి ఆధారం నిర్గుణబ్రహ్మ లేదా అక్షరబ్రహ్మ అనీ నేర్చుకున్నాము. నాలుగవ బ్రాహ్మణములో మొదలైన సర్వాంతరః కు ఇక్కడ ముగింపు వస్తుంది. అక్షరం సర్వాంతరః. 7–11 మంత్రాల వరకూ ముఖ్యమైన మంత్రాలు. బ్రహ్మ గురించిన అద్భుతమైన నిర్వచనం వస్తుంది. జ్ఞానంవల్లనే మోక్షం వస్తుందని తెలుస్తుంది. జ్ఞానం పొందిన వ్యక్తిని బ్రాహ్మణుడు అంటారనీ, జ్ఞానం పొందని వ్యక్తిని కృపణుడు అంటారనీ చూశాము.

**9. శాకల్య బ్రాహ్మణము** – శాకల్యుడు అనే బ్రాహ్మణుడు యాజ్ఞవల్క్యుణ్ణి ప్రశ్నలు అడగటంవల్ల ఈ బ్రాహ్మణానికి ఆ పేరు వచ్చింది. ఇందులో నాలుగు అంశాలను చూశాము. అవి – హిరణ్యగర్భ మహిమ, అష్టవిధ హిరణ్యగర్భ ఉపాసన, పంచవిధహిరణ్యగర్భ ఉపాసన, ఆత్మస్వరూపం.

ఆత్మస్వరూపం గురించి నిజానికి యాజ్ఞవల్క్యుడు శాకల్యుణ్ణి అడిగాడు కాని అతను చెప్పలేకపోయాడు. అప్పుడు ఉపనిషత్తే చెప్పింది. ఇందులో ముఖ్యమైన మంత్రాలు 26, 28లోని 7వ మంత్రం. 26వ మంత్రం ఆత్మ నిర్వచనాన్ని ఇస్తే, 28లోని 7వ మంత్రం బ్రహ్మనిర్వచనం ఇచ్చింది. అది విజ్ఞానమానందం బ్రహ్మ. అంటే సచ్చిదానంద బ్రహ్మనిర్వచనంగా తీసుకోవచ్చు.

జనకుడు బ్రహ్మవేత్త ఎవరో తెలుసుకోవాలనుకున్నాడు. అంటే బ్రహ్మవేత్తకు వేదపూర్వభాగం, వేద అంతభాగం రెండూ క్షుణ్ణంగా తెలిసివుండాలి. యాజ్ఞవల్క్యునికి రెండూ క్షుణ్ణంగా తెలుసని నిరూపించటానికి ఉపాసనలు, బ్రహ్మవిద్య రెండూ కూడా వచ్చాయి. ఈ అధ్యాయం జల్పప్రధానంగా ఉందని చూశాము.